ముండకోపనిషత్తు

(అధర్వణ వేదం నుండి)



వ్యాఖ్యాత :

'అభినవ వ్యాస' 'జ్ఞానప్రపూర్ణ'

శ్రీ దేవిశెట్టి చలపతిరావు

B.Sc., (Ag)

ఆధ్యాత్మిక జ్ఞానపీఠం – చిలకలూరిపేట

పూజ్య గురుదేవులు



‘అభినవ వ్యాస’ ‘జ్ఞానప్రపూర్ణ’

శ్రీ దేవిశెట్టి చలపతిరావు

B.Sc., (Ag)

వ్యవస్థాపకులు :

ఆధ్యాత్మిక జ్ఞానపీఠం – చిలకలూరిపేట

ముండకోపనిషత్తు

తొలిపలుకు

ఈ ప్రపంచంలో ప్రతిమానవుడు – అతడు తెలివిగల వాడైనా, తెలివితక్కువ వాడైనా, ఉన్నవాడైనా, లేనివాడైనా, చిన్నవాడైనా, పెద్దవాడైనా, – ఎవరైనాసరే ఆనందాన్నే కోరుకుంటున్నారు. దుఃఖాలు వస్తే వెంటనే తొలగిపోవాలనుకుంటున్నారు; అసలు దుఃఖాలే రాకూడదని అనుకుంటున్నారు.

వచ్చిన దుఃఖాలు తొలగించుకోటానికి; అలాగే లేదనుకున్న సంతోషాన్ని, ఆనందాన్ని పొందటానికి ఎన్నెన్నో పనులు చేస్తున్నారు; ఎన్నెన్నో ఆలోచనలు చేస్తున్నారు; ప్రణాళికలు వేస్తున్నారు.

డబ్బుసంపాదిస్తున్నారు; వస్తువులు సేకరిస్తున్నారు; పెళ్ళి చేసుకుంటున్నారు; బిడ్డలను కంటున్నారు; ఇళ్ళు కట్టిస్తున్నారు; తోటలు, దొడ్లు, భూములు కొంటున్నారు; కోరిన తిండి తింటున్నారు; హాయిగా నిద్రపోతున్నారు; వ్యవసాయం చేస్తున్నారు, వ్యాపారాలు చేస్తున్నారు, పరిశ్రమలు స్థాపిస్తున్నారు; చేతి వృత్తులు చేస్తున్నారు; అధికారాన్ని సంపాదిస్తున్నారు; బ్యాంకులలో డబ్బు దాచుకుంటున్నారు. ఇలా ఎన్నో చేస్తున్నారు. క్షణం తీరిక లేకుండా కష్టపడుతున్నారు. అయినా ఏమిటో – ఎవరిని కదిలించినా అసంతృప్తే.

ఇంకా ఏదేదో కావాలని, ఏదోలేదని; ఉన్నది చాలదని; రకరకాల కథలు వినిపిస్తారు. కొందరు ఎవ్వరికీ వినిపించరుగాని, వారిలో వారే కుమిలి పోతుంటారు. ఎంత సంపదలున్న వారైనా, ఎందరు బిడ్డలున్న వారైనా, ఎంతటి గొప్పగొప్ప పదవులున్న వారైనాసరే 'మేము హాయిగా

ఆనందంగా ఉన్నాం. మాకే కొరతాలేదు' అని సంతృప్తి పడి ఆనందంగా ఉన్న వారే లేరు. సంతోషం కూడా ఉంటుంది. ఐతే సంతోషంగా ఉన్నారనుకున్న వారిలో కూడా ఏదో అసంతృప్తి. ఈ సంతోషం ఎప్పుడు మాయమై పోతుందోననే బెంగ - దిగులు. గట్టిగా కొందరు గుట్టుగా కొందరు ఏడ్చేవారే.

దీనిని బట్టి మనకొక విషయం తెలుస్తుంది. మనకు కావలసింది తాత్కాలిక సంతోషంకాదు. శాశ్వతమైన ఆనందం. దుఃఖమేలేని ఆనందం. భయంలేకుండా అనుభవించే ఆనందం. మరి ఈ వస్తువులద్వారా, వ్యక్తుల ద్వారా, డబ్బు ద్వారా, సంపదలద్వారా, పదవులద్వారా, కర్మలద్వారా, విషయాలద్వారా వచ్చే ఆనందం తాత్కాలికమైనదేగాని శాశ్వతానందంకాదు. స్వర్గలోకానందం కూడా ఇంతే. ఇది ఎప్పుడు అంతమై పోతుందో, ఎప్పుడు కష్టాలు వచ్చి మీదపడతాయో అనే భయంతో కూడిన ఆనందమేగాని - దుఃఖంలేని, భయంలేని, అంతంలేని, శాశ్వత ఆనందం కాదు. ఎందుకని ఇలా జరుగుతున్నది? ఎంతప్రయత్నించినా శాశ్వతానందాన్ని, నిత్యమైన ఆనందాన్ని ఎందుకు పొందలేక పోతున్నాం?

దీని కొక్కటే కారణం. మనం అనిత్యమైన వస్తువులను పట్టుకున్నాం కనుక వాటి ద్వారా వచ్చే ఆనందం కూడా అనిత్యమైనదే అవుతున్నది. మనం నిత్యమైన వస్తువును పట్టుకొన్నట్లైతే మనకు వచ్చే ఆనందం కూడా నిత్యమైనదే అవుతుంది.

ఈ జగత్తు - ఇందులోని విషయాలు అనిత్యమైనవి. మరి నిత్యమైన వస్తువేమిటి?

"నిత్య వస్త్వేకం బ్రహ్మ తద్ వ్యతిరిక్తం సర్వం అనిత్యం"

అని శంకరాచార్యుల వారు **'తత్త్వబోధ'**లో తెలియజేశారు. కనుక నిత్య వస్తువు **ఆ బ్రహ్మమే**. అంటే పరమాత్మయే - అదితప్ప మిగిలిన వన్నీ అనిత్యమైనవే.

దేనికి పుట్టుక, నాశనం ఉన్నాయో అది అనిత్యం. **ఈ జగత్తు** పుట్టుకకు ముందులేదు. ప్రళయం తర్వాత కనిపించదు. ఆది–అంతాలలో ఏదిలేదో – అది మధ్యలో కనిపించినను లేనిదే అనిగ్రహించాలి. కనుక ఒక కాలంలో కనిపించి – మరొక కాలంలో కనుమరుగయ్యే ఈ జగత్తు కూడా మిధ్యయే. లేనిదే. అనిత్యమైనదే. ఆది అంతాలలో ఉండి, మధ్యలో కనిపించకపోయినా అది ఉన్నదే. నిత్యమైనదే. సత్యమైనదే.

మనం సినిమాహాల్లో ప్రవేశించినప్పుడు అక్కడ **తెర** ఉన్నది. సినిమా అయిపోయిన తర్వాతా తెర ఉన్నది. మధ్యలో సినిమా వేసినంతసేపూ తెరకనిపించదు. కారణం? మనం ఆ సినిమా కథతో తాదాత్మ్యం చెందటం వల్ల; అందులోని విషయాలలో మునిగి పోవటం వల్ల. కాని, అప్పుడు కూడా నిజంగా తెర ఉన్నది. మరి **సినిమాయో?** ముందులేదు. ఆపిన తర్వాత కనిపించదు. కనుక మధ్యలో కనిపించినా అది అనిత్యమే. లేనిదే – మిధ్యయే.

అలాగే ఈ జగత్తు మిధ్య – దీనికి వెనుక ఆధారంగా ఉన్న ఆత్మ లేదా పరమాత్మ నిత్యం. సత్యం.

మనం సినిమాలో తాదాత్మ్యం చెందితే అందులోని పాత్రల కష్టాలకు చలించిపోతాం, దుఃఖిస్తాం. ఆ పాత్రలు ఆనందిస్తే ఆనందిస్తాం. కనుక సినిమాలో లీనమైతే కొత్తగా సుఖదుఃఖాలు తెచ్చుకుంటున్నాం. ఆ సినిమాను గనుక పట్టించుకొనక పోతే – దానిలో మునిగిపోకపోతే మనకు ఏ సుఖదుఃఖాలు ఉండవు. అనిత్యమైన సినిమాను నిరసిస్తేనే – తొలగిస్తేనే నిత్యమైన ఆధారమైన తెర మనకు కనిపిస్తుంది. సుఖదుఃఖాలు తొలుగుతాయి.

అలాగే అనిత్యమైన ఈ జగత్తులో మునిగిపోయిన మనం అనేక సుఖదుఃఖాలను తెచ్చుకుంటున్నాం. ఈ అనిత్యమైన జగత్తుతో తాదాత్మ్యం వదిలిపెడితే – నిరసిస్తే – తొలగిస్తే – ఈ జగత్తుకు ఆధారమైన ఆత్మను దర్శిస్తాం. ఆ ఆత్మానందాన్ని అనుభవిస్తాం.

ఆత్మ ఆనందస్వరూపం, జ్ఞాన స్వరూపం. అదే నీ స్వరూపం. నీ నిజ స్వరూపం. నేను ఈ దేహాన్ని అనేభ్రమలో ఉన్నంతకాలం దుఃఖాలు తప్పవు. నేను ఆత్మను అనే అనుభూతి పొందితేనే ఆనందం. శాశ్వతానందం. బ్రహ్మానందం.

అట్టి **ఆత్మాను భూతిని పొందటానికి మనకు ఎట్టి జ్ఞానం కావాలో ఆ అద్భుతమైన 'జ్ఞానం' ఉపనిషత్తులలో భద్రపరచబడి ఉన్నది.** ఈ ఉపనిషత్తులు వేదాలకు అంతంలో ఉన్నవి కనుక వీటిని **'వేదాంతము'** అని పిలుస్తారు.

వేదాంతము అంటే ఉపనిషత్తులలో భద్రపరచబడి ముక్తిని – మోక్షాన్ని **– కైవల్యాన్ని ప్రసాదించే జ్ఞానభాండాగారం అని భావం.**

ఇలాంటి జ్ఞానాన్ని అందించే ఉపనిషత్తులు, 4 వేదాలలోను కలిపి 1180 ఉన్నాయని పెద్దలు అంటారు గాని వాటి పేర్లు కూడా తెలియదు. మొత్తం మీద పండితులు పరిశోధనలు చేసి దాదాపు 300–350 ఉపనిషత్తులను బయటకు తీశారు. అయితే ఇవన్నీ తాళపత్రాలలో ఉండటం వల్ల అనేకం శిధిలమై పోయాయి. అందులో 108 ఉపనిషత్తులు మాత్రం పేర్లు మంత్రాలతో సహా ప్రచురించబడ్డాయి. వీటిలో 10 ఉపనిషత్తులకు శంకర, రామానుజ, మధ్వాచార్యులు – భాష్యాలు వ్రాశారు. వీటిని ముఖ్యమైన ఉపనిషత్తులుగా ముగ్గురు ఆచార్యులు గుర్తించారు.

అవి 1.ఈశ 2.కేన 3.కఠ, 4.ప్రశ్న, 5. ముండక, 6. మాండూక్య, 7.ఐతరేయ, 8. తైత్తిరీయ, 9.ఛాందోగ్య, 10.బృహదారణ్యక ఉపనిషత్తులు.

అన్ని ఉపనిషత్తులలోని భావాలు, సిద్ధాంతాలు, ఈ దశోపనిషత్తులలో సమగ్రంగా లభిస్తాయని భాష్యకారుల నిర్ణయం.

ప్రస్తుతం మనం అధ్యయనం చేయబోతున్న ముండకోపనిషత్తు దశోపనిషత్తులలో ఒకటి - అతి మఖ్యమైనది; బహుసుందరమైనది; అత్యున్నతమైనది. జిజ్ఞాసువులకు – పరిశోధకులకు ఎంతో ఉపయోగకరమైనది.

ఈ ముండకోపనిత్తు 3 భాగాలుగా విభజించబడింది. ప్రతి భాగము మళ్ళీ రెండు ఖండాలుగా విభజింపబడినది మొత్తం మంత్రాలు 64. అంటే మూడు అధ్యాయాలతో– ఆరు ఖండాలతో – 64 మంత్రాలతో శోభిస్తున్నది.

అంటే **మూడు పూలు, ఆరు కాయలు, 64 కళలతో** ప్రకాశిస్తున్నదన్నమాట.

ఈ ఉపనిషత్తు వేదాలలో నాలుగవ వేదమైన **అధర్వణవేదం** లోనిది.

'ముండకోపనిషత్' అనే పేరు ఈ ఉపనిషత్తు కెలా వచ్చింది?

'ఈశ' అనే పదంతో మొదటి మంత్రం ప్రారంభమైనందున ఈశావాస్యోపనిషత్ అనేపేరు; కేన అనే పదంతో మొదటి మంత్రం ప్రారంభమైనందున కేనోపనిషత్ అని మొదటి రెండు ఉపనిషత్తులకు పేర్లువచ్చినవి. కాని ఈ ఉపనిషత్తులోని మొదటి మంత్రం బ్రహ్మాతో ప్రారంభమైనదేగాని 'ముండక' అనే పదంతో ప్రారంభంకాలేదు. కనుక ఈ ఉపనిషత్తులో నిక్షిప్తమైన జ్ఞానానికి ఈ పేరుతో ఏదో సంబంధం ఉండి ఉండాలి. అదేమిటో చూద్దాం.

'ముండకం' అంటే 'మంగలి కత్తి' అని ఒక అర్థం. మంగలి కత్తి తలపై ఉన్న వెంట్రుకలను అవి నల్లనివిగాని, నెరిసి తెల్లబడినవిగాని పూర్తిగా తొలగించి తలను నున్నగా ఎలా గుండు చేస్తుందో – అలాగే ఈ ఉపనిషత్తులోని జ్ఞానం మన తలలో ఉన్న ఆశలను, కోరికలను అజ్ఞానాన్ని, పూర్తిగా తొలగించి మన బుద్ధిని శుద్ధం చేస్తుందని భావం. ఇదే చాలామంది అంగీకరించిన వివరణ.

'ముండకం' అంటే మరొక అర్థం కూడా ఉంది. గుండు చేసిన

తలగలవాడు – అంటే బోడిగుండువాడు అని – అంటే సన్యాసి అని అర్థం. ఇది సన్యాసులకు బోధించదగినది అని కొందరు చెబుతారు గాని ఈ భావం సర్వాంగీకారం కాదు. అసలు ఈ ఉపనిషత్తును బోధించింది గృహస్థుడైన శౌనకునికే. సన్యాసమంటే కాషాయ వస్త్రం ధరించుట – గుండు కొట్టించుట అనికాదు. "సమ్యక్‌న్యాసః ఇతి సన్యాసః" అంటే సరియైన త్యాగమే సన్యాసము అని.

'తలలు బోడులైన తలపులు బోడులా'! అని వేమన కవి చమత్కరించాడు. ఆశలు త్యాగం చెయ్యాలిగాని, కేశాలు త్యాగంచేస్తే ఏం ప్రయోజనం లేదు.

ఈ ఉపనిషత్తును అధ్యయనం చేస్తే, తలలేగాక, తలపులు కూడా బోడులవుతాయనే అర్థంలో గ్రహించవచ్చు. అలాగే అవ్యయమూ, శాశ్వతము అయిన కైవల్య ప్రాప్తికి, మోక్షప్రాప్తికి 'సన్యాసం' యొక్క ఆవశ్యకత ఉన్నదని ఈ ఉపనిషత్తులో వక్కాణించటం జరిగింది. కనుక ఈ ఉపనిషత్ ఉన్నతస్థితిలో ఉన్న సాధకులకు ఉద్దేశించింది అని కూడా చెప్పుకోవచ్చు.

ఇక **'ఉపనిషత్తు'** అనే పదం మన చెవిన పడగానే ఒక సుందరమైన, మనస్సుకు ఆహ్లాదకరమైన ఒక అద్భుత దృశ్యం మన మనోఫలకం మీద కదలాడుతుంది.

ప్రశాంతమైన వన వాటికలో ఒక పవిత్రమైన ఆశ్రమం. ఆ ఆశ్రమంలో ఒకచోట ఒక పెద్ద వృక్షం. దాని మొదలు వద్ద ఒక అరుగు. ఆ అరుగుపై శ్రోత్రియుడు, బ్రహ్మ నిష్ఠుడు, కరుణాసముద్రుడు అయిన సద్గురువు. ఆయనకు ఎదురుగా – సమీపంలో శుభ్రం చేసిన నేలపై దర్భాసనాలు వేసుకొని సాధన చతుష్టయ సంపన్నులైన శిష్యులు. ఎంతో వినయ విధేయతలతో ఆ శిష్యులు గురువుగారి అమృతవాక్కుల కొరకై

ఎదురుచూస్తుంటే గంభీరమైన స్వరంతో ఆ గురువు తత్వబోధ చేస్తుండటం **– ఇదీ ఆ దృశ్యం.**

ఉపనిషత్ అనే పదంలో ఈ దృశ్యం దాగి ఉంది. ఎందుకంటే **ఉప అంటే సమీపంగా; ని అంటే క్రింద; షత్ అంటే కూర్చొనుట.** గురుదేవునికి సమీపంగా క్రింద కూర్చొని శిష్యుడు ఈ జ్ఞానాన్ని పొందాలి అని ఈ పదం అంతరార్థం.

గురువుకు దగ్గరగా అంటే కొలుచుకొని ఒక గజం దూరంలో కూర్చోవాలి అని గాని, ఇంకా దగ్గరగా అంటే ఒక అడుగు దూరంలో కూర్చోవాలని గాని అర్థంకాదు. గురువు యొక్క **మనస్సులోని భావాలకు అనుగుణంగా జీవించాలి, – ప్రవర్తించాలి అని.** తాను ఎంత జ్ఞానాన్ని సంపాదించినా **గురువుతో సమానమని భావించకూడదు.** అట్టి అహంకారి ఆధ్యాత్మికరంగంలో పతనమవుతాడు. అందుచేత గురువు కన్న క్రిందుగ కూర్చోవాలి. తన వినయాన్ని, విధేయతను, నమ్రతను వ్యక్తంచేయాలి. ఇంద్రియ మనోబుద్ధులకు అందని ఆత్మతత్త్వాన్ని, **స్థిమితంగా అధ్యయనం చేయాలి.** అదే కూర్చొనుట అంటే. **జ్ఞానగంగ పైనుండి** క్రిందికి ప్రవహిస్తుంది గనుక ఆ జ్ఞాన గంగను మన మస్తకానికి ఎక్కించటానికి **మన తల గురువుయొక్క పాదాల వద్ద ఉండాలి.**

ఉపనిషత్ అనే పదానికి మరొక అర్థం కూడా ఉన్నది. బ్రహ్మమునకు సమీపంగా మనలను ఉంచగలిగే జ్ఞానాన్ని కలిగి ఉన్నది గనుక ఈ వేదాంతాన్ని ఉపనిషత్ అన్నారు.

అలాగే "బ్రహ్మమును తెలియజేసి, బ్రహ్మ సాక్షాత్కారానికి సహాయపడుతుంది గనుక ఈ బ్రహ్మజ్ఞానాన్ని ఉపనిషత్" అన్నారు.

"సంసారానికి కారణమైన అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానం గనుక దీనిని ఉపనిషత్" అన్నారు. (ఉపని–షత్)

చీకటి తొలగాలంటే దీపం కావాలి. అజ్ఞానమనే చీకటి తొలగాలంటే జ్ఞాన మనే దీపం కావాలి. అట్టి జ్ఞాన జ్యోతిని శిష్యునికి అందించి ఉద్ధరించు మహాత్ముడే గురువు. 'గు' అనగా చీకటిని, 'రు' అనగా పోగొట్టువాడు. కనుకనే అజ్ఞానమనే చీకటిని పోగొట్టి జ్ఞాన దీపం వెలిగించిన మహాత్ముని **గురువు** అన్నారు.

నిజంగా జీవునికి పట్టిన ఈ అజ్ఞానం ప్రపంచజ్ఞానం లేకపోవటం వల్ల కలిగింది కాదు. స్వస్వరూప జ్ఞానం, – ఆత్మజ్ఞానం లేకపోవటం వల్ల కలిగిందే. కనుక ఆత్మజ్ఞానం వల్లనే అజ్ఞానం తొలగాలి. ఆ ఆత్మజ్ఞానం **ఆచార్యుని బోధవల్లనే** లభిస్తుంది.

శిష్టాచార సాంప్రదాయంలో బ్రహ్మవిద్య లేదా ఆత్మవిద్య గురు శిష్య **పరంపరగా** వచ్చింది. ప్రస్తుతం మనం అధ్యయనం చెయ్యబోయే ఈ ముండకోపనిషత్ కూడా గురుశిష్య పరం పరగానే వచ్చింది.

గురువైన అంగిరస మహర్షికి, శిష్యుడైన శౌనకునికి మధ్య జరిగిన సంవాదమే ఈ ఉపనిషత్తు. అమరధామానికి ఆనందబాటను వేసిన అమృత రూప ఉపనిషత్తు ఈ ముండకోపనిషత్తు. దీని గురు పరంపర ఏమిటి?

సృష్టికర్త ఐన **బ్రహ్మదేవుడు** తన పెద్ద కుమారుడైన **అధర్వునికి** ఈ బ్రహ్మ విద్యను అనుగ్రహించగా, అధర్వుడు తన శిష్యుడైన **అంగిరునికి** బోధించాడు. అంగిరుని వద్ద భరద్వాజ గోత్రుడైన **సత్యవాహుడు** నేర్చుకొనగా, ఆ సత్య వాహుని వద్దనుండి **అంగిరసుడు** ఉపదేశం పొందాడు.

ఇలా పరం పరా ప్రాప్తంగా అంగిరసునకు బ్రహ్మవిద్య లభించగా, శిష్యుడైన **శౌనకుడు** గురువైన అంగిరసుని వద్దకు వెళ్ళి, గురువుకు పాదాభి వందనం చేసి, **"ఓ మహాత్మా! ఏది తెలుసుకొనటం చేత, ఈ సర్వమూ తెలియ బడుతుందో దానిని తెలియజేయమని ప్రార్థించాడు.** ఈ ప్రశ్న శౌనకుని ఆంతరంగిక యశస్సును – అతడి అర్హతను తెలియజేస్తున్నది.

అలా ప్రార్థించిన శిష్యునికి సమాధానంగా గురువు నుండి బయలు దేరిన ఉపదేశం ఎంత అమృత తుల్యంగా ఉంటుందో ఇక మనం రుచి చూడబోతున్నాం. రుచి చూచి వదిలేసే వారెవరో – తృప్తిగా ఈ అమృతాన్ని త్రాగే వారెవరో కాలమే నిర్ణయిస్తుంది.

ఉపనిషత్తును ప్రారంభించబోయే ముందు శిష్టాచార సాంప్రదాయంలో గురుశిష్యులిద్దరూ శాంతి మంత్రాన్ని పఠిస్తారు. శాస్త్రాధ్యయనం నిర్విఘ్నంగా సాగాలని – ఎలాంటి అవాంతరాలు కలగరాదని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తారు. మనమూ శాంతి పాఠంతో ప్రారంభిద్దాం.



శాంతి మంత్రం:

ఓం భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః
భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రాః
స్థిరై రంగైః తుష్టువాం సస్తనూభిః
వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః
స్వస్తినః పూషా విశ్వవేదాః
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః
స్వస్తి నో బృహస్పతిర్దధాతు ।
ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

ప్రతిపదార్థం :- ఓం = పరమాత్మ; దేవాః = దేవతలారా!, కర్ణేభిః = చెవులతో; భద్రం = శుభప్రదమైన మాటలను; శ్రుణుయామ = విందుముగాక!; అక్షిభిః = కనులతో; భద్రం = మంగళప్రదమైన దృశ్యాలను; పశ్యేమ = చూచెదము గాక; యజత్రా = పూజనీయులారా; స్థిరైః అంగైః = దృఢమైన అంగములతో, తనూభిః = శరీరాలతో; తుష్టువాంసః = గానంచేస్తూ; యదాయుః = ఆయువు ఉన్నంతకాలం; దేవహితం = దైవసంబంధమైన కార్యాలను; వ్యశేమ = చేసెదముగాక; వృద్ధశ్రవాః = సనాతన ఋషులచే స్తుతించబడిన; ఇంద్రః = ఇంద్రుడు; నః స్వస్తిః దధాతు = మాకు శుభమును ప్రసాదించును గాక!; విశ్వవేదాః = సర్వజ్ఞుడైన; పూషాః = సూర్యుడు; నః = మాకు; స్వస్తి = శుభమును కల్గించుగాక!; అరిష్టనేమి = ఆపదలనుండి రక్షించు; తార్క్ష్యః = వాయుదేవుడు; నః = మాకు; స్వస్తి = శుభమును ప్రసాదించుకాక; బృహస్పతి = బృహస్పతి; నః స్వస్తిః దధాతు = మాకు శుభమును ప్రసాదించు గాక!,

భావం :– ఓ దేవతలారా! మా చెవులతో శుభప్రదమైన మాటలనే విందుముగాక! మా కన్నులతో మంగళకరమైన దృశ్యములనే చూచెదము గాక! దృఢమైన అంగాలతో, శరీరాలతో మిమ్మ్ముస్తుతిస్తూ, మాకు ప్రసాదించిన ఆయుష్కాలమును దైవ సంబంధమైన కార్యాలతో గడిపెదముగాక!

సనాతన ఋషులచే స్తుతించబడిన ఇంద్రుడు మాకు శుభమును ప్రసాదించును గాక! సర్వజ్ఞుడైన సూర్యుడు మాకు శుభమును కలిగించుగాక! ఆపదల నుండి కాపాడే వాయువు మాకు శుభము నొసగునుగాక! మాలోని ఆధ్యాత్మిక సంపదను కాపాడే బృహస్పతి మాకు శుభములను ప్రసాదించుగాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఓ పరమాత్మా! ఆధిదైవిక, ఆధి భౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక.

వ్యాఖ్య :– "ఒక కార్యం ఫలించాలంటే మనప్రయత్నం ఒక్కటే చాలదు. దానికి కాలం, దైవం కూడా అనుకూలించాలి. ఇలా మానవ ప్రయత్నమూ, దైవసహాయమూ, కాలమూ మూడూ సహకరించాలనే దివ్యభావాన్ని మన అంతరంగంలో నిలుపుకొనుటకే ఈ శాంతి పాఠం. దైవ ప్రార్థన –

(ఓం) ప్రతిశాంతి పాఠము ఓంకారంతోనే ప్రారంభమవుతుంది. ఓంకారమే ప్రణవము. అదే బ్రహ్మస్వరూపం. భగవంతుని రూపమూ – నామమూ ఓంకారమే. ఈ సమస్త ప్రపంచమూ ఓంకారంతోనే నిండియున్నది.

ఓం అంటే నామరూపాలతో కూడిన ఈ జగత్తుకు ఆధారంగా ఉన్న – నామ రూపరహిత పరమాత్మయే. నామరూపాలతో కూడిన జీవుని

యొక్క అసలు సారమే ఈ ఓంకారం – ప్రణవం. ఇది నిరాకారం – నిర్గుణం, నిరంజనం, నిరీహం, నిర్వికారం అయిన ఆత్మయే. ఈ ప్రణవాన్ని, తలచుకొని ప్రార్థన ప్రారంభిస్తున్నారు ఉపనిషత్ ఋషులు.

నిజంగా మనం చేరుకోవలసింది ఈ ప్రణవాన్నే. చేరుకున్న తర్వాత ఇక మిగిలేదేమీ ఉండదు. ఎందుకంటే ఆత్మ అద్వయం. రెండవదేదీ లేదు. అది ఏకం– ఒక్కటే. అయితే ఆత్మను చేరుకొనే ఈలోపల మనం ఈ ప్రపంచంలో ఒక భాగంగా ఉన్నాం. అందుకే సత్యాన్ని గ్రహించేలోగా – ఆత్మాను భూతిని పొందేలోగా మనసాధన – ఉపనిషత్ అధ్యయనం చక్కగా, ఏ ఆటంకాలు లేకుండా సాగాలి. దీనికి ఎందరో సహాయపడాలి. మన అవసరాలన్నీ చక్కగా తీరాలి. **మనస్సు వికలం కాకుండా ఉండాలి.**

అందుకని శుభకరమైన అందమైన దృశ్యాలే కనిపించాలి; మంగళకరమైన, ఆహ్లాదకరమైన శబ్దాలే వినిపించాలి. **దేవతా స్వరూపమైన హృదయస్థానంలో శనిగ్రహం ప్రవేశించటానికి చెవులు, కన్నులు రాజమార్గాలై ఉన్నాయి.** మిగిలిన 3 జ్ఞానేంద్రియాలు అంత ప్రమాదకరాలు కావు. కనుక ఘాతుక దృశ్యాలుగాని; అమంగళకర శబ్దాలుకాని మనలో ప్రవేశించరాదు. అవి మన మనస్సును ఆధ్యాత్మిక రంగం నుండి మరలిస్తాయి. కనుక జాగ్రత్తగా ఉండాలి.

ఇలా కోరుకోవటం అంటే సామాన్యుల లాగా దేవతల వద్దకెళ్ళి లౌకికమైన కోర్కెలు కోరుకోవటమా? కాదు. మనం భౌతిక సుఖభోగాలకోసం ప్రార్థించటం లేదు. జీవితం నుండి తరించటానికి – మన స్వస్వరూపంలో మనం నిలవటానికి చేసే కృషిలో **ఆయువు ఉన్నంత వరకు – ఎట్టి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా – జ్ఞానాన్ని పొందటానికి, సాధన సాగించటానికి అవకాశాన్ని ప్రసాదించమని దేవతలను ప్రార్థిస్తున్నాం.**

అజామీళుడు **చూడకూడని దృశ్యం** చూచాడు. దానితో పతనమైపోయాడు. రావణుడు **శూర్పణఖ** ద్వారా **వినకూడని మాటలు** విన్నాడు. సర్వనాశనమై పోయాడు. కనుక ఒక్క ఘోరమైన **దృశ్యం;** ఒక్క కటువైన, అశ్లీలమైన **మాట** చాలు – మన ఏకాగ్రతను చెడగొట్టటానికి, మన మనసును వికలం చేయటానికి. మనస్సు సరిగ్గా లేకపోతే బుద్ధి పనిచేయదు. అందుకే ఈ ప్రార్థన.

సాధన పూర్తయిన తర్వాత అన్నింటిలోను, అంతటా దైవాన్నే దర్శించగలస్థితికి వస్తాముగనక ఆపైన ఫరవాలేదుగాని, అప్పటి దాకా మాత్రం మాపై కనికరం చూపండి. ఈ శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నంతకాలం మాకు ఘోర దృశ్యాలుగాని; అమంగళకర శబ్దాలుగాని కనిపించరాదు, వినిపించరాదు అని ప్రార్థన.

ఇక్కడ **మంగళప్రదమైన వాక్కులు** వింటాం. ఆత్మను గూర్చిన జ్ఞానాన్ని తెలుసుకుంటాం. ఈ విన్న విషయాలను మనస్సులో మననం చేసుకొనేటప్పుడు మనసు కలుషితంగా ఉంటే ఆ శుభమైన విషయం కూడా అశుభంలాగా తోస్తుంది. కనుకనే మంగళకరమైన దృశ్యాలతో శబ్దాలతో మనస్సు నిండి పోవాలని ప్రార్థన.

మంగళప్రదమైన ఆత్మ తత్వాన్ని విని, అట్టి ఆత్మను దర్శించే శక్తి నివ్వమనియే ఈ ప్రార్థన సారాంశం. అందుకే గురుశిష్యుల ఈ ప్రార్థన.

ఈ శక్తినిచ్చే వారెవరు? దేవతలు. **'దానాత్ దేవః'** అన్నారు. అంటే ఇచ్చేవారు దేవతలు అని. అందుకే దేవతలకు ప్రార్థన.

సాధన సక్రమంగా జరిగి అనుభూతిని పొందాలంటే సాధనాక్షేత్రమైన **ఈ శరీరం ఆరోగ్యంగా** ఉండాలి. అవయవాలన్నీ చక్కగా పనిచేయాలి; కాళ్ళతో నడిచిరావాలి. ఇక్కడ రెండు గంటలు కూర్చోవాలి. రోజూ ధ్యానం

చేయాలి. వీటి కోసం కాళ్ళు ఆరోగ్యంగా ఉండాలి. **చూడాలంటే** కళ్ళు బాగుండాలి. **వినాలంటే** చెవులు బాగుండాలి. మాట్లాడాలన్నా, తెలియని విషయం అడగాలన్నా **వాక్కు** బాగా ఉండాలి. మొత్తం అవయవాలన్నీ బాగుంటేనే పూర్తి ఆరోగ్యం. కనుక ఆరోగ్యంగా ఉండాలనీ, అవయవాలన్నీ చక్కగా పనిచేయాలని కోరుకుంటున్నాం. అయితే దేనికి ఈ ఆరోగ్యం? దివ్యసాధనలు చేసి తరించటానికి. అలా కోరుకున్నంత మాత్రాన ఈ దేహం శాశ్వత మనే భ్రాంతి లేదు. అందుకే **యదాయుః** అన్నారు. ఎంతవరకైతే ఈ దేహం ఉండాలో అంతవరకే ఉంటుంది. తర్వాత రాలిపోతుంది. భగవంతుని నిర్ణయానికి తలొగ్గుతున్నాం, అయితే జీవించినంతకాలం ఈ అవయవాలు పుష్టిగా, తుష్టిగా, ఆరోగ్యంగా ఉండాలి. సాధనలకు అనువుగా ఉండాలి అనేదే కోరిక. జీవించి ఉన్న ఈ కాలంలో దేవహితం చేయటానికి మాత్రమే శరీరారోగ్యాన్ని కోరుతున్నారు ఈ ప్రార్థనలో - దైవానికి సన్నిహితం కావటమే దేవహితం.

ఏయే దేవతలను ప్రార్థిస్తున్నారు? :- ఇంద్రుడు, సూర్యుడు, వాయువు, బృహస్పతి - వీరంతా ప్రకృతి శక్తులే. వేదకాలంలో ప్రకృతి శక్తులే దేవతలు - ప్రకృతి దేవతల యొక్క అనుగ్రహాన్ని అవసరమని గుర్తించారు కనుకనే ఇంద్రుని ధ్యానిస్తున్నారు. ఇంద్రియాలకు అధిపతి ఇంద్రుడు. కనుక **ఇంద్రియాలు తమ అధీనంలో ఉండాలి అని ప్రార్థన.** సూర్యుని ప్రార్థించటంలో **మనస్సు - జ్ఞాన ప్రకాశంతో నిండి పోవాలని భావన.** వాయువును ధ్యానించుటలో **ప్రాణక్రియను నిరోధించి యోగా రూఢులై తరించాలని కోరిక. ఇలా గ్రహించిన జ్ఞానం దొర్లిపోకుండా, చెదిరిపోకుండా బుద్ధిలో స్థిరంగా నిలవాలని బృహస్పతికి అభ్యర్థన.** ఇలా ఇంద్ర, సూర్య, వాయు, బృహస్పతులను ప్రార్థించిన తర్వాత **3 సార్లు శాంతిః, శాంతిః...** అని పలుకుతున్నారు. ఎందుకు? ప్రారంభించిన కార్యం మధ్యలో

ఆగిపోవటానికి 3 కారణాలున్నాయి. అవే ఆధి దైవిక, ఆధి భౌతిక, ఆధ్యాత్మిక తాపాలు. అవన్నీ తొలగాలని ప్రార్థన –

(i) తుఫానులు, వర్షాలు, వరదలు, భూకంపాలు మొ॥ వన్నీ దైవం చేతిలోనివి. కనుక వీటిని ఆధిదైవిక తాపాలన్నారు.

(ii) చుట్టూ ఉండే జీవరాశి, క్రూర జంతువులు, విషపురుగులు, మన చుట్టూ ఉండే మనుషులు, తగాదాలు, కొట్లాటలు. ఇవన్నీ మనచుట్టూ ఉన్న భూతాల వల్ల వచ్చేవి. కనుక వీటిని ఆధిభౌతిక తాపాలన్నారు.

(iii) శారీరకంగా, మానసికంగా మనకు వైముఖ్యం కలగటం ఆధ్యాత్మిక తాపం అన్నారు. ఈ 3 తాపాలు శాంతించుగాక అని ప్రార్థన.



ప్రథమ ముండకం

ప్రథమ ఖండం

మం॥ ఓం బ్రహ్మాదేవానాం ప్రథమః సంభభూవ
విశ్వస్య కర్తా భువనస్య గోప్తా ।
స బ్రహ్మావిద్యాం సర్వవిద్యా ప్రతిష్టాం
అధర్వాయ జ్యేష్ట పుత్రాయ ప్రాహ ॥ (1)

ప్రతి॥ విశ్వస్య కర్తా = సృష్టికర్తయు; భువనస్యగోప్తా = జగద్రక్షకుడు ఐన; బ్రహ్మా = బ్రహ్మాదేవుడు; దేవానాం = దేవతలం దరికన్న ; ప్రథమః సంభభూవ = ముందుగా పుట్టెను; సః = అతడు; సర్వ విద్యా ప్రతిష్ఠాం = సకల విద్యలకు ఆధారమైన; బ్రహ్మా విద్యాం = బ్రహ్మా విద్యను; జ్యేష్ఠ పుత్రాయ అధర్వాయ = తన జ్యేష్ఠ పుత్రుడైన అధర్వునకు; ప్రాహ = చెప్పెను.

భావం:– సృష్టికర్తయు, జగద్రక్షకుడు ఐన బ్రహ్మాదేవుడు దేవతలందరి కన్న ముందుగ జన్మించెను. అతడు సర్వవిద్యలకు ఆధారమైన బ్రహ్మావిద్యను తన జ్యేష్ట పుత్రుడైన అధర్వునకు తెలియజేశాడు.

వ్యాఖ్య:– ఈ ఉపనిషత్తు 'బ్రహ్మా' అనే మంగళ వాచకంతో ప్రారంభ మవుతున్నది. బ్రహ్మా అనే పదం 'బ్రూహి' అనే సంస్కృత పదంనుండి పుట్టింది. **బ్రూహి** అంటే పెద్ద అని అర్థం. కనుక బ్రహ్మా అంటే పెద్దది అని అర్థం. ఎంత పెద్దది? అని ఆలోచిస్తే నీవు ఎంత ఆలోచించినా అంతకన్నా పెద్దది అని భావం. బ్రహ్మా అంటే సృష్టికర్త ఐన చతుర్ముఖ బ్రహ్మా అని ఒక అర్థం. బ్రహ్మా అంటే నిరాకార నిర్గుణ పరమాత్మ అని మరొక అర్థం. ఇక్కడ సృష్టికర్త బ్రహ్మాదేవుడే అనే అర్థం సరిపోతుంది.

బ్రహ్మాదేవుడు దేవతలందరి కన్న **ముందుగా పుట్టిన వాడు.**

ప్రళయకాలంలో ఒక్క పరమాత్మ మాత్రమే జలరాశిపై ఉంటాడు. ఇంక సృష్టి ఏమీ ఉండదు. ప్రళయకాలం పూర్తికాగానే ఆ పరమాత్మనుండి ముందుగ ఒక **తామర పుష్పంలో నుండి బ్రహ్మదేవుడు** జన్మిస్తాడు. ఆయనను సృష్టిచేయమని పరమాత్మ ఆదేశిస్తాడు. కనుక అందరికన్నా ముందు పుట్టినవాడు బ్రహ్మ. ఆయన సృష్టి కర్త. సృష్టి చేసిన వాడే రక్షించాలి గనుక రక్షకుడూ ఆయనే.

సృష్టి కర్తయైన ఆయనకు సృష్టి చేసే జ్ఞానం ఉండాలి. కనుక ఆయన సర్వజ్ఞుడై యుండాలి. సర్వజ్ఞుడైన ఆయన **సృష్టి చేసినప్పుడు ఆ సృష్టిలో అనేక విద్యలుంటాయి. ఈ విద్యలన్నీ లౌకిక విద్యలు. కనుక అవి సృష్టిని గూర్చి తెలుపుతాయి. జగత్తును గురించి, జగత్తులోని వస్తువుల గురించి, జీవుళ్ళ గురించి** తెలుపుతాయి. అయితే ఈ విద్యలన్నింటికి **ఆధారమైన మరొక** విద్య ఉన్నది. అదే **బ్రహ్మ** విద్య. ఈ లోకంలోని అన్ని విద్యలు బ్రహ్మ విద్యనుండి వచ్చినవే. ఇంటిలోని అన్ని కుళాయిలలో నుండి వచ్చే నీరు overhead Tank నుండి; అన్ని నదులలోని నీరు సముద్రం నుండి వచ్చినట్లుగ. – ఆ బ్రహ్మ విద్య సృష్టిని గురించిగాక సృష్టి కర్తను గురించి తెలియజేస్తుంది. సృష్టిలోని విద్యలన్నీ ఎంతగా నేర్చుకున్నా మృత్యువును దాటటానికి వీలులేదు. అయితే **బ్రహ్మ విద్య మాత్రం మృత్యువును దాటించ గలదు.** అమృతత్వాన్ని ప్రసాదించగలదు.

పొందలేవు నీవు పరి పూర్ణ శాంతిని
కవిత చేసిగాని, పాట నేర్చిగాని,
నేల నేలినగాని, నింగి తాకిన గాని,
నిన్ను తెలియక నీకు శాంతి రాదు.

నీవు ఎన్ని చేసినా – ఎంతనేర్చినా పరిపూర్ణ శాంతిని పొందలేవు.

నిన్ను నీవు తెలుసుకుంటేనే శాంతి. పరిపూర్ణ శాంతి. ఎన్నోబాధలతో దరిచేరిన ఆపన్నులకు **భగవాన్ రమణ మహర్షుల వారిచ్చే సలహా ఇదే. "నిన్ను నీవు తెలుసుకో".** నీ బాధలన్నీ తొలగిపోతాయి. ఆనందం కలుగుతుంది – అని. నిన్ను నీవు తెలుసుకొనే విద్యయే బ్రహ్మ విద్య – ఆధ్యాత్మిక జ్ఞానవిద్య – ఆత్మ జ్ఞాన విద్య. **మృత్యువును జయించాలంటే ఈ విద్యను నేర్వాలి.** అందుకే వేమనయోగి అంటారు. **"చదివి చదివి చదివి చావంగ నేటికి, చావులేని చదువు చదువ వలయు అని** – చావులేని చదువు బ్రహ్మ విద్యయే. అది అమృతం. **ఇట్టి బ్రహ్మ విద్యను బ్రహ్మదేవుడు తన పెద్దకుమారుడైన అథర్వునకు బోధించాడు.**

మొట్ట మొదటి సారిగా బ్రహ్మ చేత ఉపదేశించబడిన విద్య గనుక దీనిని **బ్రహ్మ విద్య అన్నారు. బ్రహ్మచేత రాయబడిన రాతను బ్రహ్మరాత అన్నారు.** దాన్నైనా దీన్నైనా – తెలుసు కోవటం చాలా కష్టం.

తండ్రికి బిడ్డపై వాత్సల్యం ఉంటుంది. తన బిడ్డ చాలా గొప్పవాడు కావాలని ప్రతి తండ్రీ ఆశిస్తుంటాడు. అలాగే తండ్రిపై బిడ్డకు ప్రేమ, గౌరవము ఉంటాయి. అదే గురువు మీద అయితే భక్తి శ్రద్ధ కూడా ఉంటాయి. **మరి తండ్రీ – గురువూ ఒక్కరే అయితేనో – ప్రేమ, గౌరవం, భక్తి శ్రద్ధ చనువు అన్నీ ఉంటాయి. వీటివల్ల ఆ తండ్రి నుండి గొప్పజ్ఞానాన్ని పొందే అవకాశం బిడ్డకు కలుగుతుంది.**

- అందువల్లనే తన తండ్రినే గురువుగా జేసికొని వరుణుని వద్ద భృగువు వేదాంత జ్ఞానాన్ని అభ్యసించాడు.
- తన తండ్రినే గురువుగా జేసికొని వ్యాసమహర్షి వద్ద శుక మహర్షి వేద వేదాంగాలను అభ్యసించాడు.
- తన తండ్రినే గురువుగా జేసికొని ఉద్దాలకుని చెంత ఆశీనుడై శ్వేతకేతువు ఆత్మజ్ఞానాన్ని అభ్యసించాడు.

✤ అలాగే ఈ ఉపనిషత్తులో అధర్వుడు కూడా తన తండ్రియైన బ్రహ్మదేవునే గురువుగా భావించి బ్రహ్మవిద్యను నేర్చుకున్నాడు. నిజమైన గురువులెవరైనా స్వస్వరూప జ్ఞానమునే అందిస్తారు. మరి గురువులకు గురువైన ఆది గురువు బ్రహ్మ దేవుడు కూడా అట్టి బ్రహ్మ జ్ఞానమునే – స్వస్వరూప జ్ఞానమునే తన జ్యేష్ఠ కుమారుడైన అధర్వునికి తెలియజేశాడు. ఇలా నేర్చుకొన్న జ్ఞానాన్ని అధర్వుడు ఇతరులకు అందజేసిన పరంపరను రాబోవు మంత్రం తెలియజేస్తుంది.

– ఈ బ్రహ్మ విద్య పరంపరాక్రమం ఈ మంత్రంలో –

మం॥ అధర్వణే యాం ప్రవదేత బ్రహ్మా
అధర్వా తాం పురోవాచాంగిరే బ్రహ్మవిద్యాం ।
స భరద్వాజాయ సత్య వాహాయ ప్రాహ
భారద్వాజోఽ ంగిరసే పరావరం ॥ (2)

ప్రతి॥ అధర్వణే = అధర్వునకు; బ్రహ్మ = బ్రహ్మదేవుడు; యాం = ఏ జ్ఞానమును; ప్రవదేత = తెలియజేసెనో; తాం బ్రహ్మ విద్యాం = ఆ బ్రహ్మవిద్యను; అధర్వా = అధర్వుడు; పురా = పూర్వము; అంగిరే = అంగిరునికి; ఉవాచ = చెప్పెను; సః = అతడు (అంగిరుడు) ; భారద్వాజాయ సత్యవాహాయ = భారద్వాజ గోత్రుడైన సత్యవాహునకు; ప్రాహ = చెప్పెను; భారద్వాజః = సత్యవాహుడు; పరావరం = ఆ పరావిద్యను; అంగిరసే ప్రాహ = అంగిరసునికి చెప్పెను.

భావం:– అధర్వునకు బ్రహ్మదేవుడు ఏవిద్యను తెలియజేసెనో అట్టి బ్రహ్మ విద్యను అధర్వుడు పూర్వము అంగిరునకు చెప్పెను. అంగిరుడు దానిని భారద్వాజ గోత్రుడైన సత్యవాహునకు ఉపదేశించగా, సత్యవాహుడు ఆ పరావిద్యను అంగిరసునకు బోధించెను.

వ్యాఖ్య:– ఈ బ్రహ్మ విద్య – వేదాంత విద్య – ఆర్ష విజ్ఞాన జ్యోతి పరంపరగా ఎలా కదిలి వచ్చిందో ఈ రెండవ మంత్రం తెలియజేస్తున్నది.

వేదములకు కర్త లేదు. అవి **అపౌరుషేయములు.** మహర్షులు పరిపూర్ణ ధ్యాన స్థితిలో ఉన్నప్పుడు వారికి అంతర్యములో వినిపించినవే వేద మంత్రములు. ఇలా వినిపించినవి గనుకనే వీటిని శ్రుతులు అన్నారు. మహర్షులు ఇలా ధ్యానస్థితిలో తమకు వినిపించిన ఈ సత్యములను ఆ తర్వాత తమనాశ్రయించిన శిష్యులకు బోధించెడివారు. ఆ శిష్యులు తాము నేర్చుకొన్న విద్యను తాముగురువులై తమ శిష్యులకు బోధించెడి వారు. ఇలా గురుశిష్య పరంపరా ప్రాప్తముగా వేదము చెవి నుండి చెవికి సోకి **'కర్ణ పరంపర'** అని కీర్తించ బడినది.

పుస్తకాల్లో అచ్చువేయించి విషయాలను అందిస్తేనే గుర్తుంచుకోలేక పోతున్నారు ఈనాటి విద్యావంతులు. మరి ఆనాడు లిపియేలేదు. కేవలం నోటితో వల్లె వేయుటం ద్వారానే విషయాలను బుద్ధిలో జ్ఞాపకం ఉంచుకొనేవారు. మహర్షుల అద్భుత మేధాశక్తి అట్టిది.

తాము పొందిన జ్ఞానాన్ని తామే ఉపయోగించుకొని ఊరకుండక, ఇతరులను కొందరినైనా తరింపజేయాలనే కోరికతో శిష్యులను జేర్చి వారికి బోధచేసేవారు మహర్షులు. వారిది త్యాగమయ జీవితం. ఆ మహర్షుల బాటలో నడిచేవారే మహర్షి సంతతివారు. అలాగాక త్యాగ ధనులైన ఋషులు అందించిన జ్ఞానాన్ని గ్రహించి; స్వార్థంతో, సంకుచిత భావంతో పది మందికీ పంచక తమకొరకే దాచుకొనువారు మహిష సంతతి వారవుతారు.

పవిత్రులు, త్యాగధనులు, అద్భుత మేధాశక్తి సంపన్నులు అయిన మహర్షుల మస్తిష్కాల నుండి జాలువారిన జ్ఞానగంగ అనేక మందిని పవిత్రం చేస్తూ ఎలా కదిలి వచ్చిందో ఈ రెండవ మంత్రం తెలియజేస్తున్నది.

బ్రహ్మదేవుని నుండి ఈ బ్రహ్మవిద్య ఆయన జ్యేష్ఠ పుత్రుడైన **అధర్వునికి** సంక్రమించింది. ఆ అధర్వుని వద్ద నుండి **అంగిరుడనే** మహర్షి ఈ జ్ఞానాన్ని గ్రహించాడు. ఆ అంగిరుడు ఈ బ్రహ్మ విద్యను తననాశ్రయించిన భారద్వాజ గోత్రుడైన **సత్యవాహునికి** బోధించాడు. ఈ సత్యవాహుని నుండి **అంగిరసుడనే** మహర్షి ఈ విద్యను నేర్చుకున్నాడు. ఇలా పరంపరా ప్రాప్తంగా తనకు లభించిన ఈ బ్రహ్మ విద్యను ఈ అంగిరస మహర్షి మరల ఎవరికి బోధించాడో తర్వాతి మంత్రం తెలియజేస్తుంది. ఈ అంగిరస మహర్షియే ఈ ముండకోపనిషత్తులో **ఆచార్యుడు.** అంగిరసునకు - శిష్యునికి జరిగిన సంవాదమే ఈ ముండకోపనిషత్.

ఈ అధర్వణ వేదం అధర్వాంగిరసం - చెక్కుచెదరని జీవుని ఆనందం.

- అంగిరసుని శిష్యుడెవరు? అతడు ఏమని ప్రశ్నించాడు?

మం॥ శౌనకో హవై మహాశాలో ఽంగిరసం
విధివత్ ఉపసన్నః పప్రచ్ఛ ।
కస్మిన్ను భగవో విజ్ఞాతే
సర్వమిదం విజ్ఞాతం భవతీతి ॥ (3)

ప్రతి॥ హవై మహాశాలః = ఉత్తమ గృహస్థుడైన; శౌనకః = శునకుని పుత్రుడు శౌనకుడు; విధివత్ = యుక్త రీతిన; అంగిరసం ఉపసన్నః = అంగిరసుని సమీపించి; భగవన్ = ఓ మహాత్మా; కస్మిన్ను విజ్ఞాతే = దేనిని తెలుసుకోవటం చేత; ఇదం సర్వం = ఈ ప్రపంచ జ్ఞానమంతా; విజ్ఞాతం భవతి = తెలియబడుతుంది; ఇతి = అని; పప్రచ్ఛ = ప్రశ్నించెను.

భావం:- ఉత్తమ గృహస్థుడైన శౌనకుడు **యుక్తరీతిన** అంగిరసుని సమీపించి, "ఓ మహాత్మా! దేనిని తెలుసుకోవటం చేత ఈ ప్రపంచ జ్ఞానమంతా తెలియబడుతుంది?" అని ప్రశ్నించెను.

వ్యాఖ్య:- శౌనక మహర్షి అంగిరసుని సమీపించి **ప్రశ్నించటంతో** ఈ ఉపనిషత్తునందలి జ్ఞానామృతం మన దగ్గరకు వస్తున్నది. ఈ పరం పరాగతమైన బ్రహ్మవిద్య శౌనక మహర్షి ప్రశ్న ద్వారా ప్రపంచంలోని సమస్త మానవాళి తెలుసుకొనుటకు వీలు కలిగింది. ఈ ఉపనిషత్తులో **ఆచార్యుడు అంగిరసుడు. శిష్యుడు శౌనకుడు.** ఈ శౌనకుడు శునక మహర్షి యొక్క పుత్రుడు; ఉత్తమ గృహస్థుడని ఈ మంత్రం తెలియజేస్తున్నది.

ముండకోపనిషత్తు సన్యాసుల కొరకు చెప్పబడినదనే అభిప్రాయం దీనిని బట్టి అంతగా అంగీకారయోగ్యం కాదు. ఇందులోని విషయాలు పరిపక్వత చెందిన సాధకులకు చక్కగా ఉపయోగపడతాయి అనేమాటను అంగీకరించవచ్చుగాని, గృహస్థులు దీనికి అర్హులు కాదనే మాట మాత్రం తప్పని ఇక్కడ ఋజువౌతున్నది. ఎందుకంటే -

శౌనకుడు ఉత్తమ గృహస్థుడు. అట్టి గృహస్థునికే, గురువు ఈ అద్భుత జ్ఞానాన్ని అందించాడు. దీనిని బట్టి అజ్ఞానాన్ని పూర్తిగా నాశనంచేసే ఈ ఉపనిషత్తు అజ్ఞానం ఉన్న ప్రతి వ్యక్తికీ అవసరమే. అతడు గృహస్థుడైనా, వానప్రస్థుడైనా, సన్యాసి ఐనా - ఎవరైనాసరే తమలో గూడుకట్టుకొని ఉన్న అజ్ఞానాన్ని పూర్తిగా నాశనం చేసుకోవటానికి ఈజ్ఞానం అవసరమే.

అయితే ఈ ఉపనిషత్తులో కనిపించే శిష్యుడు **'ఉత్తమ గృహస్థుడు'** అని ప్రత్యేకంగా పేర్కొనటం జరిగింది. అంటే గృహస్థాశ్రమ విధిని సక్రమంగా నెరవేర్చినవాడు అని. ఎలా?

(i) జీవితంలోని భోగాలన్నింటిని చవిచూసి, **భోగాలన్నీ** నిజంగా రోగాలకు ఆలవాలమైనవేనని తెలుసుకొని, వాటిపట్ల **వైరాగ్యం కలిగినవాడు.**

(ii) ప్రపంచంలోని సుఖాలన్నీ నిజంగా దుఃఖాల ప్రతి రూపమేగాని అవి నిజమైన, **నిత్యమైన సుఖాలు కాదని బాగా గ్రహించుకొన్నవాడు.**

(iii) నిజమైన **ఆనందం,** నిజమైన సుఖం; నిత్యమైన శాంతి ఈ **ప్రాపంచిక విషయాలలో** భోగాలలో **లేదని తెలుసుకొని** అట్టి శాశ్వతానందం, పరిపూర్ణ శాంతి **పరమాత్మ సాన్నిధ్యం వల్లనే** లభిస్తుందనే దృఢమైన నమ్మకం కలిగినవాడు;

(iv) అట్టి పరమాత్మను చేరుకొనుటకు తన ధర్మాలను తాను నిర్వర్తిస్తూ, **దైవ చింతనతో బ్రతుకును** నందనవనం చేసుకోవాలని గ్రహించిన ఆదర్శవంతుడు – **ఉత్తమ గృహస్థుడు** అవుతాడు. అలా తెలుసుకోవటమే గాదు తన లోని

(v) **రజోగుణ తమో గుణాలను** వదిలించుకుంటూ సాత్త్విక బుద్ధితో; **అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ, తనపై ఆధారపడిన వారిని పోషిస్తూ, తన కర్తవ్యాలను నిర్వర్తిస్తూ, నిరంతరం ఆ దైవాన్ని తన మనస్సులో నిల్పుకొని, నిరంతర దైవచింతన చేస్తూ, అవకాశం దొరికినప్పుడల్లా దైవకార్యాలు చేస్తూ; అలాంటి దైవ కార్యాలకు చేతనైనంతగా సహాయ సహకారాలందిస్తూ, పురాణాలు, ఇతిహాసాల యొక్క లోతులను తెలుసుకుంటూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని శ్రవణం చేస్తూ, జీవితాన్ని ఆదర్శ వంతంగా తీర్చి దిద్దు కొనేవాడే** ఉత్తమ గృహస్థుడుగా పరిగణింపబడతాడు. అట్టివాడే శౌనకుడు. ఈ లక్షణాలు మనలో ఉండి, మనం కూడా అలా వ్యవహరించగలిగితే ఈ ఉపనిషత్తు మనకు చక్కగా ప్రయోజనకారి. ఈ శౌనకుడు తనతోటి మహా మునులందరితో కలిసి సూతమహర్షి వల్ల అనేక పురాణాలను, ఇతిహాసాలను, శాస్త్రాలను తెలుసుకుంటూ ఉండేవాడు. మహాత్ముల దర్శనం లభిస్తేచాలు వారిని సేవించి, పూజించి, ప్రార్థించి అనేక పారమార్థిక విషయాలను తెలుసుకుంటూ ఉండేవాడు. అందుకే శౌనకుని ఉత్తమ గృహస్థుడు అని కీర్తించటం.

అట్టి శౌనకుడు 'విధివత్' అంటే విధిననుసరించి – శాస్త్ర విధిననుసరించి గురువైన అంగిరసుని సమీపించాడు. పూర్వకాలంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందాలనుకున్న వారు గురువులను సమీపించే పద్ధతి ఒకటున్నది. అదేమంటే తాను ముందుగా ఈ ప్రాపంచిక భోగాల పట్ల విరక్తుడై, **సమిధలను** చేతపట్టుకొని గురువును ఆశ్రయిస్తాడు. గురువు దగ్గరకు వెళ్ళేటప్పుడు **ఒట్టి చేతులతో** వెళ్ళకూడదు. గురువు–దైవం – గర్భిణీ స్త్రీలు – వీరి వద్దకు ఒట్టి చేతులతో వెళ్ళరాదు. గురువు చేసే యజ్ఞానికి హోమద్రవ్యాలుగా ఉపయోగపడే సమిధలను చేత పట్టుకొని ఆశ్రమ ప్రాంతం చేరుకుంటాడు. అలా గురువుచేసే లోక కళ్యాణ కారకమైన యజ్ఞానికి తన వంతు సహాయంగా సమిధలు చేతబట్టుకొని వెళ్తాడు. ఇందులో **ఒక ఆంతర్యం కూడా** ఉంది.

ఈ సమిధలు **హోమాగ్నిలో** పడి భస్మమై పోయినట్లుగా ఈనాడు తనలో గూడు కట్టుకొని యున్న **అజ్ఞానం** కూడా గురుదేవుని ముఖ కమలం నుండి వెలువడే **జ్ఞానాగ్నిలో** పడి దగ్ధమై పోవాలనే భావనయే శిష్యులు సమిత్పాణులై గురుదేవుని సందర్శించుటలోని ఆంతర్యం.

అయితే ఈనాడు అట్టి సాంప్రదాయాలు అడుగంటి పోతున్నాయి. ఇవ్వాళ చాలామంది శిష్యులు ఏ మాత్రం వినయ విధేయతలు లేకుండా ఆవేశ పూరితులై గురువులను ప్రశ్నించి, **తమ ఆధిక్యతను ప్రదర్శించుకోవాలను కుంటున్నారు.** జ్ఞానం కోసం **తామెక్కడికీ వెళ్ళాల్సిన** పనిలేదు. అదే వెతుక్కుంటూ రావాలని, వచ్చినప్పుడు నాకు వీలుంటే తెలుసు కుంటాననే భావన స్థిరపడి పోతున్నది. అంతేగాకుండా గురువుల వద్ద అధికార దర్పాలను, **డాంబికాన్ని ప్రదర్శించుకుంటూ** గురువు చెప్పే విషయాలను గాకుండా గురువులో లోపాలను వెతకటానికి, ప్రచారం చేయటానికి ప్రయత్నించే మందమతులు, అప్రయోజకులు అధికమవుతున్నారు.

గురువులను తామే ఉద్ధరిస్తున్నామని భావించుకుంటారు గాని తమ ఉద్ధరణ గురించి ఆలోచించకుండా పతన మవుతున్నారు. **ఇట్టివారు** ఎన్ని శాస్త్రాలు తెలుసుకున్నా వ్యర్థమే. వారి జీవితంలో ఏమాత్రం మార్పురాదు. వారిది భ్రష్ఠ జీవితమే. అట్టి వారికి ప్రాచీన సాంప్రదాయాలు అర్థరహితంగా అనిపిస్తాయి.

సనాతన ధర్మ జీవన బాటలో పయనించే శౌనకుడు శాస్త్ర విధిననుసరించి, సమిత్పాణియై గురుదేవుడైన అంగిరసుని సమీపించి వినమ్రుడై ఆయనతో **ఇలా అంటున్నాడు.** "భగవాన్! దేనిని తెలుసుకుంటే ఈ సర్వము తెలియబడుతుందో అట్టి జ్ఞానాన్ని నాకు తెలియజేయండి" – అని చేతులు జోడించి నమస్కరించాడు.

ఇలా ప్రశ్నించటంతో శౌనకుని వినయ విధేయతలే గాకుండా **ఆయన అంతరంగిక వైభవం కూడా బయట పడుతుంది.** ఆయన హృదయావేదన ఏమిటో తెలుస్తుంది. తానుకోరుకొనేది భౌతికమైన భోగలాలస కాదు. భోగ్యవస్తువులలో తనకు ఆనందం కనిపించలేదు. పరిమిత వస్తువులతో పరిమిత ఆనందమేగాని శాశ్వతానందం లభించటం లేదు. కనుక **ఏ జ్ఞానాన్ని** పొందితే శాశ్వతానందం, పరిపూర్ణ శాంతి లభిస్తుందో అట్టి జ్ఞానం తనకు కావాలి. అందుకే వినయంతో కూడిన ప్రశ్న వేశాడు. (పరి ప్రశ్న)

మన స్వానుభవంలో ఒక దానికి సంబంధించిన జ్ఞానం కలిగితే మరొకదానికి సంబంధించిన జ్ఞానం తెలియదు. వైద్య శాస్త్రం తెలుసుకుంటే రోగాలవిషయం – వాటిని నివారించే తెలివి వస్తుందేగాని, కోర్టుల్లో వాదించే తెలివి రాదు. Law ప్రాక్టీస్‌చేస్తే కోర్టుల్లో వాదించే తెలివి వస్తుందే గాని కలపతో కుర్చీలు, బల్లలు చేసే తెలివిరాదు. వడ్రంగం నేర్చుకుంటే చక్కతో వస్తువులు చేయటం తెలుస్తుందేగాని చెప్పులు కుట్టటం చేతగాదు. చెప్పులు కుట్టటం నేర్చుకున్న వాడికి పౌరోహిత్యం చేతకాదు. ఇలా ఒకజ్ఞానం పొందిన

వాడికి మరొక విషయంలో తెలివి ఉండదు. మరి ఏదో ఒకటి తెలుసుకొంటే అన్ని జ్ఞానాలు కలిగేదెలా? అలా కలగాలంటే అన్ని వస్తువులు ఒక్క దానినుండే వస్తే ఆ ఒక్కదానిని తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నట్లే. - కుండలు, చట్లు, మూకుళ్ళు, కూజాలు, ప్రమిదెలు మొ॥న వన్నీ మట్టితో తయారైనవే. కనుక మట్టిని తెలుసుకొంటే అన్ని పాత్రల జ్ఞానము వచ్చినట్లే.

అలాగే ఈ సమస్త సృష్టి ఆ సృష్టికర్తనుండే = పరమాత్మ నుండే వచ్చింది. ఆ పరమాత్మను గురించి తెలుసుకుంటే సమస్తము తెలిసినట్లే. **ఆ పరమాత్మ గురించి తెలియజెప్పే జ్ఞానమే బ్రహ్మజ్ఞానం. అది తెలుసుకొంటే ఈ ప్రపంచ జ్ఞానమంతా తెలుసుకొన్నట్లే.**

అందుకే ఏ ఒక్క జ్ఞానాన్ని తెలుసుకుంటే సమస్త వస్తుజ్ఞానము, సమస్త ప్రపంచ జ్ఞానము అనుభవానికి వస్తుందో అట్టి జ్ఞానాన్ని బోధించమని శౌనకుడు అడిగిన ప్రశ్నకు గురువైన అంగిరసుడు రాబోయే మంత్రంలో సమాధానం చెప్పబోతున్నాడు.

- శిష్యుని ప్రశ్నకు గురువు సమాధానం.

మం॥ తస్మై సహోవాచ ద్వేవిద్యే వేదితవ్యే ఇతి హస్మయద్ ।
బ్రహ్మ విదో వదంతి పరాచైవ అపరాచ ॥ (4)

ప్రతి॥ తస్మై = ఆ శౌనకునికి; సః = అంగిరసుడు; ఉవాచ = జవాబు చెప్పెను; వేదితవ్యే ద్వేవిద్యే = తెలియదగినవి రెండు విద్యలున్నాయి; పరాచ అపరాచ = పరావిద్య, అపరావిద్య; ఇతి = అని; బ్రహ్మవిదః వదంతిస్మ = బ్రహ్మవిదులు చెబుతున్నారు.

భావం:- శౌనకునికి అంగిరసుడు జవాబు చెప్పెను. "తెలియదగినవి పరావిద్య, అపరావిద్య అని రెండు విద్యలున్నాయని బ్రహ్మ వేత్తలు చెబుతున్నారు".

వ్యాఖ్య:- ఏ ఒక్క జ్ఞానాన్ని **తెలుసుకుంటే సమస్త ప్రపంచ జ్ఞానము** తెలుసుకోబడుతుందో అట్టి బ్రహ్మజ్ఞానమును అందించమని శౌనకుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా అంగిరసుడు ఇక్కడ రెండు విద్యలున్నాయని చెబుతున్నాడు. ఒక్కటి అడిగితే - ఆ ఒక్కటి చెప్పక రెండింటిని చెబుతున్నాడు గురువు. ఎందుకని ఇలా చెబుతున్నాడు?

శిష్యుడు ప్రశ్న సూటిగానే అడగవచ్చు. కాని ఒక్కొక్క సమయంలో గురువు తన సమాధానాన్ని సూటిగా చెప్పే వీలుండదు. అలా సూటిగా చెబితే వేదాంతం అర్థంకాదు; అనుభవానికి రాదు. **తెలిసిన దాని ద్వారా తెలియని దానిని తెలుసుకొనుటకు చేసే ప్రయత్నమే వేదాంతం.**

ఒక కాలనీలోకి వెళ్ళి ఒకవ్యక్తి అక్కడ కనిపించిన ఒకరిని అడిగాడు, **గోపాలంగారి ఇల్లు ఏది**? అని. అక్కడి ఇళ్ళన్నీ ఒకే రకంగా ఉన్నాయి. ఒకే రంగు వేసి ఉన్నాయి. అందువల్ల అతడు అదిగో అది - అదే అని ఎంతగా చెప్పినా అదా? ఆప్రక్కదా? అని అడుగు తున్నాడేగాని స్పష్టంగా అర్థంకాలేదు. అంతలో ఒక కాకి ఆగోపాలం గారింటి మీద వాలింది. వెంటనే అతడు చెప్పాడు. అదిగో? ఆ కాకి వాలిందే - అదే గోపాలంగారిల్లు అని. తెలియని ఇంటిని గుర్తించాలంటే తెలిసిన కాకి ద్వారానే సాధ్య మయింది. ఇక్కడ కాకి అవసరం అతడికి లేదుకాని ఇల్లు కనుక్కోవటానికి అవసరమైనది. **అలాగే** వేదాంతంలో కూడా పరావిద్య - అపరావిద్య అని రెండు విద్యలున్నాయని చెబుతున్నాడు గురువు. పరావిద్య అంటే బ్రహ్మ విద్య. బ్రహ్మాను భూతికి సహాయపడే విద్య. మోక్షాన్ని కలిగించే విద్య. అపరావిద్య అంటే బ్రహ్మాను భూతికి సరాసరి సహకరించదు. కాకపోతే 'పరావిద్య'ను అర్థం చేసుకోవాలంటే, అర్హతగా ఈ అపరా విద్యను తెలుసుకొనటం కూడా అవసరమే. అలా తెలుసుకొని అపరావిద్యను నిరశించి పరావిద్యతో బ్రహ్మానుభూతిచెందాలి.

అందువల్ల శిష్యుడు తెలుసుకోగోరింది పరావిద్యనే ఐనప్పటికీ గురువు మాత్రం రెండు విద్యలను గురించి చెప్పబోతున్నాడు. ఇక్కడ గురువును **సూటిగ - అడిగిన దానికి చెప్పటంలేదని నిందించరాదు.** ఇక్కడ శిష్యుని సందేహాన్ని పూర్తిగా తొలగించటం, సమ్యక్జ్ఞానాన్ని అందించటం గురువుయొక్క భాద్యత. అంతేగాని శిష్యుని ప్రశ్నకు జవాబుచెప్పటమే ముఖ్యంకాదు.

శిష్యుడు ప్రశ్నవేసినప్పుడు అందులో అనవసరవిషయం కొంత ఉండవచ్చు; అవసరవిషయం లేకపోనూ వచ్చు. అనవసరవిషయం ఉంటే దానిని వదిలేయాలి. అవసరవిషయం లేక పోయినా సరే దానిని కూడా స్వీకరించి తగు విధంగా బోధించి, శిష్యుని ఉన్నత మార్గంలో నడపాలి. అదే సద్గురువుల యొక్క భాద్యత.

పరావిద్య అంటే ఆత్మజ్ఞానము; స్వస్వరూప జ్ఞానము. స్వస్వరూప జ్ఞానము లేకపోవుటయే అజ్ఞానము. స్వస్వరూపం తెలియనప్పుడు తాను జీవుణ్ణని భ్రాంతి చెందుతాడు. ఈ భ్రాంతిని తొలగించి తన నిజస్వరూపం ఆత్మయేనని తెలిపే జ్ఞానమే ఆత్మజ్ఞానం. అదే పరావిద్య. అపరావిద్యగౌణం. అంటే అదీ పరావిద్యయేననే భ్రమకలిగిస్తుంది. కాని కాదు. అందుకే దానిని గౌణం అన్నారు. ఏమిటా రెండు విద్యలు?

- ఇప్పుడా రెండు విద్యలు - పరా, అపరా విద్యల యొక్క సమగ్రజ్ఞానాన్ని అందిస్తున్నారు 5వ మంత్రంలో.

మం॥ తత్రాపరా, ఋగ్వేదో యజుర్వేదః

సామవేదోఽ థర్వవేదః శిక్షా కల్పో

వ్యాకరణం నిరుక్తం, ఛందో జ్యోతిష్యమితి

అథపరా, యయా తదక్షర మధిగమ్యతే ॥(5)

ప్రతి:– తత్ర = ఆరెండింటిలో (పరా–అపరా విద్యలలో); ఋగ్వేదః యజుర్వేదః సామవేదః అథర్వవేదః = ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము; శిక్ష –= శబ్దములను తెలియజేయుశాస్త్రము (Phonetics); కల్పః = కర్మవిధులను తెలియజేసే శాస్త్రము (Rituals); వ్యాకరణం = పదకూర్పును వ్యాకరించు శాస్త్రము (Grammer); నిరుక్తం = పదముల యొక్క అర్థ నిర్ణయం చేసేశాస్త్రం (Etymology); ఛందః = గురు, లఘువులను తెలిపే శాస్త్రం (Prosody); జ్యోతిష్యం = జ్యోతిస్సులను తెలిపే శాస్త్రం (Astrology); ఇతి = అని; అపరా = అపరావిద్య; అథ = ఇక; యయాతత్ అక్షరం = దేనిచేత ఆ అక్షర తత్వం; అధిగమ్యతే = పొందబడుతుందో; పరా = అది పరావిద్య.

భావం:– పరా, అపరా అనబడే రెండు విద్యలలో ఋగ్వేదం, యజర్వేదం, సామవేదం, అథర్వణవేదం అనే నాలుగు వేదాలు, శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిష్యం అనే ఆరు వేదాంగములు అపరా విద్యకు సంబంధించినవి. అక్షర పరబ్రహ్మను – పొందగలిగే విద్యయే పరావిద్య.

వ్యాఖ్య:– అపరావిద్యలో 4 వేదాలు – 6 వేదాంగాలు ఉన్నాయి. 4 వేదాలు : ఋగ్వేదం, యజర్వేదం, సామవేదం, అథర్వణవేదం. 6 వేదాంగాలు :

1. **శిక్ష :–** 'అ' నుండి 'హ' వరకు గల 50 **అక్షరములను ఉచ్చరించే విధానాన్ని తెలియజేసే శాస్త్రం శిక్ష –**

2. **కల్పం:–** (కల్పించేది గనుక కల్పం) వేదములందు తెలియజేయబడిన యజ్ఞ యాగాది **కర్మలయొక్క విధి విధానాన్ని** తెలియజేసేది కల్పం. (కర్మవిధులు)

3. **వ్యాకరణం :–** పదకూర్పును పదసంధిని వ్యాకరించుట. **పాణిని** మొ॥ మహాత్ములు వ్యాకరణమునకు కర్తలు.

4. **నిరుక్తం :-** వ్యాకరణం వల్ల సాధ్యం కాని వానిని విపులీకరించి, విమర్శించి **అర్ద నిర్ణయము చేసే శాస్త్రం నిరుక్తం. దీనిని యాస్కమహాముని** రచించెను.

5. **ఛందస్సు :-** వేదములయందలి మంత్రముల యొక్కగురు, లఘువుల సంఖ్యను తెలిపేశాస్త్రం. దీని కర్త **నందికేశ్వరుడు.**

6. **జ్యోతిషం :-** జ్యోతిస్సులను తెలియజేసేది. రాత్రింబవళ్ళు, కాలములు దీనివల్ల తెలియును. సిద్ధాంతము, జాతకము, ముహూర్తము. ప్రశ్న అనే నాలుగు విధాలుగా ఈ జ్యోతిశాస్త్రం తెలియబడుతున్నది.

నాలుగు వేదాలలో చెప్పబడిన కర్మకాండ, పైన చెప్పిన 6 వేదాంగములు - ఇవన్నీ అపరావిద్యలే. అపరా విద్యజిజ్ఞాసువును కర్మమార్గం వైపుకు నడిపించి కర్మవలయంలో దింపుతుంది. స్వర్గాది సౌఖ్యములను ప్రసాదిస్తుంది. పుణ్య మార్గమున, ధర్మమార్గమున మానవులను నడిపిస్తుంది. అయితే పుణ్యము, ధర్మము అనేవి పరిపూర్ణత నివ్వవు. ఈ ధర్మావలంబనం కర్మవైపు నడకసాగిస్తుంది. పదే పదే కర్మలు ఆచరించేటట్లు చేస్తుంది.

పుణ్యంవల్ల, ధర్మం వల్ల, కర్మలవల్ల బ్రహ్మజ్ఞానం సిద్ధించదు. కనుక ధర్మ, అర్థ, కామములనే మూడు పురుషార్థములు అపరావిద్యయే.

ప్రపంచంలో మతాలన్నీ ధర్మాచరణమే ముఖ్య విషయంగా బోధిస్తున్నవి. అందరిని ధర్మ మార్గంలో నడిపించటానికే కంకణం కట్టుకున్నాయి. కనుక ఇవన్నీ అపరావిద్యను తెలియజేసేవే.

అయితే బ్రహ్మజ్ఞానం ఒక్కటే పరావిద్య. అట్టి పరావిద్యను అందించేది మన సనాతన ధర్మమే.

అపరావిద్య కర్మ వలయంలో దింపేదయితే పరావిద్య నైష్కర్మ్య సిద్ధిని అందించేది. అంటే కర్మలనుండి మానవులను ఉద్ధరించేది; తన స్వస్థితిలో నిలిపేది.

అపరావిద్యలు తనకన్న వేరైన ప్రపంచాన్ని, వస్తువుల గురించిన జ్ఞానాన్ని తెలిపేవి. పరావిద్య అన్నింటిని తెలుసుకొనే వానిని గూర్చితెలిపేది. అంటే ఆత్మను గురించి తెలిపేది.

"నేను అజ్ఞానిని" అన్నాడొకడు. అంటే వివేకంతో, విచక్షణతో అన్నింటిని తెలుసుకోలేక పోతున్నానని అతని భావన. ఈ తెలుసుకోలేక పోవటం నిజంగా బుద్ధి ధర్మం. **తన బుద్ధికి తెలివి లేదని ఏ జ్ఞానం వల్ల తెలుసుకుంటున్నాడో ఆ జ్ఞానమే 'ఆత్మ'. కనుక తెలివి లేని వాని ఆత్మకూడా జ్ఞాన స్వరూపమే.**

అలాగే నాకు ఫలానా విషయంలో గొప్ప జ్ఞాన మున్నది, నా కన్నీతెలుసు అని అంటాం. ఈ జ్ఞానం కూడా బుద్ధికి చెందిన జ్ఞానం. **అయితే బుద్ధికి అట్టి జ్ఞానం ఉన్నదని ఏ జ్ఞానం వల్ల తెలిసిందో ఆ జ్ఞానమే ఆత్మ. కనుక తెలివిగల వాని ఆత్మ కూడా జ్ఞాన స్వరూపమే.**

దీనిని బట్టి జ్ఞానం, అజ్ఞానం రెండూ బుద్ధికి సంబందించినవే గాని ఆత్మకు చెందినవిగావు. అయితే బుద్ధిలోని జ్ఞాన అజ్ఞానములను ప్రకాశింప జేసే తెలివియే ఆత్మ – ప్రజ్ఞ. అదేపరావిద్య. ఇది అక్షరమని అంగిరస మహర్షి తెలియజేస్తున్నారు. అంటే నాశనం లేనిదని, నిత్యము, శాశ్వతము అయినదని భావన.

అపరా విద్య క్షర స్వరూపమని, పరావిద్య అక్షరము, అవ్యయము అని తెలుస్తున్నది. పరావిద్య ద్వారా అక్షర పరబ్రహ్మ తత్త్వాన్ని ఎలా తెలుసుకోవాలో ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని మహాత్ములు ఎట్టిదిగా దర్శిస్తున్నారో రాబోవు మంత్రంలో వివరించబోతున్నారు.

దీనితో రెండు విద్యలను గూర్చి వివరించటం పూర్తవుతుంది.

– ఇక పరావిద్య ద్వారా పొందబడే అక్షర తత్త్వాన్ని గురించి –

మం॥యత్ తదద్రేశ్య మగ్రాహ్య మగోత్ర మవర్ణం
అచక్షుః శ్రోత్రం తదపాణి పాదం
నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం
తదవ్యయం యద్భూత యోనిం పరిపశ్యంతి ధీరాః॥ (6)

ప్రతి:– యత్ = ఏదైతే; అద్రేశ్యం = కనిపించదో; అగ్రాహ్యం = గ్రహించుటకు వీలులేదో; అగోత్రం = పుట్టుక లేనిదో; అవర్ణం = రంగులేనిదో; అచక్షుః శ్రోత్రం = కన్నులు, చెవులు లేనిదో; తత్ అపాణి పాదం = చేతులు కాళ్ళు లేనిదో; నిత్యం = నిత్యమైనదో; విభుం = సర్వరూపధారియో; సర్వగతం = సర్వవ్యాపియో; సుసూక్ష్మం = సూక్ష్మాతి సూక్ష్మమైనదో; అవ్యయం = నశించని దైయున్నదో; తత్ = దానిని; ధీరాః = ధీరపురుషులు; భూతయోనిం = విశ్వకారణముగ; పరిపశ్యంతి = చక్కగ దర్శిస్తారు.

భావం:– ఏదైతే కన్నులకు కనిపించదో, మనస్సుచే గ్రహించుటకు వీలులేదో, పుట్టుకలేనిదో, రంగులేనిదో, కన్నులు చెవులు లేనిదో; కాళ్ళుచేతులు లేనిదో; నిత్యము, సర్వరూపధారి, సర్వవ్యాపియో, సూక్ష్మాతి సూక్ష్మమైనదో, నశించనిదైయున్నదో దానిని ధీర పురుషులు విశ్వకారణముగ చక్కగా దర్శిస్తారు.

వ్యాఖ్య:– 4 వేదములు, 6 వేదాంగములు – అన్నీ అపరావిద్యయేనని క్రిందటి మంత్రంలో తెలియజేశాడు గురువు. దానితో తాను ఇంత వరకు అభ్యసించిన వేదాధ్యయనం గాని, చేసిన కర్మలుగాని అపరావిద్యకు చెందినవైతే వ్యర్థమేగదా! అనే నిరాశ కలిగింది శిష్యునిలో. శిష్యునిలో కలిగిన నిరాశను తొలగించటానికి అక్షర పరబ్రహ్మ స్వరూపాన్ని గూర్చిన

జ్ఞానాన్ని అందిస్తున్నాడు గురువు. అక్షర పరబ్రహ్మమే ఆత్మ. ఆత్మను గురించి తెలుసుకొనుటయే పరావిద్య. పరమాత్మను తెలుసుకొనే విద్యయే పరావిద్య.

ఆత్మకు నామ రూపాలులేవు. మనస్సేమో నామ రూపాలమీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నది. నామ రూపాలుంటేనే మనస్సు ఆ వస్తువులను, విషయాలను తెలుసుకుంటుంది. కనుక నామరూపాలు లేని ఆత్మను మనస్సు తెలుసుకోలేదు. కనుకనే మనస్సు ఆత్మ సామ్రాజ్యంలో ప్రవేశించలేక పోతున్నది. **వేదాంతంలో ఇదే కష్ట సాధ్యమైనది.** అందుకే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని గ్రంథాల ద్వారాగాక అనుభవజ్ఞులైన గురువుల ద్వారా మహాత్ముల ద్వారా గ్రహించి తరించాలి.

ఈ మంత్రం చాలా అద్భుతమైనది, అందమైనది, ఆత్మను తేలికగా అవగాహన చేసుకొనుటకు అనుకూలిస్తున్నది. ఇందులో చెప్పిన లక్షణాలను చర్చించి సత్యాన్ని తెలుసుకుందాం.

1. అద్రేశ్యం :- ఆత్మ కంటికి కనిపించేది కాదు. ఎందుకంటే ఆత్మ దృశ్యం కాదు. దృక్కు. కన్ను దృశ్యాన్ని చూస్తుంది; దృక్‌ను కాదు. చూచే కంటికి వెనకాల ఉన్నది ఆత్మ చైతన్యమే. అది వస్తువు కాదు గనుక కంటికి కనిపించదు. నిజంగా కన్ను ఒక పరికరం లాంటిదే. ఆ కంటికి వెనుకనున్న ఆత్మ శక్తియే కంటిద్వారా తెలుసుకుంటున్నది. (కంటికి కళ్ళజోడులాగా ఆత్మకు కన్ను ఉపయోగపడుతుంది. అంతే)

మనం ఒక వస్తువును చూడాలంటే కళ్ళజోడు పెట్టుకుంటాం. ఆ కళ్ళజోడు ద్వారా వస్తువును చూస్తాం. కాని ఆ కళ్ళజోడు తనంతట తాను చూడగలుగుతుందా? చూచే మనను చూడగలుగుతుందా? అలాగే కన్ను తనకు చైతన్యాన్నిచ్చే ఆత్మను ఎన్నటికీ చూడలేదు. కన్నేకాదు - ఏ జ్ఞానేంద్రియాలూ చూడలేవు.

2. అగ్రాహ్యం :- మనస్సుచేత గ్రహించుటకు కూడా వీలు పడనిది. ఆత్మ ఇంద్రియాలకు గోచరం కాదని ఇంతకు ముందుతెలుసుకున్నాం. ఇప్పుడది మనస్సుకు కూడా అందదు అని చెబుతున్నారు. అసలు మనస్సు పనిచేయటానికి కారణం ఆత్మయే. ఆత్మ చైతన్యం లేనిచో మనస్సుజడం. ఇలా చైతన్యం చేతనే పనిచేసే మనస్సు ఆ చైతన్యాన్ని చూడాలంటే దానికి దూరంకావాలి. దూరమైతే మనస్సు కాస్తా జడమౌతుంది.

బ్యాటరీ సహాయంతో టార్చిలైటు ఏ వస్తువునైనా చూపుతుంది. మరి ఆ బ్యాటరీలను చూడాలని టార్చికి అనిపించిందనుకోండి. ఆ బ్యాటరీలను టార్చినుండి వేరు చేయాలి. అలా వేరు చేస్తే ఆ టార్చిలైటు పనిచేయదుగదా! అలాగే చైతన్యంతో పనిచేసే మనస్సు తన శక్తికి కారణమైన ఆత్మ చైతన్యాన్ని గ్రహించే వీలులేదు. కనుక ఆగ్రాహ్యం అన్నారు.

3. అగోత్రం :- అగోత్రం అంటే పుట్టుకలేనిది. పుట్టుక లేనిది గనుక మార్పులులేవు, నాశనం లేదు. అగోత్రం అంటే గోత్రం లేనిది అనికూడా అర్థం, పుట్టినవాడికే జాతి, గోత్రం నామం, రూపం ఉంటాయి. అసలు పుట్టుకయేలేని ఆత్మకు అవేమీ ఉండవు.

4. అవర్ణం :- వర్ణం అంటే రంగు లేదా గుణం అని అర్థం. ఆత్మకు పుట్టుక లేదని ఇంతకు ముందే తెలుసుకున్నాం. కనుక అది వస్తువు కాదు, దేహంకాదు. కనుక దానికి రంగు ఉండదు. అది మనస్సూకాదు. కనుక దానికి గుణమూలేదు. సత్వ, రజ, స్తమోగుణాలు, మనసున్న ప్రాణులకేగాని – ఆత్మ **గుణరహితం; వర్ణరహితం; నామరహితం; రూపరహితం.**

5. అచక్షుః శ్రోత్రం :- ఆత్మచైతన్యం అవయవరహితం – నిరవయవం. కనుక దానికి కన్నులులేవు; చెవులు లేవు. ఆత్మ ఒక చైతన్య శక్తి. అది అంతటా ఉన్నది. **దానికన్న వేరే ఏమీ లేదు.** కనుక దేనినీ చూచే పనిలేదు; వినే పనిలేదు. కనుకనే అచక్షుః శ్రోత్రం అన్నారు.

6. అపాణి పాదం :- ఆత్మ చైతన్యం **ఏ పనీచేయాల్సిన అవసరం లేదు. ఎక్కడకూ పోవాల్సిన పనిలేదు.** అందుకే పనిచేసే చేతులుగాని, నడిచేకాళ్ళుగాని లేవు. దానికి పొందవలసినది ఏదీ లేదు గనుక చేతులతో పనిలేదు. అది అంతటా ఉన్నది గనుక ఎక్కడికీ కదిలే వీలు లేదు. కనుక పాదాలు లేవు.

ఇంత వరకూ ఆత్మకు లేని విషయాలను తెలియజేశాడు గురువు. అజ్ఞానంలో ఉండే శిష్యునకు తన మనస్సు చేత కల్పించుకున్న భావాలలోని అసంబద్ధతను తెలియజేసి ఇప్పుడు ఆత్మను వర్ణించటానికి – దాని స్థితిని తెలియజేయటానికి ప్రయత్నిస్తున్నాడు గురువు.

7. నిత్యం :- ఆత్మను పుట్టుక లేనిదని చెప్పుకున్నాం. పుట్టినదానికే మరణం. పుట్టుకే లేనిదానికి మరణం లేదు. కనుక ఆత్మ ఎప్పుడూ ఉండేదేగాని ఒకప్పుడుండి ఒకప్పుడులేనిదిగాదు. ప్రపంచం ఉన్నప్పుడూ పరమాత్మ ఉన్నది. ప్రపంచం లేనప్పుడూ పరమాత్మ ఉన్నది. కనుక అది నిత్యం. (సముద్రం నిత్యం – అలలు లేస్తూపడుతూ ఉంటాయి)

8. విభుం :- ఆత్మ ఏకం, అద్వయం, రెండవదేదీ లేదు. ఏవైతే ఉన్నట్లుగా అనిపిస్తున్నాయో అవన్నీ అందులో కల్పితాలే. కనుక అన్ని రూపాలూ తానే. దానినే **'విభుం'** అన్నారు.

9. సర్వగతం :- ఆత్మ అంతటా అన్నింటా వ్యాపించియున్నది. అదిలేని చోటులేదు. ఆకాశం అన్నింటినీ తనలోనే ఇముడ్చుకొన్నది. వాయువును, అగ్నిని, నీటిని, భూమిని, ప్రాణి కోట్లను – అన్నింటిని తనలో ఇముడ్చుకొన్నందున దానిని సర్వవ్యాపకం అన్నారు. ఆ ఆకాశాన్ని కూడా తనలో ఇముడ్చుకొన్న ఆత్మ సర్వగతం.

10. సుసూక్ష్మం :- సర్వత్రా వ్యాపించినది ఏదైనా సూక్ష్మమే. మరి ఆత్మను సూక్ష్మం అనక సుసూక్ష్మం అన్నారెందుకు? ఆకాశం సూక్ష్మంగదా; అంతకన్న సూక్ష్మమైనది గనుక ఆత్మ సుసూక్ష్మం. వ్యాపక శక్తి ఎక్కువయ్యే కొద్దీ సూక్ష్మత్వం ఎక్కువౌతుంది. వ్యాపక శక్తి తగ్గుతున్న కొద్దీ సూక్ష్మత్వం తగ్గుతుంది. భూమి ఎక్కడి దక్కడే ఉంటుంది. వ్యాపకత్వం లేదు. కనుక అది స్థూలం. నీరు పల్లానికి మాత్రమే వ్యాపిస్తుంది. కనుక అదీ స్థూలమే. అగ్ని పైకీ ప్రక్కలకూ వ్యాపిస్తుంది కనుక కొంత స్థూలం కొంత సూక్ష్మం. వాయువు అంతటా వ్యాపిస్తుంది. గనుక సూక్ష్మం. కాకపోతే దానిని **స్పర్శ ద్వారా** తెలుసుకోవచ్చు. ఆకాశం స్థూలవస్తువులలో తప్ప అంతటా వ్యాపించి ఉంటుంది. కనుక పూర్తిగా సూక్ష్మం. ఇక ఆత్మ స్థూలవస్తువులతో సహా అంతటా వ్యాపించియున్నది గనుక సుసూక్ష్మం.

11. అవ్యయం :- సూక్ష్మమైనదానికి నశింపు లేదు. పుట్టుక లేనిదానికి నశింపు లేదు. కనుక ఆత్మకు నశింపులేదు. అది అవ్యయం. అన్నింటిని తనలో దాచుకొనే తాను ఎక్కడ దాగి ఉంటుంది?

12. భూతయోనిం :- ఇట్టి ఆత్మ సకల భూతముల సృష్టికి ఉత్పత్తి స్థానం కనుక అది భూతయోని. దీనిని జగత్తుకు కారణంగా భూతాల పుట్టుకకు మూలకారణంగా ధీరపురుషులు భావించారు.

అయితే ఇట్టి దానిని పొందశక్యమా? అని సందేహం కలగకుండ దీనిని ధీరపురుషులు దర్శించారు అని మహర్షి తెలియజేస్తున్నారు. పశ్యంతి అనక 'పరిపశ్యంతి' అన్నారు. అనగా చక్కగా దర్శించారు - అంటే అనుభూతి చెందారు అని భావన. ఆత్మ ఎలా భూతయోని?

– అన్ని భూతాల ఉనికి ఆత్మలోనే అని తెలియాలంటే ఈ సృష్టి ఎలా ఆవిర్భవించిందో తెలియాలి. అందుకే సృష్టి జరిగిన విధానాన్ని 7వ

మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥ యధోర్ణనాభిః సృజతే గృహ్ణతేచ
యధాపృధివ్యాం ఓషధయః సంభవంతి ।
యధాసతః పురుషాత్ కేశలోమాని
తధాక్షరాత్ సంభవతీహ విశ్వం ॥ (7)

ప్రతి :– యధా = ఏ ప్రకారంగా; ఊర్ణనాభిః = సాలెపురుగు; సృజతే = బయటకు వదులుతూ; గృహ్ణతేచ = లోపలికి తీసుకుంటుందో; యధా = ఏవిధంగా; పృధివ్యాం = భూమినుండి; ఓషధయః = ఓషధులు; సంభవంతి = పుడుతూ ఉన్నాయో; యధా = ఏ ప్రకారంగా; సతఃపురుషాత్ = జీవించియున్న మానవుని నుండి; కేశలోమాని = వెంట్రుకలు, గోళ్ళు వస్తాయో; తధా = అలాగే; ఇహ = ఇక్కడ; అక్షరాత్ = అక్షరతత్త్వం నుండి; విశ్వం సంభవతి = ఈ సమస్తవిశ్వము ఆవిర్భవిస్తున్నది.

భావం :– ఏ ప్రకారంగా సాలెపురుగు తన నుండే సాలె గూడును బయటకు వదలి, తనలోనే లీనం చేసుకుంటుందో, ఏ ప్రకారంగా భూమినుండి ఓషధులు ఆవిర్భవిస్తున్నాయో, ఏవిధంగా మానవుని తలపై వెంట్రుకలు, చేతి వ్రేళ్ళకు కాలి వ్రేళ్ళకు గోళ్ళు పెరుగుతాయో అలాగే అక్షరతత్త్వం నుండి ఈ జగత్తు ఆవిర్భవిస్తుంది.

వ్యాఖ్య :– సృష్టి ఎలా జరిగిందో అనేక శాస్త్రాలు అనేక రకాలుగా చెప్పటం జరిగింది. ఎందుకంటే స్వప్న ప్రపంచంలాగా సృష్టి అసలులేదు. వారివారి మానసిక స్థాయిని బట్టి ఆయా శాస్త్రాలు అలా చెప్పాయి. ఈ మంత్రంలో సృష్టి జరిగినవిధాన్ని చక్కని ఉపమానాలతో వివరించటం జరిగింది. (అయితే మూడు ఉపమానాలెందుకు చెప్పినట్లు? ఇదే జాగ్రత్తగా మనం ఆలోచించాల్సిన విషయం.)

ఈ సృష్టి మనకు కనిపిస్తున్నది – అంటే దానికి కారణం ఉండితీరాలి. **ఉదా :** మనకు కుండ కనిపిస్తున్నదంటే దానికి కారణం తప్పక ఉండి తీరాలి. ఒకటికాదు. రెండు కారణాలుండాలి. 1. ఉపాదానకారణం 2. నిమిత్తకారణం.

కుండను తయారుచేయాలంటే కుమ్మరి ఉండాలి. అతడికి కుండలు తయారు చేయటంలో నైపుణ్యం ఉండాలి. అట్టివానిని వేదాంత పరిభాషలో **'నిమిత్త కారణం'** అన్నారు. కుమ్మరి ఒక్కడుంటే కుండతయారవుతుందా? ముడిసరుకు కూడా ఉండాలి. అది మట్టి. దానినేమో **'ఉపాదాన కారణం'** అన్నారు. అంటే – కుండ విషయంలో కుమ్మరి నిమిత్తకారణం. (కర్త) మట్టి ఉపాదాన కారణం. (ముడిసరుకు) అలాగే ఈ సృష్టికి కూడా ఎవరో ఒక కర్త ఉండి తీరాలిగదా! ఎవరాకర్త? అతడే పరమాత్మ. కనుక **పరమాత్మ** ఈ సృష్టికి **నిమిత్తకారణం** అన్నమాట. మరి కుండకు మట్టి ఉపాదాన కారణమైనట్లు ఈ సృష్టికి ఉపాదానకారణం – ముడిసరుకు ఏమిటి? దేని నుండి ఈ సృష్టిని తయారుచేశాడన్నా ఈ ముడిసరుకు అంతకు పూర్వమే ఉండి ఉండాలి. పరమాత్మ కన్నా ముందే ఒక వస్తువు సృష్టింపబడి ఉంటే పరమాత్మ సృష్టికర్త ఎలా అవుతాడు? కనుక పరమాత్మ కన్నా ముందు ఏదీ ఉండే అవకాశం లేదు. కాబట్టి సృష్టి తయారు కావటానికి ఉపయోగించిన సరుకు ఏదో అది పరమాత్మనుండే వచ్చి ఉండాలి. అంటే ముడిసరుకు కూడా తానే అయి ఉండాలి. అంటే – **ఉపాదాన కారణం కూడా పరమాత్మే అయి ఉండాలి.**

మిగిలిన వస్తువులకున్నట్లు ఉపాదానకారణం, నిమిత్త కారణం అంటూ రెండు కారణాలు కాకుండా ఈ సృష్టికి పరమాత్మే ఉభయకారణం అయి ఉండాలి. ఇది అర్థంచేసుకోవాలంటే చాలా జటిలంగా ఉంటుంది. అందుకే చక్కని ఉపమానం.

"ఊర్ణనాభి' అంటే సాలెపురుగు గూడును నిర్మిస్తుంది. అదే

నిర్మిస్తున్నది గనుక గూడుకు **నిమిత్తకారణం సాలెపురుగే.** మరి దేనితో నిర్మిస్తున్నది? తననోటిలోని (చొంగ) జిగురు పదార్థంతోనే గూటిని అల్లుతున్నది. ఆ చొంగను దారాలు దారాలుగా తీసి గూటిని తయారుచేస్తున్నది. అంటే ముడిసరుకు - **ఉపాదాన కారణం కూడా సాలెపురుగే.** సాలె గూడు తయారుగావటానికి నిమిత్తకారణము, ఉపాదాన కారణము - రెండూ సాలెపురుగే. అలాగే ఈ సృష్టికి నిమిత్త కారణము, ఉపాదాన కారణము రెండూ పరమాత్మయే. అంతేగాదు. సాలె పురుగునుండి దారాలు బయటకు వచ్చి గూడుతయారై, మరల ఆ దారాలన్నీ దానినోటిలోకే పోయి అదృశ్యమై పోతున్నట్లు అక్షరుడైన పరమాత్మనుండి ఈ సృష్టి కదలి, బయటకు వచ్చి, తిరిగి ఆ పరమాత్మలోనే లయమై పోతున్నది.

ఇంతవరకు బాగానే ఉంది. సృష్టి ఎలా వస్తున్నదో - ఎలా అంతమవుతున్నదో దృష్టాంతం ద్వారా తెలియజేశారు గదా! మరి ఇంకా రెండు ఉపమానాలను ఎందుకు చెప్పినట్లు?

ఎందుకంటే - సాలెపురుగు ఎందుకు గూడును నిర్మిస్తుంది? ఆ గూటిలో ఏవైనా పురుగులు చిక్కుకుంటే తిందామని **ఆశతో.**

సాలెపురుగు గూడును నిర్మించినట్లు పరమాత్మ సృష్టి చేశాడు అని అంగీకరిస్తే -'సాలెపురుగు లాగా పరమాత్మకు కూడా ఏదో ఆశతో సృష్టి చేయాలనే ఉద్దేశ్యం ఉన్నట్లేగదా! ఏదో ప్రయోజనం కోరిచేసినట్లే గదా!' అనే అనుమానం వస్తుంది. భగవంతుడికి కోరికలు, ఉద్దేశాలు ఉన్నాయి అని అంగీకరిస్తే ఆయనకు పరిపూర్ణత లేదని అంగీకరించాల్సివస్తుంది. ఈ సందేహ నివారణకే రెండవ ఉపమానం :-

భూమి నుండి ఓషధులు వరి, గోధుమ, పండ్లు, కూరలు, కాయలు, మొ॥వి పుట్టికొచ్చినట్లు పరమాత్మ నుండి ఈ సృష్టి పుట్టుకొస్తున్నది అని. ఇక్కడ భూమికి ఏ సంకల్పము లేదు; ఏ కోరికాలేదు; ఓషధులు పుట్టుకొని

రాకపోతే దానికి ఏ ఇబ్బందీ లేదు. ఏ ప్రయత్నమూ లేకుండానే భూమినుండి ఓషధులు ఉత్పన్న మవుతున్నాయి గనుక పరమాత్మనుండి ఏ సంకల్పం లేకుండానే, ఏ ఆశలు కోరికలు లేకుండానే సృష్టి పుట్టుకొస్తున్నది అని మనం తెలుసుకోవచ్చు. దీనితో పరమాత్మ పూర్ణత్వానికి భంగంలేకుండా పోయింది.

ఇక్కడ మరొక సందేహానికి ఆస్కారం కలుగుతున్నది. చైతన్య స్వరూపమైన పరమాత్మ భూమిలాగా జడపదార్థమా? అని – ఈ సంశయాన్ని నివారించటానికి మూడవ ఉపమానం –

చైతన్యంతో కూడుకున్న, ప్రాణం ఉన్న మానవుని నుంచి జడమైన కేశములు గోళ్ళు పుట్టుకొస్తున్నవి. తలపైన, శరీరంపైన ఎలా వెంట్రుకలు పుట్టుకొస్తున్నాయో – అలాగే చైతన్య స్వరూపమైన అక్షర పరమాత్మ నుండి ఈ (జడ చేతన ప్రకృతి) – సృష్టి పుట్టుకొస్తున్నది అని – **3 ఉపమానాలతో సృష్టి విధానం చెప్పారు.**

ఈ సృష్టి **ఆ పరమాత్మకన్న వేరుకాదని మొదటి ఉపమానం – ఈ సృష్టి ఆ పరమాత్మ మీదనే ఆధారపడి మనుగడ సాగిస్తున్నదని రెండవ ఉపమానం – చైతన్య వంతమైన జీవులతో పాటు జడవస్తువులు కూడా ఆ పరమాత్మయందే చోటు చేసుకొని ఉన్నాయని 3వ ఉపమానం** మనకు నిరూపిస్తున్నాయి. అంతేగాదు పరమాత్మకన్న వేరుగా ఉండి **ఏదీ మనుగడ సాగించలేదని** మొత్తం 3 ఉపమానాలు కలిసి నిరూపిస్తున్నాయి. ఈ జగత్తు అంతా పరమాత్మే. ఇదే బ్రహ్మవిద్య. **ఉపనిషత్తులు ఈ బ్రహ్మవిద్యనే బోధిస్తున్నాయి. అలాగే గురు పాదాలను పట్టి బ్రహ్మ సాక్షాత్కారంతో ఈ సంసారాన్ని తరించాలని, జీవన్ముక్తులు కావాలని కూడా అన్ని ఉపనిషత్తులు ఉద్ఘోషిస్తున్నాయి.** పరమాత్మనుండి సృష్టి ఎలా వచ్చిందో చెప్పి – ఆ సృష్టి **వచ్చిన క్రమాన్ని** రాబోయే మంత్రంలో తెలియజేస్తున్నారు.

– పరమాత్మ నుండి సృష్టి కదిలిన క్రమము.

మం॥తపసా చీయతే బ్రహ్మ తతోఽ న్న మభి జాయతే।
అన్నాత్ ప్రాణోమనః సత్యం లోకాః కర్మసు చామృతం॥
(8)

ప్రతి : తపసా = తపస్సుచేత; బ్రహ్మచీయతే = బ్రహ్మంవృద్ధి చెందుతుంది. తతః = దాని నుండి; అన్నం అభిజాయతే = అన్నం పుడుతున్నది; అన్నాత్ = అన్నంనుండి; ప్రాణఃమనః = ప్రాణము, మనస్సు; సత్యంలోకాః = సత్యమైనవి, లోకాలు; కర్మసుచ అమృతం = కర్మలు మరియు కర్మఫలములు వస్తున్నాయి.

భావం: తపస్సుచేత బ్రహ్మ వృద్ధిచెంది, అతడినుండి అన్నం, అన్నం నుండి ప్రాణం, మనస్సు, సత్యమైనవి, లోకాలు, కర్మలు, కర్మఫలాలు వస్తున్నాయి.

వ్యాఖ్య : తపస్సుచేత బ్రహ్మము వృద్ధి చెందినది అంటున్నాడు ఋషి. అదే సృష్టికి కారణ మయినదని కూడా చెబుతున్నాడు. ఇక్కడ **తపస్సు** అంటే ఒంటికాలిమీద నిలబడి చేసే శారీరక శ్రమ కాదు. **ఇది ఒక జ్ఞాననిష్ఠ.** సృష్టికి ముందుగానే ఈ సృష్టి ఎలా ఉండాలో, ఇక్కడ ఏమేమి అవసరమో, ఇది నిరంతరం ఎలా కొన సాగాలో – ఆ విషయాలకు సంబంధించిన తీవ్ర ఏకాగ్రత, ఆనంద ప్రదమైన భావన, సంకల్పం, గొప్ప ఆలోచన, సృజనాత్మక చింతనయే తపస్సు. దాని నుండి **అన్నం** పుట్టింది. అన్నం అంటే ఒక ప్రణాళిక. ఆ ఆలోచననుండి ఈ సృష్టికి కావలసిన ప్రణాళిక (ప్లాన్) జనిస్తుంది. **అదే అన్నం.** దీని నుండే – 'ప్రణాళిక నుండే' శక్తి రూపమైన **ప్రాణం** ఉద్భవిస్తున్నది. **ప్రాణం** అంటే **ప్రాణవాయువులు లేదా హిరణ్యగర్భుడు** అని రెండు అర్థాలు. ఇక్కడ ప్రాణం అంటే **హిరణ్యగర్భుడే.** ఇతడే సృష్టికర్త; చతుర్ముఖ బ్రహ్మ – (సమిష్ఠి సూక్ష్మ శరీరాభిమాని). సృష్టికర్త బ్రహ్మ నుండి మనస్సు (సమిష్ఠి సూక్ష్మం శరీరం) కదులుతుంది.

సూక్ష్మ శరీరం అనుభవాలు పొందాలంటే స్థూలశరీరాలు కావాలి. వాటిని తయారుచేయటానికి **పంచభూతాలు** కావాలి. కనుకనే పంచభూతాల సృష్టి జరుగుతున్నది. అవే **'సత్యం'.** అంటే. నామ రూపాలతో కూడిన ఈ ప్రాణులు పుడుతున్నా, చస్తున్నా పంచభూతాలు మాత్రం చలించక, నశించక ఉంటాయి గనుక వాటిని **సత్యమైనవి** అన్నారు.

పంచభూతాలు ఆవిర్భవించగానే పంచభూతాల పంచీకరణంతో తయారయ్యే ఈ శరీరాలు (స్థూల శరీరాలు) ఉద్భవించినవి. వీటినే **లోకాలు** అన్నారు.

ఈ శరీరాలు ఉద్భవించగానే వాటినుండి కర్మలు ప్రారంభమైనవి. కనుక **కర్మసు –** అన్నారు.

కర్మలు చేయటంతో కర్మఫలాలు వస్తాయి. కర్మలు అంతమై పోయినా వాటి ఫలితాలు మాత్రం వెన్నంటి వస్తాయి. ఈ శరీరంతో ఏ కర్మలు చేసినా శరీరం వదిలిన తర్వాత కూడా కర్మ ఫలాలు జీవుణ్ణి వదలవు. కనుకనే వాటిని **'అమృతం'** అన్నారు. అంటే మృతం లేనివి, చావులేనివి అని.

ఈ విధంగా పరమాత్మ జ్ఞాన నిష్ఠతో సృష్ఠికి సంబంధించిన **సృజనాత్మక చింతన చేస్తాడు. అదే తపస్సు.** ఆ తపస్సు వల్ల సృష్ఠికి కావలసిన ప్లాన్ **ఉత్పన్నమవుతుంది. అదే అన్నం. ఆ అన్నం నుండే సృష్ఠి కర్త ఉద్భవిస్తాడు. అదే ప్రాణం. ప్రాణం నుండి మనస్సు** ఆ తర్వాత పంచభూతాలు, వాటితో శరీరాలు (లోకాలు). శరీరాలు ఏర్పడ్డ తర్వాత **కర్మలు** చేయటం, **కర్మఫలాలను** ప్రోగుచేసుకోవటం. ఇలా సృష్ఠి క్రమాన్ని వివరించి ప్రథమ ఖండాన్ని ముగిస్తూ చివరి మంత్రంలో విషయాన్ని సింహావలోకనం చేస్తున్నాడు గురువు.

– సృష్ఠి జరిగే విధం సంక్షిప్తంగా

మం॥యః సర్వజ్ఞః సర్వవిద్ యస్య జ్ఞానమయం తపః ।
తస్మా దే తత్ బ్రహ్మ నామరూపం అన్నం చ జాయతే ॥ (9)

ప్రతి : యః = ఎవరైతే; సర్వజ్ఞ సర్వవిద్ = సర్వజ్ఞుడో సర్వవిదుడో; యస్య తపః = ఎవరి తపస్సు; జ్ఞానమయః = జ్ఞానమయమో; తస్మాత్ = దానినుండే; ఏ తద్ బ్రహ్మ = ఈ బ్రహ్మదేవుడు; నామ రూపం = ప్రాణులు; అన్నం చ జాయతే = విషయ ప్రపంచం పుట్టినవి.

భావం : సర్వజ్ఞుడు, సర్వవిదుడు, జ్ఞానమే తపస్సుగా గలవాడు అయిన బ్రహ్మ పదార్థం నుండి సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు, ప్రాణులు, విషయ ప్రపంచము ఉద్భవించినది.

వ్యాఖ్య : సంక్షిప్తంగా సృష్టి ఎలా ఉద్భవిస్తున్నదో ఈ మంత్రంలో చెబుతున్నారు. పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వవిదుడు, జ్ఞానమే తపస్సుగా గలవాడు. ఆయన నుండి సృష్టి కర్త బ్రహ్మదేవుడు, ప్రాణికోట్లు, విషయప్రపంచము – అన్నీ ఉద్భవించాయి.

పరమాత్మలో ఇచ్ఛా శక్తి, క్రియాశక్తి ఉన్నాయి. సృష్టిచేయాలనే ఆలోచనరాగానే పరమాత్మలో దానికి అనుకూల స్థితి ఏర్పడింది. సృష్టి జ్ఞానము పరమాత్మ యందు నిండి ఉన్నది. కనుక పరమాత్మ **సర్వజ్ఞుడు;** ఆయన **సర్వవిదుడు** కూడా. సర్వము తన చూపుతోనే కదులుతుంది. ఇక ఆయన జ్ఞానమే తపస్సుగా గలవాడు. సృష్టికి సంబంధించిన సంపూర్ణ అవగాహన ఉన్నది ఆయనలో. అదియే జ్ఞానము. అదే తపస్సు.

పరమాత్మలోని ఈ జ్ఞానం వల్ల చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించడం జరిగింది. ఆ బ్రహ్మ నామరూపాలను, అన్నమును సృజించెను.

నామరూపాలంటే ప్రాణులు అని భావం. ప్రాణులకు నామం ఉంటుంది, రూపం ఉంటుంది. **అన్నం అంటే ప్రాణులు అనుభవించటానికి సృష్టింపబడిన విషయప్రపంచమే. (శబ్దస్పర్శ రూప రసగంధాలు)**

పరమాత్మ నుండి జనించిన బ్రహ్మదేవుడు (ఎ) ప్రాణులను, (బి) ప్రకృతి – లేదా విషయ ప్రపంచాన్ని సృష్టించటం జరిగింది. ఇలా సృష్టి

పరమాత్మనుండి ఉత్పన్నమైంది. మన మనస్సునుండి స్వప్న ప్రపంచం ఎలా వస్తున్నదో – పరమాత్మనుండి జాగ్రత్ ప్రపంచంకూడా అలాగే వస్తున్నది.

స్వప్న ప్రపంచ సృష్టికి, జాగ్రత్ ప్రపంచ సృష్టికి పోలికలున్నాయి.

(i) జాగ్రదావస్థలోని అనుభూతులు స్వప్నానికి కారణమైనట్లు – పరమాత్మలోని సమిష్టికారణ శరీరం ప్రపంచ సృష్టికి కారణమౌతున్నది.

(ii) స్వప్నం తయారుకాగానే స్వప్న దృశ్యములు, వ్యక్తులు, స్వప్నాన్ని చూచేవాడు తయారైనట్లు –

ఈ సృష్టి **సంకల్పం జరగగానే** ప్రపంచము – అందులో **శబ్దాది విషయాలు,** వాటిని అనుభవించే **ప్రాణులు** తయారయ్యారు.

(iii) స్వప్నం నడుస్తున్నట్లుగనే ఈ జీవిత నాటకం (సృష్టి) కూడా నడుస్తున్నది.

(iv) మేలుకోగానే స్వప్నము, అందలి అనుభవాలు, వాటిని అనుభవించేవాడు అదృశ్యమైనట్లు, పరమాత్మ **సాక్షాత్కారం జరగగానే** ఈ జగత్తు, అందలి అనుభవాలు, కర్మ ఫలాలు, జీవుడు అదృశ్యమై పోతారు. బ్రహ్మానందం ప్రాప్తిస్తుంది.

కనుక బ్రహ్మానంద ప్రాప్తికి పరమాత్మ సాక్షాత్కారమే ఏకైక మార్గము – సాక్షాత్కారంతో సర్వకర్మబంధ విముక్తి. అదే మోక్షం – జన్మరాహిత్యం–

ఇది ప్రథమ ముండకంలోని ప్రథమఖండం.



ప్రథమ ముండకం

ద్వితీయ ఖండం

– ముందుగా అపరావిద్యను గురించి ప్రారంభిస్తున్నాడు గురువు.

మం॥తదేతత్ సత్యం, మంత్రేషు కర్మాణి కవయో
యాన్య పశ్యం స్తాని, త్రేతాయాం బహుధా సంతతాని।
తాన్యా చరధ, నియతం సత్య కామా
ఏషవః పంథాః, సుకృతస్యలోకే ॥ (1)

ప్రతి : మంత్రేషు = వేదమంత్రాలలో; యాని కర్మాణి = ఏ కర్మలను; కవయః = ప్రాజ్ఞులైనవారు; అపశ్యన్ = దర్శించారో; తత్ = అది; ఏతత్ సత్యం = ఈ సత్యమే; త్రేతాయాం = త్రేతాయుగంలో; (3 వేదాలలో) తాని = అవి; బహుధా సంతతాని = బాగా తెలియజేయబడినవి; సత్యకామాః = సత్యకాంక్షగలవారై; నియతం తాని ఆచరధ = ఎల్లప్పుడూ వాటిని ఆచరించండి; వః = మీకు; సుకృతస్య = పుణ్య ఫలములకు; లోకే = లోకంలో; ఏషపంథాః = ఇదియే మార్గము.

భావం : వేదమంత్రాలలో ఏకర్మలను ఋషులు దర్శించారో అవి సత్యం. 3 వేదాలలోను ఇవి బాగా తెలియజేయబడినవి. సత్యకాంక్షగలవారై ఎల్లప్పుడూ వాటిని ఆచరించండి, పుణ్యఫలములకు లోకంలో ఇదే మార్గం.

వ్యాఖ్య : ప్రథమ ఖండంలో పరావిద్య, అపరావిద్య అని రెండు విద్యలను గూర్చి అంగిరస మహర్షి తెలియజేశాడు. మానవుడుకోరుకొనే **శాశ్వత బ్రహ్మానందం పరావిద్య వల్ల లభించేదే గాని అపరావిద్య వల్ల లభించేది కాదు.** ఈ ద్వితీయ ఖండంలో ముందుగా అపరావిద్యను తెలియజేస్తూ దానిని అధిగమించి పరావిద్యలో నిలవటానికి మార్గాన్ని

తెలియజేయబోతున్నాడు. అపరావిద్య, అనిత్యమైన సుఖములను ఇచ్చేది. పరావిద్య నిత్యమైన ఆనందాన్నిచ్చేది. మరి అలా అయినప్పుడు పరావిద్యనే సరాసరి చెప్పవచ్చు గదా!. అహఁ వీల్లేదు. ఎందుకని?

పరావిద్య లేదా బ్రహ్మవిద్య అనేది ప్రాపంచిక విషయాలపట్ల, భోగాలపట్ల **తీవ్ర వైరాగ్యం కలవారికే గాని కోరికలతో, భోగాసక్తి తో తహతహలాడే వారికి కాదు.** మరి మానవులంతా కోరికలతో, భోగాసక్తితో ఉండేవారే గదా! వారికి వైరాగ్యం ఎలా కలుగుతుంది? వారికి అపరావిద్యను బోధిస్తే – దాని ద్వారా భోగాలను అనుభవించి; అందులో కూడా సంతృప్తి కలగక ఇక ఎంతకాలం ఎన్ని భోగాలనుభవించినా సంతృప్తి కలగటం లేదు; కలగదు; కనుక ఇవి విడిచి పెట్ట దగినవే అని అన్ని కోరికలను, ఆశలను వదిలేయటం జరుగుతుంది. లేదా అపరా విద్యవల్ల శాశ్వతానందం కలగలదని తెలుసుకొని విరక్తి చెందాలి. అట్టి **స్థితిలో నున్నవారికి** శాశ్వతానందం ఎలా కలుగుతుందో, దేని ద్వారా కలుగుతుందో ఆ బ్రహ్మవిద్యను పరావిద్యను బోధించాలి.

అందుకే ముందు స్వర్గలోక భోగాలను అనుభవించటానికి వీలయ్యే అపరావిద్యను బోధించి; ఆ తర్వాత పరావిద్య యొక్క ఆవశ్యకతను తెలియజేయబోతున్నారు.

మనకు కావలసింది అపరిమిత (శాశ్వత) ఆనందం. ఇది కర్మల వల్ల లభిస్తుందా? – **ఇదే వివేకంతో ఆలోచించాలి.** కర్మలు పరిమితములా? అపరిమితములా? – కర్మకు ఆది అంతం ఉన్నాయిగనుక కర్మలు పరిమితములే. మరి పరిమితమైన కర్మ పరిమితమైన ఆనందాన్నిస్తుందేగాని అపరిమితమైన ఆనందాన్నిస్తుందా? ఇవ్వలేదు. కనుక కర్మలు అవాంఛనీయములు, గతినిరోధములు. **మోక్షప్రాప్తికి అవరోధములు. "కృతి మహోధధౌ పతన కారణం ఫలమశాశ్వతం గతినిరోధకం."** (ఉపదేశసారం – భగవాన్ రమణ మహర్షులు)

మానవుడు ఆశించే పరిపూర్ణ ఆనందమును ఈ కర్మలు - అవి లౌకిక కర్మలైనా, శ్రౌత కర్మలైనా, స్మార్త కర్మలైనా - ఏవైనా సరే ఇవ్వలేవు. ఈ కర్మల యొక్క యదార్థ పరిస్థితిని తెలియజెప్పి, ఆ కర్మ వలయం నుండి జీవుని విముక్తునిగ చేయుటయే **ఈ రెండవ ఖండం యొక్క ముఖ్య విశేషం. ముఖ్యఉద్దేశం.**

వేద మంత్రాలలో ఋషులు దర్శించిన కర్మలన్నీ ఈ సత్యమైనవే. అంటే వేదంలో చెప్పినట్లుగా కర్మలు గనుక చేస్తే అవి తప్పకుండా కోరిన ఫలితాలను ఇస్తాయి. అందుకే ఈ **సత్యమైనవి** అన్నారు. అయితే ఆ ఫలితాలన్నీ పరిమితమైనవి, తాత్కాలికమైనవే గాని శాశ్వతమైనవి కాదు. ఈ కర్మల గురించి 3 వేదాలు విపులంగా తెలియజేశాయి. ఈ కర్మలన్నీ ఋషులు దర్మించినవే. అంటే అర్థం ఏమిటి? ఉపనిషత్తులలో జ్ఞానాన్ని ప్రతిపాదించిన ఋషులే **కర్మలను,** వాటి యొక్క **అపరిపక్వ స్థితిని** దర్శించారు అని. కర్మలలోని అసంపూర్ణతను బాగా అర్థంచేసుకొని, ఆ కర్మలను ఖండిస్తూ సంపూర్ణత కొరకు, **నిత్యమైన బ్రహ్మానంద ప్రాప్తి కొరకు జ్ఞానాన్ని ప్రతిపాదించారు.**

సత్యకాములై ఈ కర్మలను మీరూ ఆచరించండి అని తర్వాత తెలియజేస్తున్నారు. కర్మలను ఆచరించక ఎవ్వరూ ఒకక్షణం కూడా జీవించలేరు. కనుక కర్మలు తప్పనిసరి. కర్మలు అనిత్యమైన భోగాలనిస్తాయని ఒక ప్రక్క చెబుతూనే కర్మలను ఆచరించండి అనటంలో అర్థమేమిటి? ఎలాగూ కర్మలను ఆచరించక తప్పదు గనుక; కర్మలను కర్మల కోసంగాని, కర్మఫలాలైన స్వర్గభోగాలకోసంగాని కాకుండా; సత్యం కొరకు చేయండి. సత్యాన్ని కాంక్షించిచేయండి. **అంటే పరమాత్మ ప్రాప్తికై చేయండి** అని భావం. అంటే పాపవాసనలు తొలగించుకొని మనస్సును శుద్ధం చేసుకొనుటకు ఈ కర్మలను చేయాలి అని. కాదు భోగాలే కావాలను కుంటారా? -

ఐతే ఈ లోకంలో సుఖభోగాలను పొందాలన్నా, స్వర్గలోక సౌఖ్యాలను అనుభవించాలన్నా మీకున్న మార్గం ఇదే. కనుక ఆచరించండి. ఆచరిస్తేగాని అనుభవంరాదు. కర్మలయొక్క నిజస్థితి అర్థంకాదు. ఆహారం ఎంత ఇష్టమైనదైనా విషం కలిసింది అని తెలిస్తే తినంగదా. అలాగే ఈ కర్మల నిజస్థితి తెలుసుకొంటే విడిచిపెడతాం. నిజస్థితిని తెలుసుకొని కర్మవలయం నుండి బయటపడటానికే కర్మాచరణ.

వేద ప్రతిపాదిత కర్మకాండలోని అగ్నిహోత్ర హోమ విధిని ఎలా ఆచరించాలో 2వ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥యదా లేలాయతే హ్యర్చిః, సమిద్ధే హవ్యవాహనే ।
తదాజ్య భాగ వంతరేణా హుతీః ప్రతిపాదయేత్॥ (2)

ప్రతి : యదా = ఎప్పుడైతే; హవ్యవాహనే = హోమాగ్ని; సమిద్ధే = చక్కగా మండుతూ ఉంటుందో; అర్చిః = జ్వాలలు పైకిలేస్తుంటాయో; తదా = అప్పుడు; ఆజ్యభాగౌ అంతరేణ = అగ్నియొక్క రెండు భాగాలమధ్య; ఆహుతీః = ఆహుతులను; ప్రతిపాదయేత్ = సమర్పించాలి.

భావం : ఎప్పుడైతే హోమాగ్ని చక్కగా మండుతూ జ్వాలలు పైకిలేస్తూ ఉంటాయో, అప్పుడు అగ్నిజ్వాలల రెండు భాగాలమధ్య ఆహుతులను సమర్పించాలి.

వ్యాఖ్య : వేదాలలో యజ్ఞ యాగాదులకు చెందిన కర్మకాండ **అపరావిద్యకు** సంబంధించినది. ఇవి చక్కగా నియమాలతో ఆచరించాలి. అలా ఆచరించకపోతే **దోషాలు** ప్రాప్తిస్తాయి. అభిక్రమనాశం, ప్రత్యవాయదోషం అని రెండు దోషాలు. కనుక వాటిని ఎలా ఆచరించాలో ఈ ఖండంలో తెలియజేస్తున్నారు. ఈ ఖండాన్ని పూర్తిగా తెలుసుకొంటే కర్మలు కష్టమైనవి, క్లిష్టమైనవి, బాధాకరమైనవి అని తెలుస్తుంది. ఉన్నత ధ్యానంలో **ముందు కెళ్ళాలనుకొనే సాధకులకు** ఈ కర్మలు **బంధాల వంటివని** తెలియజేయటమే గురువుయొక్క ఉద్దేశం.

యజ్ఞయాగాది క్రతువులలో అతి ముఖ్యమైన అగ్నిహోత్ర హోమాన్ని గూర్చి, విధి విధానం గూర్చి తెలుపుతున్నారు.

హోమ కుండంలో అగ్ని బాగా ప్రజ్వరిల్లుతూ ఉన్నప్పుడు, అగ్ని శిఖలు కదులుతూ ఉన్నప్పుడు ఆహుతులివ్వాలి. పొగక్రమ్మి మందముగానున్న అగ్నిలో ఆహుతులు వేయరాదు. **ఆకలిగొన్నప్పుడే** మనం అన్నం తింటే ఉపయోగపడుతుంది. ఆకలి లేనివాడికి అన్నం పెడితే అదివాడికి సంతృప్తినివ్వదు. అగ్ని జ్వాలలే అగ్ని దేవుని నాలుకలు. కనుక అగ్ని నాలుకలు చాచినప్పుడే, అగ్ని జ్వాలలు ఆనందంతో నృత్యం చేస్తున్నపుడే ఆహుతులనర్పించాలి. అంతేకాదు ఆజ్యమునిచ్చేటప్పుడు అగ్నియొక్క కుడి, ఎడమల జ్వాలలమధ్యనే ఆహుతి ఇవ్వాలి. ఈ మధ్యస్థానాన్నే వైదిక పరిభాషలో **"ఆవాపస్థానము"** అంటారు. ఇది హోమాగ్నిలో ఆహుతులు వేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్త.

మనం ఎవరిని ఉద్దేశించి ఆహూతులిస్తే అగ్ని వారికి వాటిని చేరుస్తాడు. ఆయన హవ్యవాహనుడు. నారాయణాయ స్వాహా, సోమాయస్వాహా, ఆదిత్యాయ స్వాహా... ఇలా అన్నప్పుడు ఆహూతులివ్వాలి.

- హోమ విధిని సక్రమంగా చేయకపోతే వచ్చే దుష్పరిణామాలేమిటో 3వ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥యస్యాగ్ని హోత్రం అదర్శ మపౌర్ణ మాసం
అచాతుర్మాస్య మనాగ్రయణం అతిధి వర్జితంచ।
అహుత మవైశ్వదేవం అవిధినా హుతం
ఆ సప్తమాం తస్యలోకాన్ హినస్తి ॥ (3)

ప్రతి : యస్య అగ్నిహోత్రం = ఎవని యొక్క అగ్నిహోత్రం; అదర్శం = అమావాస్య కర్మరహితమో; అపౌర్ణమాసం = పౌర్ణమాసకర్మరహితమో; అచాతుర్మాస్యం = చాతుర్మాస్య వ్రతహీనమో; అనాగ్రయణం = నూర్పిడి

సమయంలో చేయదగిన కర్మ చేయలేదో; అతిధివర్జితం = అతిధులు లేనిదో; అహుతం = సమర్పణ లేనిదో; అవైశ్వదేవం = వైశ్వదేవ విధిరహితమో; అవిధినాహుతం = విధిరహితంగా ఆహూతులు సమర్పించబడినదో; తస్య = అతడి; ఆసప్తమాన్‌లోకాన్ = ఏడులోకాలను; హినస్తి = నశింపజేస్తుంది.

భావం : ఎవరైతే అమావాస్యనాడు ఆచరించవలసిన కర్మనాచరించక, పౌర్ణమినాడు ఆచరించవలసిన కర్మనాచరించకుండ, చాతుర్మాస్యము నాచరించక, నూర్పిడి సమయంలో అనుసరించదగిన కర్మచేయకుండా, అతిధులు లేకుండా, వైశ్వదేవ ఆహూతులు లేకుండా, శాస్త్ర విరుద్ధముగా ఆహుతులు సమర్పించి అగ్నిహోత్ర హోమంచేస్తారో ఆయజ్ఞం యజ్ఞకర్తయొక్క ఏడులోకాలను నశింపజేస్తుంది.

వ్యాఖ్య : ఈ అగ్ని హోత్రహోమం యొక్క **విధివిధానం** ఇందు తెలియజేయబడింది. **యజ్ఞ విధియందులోపాలు** జరిగితే కలిగే **వినాశనం** ఏమిటో తెలియజేయబడినది.

ఈ అగ్ని హోత్ర **హోమం** చేయువారు నిర్వర్తించవలసిన విధులు.

1. అమావాస్యనాడు ఆచరించవలసిన కర్మలు ఆచరించాలి.
2. పున్నమినాడు ఆచరించవలసిన కర్మలు ఆచరించాలి.
3. చాతుర్మాస్య వ్రతమును ఆచరించాలి. (వర్షాకాలంలో చేయవలసిన యజ్ఞం)
4. నూర్పిడి సమయంలో అనుసరించదగిన కర్మలు ఆచరించాలి. ప్రథమ ఫలాలు అర్పణచేయటం (వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం విషయాలలో)
5. ప్రతిరోజూ అతిథితోపాటు భుజించాలి.
6. వైశ్వదేవ ఆహూతులు లోపించరాదు. (పశుపక్ష్యాదులకు ఆహారం ఇవ్వాలి)

7. శాస్త్రంలో నిర్ణయించబడిన విధంగా యజ్ఞవిధి నిర్వహించాలి.

ఈపైన చెప్పిన విధులను అన్నింటినిగాని, కొన్నింటినిగాని, లేదా ఏ ఒక్కదానినిగాని పాటించకపోయినా దోషమే. వాటిని ఆచరించటం ఈ రోజుల్లో సాధారణంగా ఎవరికైనా చాలాకష్టం అని వేరే చెప్పనక్కరలేదు.

మరి ఈ దోషానికి ఫలితం ఏమిటి? అనుకున్న ఫలితం, కోరుకున్న శుభం లేదాకోరిన కోరికలు తీరకుండా ఉండటమా? అలా అయితే కొంతవరకు ఫరవాలేదు. కాని పైన చెప్పిన విధి పూర్వకంగా యజ్ఞ క్రతువును నిర్వహించక పోయినట్లైతే కలిగే దోషంవల్ల అతడి 7 లోకాలు ధ్వంసమై పోతాయి. అంటే ఇంతకు ముందు చేసిన పుణ్య కర్మల కారణంగా 7 లోకాలలో తనకు లభించబోయే ఉత్తమగతి ధ్వంసమై పోతుంది. ఆ లోకాలలో పొందవలసిన సౌఖ్యం నశించిపోతుంది. ఏమిటా 7 లోకాలు?

1. భూలోకం, 2. భువర్లోకం, 3. సువర్లోకం, 4. మహర్లోకం, 5. జనలోకం, 6. తపోలోకం, 7. సత్యలోకం.

దీనికే మరొక భావం కూడా ఉంది. 7 లోకాలంటే 7 తరాలు. తనకంటే ముందున్న మూడుతరాలు, తాను, తనతర్వాతి 3 తరాలు. మొత్తం ఏడుతరాలు. (ముత్తాత నుండి మునిమనుమని దాకా). ఎవరు పైన చెప్పిన విధులను పాటించకుండా హోమాన్ని నిర్వహిస్తారో తనకేగాక తండ్రి తాతముత్తాలకు, పుత్ర, పౌత్ర, ప్రపౌత్రులకు హానిచేసినవారౌతారు.

మొత్తం మీద ఫలితం రాకపోగా చెడ్డఫలితం రావటం ఖాయం. ఇంతకు ముందు సంపాదించుకున్న పుణ్యఫలాలు కూడా నశించిపోతాయి. దీనిని బట్టి సాధకులు **సకామ కర్మల నుండి** బుద్ధి మరలించుకోక పోతే గొప్ప వినాశనం ఉన్నదని తెలియజేసి ఈ మంత్రం **నిష్కామ కర్మలవైపు** సాధకులను, ముముక్షువులను త్రిప్పుతున్నది. నిష్కామంగా చేస్తే దోషాలు లేవు. చిత్తశుద్ధి కలుగుతుంది. అంతేకాదు అసలు కర్మలే చేయకూడదని అర్థం చేసుకోరాదు. అంతఃకరణ శుద్ధికి ఉపయోగించే నిష్కామ కర్మలు

మనందరికీ అవసరమే. కనుక సేవ, జపం, సంకీర్తన, నామస్మరణ, శ్రవణం, మననం, ధ్యానం మొ॥న వన్నీ తప్పక చేయవలసిందే. మనం చేసే కర్మలు మనను బంధించేవికారాదు. నిష్కామంగా చేసి మనశ్శుద్ధిని చేసుకోవాలి. ఆత్మజ్ఞానానికి అర్హత సంపాదించాలి. అంతే కాని ఇవి చేస్తే మనకు బాగా కలిసొస్తుంది అని మునిగిపోరాదు. పిచ్చి పరుగులు తీయరాదు.

– కదిలే అగ్ని శిఖలలో ఆహూతులవ్వాలి. ఆ అగ్ని శిఖలపేర్లు ఏమిటో ఈ మంత్రంలో –

మం॥కాలీ కరాలీచ మనో జవా చ

సులోహితా యాచ సు ధూమ్రవర్ణా ।

స్ఫులింగినీ విశ్వరుచీ చ దేవీ

లేలాయ మానా ఇతి సప్త జిహ్వాః ॥ (4)

ప్రతి : కాలీ = కాలీ; కరాలి = కరాలి; మనోజవా = మనోజవా; సులోహితా = సులోహితా; సుధూమ్రవర్ణా = సుధూమ్రవర్ణా; స్ఫులింగినీ = స్ఫులింగినీ; విశ్వరుచీదేవి = విశ్వరుచీదేవి; ఇతి చ = అనికూడా; లేలాయమానాః = చలించుచున్న; సప్త జిహ్వాః = ఏడు నాలుకలు.

భావం : కాలీ, కరాలి, మనోజవా; సులోహితా, సుధూమ్రవర్ణా, స్ఫులింగినీ, విశ్వరుచీదేవి అనేవి కదులుతున్న అగ్నియొక్క 7 నాలుకలు.

వ్యాఖ్య : అగ్ని ప్రజ్వరిల్లినప్పుడు నాలుకలు చాపుతూ జ్వాలలుపైకి లేస్తాయి. ఆ జ్వాలలే అగ్నిదేవుని నాలుకలు. వాటి వివరాలు ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు. వాటికి తగినపేర్లను మహర్షులు నిర్ణయించారు. పేరును బట్టి ఆ అగ్ని శిఖను గుర్తించవచ్చు.

1. కాలీ = కాలీ అనగా **నల్లనిది** అని భావం.
2. కరాలీ = కరాలీ అనగా **భయంకరమైనది.**

3. మనోజవా = మనస్సులాగా **వేగం** గలది.

4. సులోహితా = **రక్తవర్ణము** గలది.

5. సుధూమ్రవర్ణా = **పొగరంగు** గలది.

6. స్ఫులింగినీ = **మిణుగురు లాగా** మెరిసేది.

7. విశ్వరుచీదేవి = **అనేకరంగులలో** ప్రకాశించేది.

ఈ ఏడు విధాలుగా అగ్ని శిఖలు కదులుతూంటాయి. ఈ సప్త జ్వాలలే అగ్నిదేవుని సప్త జిహ్వలు. (నాలుకలు) ఈ అగ్నిశిఖలు బాగా నాలుకలు చాపినప్పుడే ఆహుతులు ఇవ్వాలి. రెండు అగ్ని శిఖల మధ్యగా ఆజ్యాహుతులు సమర్పించాలి. ప్రకాశిస్తూ చలిస్తున్న ఈ జ్వాలల్లో మంత్రోచ్ఛారణతో **'స్వాహా'** అన్నప్పుడే ఆహుతులు సమర్పించాలి. అలా సమర్పించబడిన ఆహుతులను అగ్నిదేవుడు ఇంద్రాది దేవతలకు చేరుస్తాడు. అగ్నిదేవుడే మనకు దేవతలకు మధ్య ఏజంటు. అలా దేవతలకు చేరిస్తే ఏమవుతుంది? –

ఈ అగ్నికార్యం (యజ్ఞం) వల్ల వచ్చే ఫలం ఏదో వర్ణిస్తున్నారు.

– విధి పూర్వకంగా ఆహూతులు సమర్పించిన వారికి కలిగే ఫలితం ఏమిటో 5వ మంత్రంలో చెబుతున్నారు.

మం॥ఏతేషు యశ్చరతే భ్రాజ మానేషు
యధాకాలం బాహుతయో హ్యదదాయన్ ।
తం నయంత్యేతాః సూర్యస్య రశ్మయో
యత్ర దేవానాం పతిరేకోఽధి వాసః ॥ (5)

ప్రతి : భ్రాజమానేషు = ప్రజ్వలిస్తున్న; ఏతేషు = ఈజ్వాలల్లో ; యః = ఎవరైతే ; యధాకాలం = సరైన సమయంలో; ఆహుతయః = ఆహూతులను; ఆదదాయన్ = సమర్పిస్తూ; చరతే = చరిస్తాడో; తం =

అతనిని; ఏతాః = ఈ ఆహుతులు; సూర్యస్య రశ్మయః = సూర్యకిరణాలై; దేవానాం ఏకఃపతి = దేవతలకు ప్రభువౌన దేవేంద్రుడు; యత్ర అధివాసః = ఎక్కడ ఉంటాడో అక్కడకు; నయంతి = తీసుకొని పోవును.

భావం : ప్రజ్వలిస్తున్న ఈ జ్వాలలలో ఎవరైతే సరైన సమయంలో ఆహూతులను సమర్పిస్తారో, అతడిని ఈ ఆహుతులు సూర్యకిరణాలై దేవతలకు ప్రభువైన దేవేంద్రుని వద్దకు తీసుకొని పోతాయి.

వ్యాఖ్య : అగ్నిహోత్ర హోమమును చేయువాడు హోమకుండంలో అగ్ని బాగా ప్రజ్వరిల్లేటప్పుడు, అగ్ని **నాలుకలు చాచినప్పుడే** ఆహుతులు ఇవ్వాలని రెండవ మంత్రంలో చెప్పారు. ఆజ్యమును ఆహుతిగా ఇచ్చేటప్పుడు **రెండు అగ్నిశిఖల మధ్యగా** ఇవ్వాలనీ ఆ మంత్రంలో చెప్పారు. విధులను 3వ మంత్రంలో చెప్పారు. ఆ అగ్ని శిఖలయొక్క పేర్లను చెప్పటం ద్వారా ఆ అగ్నిశిఖలను గుర్తించే తెలివిని నాలుగవ మంత్రంలో అందించారు.

ఇలా దేదీప్యమానంగా ప్రకాశించే అగ్ని జ్వాలల మధ్య ఆహుతులను ఇవ్వమన్నారు గదా అని, బాగా మండుతున్నప్పుడు టకటకా ఆహుతులను – నెయ్యి, సమిధలు, మధుర పదార్థాలను వెయ్యటమేనా? అంటే కాదు. వాటిని **'యధాకాలం'** లో సమర్పించాలి. అంటే తగిన సమయంలోనే సమర్పించాలి. మంత్రోచ్చారణ పూర్వకంగా ఏదేవతకు ఆ ఆహుతులు ఉద్దేశించబడ్డాయో తెలియజేసి 'స్వాహా' అని ఉచ్చరించినప్పుడే ఇవ్వాలి. అదే **'యధాకాలం' అంటే.**

ఇలా తగిన సమయంలో, బాగా ప్రజ్వలిస్తున్న అగ్ని జ్వాలల్లో, అగ్నిశిఖల మధ్యగా **'ఆవాపస్థానము'** నందు ఆయాదేవతల నుద్దేశించి ఆహుతులను ఎవరైతే సమర్పిస్తూ, మూడవ మంత్రంలో చెప్పినట్లు 7 విధులను ఎవరు నెరవేరుస్తారో అట్టి వారు ఈ చేసిన కర్మకు ఫలితంగా దేవతలకు ప్రభువైన దేవేంద్రుని వద్దకు తీసుకొని పోబడతారు (స్వర్గానికి). అయితే ఎవరు ఇలా ఇంద్రునివద్దకు తీసుకొని వెళ్ళేది? మనకు దారి

తెలియదుగదా! అంటే **మనం భక్తితో, ప్రేమతో సమర్పించిన ఆహుతులే సూర్యకిరణాలై మనకు మార్గాన్ని చూపిస్తూ ఉంటాయి.** అవి అలా దారిచూపిస్తూ ఉంటే మనం **ఈ శరీరంతో వెళతామా?** లేదు. శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాతనే వెళ్ళేది. శరీరాన్ని విడిచి పెట్టిన తర్వాత **వెళ్ళేదెవరు**? మన సూక్ష్మ శరీరం. అంటే మనో బుద్ధులతో కూడిన **జీవుడు.**

కనుక ఎవరైతే ఫలాపేక్షతో - స్వర్గభోగాలు కావాలని, పుణ్యం సంపాదించాలని, ఆనందం పొందాలని యజ్ఞయాగాదులు చేయ సంకల్పించి, సమస్త విధులను పాటించి, శాస్త్ర బద్ధముగా హోమమును చేస్తారో అట్టి వారి సకామకర్మలు **వాసనా రూపంలో** కారణ శరీరంలో ముద్రించబడతాయి. అంటే **మనస్సు మీద ముద్రలుగా పడిపోతాయి.** శరీరాన్ని విడిచిపెట్టగానే ఈ ముద్రలే ప్రేరణలై, ఆహుతులు సూర్యకిరణాలై మార్గాన్ని చూపుతాయి.

ఇప్పుడు మీరంతా ఇక్కడ కూర్చున్నారు గదా! ఇక్కడ ఉపన్యాసం ముగించగానే ఏంచేయాలో మీకు జ్ఞాపకం వచ్చిందనుకోండి. మీ శరీరాలు ఇక్కడే ఉంటాయి. కొందరి **మనస్సులేమో మార్కెట్టుకు** వెళతాయి, కొందరి మనస్సులు **షాపులకు,** కొందరి మనస్సులు **టిఫిను చేయటానికి హోటలుకు,** కొందరి మనస్సులు **స్నానాలకు** వెళతాయిగదా! అలా ప్రయాణం సాగుతుంది మరణించిన తర్వాత స్వర్గానికి.

-ఆహూతులు యజ్ఞకర్తను ఇంద్రలోకానికి తీసుకువెళ్ళే విధమును ఈ 6వ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥ఏహ్యేహీతి తమాహుతయః సువర్చసః
సూర్యస్య రశ్మిభిః యజమానం వహంతి।
ప్రియాం వాచ మభివదంత్యః అర్చయంత్య
ఏషవః పుణ్యసుకృతో బ్రహ్మలోకః ॥ (6)

ప్రతి : సువర్చసః = మెరుస్తున్న; ఆహుతయః = ఆహూతులు; ప్రియాంవాచం = ప్రీతికరమైన పలుకులు; అభివదంత్య = పలుకుతూ; ఏషవః = ఇదే మీయొక్క, సుకృతః = సుకృతం వల్ల లభించిన; పుణ్యః = పవిత్రమైన; బ్రహ్మలోకః = బ్రహ్మలోకం; ఏహి ఏహి ఇతి = రండి! రండి! అంటూ; అర్చయంత్య = పూజిస్తూ; తంయజమానం = ఆ యజ్ఞకర్తను; సూర్యస్యరశ్మిభిః = సూర్యకిరణాల ద్వారా; వహంతి = తీసుకొని పోతాయి.

భావం : మెరుసున్న ఆహూతులు ప్రీతికరంగా పలుకుతూ, **ఇదే మీ** సుకృతం వల్ల లభించిన పవిత్ర బ్రహ్మలోకం, రండి రండి అంటూ, పూజిస్తూ **ఆ యజ్ఞకర్తను** సూర్య కిరణాల ద్వారా తీసుకొని పోతాయి.

వ్యాఖ్య : కర్మలు చేసినప్పుడు ఆ కర్మ మంచిదైనా, చెడ్డదైనా ఆ కర్మలు ఫలితాలనివ్వక మానవు. **మంచికర్మ** మంచి ఫలితాన్నిస్తుంది. **చెడ్డకర్మ** చెడ్డ ఫలితాన్నిస్తుంది. 'ఎవరు చేసిన కర్మ వారనుభవించక ఎవరికైనా తప్పదు'. బాహ్యంగా కర్మను చేస్తాం. (ఆ కర్మను ఎందుకు చేయాలనుకున్నామో) చేసేటప్పుడు ఏ భావంతో ఉన్నామో అదంతా మనస్సులో తలుస్తాం. మనం లోపల భావించే భావనలే పుణ్యం, పాపం. **చెడ్డ ఆలోచనతో చేస్తే పాపం. మంచి ఆలోచనతో చేస్తే పుణ్యం.** పుణ్యం స్వర్గ ప్రాప్తిని కలిగిస్తుంది. పాపం నరక ప్రాప్తిని కలిగిస్తుంది. పుణ్యం తరిగిపోయిన తర్వాత స్వర్గంనుండి భూలోకంలోకి మళ్ళీ శరీరం ధరించి రావాల్సిందే. అలాగే పాపం తరిగిపోయిన తర్వాత నరకంనుండి భూలోకంలోకి మళ్ళీ శరీరం ధరించిరావాల్సిందే. కనుక స్వర్గనరకాలు అప్పుడప్పుడు మనం చేసే టూరిస్టుకేంద్రాలేగాని మనశాశ్వత నివాస స్థానాలు కాదు.

మనం స్వర్గ భోగాలను ఆశించి, పుణ్యఫలాలను ఆశించి హోమ విధిని చక్కగా నిర్వర్తిస్తే – ప్రజ్వలిస్తున్న అగ్ని జ్వాలల్లో యధాకాలంలో

ఆహుతులు సమర్పిస్తే - ఆ ఆహుతులే **ప్రియవచనాలు పలుకుతూ,** పుణ్యలోకాలకు మార్గాన్ని చూపుతూ, మనలను ఎంతో పూజ్యభావంతో, గౌరవభావంతో అర్చిస్తూ "మీరు చేసిన పుణ్య కర్మలకు ఫలితంగా లభించిన స్వర్గలోకం ఇదే - ఉత్తమ లోకం ఇదే".... అంటూ, 'రండి - రండి' అని ఆహ్వానిస్తూ యజమానులమైన మనను సూర్యకిరణాలద్వారా అంటే మంచి వెలుగుద్వారా - చీకటి అనేదిలేని మార్గం ద్వారా తీసుకొని పోతాయి.

పుణ్య ఫలంగా లభించిన స్వర్గలోక ప్రాప్తిని అంగిరస మహర్షి ఎంతో హృద్యంగా వర్ణించాడీ మంత్రంలో. ఇలా స్వర్గలోకప్రాప్తిని పొందిన వారు ఇక్కడ అనేక భోగాలను అనుభవిస్తారు. ఇదే ప్రకారంగా పాపంచేసిన వారిని, దోషాలతో చేసిన వారిని ఆ కర్మలు **చీకటి** మార్గం ద్వారా అవమానిసర్తా ఈడ్చుకుంటూ **నరకానికి** తీసుకెళతాయి. అక్కడ నరకయాతనలు అనుభవించాలి.

ఏమైనా ఈ స్వర్గలోక ప్రాప్తి, స్వర్గభోగాలు తాత్కాలికమైన ఊరటయేగాని శాశ్వత ఆనందంకాదు. ముక్తికాదు. మోక్షం కాదు. ఇక్కడ చేసిన పుణ్యాన్ని బట్టి అక్కడ ఎంతకాలం భోగాలు అనుభవించాలో నిర్ణయమౌతుంది. పుణ్యఫలం ఖర్చు కాగానే మళ్ళీ ఈ దుఃఖాలు తప్పవు. మనశ్శాంతి కోసం ఏపుణ్యక్షేత్రానికి వెళ్ళినా ఆ నాలుగు రోజులు ఆనందంగానే ఉంటుంది. కాని ఇంటికి తిరిగిరాగానే మళ్ళీ మామూలే. పైగా ఆ లోకాల్లోని వారు ఈ సుఖ భోగాలను అనుభవిస్తూ పూర్తి ఆనందంగా ఉండరు. మరొకలోకంలోని వారి భోగాలతో తమ భోగాలను పోల్చుకొని **అసూయ** చెందుతారు. ఆ లోకాలలో కూడా సుఖానుభవంలో తేడా ఉంటుంది. పుణ్యఫలం ఖర్చయి పోతున్నదే అని దుఃఖిస్తూ ఉంటారు. కనుక ఈ పుణ్యకర్మలు కూడా చివరకు మనలను దుఃఖ వలయంలో పడవేసేవే అని రాబోయే మంత్రంలో-

- ఈ యజ్ఞకర్మల యొక్క యదార్థస్థితిని 7వ మంత్రంలో వివరిస్తున్నారు.

మం॥ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపా
అష్టాదశోక్తం అపరం ఏషు కర్మ।
ఏతత్ శ్రేయో యేఽభినందంతి మూఢాః
జరామృత్యుం తే పునరే వాపి యంతి ॥ (7)

ప్రతి : అష్టాదశ యజ్ఞరూపా = 18 అంగాలతో కూడిన; ఏతేకర్మ = ఈ యజ్ఞకర్మ; అపరం ఉక్తం = అపరా విద్య అని చెప్పబడినది; హి= ఎందుకంటే; అధృఢాప్లవాః = ఇవి బలహీనమైన తెప్పలవంటివి; యేమూఢాః = ఏ మూఢులు; ఏతత్ = ఇది; శ్రేయః అభినందంతి = శ్రేయో మార్గమని ప్రశంసిస్తారో; తే = వారు; పునః అపి = మళ్ళీకూడా; జరామృత్యుం యంతి = జరామరణాలను పొందుతారు.

భావం : 18 అంగాలతో కూడిన ఈ యజ్ఞకర్మ అపరావిద్యకు చెందినదే. ఇవి బలహీనమైన తెప్పలవంటివి. ఏ మూఢులు దీనిని శ్రేయోమార్గంగా ప్రశంసిస్తారో వారు తిరిగి జరామరణాల పాలుగాక తప్పదు.

వ్యాఖ్య : ఆత్మానుభూతిని లేదా మోక్షప్రాప్తిని కోరుకొనే సాధకులకు **వేదోక్త కర్మల ఆచరణ తప్పదు.** వాటివల్ల **మనశ్శుద్ధి కావాలి.** శుద్ధమైన మనస్సులోనే జ్ఞానబీజం నాటుకొనేది. కనుక వాటిని ఫలాపేక్షతో కాకుండా, భోగాసక్తితో కాకుండా నిష్కామంగా ఆచరించాల్సిందే. ఆ విధంగా ఉత్తమ లక్ష్యాన్ని చేరుకొనుటకు **వాటిని సాధనంగా ఉపయోగించుకోవాల్సిందే.** అయితే హిందువులలో **నూటికి తొంభై తొమ్మిది మంది** ఈ కర్మకాండల వల్లనే జన్మ సార్థక్యం కలుగుతుందని భావిస్తున్నారు. **ఇలా వేదాలలో చెప్పినట్లు యజ్ఞయాగాలు చేసుకుంటూ - పూజా పునస్కారాలు చేసుకుంటూ (బ్రతికినంత) జీవించినంతకాలం ఇందులోనే మునిగిపోతే చాలు మనకు**

మోక్షం ఖాయం అనుకుంటూ ఉంటారు. ఈ కర్మకాండను దాటి వేదాలలోనే ఉపాసనా కాండ, జ్ఞానకాండలను కూడా చెప్పారు గదా!, మరి వాటిని కూడా తెలుసుకోవాలిగదా! అని ఆలోచించరు. ఈ కర్మకాండ అనే ఎలిమెంటరీ స్కూలును దాటి వెళ్ళటానికి ఇష్టపడరు. అంతేగాక ఎవరన్నా అలా ఎలిమెంటరీ స్కూలును దాటి ఉపాసనా కాండ అనే హైస్కూలులోను, జ్ఞానకాండ అనే కళాశాలలోను చదువుకుంటుంటే వారిని చూసి ఎగతాళి చేస్తారు. తమ గొప్పతనానికి తామే మురిసిపోతారు. మీరు ఏ హైస్కూలుకు వెళ్ళి చదవనక్కరలేదు. ఏ కాలేజీకి వెళ్ళి చదవనక్కరలేదు. **ఈ పాఠశాలలోనే కూర్చొని అక్షరాలు దిద్దుకోండి. ఇది ఎంతో తేలిక. ఇది చాలు మీజన్మకు – అని కూడా చెబుతూ ఉంటారు. ఇలాంటి వారినే మూఢులు – మందమతులు అని ఈ మంత్రంలో ఋషి తెలియజేసినది.** (ఈ మూఢుల మాటలు విని కాలేజీ నుండి ఏలిమెంటరీ స్కూల్లో కూర్చొనే **మహామందమతులూ ఉంటారు.**)

కర్మకాండలోనే మునిగి పోయి ఉన్నతస్థానానికి వెళ్ళటానికి నిరాకరించే వారిని ఈ అధర్వణవేదం – (శ్రుతి మాత) **మూఢులు** అని చెబుతూ వారిని ఉన్నత స్థితికి ఎదగటానికి పురి కొల్పుతున్నది ఈ మంత్రం ద్వారా.

వేదాలలో చెప్పిన కర్మకాండ – అంటే పూజలు, యజ్ఞయాగాదులు స్వర్గప్రాప్తిని కలిగిస్తాయేగాని మోక్షప్రాప్తిని అందించవు అని ఈ ఉపనిషత్‌లో ఋషి స్పష్టంగా తెలియజేస్తున్నారు.

యజ్ఞరూపకర్మ 18 అంగాలతో కూడినది అంటున్నారు. పదహారు మంది ఋత్విక్కులు, యజమాని, యజమానిభార్య – మొత్తం 18 మంది ఉంటారు. ఇదే 18 అంగాలు.

ఇలా 18 అంగాలతో కూడిన ఈ యజ్ఞకర్మ **'అపరకర్మ'** అన్నారు. అంటే ఇది అపరావిద్యకు సంబంధించినది. 'శ్రేష్ఠమైనది కాదు' అని. అంటే

జన్మ సాఫల్యానికి – మోక్ష ప్రాప్తికి తగినది కాదు అని; ఈ కర్మల వల్ల అనంతమైన దుఃఖాలు కలుగుతాయి అని; ఈ కర్మలెంత గొప్పవైనా, యజమాని వాటిని ఎంత విధి విధానంగా ఆచరించినా తాత్కాలిక భోగాలు కలుగుతాయేగాని, శాశ్వత ఆనందం సిద్ధించదు. ఇవి వాస్తవంలో పరమాత్మను చేరే మార్గంలోని మజిలీలేగాని పరమాత్మ స్థానంకాదు. వీటిద్వారా ఏ లోకాలకు వెళ్ళినా తిరిగి మళ్ళీ ఇక్కడకు రావాల్సిందే. కనుక ఇవి అపరకర్మలు అన్నారు.

ఇవి **బలహీనమైన తెప్పలవంటివి** అని ఋషి తెలియజేస్తున్నారు. (అదృఢా ప్లవా అన్నారు)

ప్లవ అంటే **తెప్ప** అని ఒక అర్థం. **నీటిబుడగ** అని మరొక అర్థం.

(i) మానవజీవితం ఒక సాగరం వంటిది. ఈ సంసార సాగరాన్ని ఈది ఆవలి తీరమైన మోక్షతీరాన్ని చేరటమే మానవ జీవితలక్ష్యం. సాగరాన్ని దాటాలంటే పడవ కావాలిగదా! మరి ఆ పడవ బలహీనమైన దైతే – మనను కాస్తా సముద్రంలో ముంచేస్తుంది. ఈ యజ్ఞమును బలహీనమైన పడవతో పోల్చారు. (అదృఢా ప్లవ). మరి సంసార సాగరాన్ని దాటి మోక్షతీరాన్ని చేరుకోవాలనుకొనే ముముక్షువులు ఈ బలహీనమైన పడవను ఎక్కితే ఇది ఎక్కడో ఈ సంసార సాగరంలోనే ముంచేస్తుందిగదా! కనుక జాగ్రత్త అని హెచ్చరిక.

(ii) అలాగే ప్లవ అంటే **నీటిబుడగ** అని మరొక అర్థం. నీటి బుడగ **ఎంతక్షణికమో ఈ యజ్ఞ కర్మల ద్వారా వచ్చే ఫలితాలు కూడా అంతే క్షణికములు –** నీటి బుడగల వంటివి. **కనుక ఈ యజ్ఞ యాగాదులనే నమ్ముకోవద్దు** అని హెచ్చరిక. కనుక కర్మలన్నీ తాత్కాలిక ఫలితాల నందించి కర్మసముద్రంలో పడద్రోస్తాయేగాని మోక్షము నందించలేవు.

"న మోక్షార్థాని కర్మాణి ఇతి సిద్ధం" కర్మ – మోక్షము నందించలేదు – అని శంకరాచార్యుల వారు బృహదారణ్య కోపనిషత్ భాష్యంలో స్పష్టంచేశారు.

"ఈ యజ్ఞ కర్మలే శ్రేయోదాయకములు. మీకు ఆరోగ్యాన్నిస్తాయి స్వర్గ భోగాలు లభిస్తాయి. మోక్షాన్నిస్తాయి" అని వీటిని ప్రశంసించేవారు మూఢులు – మందమతులు అన్నారు. అంటే వారి బుద్ధి ఇక అంతకంటే పైకి వెళ్ళనంటున్నది. వారి బుద్ధి అంతకన్న పైకి వెళ్ళదు గనుక వారు మిగిలిన వారిని కూడా అలా మంద మతులుగానే తనకు తోడుగా ఉంచుకోవాలనుకుంటారు. అందుకే ఇలా చేయండి చాలు మీకు మోక్షం వస్తుంది అంటారు.

అట్టి వారికి కలిగే ఫలితం కూడా ఏమిటో చెప్పారు. మళ్ళీ మళ్ళీ పుట్టటం, మళ్ళీ మళ్ళీ చావటం. జన్మదుఃఖం, జరా దుఃఖం, వ్యాధి దుః ఖం. మరణ దుఃఖం. ఇలా దుఃఖాలతో పైకి క్రిందికీ ఏతం బానలా తిరుగుతూ ఉండాల్సిందే.

– ప్రేయోమార్గమైన ఈ కర్మమార్గమే శ్రేయస్సును కలిగిస్తుందని ప్రశంసించే మందమతుల అయోమయ ధోరణిని వివరిస్తున్నారీ మంత్రంలో–

మం॥అవిద్యాయాం అంతరే వర్తమానాః

స్వయంధీరాః పండితం మన్యమానాః ।

జంఘన్యమానాః పరియంతి మూఢాః

అంధేనైవ నీయమానా యథాంధాః ॥ (8)

ప్రతి : అవిద్యాయాం అంతరే వర్తమానాః = అజ్ఞానంలో జీవించేవీరు; స్వయంధీరాః = తామే ధీరపురుషులమని; పండితం మన్యమానాః = పండితులమని ఆత్మస్తుతి చేసుకొనే; మూఢాః = మూర్ఖులు; జంఘన్యమానాః = శోకగ్రస్తులై; అంధేన ఏవనీయమానాః = గ్రుడ్డివారిచే నడుపబడే; అంధాః = గ్రుడ్డివారి; యథా = వలె; పరియంతి = పరిభ్రమిస్తూ ఉంటారు.

భావం : అజ్ఞానంలో జీవించే వీరు తామే ధీరపురుషులమని, పండితులమని ఆత్మస్తుతి చేసుకునే మందమతులు. వీరు శోకక్రగస్తులై, అంధునిచే నడిపించబడే అంధులవలె పరిభ్రమిస్తూ ఉంటారు.

వ్యాఖ్య : భోగాసక్తితో కర్మ కాండలో మునిగిపోయి, యజ్ఞ యాగాదులు చేస్తూ ఉంటే చాలు; జన్మసార్థకమవుతుంది; అని తెలియజేస్తూ, తాముగొప్ప పండితులమని, జ్ఞానంలో పండిపోయామని, తమకు తెలియని విషయమే లేదని, ఊక దంపుడు ఉపన్యాసాలిస్తూ, తమకున్న అజ్ఞానాన్ని తోడుచేసుకొని పదిమందిని నడిపించాలని ఉవ్విళ్ళూరే అంధులను ఈ మంత్రంలో అంగిరసమహర్షి **అవహేళన చేస్తున్నాడు. వారిని 'మూఢులు' అంటున్నాడు.**

మిడి మిడి జ్ఞానంతో ముముక్షువుల మంచితనాన్ని, అమాయకత్వాన్ని బలహీనతగా చిత్రించుకొని వారిపై స్వారీ చేసి, వారిని దారి మళ్ళించి, తాము చెడి, పదిమందినీ గోతిలో తోసే మందభాగ్యుల విషయంలో జాగ్రత్త వహించమని సాధకులను హెచ్చరిస్తున్నారీ మంత్రంలో.

ఈ విషయం కేవలం ఈ ఉపనిషత్తులోనేగాదు **కఠోపనిషత్తులోను, బృహదారణ్య కోపనిషత్తులోను ఇదే మంత్రం కొద్ది మార్పులలో** ఉన్నది. అంతేకాదు భగవద్గీత **రెండవ అధ్యాయంలో 42, 43, 44** శ్లోకాల్లో చెప్పినది మక్కికి మక్కీగా ఇదే భావం.

స్వర్గ భోగాలయందు ప్రీతిగలవారు, వేద బ్రాహ్మణము లందు చెప్పిన కర్మకాండను గురించి పదే పదే చెబుతూ, కర్మ వలయంలోనే చరిస్తూ, అవివేకులై, ఇంతకన్న జీవితంలో చేయదగ్గది మరేమీలేదని వాదిస్తూ, తమ అజ్ఞానాన్ని తాము తెలుసుకోలేక ఇతరులను నడిపించటానికి ప్రయత్నిస్తారు. తామే ధీరపురుషులమని అవతారపురుషులమని చాటుకుంటారు. తమకు తెలిసిందే సత్యమంటారు. **సత్యసూర్యుని** దర్శించలేని **ఈ గుడ్లగూబలు** అయోమయంలో తాముంటూ, ఇతరులను తప్పు త్రోవ పట్టిస్తూ ఉంటారు. వారు చేసే వ్యర్థ ప్రసంగాలలోని అజ్ఞానాన్ని గుర్తించలేక ప్రజలు వారిని అనుసరిస్తారు. ఇలా అనుసరించటం **'అంధపరంపర'** అవుతుందని మహర్షి హెచ్చరిస్తున్నాడు.

కళ్ళులేని గ్రుడ్డి వాడికి దారి కనపడదు. కనుక రోడ్డు మీదనడువలేడు. అట్టివాడు ఒక ట్రాఫిక్ రోడ్డు మీద పదిమంది గ్రుడ్డివాళ్ళను నేను నడిపిస్తాను, మిమ్ములనందరిని క్షేమంగా ఈ వైపునుంచి ఆ వైపుకు తీసుకెళతానని వారిని వెంట బెట్టుకొని బయలుదేరాడట. అలా ఉంటుంది ఈ కర్మ కాండనే సర్వస్వమని నమ్మి ఇతరులను నమ్మించజూసే వారి స్థితి.

జ్ఞానములేనివాడు గ్రుడ్డివాడే. అలాంటి వాడు పదిమందినీ జ్ఞాన మార్గంలో నడుపుతానంటే అది ఎంత ప్రమాదకరమో ఆలోచించాలి. తాను గోతిలో పడటమేగాక తన అనుయాయులను కూడా గోతిలోనికి త్రోసేస్తాడు. **తనతోపాటు వారికి కూడా జన్మ మృత్యు జరా వ్యాధులను** మళ్ళీ మళ్ళీ అందిస్తాడు. కనుక సాధకులైనవారు జాగ్రత్తగా ఉండాలి – అని ఈ మంత్రం హెచ్చరిస్తున్నది.

ప్రతి వేదమూ నాల్గు భాగాలుగా విభజింపబడింది. మంత్రభాగం, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తు అని. బ్రాహ్మణాలు కర్మకాండను, ఆరణ్యకాలు ఉపాసనాకాండను, ఉపనిషత్తు జ్ఞానకాండను తెలియజేస్తున్నాయి. ఈమంద బుద్ధిగల పండితులు, ఒక్క కర్మకాండను చూచి, భోగాలందుకోవాలనే కోరికను తీర్చుకోవాలంటే ఇదే మార్గమని చెప్పటంవల్ల కర్మకాండతోనే ఆగిపోతారుగాని ఆపైన చూడరు.

ఈ ఉపనిషత్తు అధర్వణ వేదంలోనిది. ఇది వేదంలోనిదే అయినా వేదాలలోనే చెప్పిన కర్మకాండను ఇక్కడ అపహాస్యం చేస్తున్నారు. ఇది విరుద్ధంగా కనిపిస్తుంది చాలా మందికి. కాని నిజంగా ఆలోచిస్తే – వివేకంతో ఆలోచిస్తే విరుద్ధం లేదు.

మీ కుమారుడు ఒకటవ తరగతి చదివేటప్పుడు ఎక్కాలు ఒప్పగించాలని నిర్బంధించేవారు. రోజూ ఎక్కాలు అప్పజెప్పించు కొనేవారు. ఎక్కాలు రాకపోతే నీకు బ్రతుకే లేదనేవారు. ఎక్కాలొస్తేచాలు ఇంకేం అక్కర్లేదనేవారు. కానివాడు పెద్దయిన తర్వాత, కాలేజీలో చదివిన తర్వాత,

గణిత శాస్త్రజ్ఞుడైన తర్వాత ఎక్కాలు అప్పుజెప్పాలని నిర్బందిస్తారా? ఒకటవ తరగతిలో ఆ ఎక్కాలే అతనికి వేదములలాగా ముఖ్యమయినవి. కాని కాలేజీలో చేరినప్పుడు వాటితో పనిలేదు.

అలాగే వేదోక్త కర్మలు ప్రారంభంలో అవసరమే అయినా వాటినే జీవితాంతము పట్టుకు కూర్చోరాదు. అలాచేస్తే జీవితాన్ని వ్యర్థం చేసుకున్నట్లే **– ఈ పూజా పునస్కారాలు యజ్ఞయాగాదులు కూడా అంతే –**

– ఇలాంటి అజ్ఞానులగతి ఏమిటో 9వ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥అవిద్యాయాం బహుధా వర్తమానాః
వయం కృతార్థా ఇత్యభి మన్యంతి బాలాః।
యత్ కర్మిణో న ప్రవేదయంతి రాగాత్
తేనాతురాః క్షీణలోకాః చ్యవంతే॥ (9)

ప్రతి : అవిద్యాయాం = అజ్ఞానములో; బహుధా = అనేక విధాలుగా; వర్తమానాః చరించేవారు; బాలాః = బాలురవంటివారు; వయం = మేము; కృతార్థాః = తరించాము; ఇతి అభిమన్యంతి = అని భావిస్తుంటారు; యత్ = ఎందుకంటే; రాగాత్ = ఆసక్తులైనందున; కర్మిణః = కర్మిష్ఠులైనవారు; నప్రవేదయంతి = సత్యాన్ని గ్రహించలేరు; తేన = అందువల్ల; క్షీణలోకాః = పుణ్యఫలాలు క్షయంకాగానే; ఆతురాః = దుః ఖితులై; చ్యవంతే = క్రిందికి జారిపడతారు.

భావం : అజ్ఞానంతో అనేక విధాలుగా ప్రవర్తించే వీరు బాలురవంటి వారు. ఎందుకంటే మేము తరించాము అని పిల్లల వలె భావిస్తూ ఉంటారు. విషయాలపట్ల ఆసక్తిగలవారుగనుక సత్యాన్ని దర్శించలేరు. కాబట్టి పుణ్యఫలాలు క్షయంకాగానే దుఃఖితులై జారిపడిపోతుంటారు.

వ్యాఖ్య : గ్రుడ్డిగా కర్మకాండను ఆచరించేవారిని ఇక్కడ 'బాలాః' అని

సంబోధిస్తున్నారు. పిల్లలు సత్యాన్ని తెలుసుకోలేరు. వారికి తెలియదు, చెబితే వినరు. మూర్ఖులూ అంతే వారికి తోచదు, చెబితే వినరు.

యజ్ఞ యాగాలు ఆచరించటమే పరమ లక్ష్యమని, ఇదే ముక్తినిస్తుందని, ఇంతకంటే ఇంక తెలుసుకోవలసింది ఇంకేమీలేదని; అజ్ఞానంలో రమించే మూర్ఖులు చెబుతూ ఉంటారు. అంతేకాదు వాళ్ళు అజ్ఞానంలో తిరుగుతూ మేము జ్ఞానులమని, కృతార్థులమని, ఇంకమాకు ముక్తి అంటే ఏమిటో తెలిసి పోయిందని భావిస్తుంటారు. అందుకే ఇలాంటి వారిని వేదమాత **'బాలురు'** అని పరిహసిస్తున్నది. తల్లికి బిడ్డమీద కోపం ఎందుకు వస్తుంది? అయ్యో! నాబిడ్డ మంచి మార్గంలో నడువలేక పోతున్నాడే! ఎంతచెప్పినా వినిపించుకోవటం లేదే! అని బాధ. అతణ్ణి ఎలాగైనా మంచిమార్గంలో పెట్టాలనే తపన. అందుకే ఇలా 'బాలా' అంటూ పరిహాసం.

కర్మ మార్గంలో చరించేవారికి భగవద్దర్శనం అసాధ్యం. కర్మ మార్గంలో చరించేవారి ఆలోచన ఎలా ఉంటుందంటే – తగినంత ధర చెల్లించి కావలసిన వస్తువులను అంగడిలో ఎలా కొనుక్కుంటామో; అలాగే తగిన కర్మలు చేసి కోరిన కోరికలు తీర్చుకుందాం అనేదే. కోరికలచేత ప్రేరేపించబడిన వారై ఆ కోరికలను తీర్చుకొని తృప్తి పడటానికే వారు వేదోక్త కర్మలను చేస్తున్నారు. పైకి మాకేం కోరికలు లేవు అని అంటున్నా ఆకోరికల (వాసనలు) మూలాలు మనస్సుల్లో ఉంటాయి. అవే మనసును ప్రేరేపిస్తూ ఉంటాయి. వస్తువులకు, భోగాలకు అంతులేదు. కనుక కోరికలకూ అంతులేదు. ఒక కోరిక తీరిన తర్వాత మరొక కోరిక. కోరిక తీరగానే తృప్తి కలుగుతుంది. ఆ తృప్తిని చూచేలోగానే తీరని కోరిక అశాంతినందిస్తుంది. దీనంతటికీ కారణం రాగమే.

ఈ రాగం వల్లనే – ఈ భోగాసక్తి వల్లనే ఎంత పండితులైనా, ఎంత గొప్పవారైనా, ఎంత మంచివారైనా, ఎంత భక్తుల మనుకొనే వారైనా తమ

జీవితాన్ని సకామ కర్మలు చేయటంలోనే వ్యర్థం చేసుకుంటున్నారు, అంత కన్న పైదైన అధ్యాత్మిక మార్గంలో ప్రవేశించలేకపోతున్నారు. జ్ఞానాన్ని అందులోలేక పోతున్నారు.

కోరికలు జీవుడివి. మరి దేవుడేమో నిరీహుడు. అంటే ఏ కోరికాలేనివాడు. కనుక కోరికలకు (భగవంతునికి) సత్య వస్తువుకు సంబంధం లేదు. కోరికలు పూర్తిగ వదలక పోతే దైవత్వం రానేరాదు. శాంతి కలగనే కలగదు. **కోరికలు వదలిన వాడికే స్వస్థితి ప్రాప్తి.**

పుణ్య కర్మలవల్ల స్వర్గప్రాప్తి. పుణ్యఫలం వల్ల వచ్చిన సుఖం పుణ్యం క్షీణించగానే నశించిపోతుంది. ఆస్థితిలో చేసేది లేక మళ్ళీ భూలోకంలో ప్రవేశించి కర్మలు చేయుటే. మరి ఈ కర్మ సుడిగుండంలో నుండి బయటపడటం ఎలా? –

ఒక్కటే మార్గం. కోరికలను జయించి, కర్మకాండను అధిగమించి, జ్ఞాన భూమికలో ప్రవేశిస్తేనే శాంతి. అలా గాక కర్మకాండలోనే మునిగిపోయారా వారికి అధోగతియే. పైకీ క్రిందికీ తిరగటమే – మళ్ళీ మళ్ళీ సంసార **దుఃఖం** తప్పదు.

– కర్మ పరుల భావాలు ఎలా ఉంటాయో, వారు పొందే జన్మలు ఏవో ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥ఇష్టాపూర్తం మన్యమానా వరిష్టం
నాన్య చ్ఛ్రేయో వేదయంతే ప్రమూఢాః ।
నాకస్య పృష్ఠే తే సుకృతేఽ ను భూత్వే
మంలోకం హీనతరం వా విశంతి ॥ (10)

ప్రతి : ఇష్టాపూర్తం = యజ్ఞ, పుణ్యకార్యాలు; వరిష్ఠం మన్యమానాః = శ్రేష్ఠమని భావించు; ప్రమూఢాః = పరమమూర్ఖులు; అన్యత్‌శ్రేయః = వేరేశ్రేయస్సును; నవేదయంతే = తెలుసుకోలేరు; తే నాకస్య పృష్ఠే =

వారు పైనున్న స్వర్గంలో; సుకృతే అనుభూత్వా = పుణ్యఫలాలను అనుభవించి; ఇమంలోకం = ఈలోకాన్ని; వా = లేదా; హీనతరం = ఇంకా హీనమైనలోకాన్ని; విశంతి = ప్రవేశిస్తారు.

భావం : యజ్ఞకర్మలు, పుణ్య కర్మలు శ్రేష్ఠమైనవని భావించే ఈ పరమ మూర్ఖులు అసలైన శ్రేయోమార్గాన్ని తెలుసుకోలేరు. అట్టివారు ఉన్నతమైన స్వర్గాదిలోకాలలో పుణ్య కర్మల ఫలితంగా స్వర్గభోగాలు అనుభవించి, తిరిగి ఈ లోకంలోగాని, ఇంతకన్నా హీనమైన లోకాలలోగాని ప్రవేశిస్తారు.

వ్యాఖ్య : యజ్ఞ యాగాదులే ముఖ్యమైనవిగా భావించే మూర్ఖ శిఖామణులు శాశ్వతానందాన్ని, బ్రహ్మానందాన్ని పొందే **శ్రేయోమార్గాన్ని తెలుసుకోలేరు.** కనుక వారు **స్వర్గ భోగాలనుభవించి మళ్ళీ ఈలోకంలో గాని – ఇంకా హీనమైన లోకాల్లో గాని ప్రవేశిస్తారు.**

కర్మ–జ్ఞానములకెప్పుడూ ముష్టి యుద్ధమే. ఈ యుద్ధమే నిజంగా మనకు ఆధ్యాత్మిక విద్యను ప్రసాదించిన శక్తి అని చెప్పాలి. ప్రపంచంలో ఒక్కొక్కకాలంలో కర్మిష్ఠులు జ్ఞానులకు లొంగిపోతుంటారు, ఒక్కొక్కకాలంలో జ్ఞానులే కర్మిష్ఠులకు లొంగి పోతుంటారు. ఇప్పుడు మనం కర్మిష్ఠుల యుగంలో ఉన్నాం. ఇప్పుడు వారిదే పైచేయి. అందుకే మన మనస్సులు జ్ఞానం కన్న కర్మల వైపుకే పరుగులు తీస్తుంటాయి. కర్మలు శరీరంతో చేసేవి కనుక తేలిక. జ్ఞానం బుద్ధితో పొందాల్సింది కనుక కష్టం. కర్మకాండలో చరించేవారు మోక్షప్రాప్తిని కలిగించే శ్రేయో మార్గంలో ప్రయాణించక, తనకు తెలిసినదే శ్రేయోమార్గం అని వాదిస్తారు. **కర్మాచరణ అనేది కర్మలను అధిగమించటానికే గాని కర్మలలో చిక్కుకొని సుడిగుండంలో పడి కొట్టుకున్నట్టు కొట్టుకొని నశించిపోవటానికి కాదు.** ఈ సత్యాన్ని తెలుసుకోలేక **ఇష్టాపూర్తం** శ్రేష్టమని కర్మపరులు భావిస్తారు.

ఇష్టాపూర్తం అనేది ఇష్టం – పూర్తం అనే రెండు పదాలకలయిక. **ఇష్టం** అంటే యజ్ఞ యాగాది కర్మలు, **పూర్తం** అంటే భావులు త్రవ్వించుట,

చెట్లు నాటించుట, పాఠశాలలు కట్టించుట, చెరువులు, సత్రములు, దేవాలయములు, కళ్యాణ మండపములు కట్టించుట మొ॥ సేవాకార్యక్రమాలు. జనులకు ఉపయోగపడేవి. లోక కళ్యాణ కారకాలు.

ఈ ఇష్టాపూర్తములు మాత్రమే దివ్యకర్మలని, ఇంతకు మించి మరేమీలేదని డాంబిక ప్రసంగాలు చేసేవారు సత్యమెరుగని మూర్ఖులు. వట్టి మూర్ఖులుకాదు **పరమమూర్ఖులు** అని **'ప్రమూఢాః'** అన్నారు ఉపనిషత్ ఋషులు. పుణ్యకర్మలు చేస్తే పుణ్య మొస్తుందేగాని జ్ఞానంరాదు. పుణ్యం వస్తే అతడు మరణించిన తర్వాత స్వర్గలోక భోగాలు లభిస్తాయి. ఆ భోగాలు అనుభవిస్తే పుణ్యధనం కాస్తా ఐపోతుంది. అలా పుణ్యం క్షీణిస్తే – "క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి" – మళ్ళీ ఈ మర్త్య లోకం చేరుకోవాల్సిందే. యజ్ఞ యాగాదుల వల్ల, పుణ్యకర్మల వల్ల వచ్చే ఫలితాల **'వాస్తవిక స్వరూపం'** తెలియని మూర్ఖులు ఇవే శ్రేయస్సును కలిగిస్తాయని భావించి, వాటి వెంటబడి పోతూ తమకు తోడుగా కొందరిని తీసుకువెళ్ళాలని భావిస్తారు. శ్రేయో మార్గాన్ని తెలుసుకోలేరు. ఇలాంటి అయోమయజీవుల్ని మనం చూస్తూనే ఉంటాం. వారి ప్రలాపాలు చాలా విడ్డూరంగా ఉంటాయి.

"నాకు దేవుడు, దయ్యం అవసరంలేదు. ఆత్మ, గీత్మ నాకు గిట్టవు. మంచి చేయటమే నామతం. నేనెప్పుడూ పుణ్యకార్యాలే చేస్తాను. సమాజానికి సేవచేస్తాను. నా దేముడు పేరు **మంచి"** అని **సంచి** ఒకటి మెడకు తగిలించుకొని పదిమంది చూసేటప్పుడు బిచ్చగాడి చేతిలో రూపాయిబిళ్ళ జారవేయటమో; ఎవరి దగ్గరన్నా చందాలు సేకరించి బీదవాడికి వస్త్రదానం చేస్తూ మంచి ఫోజులో ఫోటోలు తీయించి పేపర్లలో వేయించుకొని చూసి మురిసి పోవటమో, గొప్ప పంక్షన్ – బఫేడిన్నరు ఏర్పాటు చేయటమో!, ఇలాంటి వెన్నో చూస్తుంటాం. ఇదంతా ఒక అహంకార ప్రదర్శన. అవగాహనలేని అయోమయధోరణి. జ్ఞానానికి దూరమయ్యే చర్యలు. మహాత్ములూ పుణ్యకార్యాలు చేస్తారు. అయితే పుణ్యకార్యాలు చేసే వారంతా మహాత్ములుకాదు. వారి ఉద్దేశాలను బట్టి ఉంటుంది.

పుణ్యకార్యాలు చేసినవారు పుణ్యఫల భోగాలైన స్వర్గ సౌఖ్యాలు అనుభవించిన తర్వాత తిరిగి ఈలోకంలోకో - అధో లోకంలోకో తిరిగి రావలసిందే.

పుణ్య కర్మలు కూడా అధో గతిని కలిగిస్తాయా? - కలిగిస్తాయి. స్వర్గం నుండి భూలోకం వచ్చే వారెవరు? అధోలోకం వెళ్ళేవారెవరు?

1. జ్ఞానం లేకుండా కర్మలు చేసేవారు (వివేకం - తెలివిలేనివారు) మానవలోకంలోకి - అంటే మానవ శరీరంతో వస్తారు. (వీరు తెలివి లేనివారు)

2. **అహంకారంతో, దంభంతో, కీర్తికాంక్షతో పుణ్యకర్మలాచరించినవారు స్వర్గంనుండి అధోలోకాలకు జారిపోతారు. అంటే నీచ నికృష్ట యోనులలోనికి, పశువులనుండి పెంట కుప్పల్లోని పురుగుల వరకు - జన్మలు రావచ్చు - (అతితెలివిగలవారు)**

ఈ వేద మంత్రం ద్వారా **"ఒకసారి మానవజన్మ ఎత్తినవాడు ఎలాంటి పాప కర్మలు చేసినా ఇక నీచజన్మ ఎత్తడు" అని చెప్పే మంద బుద్ధుల మాటలు ఖండించబడుతున్నాయి. మన భావాలను బట్టే మనజన్మలు.**

- ఇంతవరకు అజ్ఞానుల యొక్క దుర్గతిని గురించి చెప్పిన ఋషి ఇప్పుడు జ్ఞానులయొక్క సద్గతిని గురించి వివరిస్తున్నారు.

మం॥తపః శ్రద్ధే యే హ్యుప వసంత్య రణ్యే
శాంతా విద్వాంసో భైక్ష్యచర్యాం చరంత ।
సూర్యద్వారేణ తే విరజా ప్రయాంతి
యత్రామృతః సపురుషోహ్యవ్యయాత్మా ॥(11)

ప్రతి॥ యేహి = ఎవరైతే నిజానికి; శాంతాః = శాంతస్వరూపులో; విద్వాంసః = విద్వాంసులో; భైక్ష్యచర్యాం చరంతః= భిక్షాటనతో జీవిస్తూ; అరణ్యే = వనప్రదేశాలలో; తపః శ్రద్ధే = తపస్సు శ్రద్ధతో; ఉపవసంతి = నివసిస్తారో;

తే = వారు; విరజాః = విశుద్ధులై; సూర్యద్వారేణ = సూర్యమార్గంలో; యత్ర = ఎక్కడ; అమృతః = నశించని; అవ్యయాత్మాపురుషః = అవ్యయపురుషుడుంటాడో అక్కడకు; ప్రయాంతి = చేరుకుంటారు.

భావం : ఎవరైతే నిజానికి శాంతస్వరూపులో, విద్వాంసులో; భిక్షాటనతో అరణ్యములందు నివశిస్తారో అట్టివారు విశుద్ధులై, సూర్యమార్గము ద్వారా అమృతము, అవ్యయము అయిన పురుషుడుండే స్థానమునకు చేరుతారు.

వ్యాఖ్య : సకామ కర్మలు ఆచరించి స్వర్గలోకాలలో భోగాలనుభవించి, తిరిగి భూలోకానికో – అధోలోకాలకో వెళ్ళే కర్మపరులను గూర్చి ఇంతవరకు చెప్పి ఇక క్రమముక్తిని పొందే ధన్యజీవులను గూర్చి ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మరణించిన తర్వాత జీవుడు రెండు మార్గాల గుండా ప్రయాణం చేస్తాడు. అవేసూర్య మార్గం. చంద్ర మార్గం. సూర్యమార్గం అంటే క్రమముక్తి, చంద్రమార్గం అంటే పుణ్యఫలం అనుభవించి తిరిగివచ్చేది.

1. సూర్యమార్గాన్ని **ఉత్తరాయణమని, శుక్ల గతియని, దేవయానమని** అంటారు. ఈ మార్గంలో ప్రయాణించే జీవుడు బ్రహ్మలోకాన్ని చేరుకుని అక్కడ బ్రహ్మద్వారా ఉపదేశాలు పొంది, కల్పాంతంలో బ్రహ్మతో సహా పరమాత్మలో లయించి ముక్తి నందుకుంటాడు.

2. చంద్ర మార్గాన్ని **దక్షిణాయనమని, కృష్ణ గతియని, పితృ యానమని** అంటారు. ఈ మార్గంలో ప్రయాణించే జీవుడు పితృలోకం చేరుకుని ఫలమనుభవించి తిరిగి మర్త్యలోకంలో ప్రవేశిస్తాడు.

కర్మకాండలో మునిగి, యజ్ఞయాగాలు, పుణ్య కర్మలను జ్ఞానం లేకుండా – కోరికలతో చేసేవారు దక్షిణాయనంలో **ప్రయాణించి** పితృలోకంచేరి ఫలితములనుభవించి, తిరిగి భూలోకంలో ప్రవేశించి

కర్మవలయంలో చిక్కుకుంటారు – వారిని గురించి ఇంతవరకు 10 మంత్రాలలో చెప్పుకున్నాం.

ఇక కోరికల సంతగోల అణగిపోయి, మనస్సు **శాంతించినవారు,** ఆధ్యాత్మిక జ్ఞానాన్ని శాస్త్రాల ద్వారా అందుకొన్న **విద్వాంసులు,** తమయొక్క అవసరాల కోసం ఏమీ ఉంచుకోకుండా, భుక్తి జరగటానికి **భిక్షాటనపై** ఆధారపడి జీవించేవారు; లేదా కోరకుండానే లభించే దానితో జీవనం సాగించేవారు, వానప్రస్థ, సన్యాసాశ్రమములను స్వీకరించి అరణ్యాలలో జీవిస్తూ **తపస్సు, శాస్త్రాధ్యయనం, ఉపాసనచేస్తూ, (భగవంతునిపై విశ్వాసంతో) శ్రద్ధతో** జీవించేవారు, మనస్సులను శుద్ధం చేసుకొన్నవారై, ఇంద్రియములు అధీనములో నున్న వారై, శరీరం వదలగానే, ఉత్తరాయణం ద్వారా ప్రయాణించి బ్రహ్మలోకం చేరుకొని, అక్కడ బ్రహ్మోపదేశాన్ని ఆలకించి, ప్రళయకాలంలో బ్రహ్మతో సహా **అమృతము, అవ్యయము ఐన పరమాత్మ స్వరూపంలో** లయమై పోతారు. దీనినే క్రమముక్తి అంటారు. ఇక వీరికి మరల జన్మ ఉండదు. అయితే **ఈ మార్గంలో కోటానుకోట్ల సంవత్సరాలు** బ్రహ్మలోకంలో ఉండాలి. అక్కడా పరిపూర్ణానందం లభించదు.

ఐతే ఉపనిషత్తులలో చెప్పబడిన **బ్రహ్మవిద్యను** పొందినజ్ఞాని ఈపై రెండు మార్గాలలో ఏ మార్గం గుండా ప్రయాణిస్తాడు? అతడికే మార్గము లేదు. మరణించిన తర్వాత జన్మలేదు. అతనిది సద్యోముక్తి. జీవించి ఉండగానే బ్రహ్మ స్వరూపుడు. అది ఎలా? ఇంతవరకు తిరిగివచ్చే చంద్రమార్గాన్ని, తిరిగిరాని సూర్యమార్గాన్ని చెప్పి ఇక జ్ఞానం ద్వారా అప్పటికప్పుడు సద్యోముక్తిని – జీవమ్ముక్తిపొందే మార్గాన్ని రాబోయే మంత్రంలో అందిస్తున్నాడు ఋషి.

– మోక్షాన్ని కోరుకొనే సాధకుడు ఏమి చేయాలి? 12 మంత్రంలో

మం॥ పరీక్ష్యలోకాన్ కర్మ చితాన్ బ్రహ్మణో
నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన ।
తద్విజ్ఞానార్థం స గురుమేవాభి గచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్టం ॥ (12)

ప్రతి ॥ కర్మచితాన్‌లోకాన్ = కర్మల ద్వారా లభించే లోకాలను; పరీక్ష్య = పరీక్షించిన పిదప; బ్రహ్మణః = బ్రాహ్మణుడు; అకృతః = నిత్యమైనది; కృతేననాస్తి = కర్మల ద్వారా పొందలేమని; నిర్వేదం ఆయాత్ = నిరాశనుపొందునుగాక!; తత్‌విజ్ఞానార్థం = ఆ పరతత్త్వాన్ని తెలుసుకొనుటకు; సః = అతడు; సమిత్పాణి = సమిధలను చేతబట్టుకొని; శ్రోత్రియం = శాస్త్రము తెలిసినవాడు; బ్రహ్మనిష్టం = బ్రహ్మనిష్ఠుడు అయిన; గురుం = గురువును; అభిగచ్ఛేత్ = సమీపించాలి.

భావం : కర్మలద్వారా లభించేలోకాలను పరీక్షించిన పిదప నిత్యమైనది కర్మలద్వారా పొందలేమని గ్రహించిన బ్రాహ్మణుడు (ముముక్షువు) కర్మలపట్ల నిరాశను పొందుతాడు. అప్పుడతను పరతత్త్వాన్ని గ్రహించటానికి సమిధలను చేతబట్టుకొని శ్రోత్రియుడు, బ్రహ్మ నిష్ఠుడు అయిన గురువును సమీపించాలి.

వ్యాఖ్య : కర్మల ద్వారా లభించేలోకాలను పరీక్షించాలి ముముక్షువైనవాడు. కర్మలన్నీ పరిమితమైనవి. యజ్ఞ, దాన, తపస్సులు ఏవైనాసరే, ఎంతటి పుణ్యకర్మలైనా సరే, పరిమితమైనవే. పరిమిత కర్మలు పరిమితానందాన్నిస్తాయేగాని అపరిమితానందాన్నివ్వలేవు.

నిజంగా మానవుడు ఏకర్మలు చేసినా కోరికలయొక్క ప్రేరణ వల్లనే చేస్తాడు. కోరికలన్నీ అజ్ఞానంవల్ల పుట్టేవే. కనుక అజ్ఞానం వల్ల చేస్తున్న సమస్త కర్మలు మనకు అందించేది అజ్ఞానలోకాలనే. అన్ని కర్మలు

సంసారాన్ని అందించేవేగాని నిత్యవస్తువును అందించేవిగావు. పుణ్యకర్మల ద్వారా మనం ఇంద్రలోకం వెళ్ళినా, చంద్రలోకం వెళ్ళినా, పితృలోకం వెళ్ళినా – అక్కడ అనుభవించే ఆనందం **మనోసంబంధమేగాని ఆత్మ సంబంధంకాదు.** అనిత్య ఆనందమేగాని, నిత్యానందంకాదు. ఈ లోకాలలోని ఆనందంకోసం ఎగబడ్డామా లోకేశ్వరుడికి దూరమై పోతాం.

లోకేశ్వరుని పొందాలనుకున్నావా! లోకాలపై ఆసక్తిని, అక్కడ లభించే భోగాలపై ఆసక్తిని పూర్తిగా వదులు.

కనుక ఇక్కడ మనంచేసే పుణ్యకర్మల ద్వారా అంటే యజ్ఞ యాగాదులద్వారా మనం పొందేలోకాలన్నీ నశించిపోయేవేనని, అక్కడి సుఖ భోగాలుకూడా నశించిపోయేవేనని గ్రహించినట్లైతే – నిత్యమైన **పరమాత్మను ఈ కర్మలద్వారా పొందలేమని, పైగా పరమాత్మకు దూరమై పోతామని** తెలుసుకుంటే ఇక ఆ కర్మల జోలికి పోకుండా తటస్థంగా ఉండగలుగుతాం. వాటి పట్ల వైరాగ్యంతో ఉంటాం. గారడీవాడు చూపించే ఇంద్రజాలం వంటి స్వర్గభోగాలపై విరక్తి కలిగి ఉంటాం.

ఇలా వివేకంతో – వైరాగ్యంతో కర్మలు చేయాలనే ఆసక్తిని, అదే జీవితధ్యేయమనే అజ్ఞానాన్ని విడిచిపెట్టిన ముముక్షువు (బ్రాహ్మణుడు) – జ్ఞానాన్ని పొంది తరించాలి.

జ్ఞానం అంటే లేనివస్తువుకాదు. ఉన్నదే. ఉన్నదానిని ఎందుకు తెలుసుకోవాలి? ఉన్నట్లు తెలియదుగనుక; మరిచావు గనుక. **మరచిన విషయము అరచినా అందదు. తరచినా దొరకదు.** మరెలా తెలుస్తుంది? ఇతరులు గుర్తుచేయాలి. ఎవరు గుర్తుచేస్తారు? **గుర్తుచేసే వాడే 'గురుదేవుడు'.**

ఆ గురుదేవుడు ఎలాంటివాడై ఉండాలి? అతడు ముందుగా శాస్త్రాన్ని తెలుసుకొని ఉండాలి. అంటే శ్రోత్రియుడై ఉండాలి. అంటే శ్రుతుల జ్ఞానాన్ని తెలిసి, తెలిసిన జ్ఞానం జీర్ణమై ఉండాలి. అనుభవం ఉండాలి (బ్రహ్మనిష్ఠం).

తాను పొందిన జ్ఞానాన్ని, అనుభవాన్ని శిష్యులయొక్క స్థాయిలోకి దిగివచ్చి వారికి అర్థమయ్యేట్లు చెప్పగలగాలి. కనుక అతడు కరుణా సముద్రుడై ఉండాలి.

అట్టి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైన గురువులను ఆశ్రయించాలి. వారిని సేవించాలి. జ్ఞానాన్ని పొంది తరించాలి.

గురువు యొక్క బోధతో తాను అన్వేషించే సత్యవస్తువు తనకన్న వేరుగాలేదని, తానే ఆ సత్యవస్తువైన ఆత్మనని తెలుస్తుంది. **ఆ ఆత్మానుభూతిలో శిష్యుని నిలిపే గురువు సాక్షాత్తు భగవానుడే.** అట్టి గురువుయొక్క ఋణం తీరేదికాదు, తీర్చేది కాదు. అట్టి గురుదేవుని **ఎలా సమీపించాలో** ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

సమిధలు చేత బట్టుకొని అని. సమిధలు వైరాగ్యాన్ని సూచిస్తాయి. తనలోని **అజ్ఞానము** ఈ సమిధల లాగానే గురుదేవుడు ప్రసాదించే **జ్ఞానాగ్నిలో** దగ్ధం కావాలనేది శిష్యుని భావన.

ఈనాడు గురుశిష్య సాంప్రదాయం మరుగున పడిపోయింది. ఈనాటి శిష్యులు **సమిధలకు బదులు చాడీలు** చేతబట్టుకొని వస్తున్నారు. గురుదేవునిలో **జ్ఞానాగ్నిని** దర్శించటం ఎలాగున్నా ఆయనలో **శోకాగ్నిని** నింపుతున్నారు. గురువు ఎలా ఉండాలో శాసిస్తున్నారు. **వచ్చిన** విషయాన్ని మరచి **పుచ్చిన** విషయాలను గురించి చర్చించుకొంటున్నారు.

గురుదేవుని కృపారసం మనపై చిందించనిచో మనం కృతార్థులవటం జరగదని అంగిరసుడు ఈ మంత్రంలో చెప్పక చెబుతున్నాడు.

గురువును సమీపించేవాడు వైరాగ్యాన్ని, గురుభక్తిని వెంటబెట్టుకొని రావాలి. గురువచనంలో పూర్ణవిశ్వాసం ఉండాలి. ఆలకించిన దానిని ఆచరించాలి. ఆత్మతో అనుసంధానం కావాలి.

అలా తనను సమీపించిన శిష్యుని పట్ల గురువు ఎలా ప్రవర్తించాలి? ఈ ఖండంలోని చివరి మంత్రంలో చెబుతున్నారు.

– యోగ్యత గలిగి సమీపించిన శిష్యునికి గురువు అనుగ్రహించ వలసిన విషయం ఏమిటో 13వ మంత్రంలో.

మం॥ తస్మై సవిద్వాన్ ఉపపన్నాయ సమ్యక్
ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ ।
యే నాక్షరం పురుషం వేద సత్యం
ప్రోవాచతాం తత్త్వతో బ్రహ్మవిద్యాం ॥ (13)

ప్రతి॥ ప్రశాంతచిత్తాయ = ప్రశాంతచిత్తం; శమాన్వితాయ = ఇంద్రియ నిగ్రహము కలిగి; సమ్యక్ = సరైనవిధానంతో; ఉపపన్నాయ = సమీపించిన; తస్మై = అట్టి శిష్యునకు; **స విద్వాన్** = బ్రహ్మవిదుడైన గురువు; యేన = దేనివలన; సత్యం = సత్యస్వరూపము; అక్షరం పురుషం = అక్షరము అయిన పురుషుని; వేద = తెలియగలడో; తాంబ్రహ్మవిద్యాం = అట్టి బ్రహ్మవిద్యను; తత్త్వతఃప్రోవాచ = యదార్థముగా బోధించాలి.

భావం : ప్రశాంతచిత్తము, ఇంద్రియ నిగ్రహముగలిగి, సరైన విధానంతో సమీపించిన శిష్యునకు బ్రహ్మ విదుడైన గురువు సత్యస్వరూపము, అక్షరము అయిన పురుషుని తెలుసుకోగల బ్రహ్మవిద్యను యదార్థముగ బోధించాలి.

వ్యాఖ్య : బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి శిష్యునికి ఉండవలసిన యోగ్యతలు – అట్టి యోగ్యతలున్న శిష్యునికి గురువు అనుగ్రహించ వలసిన విషయమును ఈ మంత్రంలో చెబుతున్నారు.

ఇంద్రియ నిగ్రహము, ప్రశాంతచిత్తము – ఈ రెండూ శిష్యుని కుండవలసిన యోగ్యతలు. నిజంగా రెండూ ఒక్కటే. ఎవరిలో కోరికల సంతగోల తగ్గిపోతుందో వారిలో ఇంద్రియాలన్నీ మనస్సు అధీనంలోనికి వస్తాయి. ఈ ప్రపంచం మీద, ప్రాపంచిక విషయవస్తువుల మీద, లౌకిక భోగముల మీద విరక్తి ఎప్పుడు కలిగిందో అప్పుడు ఇంద్రియాలన్నీ నిర్లిప్తంగా పనిచేస్తుంటాయి. అప్పుడే అంతః కరణం శుద్ధి అవుతుంది. మనస్సు యొక్క పరుగులు ఆగిపోతాయి. కోరికలే మనస్సును అల్లకల్లోలం

చేస్తాయి. కోరికలు అణిగితే మనస్సుశాంతిస్తుంది. బలవంతంగా కోరికలను అణచుకున్నా మనస్సు వికలంగాక తప్పదు. కనుక విషయాలను దోషదృష్టితో చూస్తూ – సుఖాలు స్వప్నతుల్యాలని భావిస్తూ కోరికలను అణచాలి. జ్ఞానార్జనయే ప్రధాన విషయంగా భావించాలి. అప్పుడే జ్ఞానార్జనకు అర్హుడు.

అట్టి అర్హత గలిగిన శిష్యుడు యథావిధిగా దరి చేరినప్పుడు గురువు సత్యము, అక్షరము అయిన బ్రహ్మ జ్ఞానాన్ని బోధించాలి. అంటే అర్హతగల శిష్యుడు అర్థిస్తే **తప్పక బోధించాలి** అని భావం.

శిష్యునికి బ్రహ్మజ్ఞానాన్ని బోధించి, ఆత్మ విద్యను అందించి అతణ్ణి ఆత్మవిదునిగా చేయటమే నిజగురుని కర్తవ్యం.

ఆత్మజ్ఞానాన్ని బోధించకుండా, లేదా బోధించలేక, అమాయకులైన శిష్యుల అమాయకత్వంపై స్వారీచేస్తూ వారిని తన స్వప్రయోజనాల కొరకు ఉపయోగించుకొనే వాడు గురువుకాదు. శిష్యుని పాలిటి శని. కొన్ని సంవత్సరాలు తనచెంత ఉన్నప్పటికీ, తనకు సేవలు చేస్తున్నప్పటికీ, తాను చెప్పినట్లు వేలు, లక్షలు ఖర్చుపెట్టి పనులు చేస్తున్నప్పటికీ అతడికి జ్ఞానాన్ని అందించక – అజ్ఞానంలోనే **ఉంచి** – అందులోనే **ముంచి** గ్రంథాలు ముద్రించి అమ్మించటానికో; ఆశ్రమంలోని కుటీరాలు, మందిరాలు కట్టించటానికో, తననుస్తుతించటానికో ఉపయోగించుకుంటూ వేదాంత ముసుగులు కప్పుకొని తిరిగే గురువులు గోముఖ వ్యాఘ్రూలు – (ఆవు ముఖం తగిలించుకున్న పులులు)

తనను నమ్మి, ఆశ్రయించిన శిష్యుని తనంతటి వానిగ చేయుటకు శ్రమపడుగురువే నిజమైన సద్గురువు. అట్టి గురువు బోధించవలసిన దేమిటి? **అక్షర పరబ్రహ్మ తత్వమునే –**

అంతేగాని రోజూగీతాపారాయణం చేసుకోండి, విష్ణు సహస్రనామం పారాయణ చేసుకోండి, నాగ్రంథాలనే చదవండి. నా ఉపన్యాసాలే వినండి – చక్కగా పూజలు చేసుకోండి, మంచి మంచి ప్రసాదాలు, నైవేద్యాలు పెట్టండి, ఎప్పుడూ యజ్ఞాలు యాగాలు చెయ్యండి, రకరకాల కోర్కెలు

కోరుకోండి; అవన్నీ మీకు తీరుతాయి. భోగభాగ్యాలు కలుగుతాయి, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, ఇష్టకామ్యాలు సిద్ధిస్తాయి అని చెప్పే వారంతా గురువులుకాదు బరువులు. మోయలేని బరువులు.

ఏది తెలిసిన తర్వాత మరియెకటి తెలుసుకోవలసిన అవసరము లేదో అట్టి ఆత్మజ్ఞానాన్ని తెలియజేసి శిష్యుని ఆత్మవిదునిగా మార్చాలి. ఆలామార్చటానికి ప్రయత్నించేవాడే గురువు అనే పదానికి అర్హుడు.

అంతేగాని నేను చెప్పిందే వినండి, ఇంకెవరన్నా చెప్పేవాటిని వినకండి; ఫలానాదేవుణ్ణే పూజించండి, మిగిలిన వారిని ద్వేషించండి. ఎప్పుడూ పారాయణలు చేసుకుంటూ పూజలు చేసుకుంటూ తీర్థాలు క్షేత్రాలు తిరుగుతూ కోరిన కోర్కెలు తీర్చుకుంటూ బ్రతకండి – శాస్త్రాలు చెప్పే సత్యాలను తెలుసుకొని ఆత్మ జ్ఞానులు అవుతారేమో – అదేం అవసరంలేదు. అలా కాకండి – ఎప్పుడూ ఇలాగే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు బ్రతకండి! అని చెప్పకుండానే చెప్పే వారు, అలాంటి స్థితిలో శిష్యులనుంచేవారు గురువులు కాదు – బరువులు. వారు ద్రోహులు, ఆత్మద్రోహులు.

కనుక శాస్త్రాలు చదవండి. ఎంతకష్టమైనా వాటిని తెలుసుకోండి. ఎవరు చెప్పినా వినండి. అన్నింటినీ పరిశీలించి చూసుకోండి. మోక్షాన్ని లక్ష్యంగా పెట్టుకోండి. శాస్త్రాలలో మోక్షానికి మార్గం ఏమని చెప్పారో తెలుసుకోండి. ఆ విధంగా నడుచుకోండి. అనవసరమైన డాంబికాలకు పోకండి. అహంకారంతో అజ్ఞానాన్ని కౌగలించుకోకండి – ఇదే జన్మ సార్థకం చేసుకోవాలనుకున్న మోక్షార్థులు చేయాల్సింది.

ఇక మనం పొందవలసిన ఆత్మజ్ఞానం ఏదో – బ్రహ్మవిద్య ఏదో– రెండవ ముండకంలో ప్రారంభంచేయబోతున్నాడు..... తెలుసుకోండి–



ద్వితీయ ముండకం

ప్రథమ ఖండం

అంగిరస మహర్షిని ఆశ్రయించిన శౌనకుడు "దేనిని తెలుసుకోవటం వల్ల సమస్త జ్ఞానము తెలియబడుతుందో అట్టి జ్ఞానాన్ని తెలియజేయమని ప్రార్థించాడు. దానితో అంగిరసుడు – అసలు తెలుసుకోవలసిన విద్యలు 2 ఉన్నాయని; అవి 1. అపరావిద్య – 2. పరావిద్య అనియు. **అపరావిద్య అనగా** నాలుగువేదాలు; శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం అనే వేదాంగాలు అనీ, పరావిద్య అనగా అక్షర పరబ్రహ్మాన్ని అందించే విద్య అనీ తెలిపి; ముందుగా అపరావిద్యను గురించిబోధించాడు.

ఈ సృష్ఠి అంతా ఆ అక్షర పరబ్రహ్మము నుండే ఉద్భవించినదని, సృష్ఠి కర్తయైన బ్రహ్మదేవునిచే అంతయు సృష్టింపబడినదనియు చెప్పి; యజ్ఞయాగాది క్రతువులనెలా చేయాలో – తీసుకోవలసిన జాగ్రత్తలేవో, వాటి వలన లభించే స్వర్గ భోగము లేవో తెలియజేసి; వాటిని సక్రమంగా నిర్వర్తించకపోతే కలిగే ఫలితములేవో కూడా తెలియజేశారు.

ఈ అపరమైన కర్మలు తాత్కాలికంగా సుఖభోగాలనందిస్తాయేగాని శాశ్వతమైన శ్రేయస్సును కలిగించలేవని; అజ్ఞానంలో చరించేవారు, మందమతులు మాత్రమే ఈ కర్మలను శ్రేయోమార్గంగా భావించి స్వర్గాది లోకములలో భోగాలు అనుభవించి తిరిగి క్రిందికి జారి ఈ లోకంలోగాని, ఇంతకన్న హీనలోకంలోగాని ప్రవేశిస్తారు అని తెలియజేశారు.

విద్వాంసులు, శాంతమనస్కులు మాత్రమే అవ్యయుడైన పరమాత్మ స్థానాన్ని చేరుకుంటారు అని తెలియజేశారు.

పుణ్యకర్మల ద్వారా ఎటువంటి ఫలితాలు కలుగుతాయో,

ఎలాంటిలోకాలకు వెళతారో వాటిని జాగ్రత్తగా పరీక్షించిన తర్వాత – కర్మలద్వారా లభించేది నిత్యమైనది గాదని – కనుక కర్మలను త్యజించి – విడిచిపెట్టి, పరతత్త్వమును పొందటానికి – పరావిద్యను తెలుసుకొనుటకు, విద్యాంసులు – సమిధలు చేతబట్టుకొని శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువును సమీపించాలి. అలా సమీపించిన శిష్యునికి ఆచార్యుడు అక్షర విద్యయైన బ్రహ్మవిద్యను – బ్రహ్మజ్ఞానాన్ని బోధించాలని చెబుతూ ప్రథమ ముండకాన్ని ముగించాడు.

కనుక ఈ ముండకంలో పరావిద్యను గురించి – మోక్షప్రాప్తిని కల్గించే బ్రహ్మవిద్యను గురించి చెప్పబోతున్నాడు.

ముందుగా ఇక్కడ కనిపించే ఈ జగత్తు – ఈ జీవులు అంటే మానవులు, పశుపక్ష్యాదులు, క్రిమి కీటకాలు, జడవస్తువులు – ఇవి అన్నీ కూడా ఎవరినుండి పుడుతున్నాయో అటువంటి కారణస్వరూపమైన పుట్టుకస్థానాన్ని గురించి బోధను ప్రారంభిస్తున్నాడు.

ఈ జగత్తు కార్యము. దీనికి కారణమేమిటి? అదే అక్షర పరబ్రహ్మము. కారణాన్ని తెలుసుకుంటే కార్యం కూడా తెలిసిపోతుంది. అందుకే కారణమైన అక్షర పరబ్రహ్మాన్ని తెలుసుకొనే మార్గాన్ని, జ్ఞానాన్ని బోధిస్తున్నాడు.



ద్వితీయ ముండకం

ప్రథమ ఖండం

– ఈ జగత్తు, జీవుళ్ళు ఎక్కడనుండి వస్తున్నాయో; ఈ కనిపించే కార్యానికి కారణం ఏమిటో మొదటి మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥ తదేతత్ సత్యం యథా సుదీప్తాత్ పావకాద్
విస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపాః ।
తథాక్షరాత్ వివిధాః సోమ్య భావాః
ప్రజాయంతే తత్ర చైవాపి యంతి ॥ (1)

ప్రతి : సౌమ్య = ఓ సౌమ్యుడా!; తదేతత్ సత్యం = ఇదే సత్యము; సుదీప్తాత్ పావకాత్ = జ్వలించు అగ్నినుండి; యథా = ఏప్రకారంగా; సరూపాః విస్ఫులింగాః = అలాంటివే అయిన నిప్పురవ్వలు; సహస్రశః ప్రభవంతే = వేలకోద్దీ జనిస్తాయో; తథా = అలాగే; అక్షరాత్ = ఆ అక్షర పరబ్రహ్మనుండి; వివిధాః భావాః = అనేకరకాల జీవులు; ప్రజాయంతే = పుట్టుకొస్తున్నాయి; అపి = మరల; తత్ర ఏవ యంతి = అక్కడికే చేరతాయి.

భావం : ఓ సౌమ్యుడా! ఇదియే సత్యము. జ్వలించే అగ్నినుండి ఏ ప్రకారంగా అలాంటివే అయిన నిప్పురవ్వలు వేలకొద్దీ జనిస్తాయో, అలాగే అక్షర పరబ్రహ్మ నుండి అనేక విధాలైన జీవులు ఉద్భవిస్తాయి. మరల అక్కడికే చేరతాయి.

వ్యాఖ్య : జ్వలిస్తున్న అగ్నినుండి ఎలాగైతే నిప్పురవ్వలు పైకిలేచి వస్తుంటాయో – అలాగే ఈ సమస్త జగత్తు – అన్ని లోకాలు – అందరుజీవులు కూడా అక్షరుడైన ఆ పరబ్రహ్మము నుండి – ఆ పరమాత్మ నుండే వస్తున్నారు.

అగ్నినుండి వేరయిన నిప్పురవ్వలు అగ్నికన్న వేరైనవా? కాదు. అగ్ని

జ్వాలలో ఉన్నది అగ్నియే – నిప్పురవ్వలలో ఉన్నదీ అగ్నే – ఇక్కడ నిప్పురవ్వలు కార్యం – జ్వలిస్తున్న అగ్ని కారణం. ఆ కారణం నుండే ఈ కార్యం వస్తున్నది. కార్యములో నున్న తత్వమేదో – అదే కారణంలో ఉన్నది. అలా ఉన్నది గనుకనే అది కార్యములోనికి వచ్చినది.

అలాగే నీటి బుడగలు కార్యం. నీరేమో కారణం. కారణంలో ఉన్న నీరే కార్యములోనూ ఉన్నది.

కనుక అసలైన కారణం తెలిస్తే కార్యము కూడా తెలిసినట్లే. కారణమునకు సంబంధించిన జ్ఞానం ఏది ఉందో. అది కార్యమునకు సంబంధించిన జ్ఞానం కూడా. కనుక కార్యకారణాల మధ్య భేదం లేదు.

మట్టి కుండలో ఉన్నది మట్టియే. కుండతయారు కావటానికి మట్టి ఏమీ వికారం చెందలేదు. కుండతయారైనందున మట్టికి నష్టమూలేదు. అలాగే కుండ పగిలినా కూడా మట్టికి ఏ నష్టమూ లేదు. పారమార్థికంగా మట్టి – కుండ, రెండూ ఒక్కటే. అలాగే జగత్తు – అక్షర పరబ్రహ్మ ఒక్కటే.

అసలు ఉన్నది ఒక్కటే. అదే అనేక విధాలుగా కనబడుతున్నది. కనుక ఆ ఉన్న ఒకే ఒక్క వస్తువుకు సంబంధించిన జ్ఞానం కలిగితే అన్ని వస్తువుల మధ్య భేదం కాస్తా నశించిపోయి అన్నింటియొక్క జ్ఞానమూ కలుగుతుంది. అన్నింటిని ఒకే విధంగా చూడగలుగుతాం.

నిప్పు రవ్వలో ఉన్నది నిప్పు తత్వమేగాని వేరుగాదు. పరిమితమైన నిప్పురవ్వ అపరిమితమైన జ్వలిస్తున్న అగ్నినుండి వచ్చినదే. అలా వచ్చినా అదినిప్పుగానే ఉన్నది. తనలోని పరిమితరూపం నశించగానే మళ్ళీ అది నిప్పే అవుతున్నది.

నిప్పేగాదు. ఉప్పూ అంతే. పరిమితమైన ఉప్పు – అపరిమితమైన సముద్రం నుండే వచ్చినది. అది ఎక్కడెక్కడ తిరిగినా చివరకు అది సముద్ర రూపమైన నీటిని చేరగానే తన పరిమితరూపాన్ని కోల్పోయి అపరిమిత

తత్వంగానే మిగిలి పోతుంది. అయితే సముద్రంనుండి వేరు పడిన ఉప్పుగల్లు మళ్ళీ సముద్రరూప నీటిని చేరుకొనేదాకా దానికి తిప్పలు తప్పవు. పరిమితరూపంలో తిప్పలు, కష్టాలు పడాలి. ఆ అపరిమిత తత్వంతో కలిసి పోయావా? ఇక ఏ బాధలు లేవు.

అలాగే జీవులమైన మనం ఎక్కడినుండి వచ్చాము? ఆ ఆపరిమిత తత్వమైన అక్షర పరబ్రహ్మం నుండే. మరి మనమో పరిమితం. మనం ఎక్కడెక్కడ తిరిగినా – ఎన్నెన్ని శరీరాలు ధరించినా – ఏఏలోకాలకు వెళ్ళినా – ఏఏ భోగాలు అనుభవించినా – ఏఏ కర్మలు చేసినా – ఏఏ దుఃఖాలు – సుఖాలు పొందినా ఈ అక్షర పరబ్రహ్మంలోనే తిరిగి తిరిగి చివరకు ఇందులోనే – అపరిమిత తత్వంలోనే కలిసి పోవాలి. పరమాత్మతో కలిసిపోవాలి. అప్పటిదాకా తిప్పలు తప్పవు.

కనుక మనం పరమాత్మనుండి వచ్చాం. పరమాత్మలోనే ఉంటాం. చివరకు మనప్రత్యేకతను – వ్యక్తిత్వాన్ని – పరిమితత్వాన్ని వదులుకోగానే ఆ పరమాత్మలోనే లయమైపోతాం. ఆ పరమాత్మ తత్వంగానే మిగిలిపోతాం.

పరమాత్మనుండి వచ్చినది చివరికి ఎప్పటికో అప్పటికి ఆ పరమాత్మలో కలిసిపోవాల్సిందే.

మట్టి నుండి వచ్చిన కుండ మట్టి కావాల్సిందే

బంగారం నుండి వచ్చిన ఆభరణాలు బంగారం కావాల్సిందే.

నీటి నుండి వచ్చిన బుడగలు నీరు కావాల్సిందే.

సముద్రం నుండి వచ్చిన ఉప్పు చివరకు సముద్రాకారంగా మారాల్సిందే – అలాగే – పరమాత్మ నుండి వచ్చిన జీవులు **పరమాత్మలోకలవాల్సిందే**. అసలు ఉన్నది కారణం ఒక్కటే – అందులోనుండి వచ్చిన కార్యములు భిన్న బిన్నముగా కనిపించినా వానిలో ఉన్న అసలైనతత్వం **కారణమే.** అది తెలిసిందా – కార్యముల

భిన్నత్వమూపోతుంది – అసలు కార్యములే అదృశ్యమై **కారణమే** మిగులుతుంది. తదేతత్ సత్యం : ఇదియే సత్యము అని అంగిరసుడు తెలియజేస్తున్నాడీ మంత్రంలో–

– సత్యమైన ఆ అక్షరతత్త్వం ఎలాంటిదో 2వ మంత్రంలో

మం॥ దివ్యో హ్య మూర్తః పురుషః
స బాహ్యాభ్యంతరో హ్యజః।
అప్రాణో హ్యమనాః శుభ్రో
హ్యక్షరాత్ పరతః పరః ॥ (2)

ప్రతి॥ దివ్యః = స్వయం ప్రకాశమైనది; అమూర్తః = ఆకారములేనిది, అజః = పుట్టుకలేనిది; శుభ్రః = శుద్ధమైనది; పురుషః = పురుషుడు; స బాహ్యాభ్యంతరః = వెలుపలలోపల ఉండువాడై; అప్రాణో అమనాః = నిజంగా ప్రాణంలేనిది, మనస్సులేనిది; అక్షరాత్ = అక్షరంకన్న ; పరతః పరః = శ్రేష్టమైనది.

భావం : స్వయం ప్రకాశము, నిరాకారము, పుట్టుకలేనిది; విశుద్ధము, సర్వ వ్యాపకము అయిన పురుషుడు వెలుపలలోపల ఉండువాడై, మనోప్రాణములు లేని వాడై అక్షరస్వరూపము కన్న శ్రేష్ఠుడై యున్నాడు.

వ్యాఖ్య : సమస్త భూతాల పుట్టుకకు కారణమైన ఆ సత్యతత్వం – పరబ్రహ్మతత్వం – అక్షరతత్వం ఎలాంటిదో ఈ మంత్రంలో అంగిరసుడు తెలియజేస్తున్నాడు.

1. అది **స్వప్రకాశ చైతన్యం.** అంటే స్వయంప్రకాశం. ఈలోకంలో అన్నింటిని ప్రకాశింపజేసేది – పగలు సూర్యుడు – రాత్రి చంద్రుడు, నక్షత్రాలు, దీపం. ఏ వస్తువును చూడాలన్నా చీకటిలో కంటికి కనిపించదు. వెలుగున్నప్పుడే కనిపిస్తుంది. అయితే ఆ వెలుగును చూడటానికి మరొక

వెలుగు ఏం కావాలి? ఏం అక్కరలేదు. కనుక సూర్యుడు, నక్షత్రాలు – ఇవి స్వయంప్రకాశాలు అంటాం. అయితే నిజంగా ఆ సూర్యునికి ఆ స్వయం ప్రకాశం ఎలావచ్చింది? దానిని వెలిగించే ఒక చైతన్యం – ఒకగొప్ప ప్రకాశం అంతర్యామిగా ఆ సూర్యునిలో ఉన్నది. అదే స్వప్రకాశచైతన్యం. అంతేకాదు ఈ జగత్తును తెలుసుకోటానికి మనలో ప్రకాశం ఉండాలి – చైతన్యంఉండాలి. చైతన్యం లేనివాడు జగత్తును తెలుసుకోలేడు. కనుక చైతన్యం మనలోనూ ఉన్నది; ఈ జగత్తును వెలిగించే సూర్యచంద్ర నక్షత్రాలలోను ఉన్నది. అదే అన్నింటిని ప్రకాశింపజేస్తుంది. దానిని ప్రకాశింపజేసేది మరొకటేదీలేదు. అది అంతటా ఉండి – ఎప్పుడూ ఉండి ప్రకాశింపజేసే చైతన్యం గనుక అది స్వప్రకాశం.

ఇదే విషయాన్ని **'జ్యోతిర్బిందూపనిషత్తు'** తెలియజేస్తున్నది "స్వయం జ్యోతిర్బహ్మ నిరంజనం" అని – నిరంజనమైన బ్రహ్మ స్వరూప **'స్వప్రకాశచైతన్యం – స్వయంజ్యోతి'** – అనిభావం – అలాగే **'బ్రహ్మరహస్యోపనిషత్తు'** ఈ అక్షర పరబ్రహ్మతత్వాన్ని **"స్వయం ప్రకాశం పరంజ్యోతి రనంతం జ్యోతిః స్వరూపం" --** పరబ్రహ్మం స్వయంప్రకాశం –అది పరంజ్యోతి స్వరూపం – అనంతజ్యోతి స్వరూపం – అని తెలియజేస్తున్నది.

అలాగే భగవద్గీత 13వ అధ్యాయం క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగంలో క్షేత్రజ్ఞ పురుషుని వర్ణిస్తూ "జ్యోతిషామపి తత్ జ్యోతిః" ఆత్మ అనేది వెలుగులకు వెలుగులాంటిది అని తెలియజేయటం జరిగింది.

2. స్వయం ప్రకాశమైన ఈ ఆత్మచైతన్యం **నిరాకారం.** అంటే ఒక ఆకారం లేనిది అని తెలియజేస్తున్నారు ఉపనిషద్ గురువు. పరమాత్మకు ఒక ఆకారంలేదు. ఆకారం ఉన్నదీ అంటే అదిస్థూలం అవుతుంది. స్థూలమయినవన్నీ నశించిపోతాయి. పరమాత్మ స్థూలంకాదు. సూక్ష్మం – సూక్ష్మాతి సూక్ష్మం. ఏ విధంగాను దానిని చింతించ వీలులేదు. నిర్దేశించి చెప్పే వీలులేదు. సూక్ష్మాతి సూక్ష్మం గనుక అది ఆకాశంలా అంతటా వ్యాపించియుంటుంది. దానికి నశింపులేదు.

"నిరాకార ఆత్మా దేహత్రయాత్ పంచకోశేభ్యశ్చా పరః" – "నిరాకారమైన ఆత్మ స్థూల, సూక్ష్మ, కారణదేహాలకు, పంచకోశాలకు వేరుగానున్నది" అని **'అద్వైతామృతోపనిషత్తు'** చెబుతున్నది.

3. స్వయం ప్రకాశము – నిరాకారము అయిన ఆత్మ **అజము** అని చెప్పబడుతున్నది. అజము అంటే పుట్టుక లేనిది అని. పుట్టుక ఉంటే నశింపుకూడా ఉంటుంది. ఆత్మ ఎప్పటికీ నశించేదికాదు. అది అవినాశి కనుక పుట్టుక ఉండే వీలులేదు. అందుకే 'అజం' అన్నారు.

తాను పుట్టదుగాని పుట్టేవాటన్నింటికీ అదే ఆధారమై బీజస్థానమై ఉన్నది. ప్రాణులన్నీ దానినుండే పుట్టి, దాని ఆధారంగానే ఉండి, దానిలోనే లీనమై పోతూ ఉంటాయి.

"అనాద్యనంత బ్రహ్మోహం అమృతా2వినాశి బ్రహ్మోహం" "ఆదిలేని అంతంలేని బ్రహ్మమును నేనే. అమృతరూపమై ఎన్నటికీ నశించని బ్రహ్మమును నేనే". అని **'బ్రహ్మానుభవ ఉపనిషత్తు'** తెలియజేస్తున్నది. కనుక నేనేబ్రహ్మమును – బ్రహ్మము అవినాశి. అనాది – అజం – అమృతం.

4. స్వప్రకాశము, నిరాకారము, అజము అని ఇప్పటివరకు చెప్పబడిన బ్రహ్మము **విశుద్ధమై** యున్నది. విశుద్ధం అంటే చాలా శుద్ధమైనది. ఏవిధంగాను మలిన పడనిది. అందులో మరొకదానిని కలిపి కల్మషం చేసేవీలు లేనిది. ఎందుకంటే ఆత్మ ఏకం. అద్వితీయం – అద్వయం. ఉన్నది అదొక్కటే. రెండవదేదీలేదు. రెండవదేదీ లేనప్పుడు ఇక దానిలో మరొకటి కలసి కల్మషమయ్యే అవకాశం ఎక్కడున్నది? కనుకనే అది విశుద్ధం. కనుక మలినము లంటే ప్రసక్తే లేదు.

"ఆత్మ జ్యోతిరేవ విశుద్ధం" 'ఆత్మ జ్యోతివలె విశుద్ధమైనది' – అని **"స్వరూప బోధోపనిషత్తు'** తెలియజేస్తున్నది –

5. స్వప్రకాశం, నిరాకారం, అజం, విశుద్ధం అని చెప్పబడ్డ ఆత్మ సర్వవ్యాపకమై వెలుపలా – లోపలా అంతటా ప్రకాశిస్తూ ఉన్నది అంటున్నారు. ఆత్మ సర్వవ్యాపకం. అది అంతటాఉన్నది. అంతటా అంటే స్థూల జడవస్తువులలోను, ప్రాణికోట్లలోను – అన్నింటిలోను ఉన్నది. అది లేనిచోటు లేదు. కనుకనే బయటాలోపలా అనే ప్రసక్తే రాదు. మనం ఉపాధుల దృష్ఠితో చూస్తున్నాం గనుక – దేహాన్ని చూస్తున్నాం గనుక దేహంలోపల వెలుపల అంటున్నాం.

'ఆకాశం కుండలోపల – వెలుపల ఉన్నది' అంటాం. అంటే లోపల – వెలుపల ఆకాశం ఉన్నది గాని కుండ పెంకులో లేదు. కాని ఆత్మ అలాగాదు. ఆ పెంకులో కూడా ఉన్నది.

"బహిరంతశ్చోర్ధ్వం చ పురశ్చ" – బయట, లోపల, పైన, క్రింద ఉన్నదని; **"సర్వతో వ్యాప్యతిష్ఠతి" –** సర్వత్రా వ్యాపించియున్నది – అని **'అద్వైతామృతోపనిషత్తు'** తెలియజేస్తున్నది.

అలాగే **"తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః"** అది ఈ అంతటికీ లోపల ఉన్నది. అదినిజంగా ఈ అంతటికీ బయట ఉన్నది అని '**ఈశావాస్యోపనిషత్తు**' చెబుతున్నది.

"బహిరంతశ్చ భూతానాం" అది ఈ ప్రాణులన్నింటికి వెలుపల, లోపల ఉన్నదని భగవద్గీత తెలియజేస్తున్నది. అంతర్బహిశ్చయత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః అని మంత్ర పుష్పం చెబుతున్నది.

6. ఆత్మకు మనస్సులేదు. ప్రాణములేదు. మనస్సు అంటే అలోచనలు. ఆత్మకు నెరవేర్చవలసిన కర్తవ్యాలుగాని, తీర్చుకోవలసిన కోరికలుగాని లేవు. కనుక ఆలోచించేపనిలేదు. కనుక మనస్సులేదు. ప్రాణం అంటే కదలికను కలిగించేది. కదలికలన్నీ ప్రాణులకేగాని ఆత్మకు కదలాల్సిన

పనిలేదు. – మనస్సు – ప్రాణాలు – ఇవి పరిమితమైనవి. ఒక ప్రదేశానికో – ఒక కాలానికో పరిమితమైన మనోప్రాణాలు దేశకాలాతీతమైన ఆత్మ చైతన్యానికి అవసరంలేదు. మనోప్రాణాలు కదలికలు కలిగినవి. ఆత్మ కదలికలేనిది. అది ప్రజ్ఞాన ఘనం. అసలు మనస్సును ప్రాణాలను కదిలించేది ఆ చైతన్యమే.

“కేనేషితం పతతి ప్రేషితం మనః కేనఃప్రాణః ప్రథమః ప్రైతియుక్తః ” “దేనిచేత కోరబడి మనస్సు విషయవస్తువులపై పడుతున్నది? దేనిచేత ప్రేరేపించబడి ప్రాణం మొదట ఈ దేహంలోనికి వచ్చినది?” – అని **‘కేనోపనిషత్తు’లో** ఈ మనః ప్రాణాల కదలికకు మూలకారణం ఆత్మచైతన్యమేనని తెలియజేయబడింది. మనస్సును ప్రాణాన్ని కదిలించే ఆత్మకు మనస్సు లేదు. ప్రాణమూలేదు.

7. మనస్సు ప్రాణమూలేని ఆ చైతన్యము అక్షరమునకు వేరైనది, దానికన్నా శ్రేష్ఠమైనది అని తెలియజేస్తున్నారు.

ఒకదాన్ని అక్షరము అన్నామంటే మరొకటిక్షరం ఉండి తీరాలి. ఒకటి నశించేది ఉంటేనే మరొకదాన్ని నశించనిది అంటాం. ఒకటి కనిపిస్తుంటేనే మరొకదాన్ని కనిపించనిది అంటాం.

మరి చైతన్యం అనేది నిజంగా ఒక్కటే. అది ఏకం. పోల్చిచూడటానికి మరొకటి లేదు. కనుకదాన్ని అక్షరం అని ఎలా అంటాం? అది క్షర – అక్షరాలకు వేరైనది. ఆ రెంటికీ అతీతమైనది. ఆ రెండింటి కన్న శ్రేష్ఠమైనది. అక్షరాతీతమైనది. అవ్యక్తాతీతమైనది.

ఆత్మ చైతన్యం ఇలా విశిష్ఠమైనది. వర్ణించటానికి వీలులేనిది. మరొక వస్తువుతో పోల్చటానికి వీలులేనిది. అయినా ఎలాగోలా అర్థం చేసుకోవటానికే ఈ లక్షణాలు.

– శుద్ధ చైతన్యం నుండి ఏమేమి వచ్చి జగత్తు వ్యక్త మౌతున్నది?

మం॥ ఏతస్మాత్ జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణిచ ।
ఖం వాయుర్జ్యోతి రాపః పృధివీ విశ్వస్య ధారిణీ ॥(3)

ప్రతి॥ ఏతస్మాత్ = దానినుండి; ప్రాణః = ప్రాణము; మనః = మనస్సు; సర్వేంద్రియాణి = అన్ని ఇంద్రియాలు; ఖంవాయుః జ్యోతి; ఆపః = ఆకాశం, వాయువు, అగ్ని, నీరు; చ= మరియు విశ్వస్యధారిణీ పృధివీ = సర్వమునకు ఆధారమైన భూమి; జాయతే = పుడుతున్నాయి.

భావం : దాని నుండి (పరబ్రహ్మము నుండి) ప్రాణము, మనస్సు, సర్వేంద్రియములు, ఆకాశము, వాయువు, అగ్ని, నీరు మరియు సర్వానికి ఆధారమైన భూమి అన్నీ పుడుతున్నాయి.

వ్యాఖ్య : శుద్ధచైతన్యం నుండి పంచ భూతములు, పది ఇంద్రియములు, ప్రాణము, మనస్సు – అనే 17 తత్వములు ఆవిర్భవిస్తున్నవి. నిజంగా ఇక్కడ 17 తత్వాలను చెప్పినా – వాటిని విడమర్చినప్పుడు అవి 24 తత్వాలు అని తెలుస్తుంది. పంచభూతాలు 5; జ్ఞానేంద్రియాలు 5, కర్మేంద్రియాలు 5, ప్రాణాలు 5; అంతః కరణములు – మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనేవి 4. మొత్తం 24 తత్వాలు – సృష్ఠి మొత్తం ఈ 24 తత్వాలతోనే నిండి యున్నది. ఈ 24 తత్వాలూ పరమాత్మ నుండే వస్తున్నవి.

ఈ 24 తత్వాలతోనే జగత్తు జీవుళ్ళు ఏర్పడుతున్నారు. ఈ 24 తత్వాలను తెలుసుకుంటున్న దెవరు? ఆ చైతన్యమే. మనలోని చైతన్యమే. **ఏ శుద్ధ చైతన్యం నుండి ఈ 24 తత్వాలు ఆవిర్భవిస్తున్నవో ఆ శుద్ధ చైతన్యమే విషయాలతో తాదాత్మ్యం చెంది విషయ చైతన్యమై ఈ మొత్తాన్ని తెలుసుకుంటున్నది.**

కనుక నామరూపాలతో కూడిన ఈ జగత్తు మొత్తం కూడా శుద్ధ చైతన్యం మీదనే ఆధారపడి ఉన్నది.

మం॥ "అంతః కరణస్య యోనిః తధా

ప్రాణేంద్రియ శరీరాణాం అస్యచ జగతః॥"

"అంతః కరణమునకు, ప్రాణమునకు, ఇంద్రియాలకు, శరీరానికి – ఈ జగత్తున కంతటికి జన్మస్థానం ఆ శుద్ధచైతన్యమే" – నని **'శివజ్ఞానామృతోపనిషత్తు'** తెలియజేస్తున్నది.

కనుక పైన పేర్కొన్న 24 తత్త్వములు చైతన్యము నందే పుట్టి, చైతన్యము నందే కనిపించి, చైతన్యమునందే అంతరించి పోతున్నవి. అంటే నామరూపాలతో కూడిన ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయాలు ఆ పరమాత్మలోనే. కనుక సత్యవస్తువు – ఎప్పుడూ ఉండే వస్తువు ఆ పరమాత్మ ఒక్కటే. ఆ శుద్ధ చైతన్యం ఒక్కటే. మరి ఉన్నది ఆ శుద్ధచైతన్య మొక్కటే అయితే ఈనామ రూపాల మాట ఏమిటి?

"యదేతత్ నామ రూపాత్మకం జగత్

తదాభాస మాత్రం"

నామ రూపాలతో కూడిన ఈ జగత్తు అంతా ఆభాస, మాయ, మిధ్య, భ్రాంతి మాత్రమే నని వేదం తెలియజేస్తున్నది.

అంటే ఉన్న సత్య వస్తువే భ్రాంతిలో – భ్రమలో వేరొక విధంగా కనిపిస్తున్నది.

శుద్ధ చైతన్యమైన ఆపరమాత్మయే వ్యక్తస్వరూపంగా ఉన్నప్పుడు జగత్తులాగా వ్యక్తమౌతున్నాడు –

త్రాడు చీకటిలో – భ్రమలో పాముగా కనిపిస్తున్నది. ఆ పాము పుట్టింది త్రాడునుండే – ఉన్నది త్రాడులోనే – చీకటి తొలగటంతో అది అదృశ్యమయ్యేదీ ఆ త్రాడులోనే. అసలు నిజంగా ఉన్నది త్రాడు మాత్రమే. పాము అనేది మిధ్య. ఆ పాము కూడా త్రాడే.

అలాగే **అజ్ఞానంలో పరమాత్మయే జగత్తులాగా భాసిస్తున్నది.** జగత్తు పరమాత్మలోనే పుట్టి, ఉండి. అంతమగుచున్నది. **అసలు నిజంగా ఉన్నది పరమాత్మే. జగత్తు మిథ్యయే. అసలాజగత్తు నిజంగా పరమాత్మయే –**

– జగత్తు పరమాత్మే అయితే ఈ జగత్తు యొక్క స్వరూపం తెలుసుకుంటే అది పరమాత్మ స్వరూపమే గదా!

మం॥ అగ్ని ర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ
దిశః శ్రోత్రే వాగ్ వివృతాశ్చ వేదాః।
వాయుః ప్రాణోహృదయం విశ్వమస్య
పద్భ్యాం పృధివీ హ్యేష సర్వభూతాంతరాత్మా ॥(4)

ప్రతి॥ అస్య = ఆ పరమాత్మకు; అగ్నిఃమూర్ధాః = దేవలోకమే శిరస్సు; చంద్రసూర్యౌచక్షుషీ = సూర్యచంద్రులు కన్నులు ; దిశఃశ్రోత్రే = దిక్కులుచెవులు; వేదాః వివృతాఃవాక్ = వేదాలే తెరువబడిననోళ్ళు; వాయుః ప్రాణః = వాయువేప్రాణం; విశ్వంహృదయం = ప్రపంచం హృదయం; పద్భ్యాం పృధివీ = పాదాలనుండి భూమి ఉద్భవించినది; ఏషః సర్వభూతాంతరాత్మా= ఇదియే సర్వభూతాంతరాత్మ.

భావం : ఆ పరమాత్మకు దేవలోకమే శిరస్సు; సూర్యచంద్రులే నేత్రములు; దిక్కులే చెవులు; వేదములే తెరచియున్న నోళ్ళు. గాలియే ప్రాణము. విశ్వమే హృదయము. అతడి పాదాలనుండే భూమి వచ్చింది. ఇదే సర్వభూతాంతరాత్మ. పరమాత్మయే విశ్వరూపంగా – జగత్తురూపంగా వ్యక్తమవుతుంటే ఆ పరమాత్మ రూపం – **విశ్వరూపం** ఎలా ఉంటుంది?

వ్యాఖ్య : ఈ మంత్రంలో విరాట్ రూపాన్ని – విశ్వరూపాన్ని వర్ణిస్తున్నారు. జగత్తు మొత్తాన్ని ఒక పురుషరూపంలో వర్ణిస్తున్నారు. ఈ జగత్తుయొక్క రూపాన్ని బట్టి జగత్తుకు ఆధారమై – అధిష్టానమైన పరమాత్మను

అర్థంచేసుకోవాలి. **అంటే కార్యాన్ని పరిశీలించటం ద్వారా కారణాన్ని అవగతం చేసుకోవటమే ఇందులోని అంతర్యం.**

విశ్వరూపాన్ని - విరాట్ రూపాన్ని పరిమితమైన మనో బుద్ధులు దర్శించలేవు గనుక ఒక వ్యక్తి యొక్క రూపాన్ని జగత్తులో ఆరోపిస్తున్నారు.

పైన దేవలోకం నుండి – క్రింది భూమి వరకు; అన్ని దిక్కులు, అన్ని వస్తువులు, సమస్త భూతాలు **అన్నీ కూడా ఆ శుద్ధచైతన్యమేనని నిరూపించుటయే ఇందలి ముఖ్య ఉద్దేశము.** వేదాంతములో అసలు విషయాన్ని అవగాహన చేసుకొనటం కష్టం గనుక – అట్టి అవగాహనకు అందని విషయాన్ని మనకు బాగా తెలిసిన - పరిచయం ఉన్న విషయంద్వారా తెలియజేయటం జరుగుతుంది. అందుకే ఒక మనిషిగా విరాట్ రూపాన్ని వర్ణిస్తున్నారు. తల, కళ్ళు, చెవులు, నోరు, హృదయము, పాదాలు - ఇలా విరాట్ రూప వర్ణనసాగిందీ మంత్రంలో.

మానవుని శిరస్సు దేహంపై భాగంలో ఉంటుంది గనుక **పైన ఉండే దేవలోకాన్ని** విరాట్ పురుషుని శిరస్సుగా వర్ణించారు. కంటికి అదిష్టాన దేవత సూర్యుడు. **వెలుగు ఉన్నప్పుడే కన్ను వస్తువులను చూడగలుగుతుంది. అందుకే సూర్య చంద్రులను కళ్ళుగా వర్ణించారు. చెవికి అధిష్టానం ఆకాశం.** శబ్దం వినిపించేది ఖాళీప్రదేశం ఉంటేనే. **అందుకే దిక్కులు చెవులుగా** వర్ణించారు. నోటిద్వారా మాట్లాడుతాం. **వేదాలు వాక్‌రూపం గనుక వేదములు నోళ్ళుగా వర్ణించారు. మానవునికి ప్రాణం గాలియే.** బయట నున్నగాలియే లోపల ప్రాణవాయువు - ప్రాణం. అది ఉచ్ఛ్వాసనిశ్వాసములచే నిలబెట్టబడుతుంది. అందుకే గాలిని ప్రాణంగా వర్ణించారు. ఈ విశ్వం ఎంతో విశాలమైనది. హృదయం కూడా విశాలమైనదే. అందుకే విశ్వాన్ని హృదయం అని వర్ణించారు. శరీరానికి పాదాలు ఆధారం. ఈ జగత్తుకు భూమి ఆధారం. అందుకే విరాట్ రూపం యొక్కపాదాలు భూమిగా వర్ణించబడ్డాయి.

'పాదోస్య విశ్వ భూతాని' అని పురుషసూక్తం తెలియజేస్తుంది.

ఇది సర్వ భూతాంతరాత్మ. సమస్త భూతాలలోను వ్యాపించియున్న అంతరాత్మయే ఇది. అంటే అంతటా ఉన్న శుద్ధ చైతన్యమే అన్ని ప్రాణులలోను ఉన్నది. అన్ని ప్రాణులలో నున్నది ఒకే చైతన్యమైతే మరి అందరూ ఒకే విధంగా కనిపించటంలేదేం? అందరి బుద్ధి ఒకే విధంగా లేదేం? ఇది వారి వారి అంతః కరణంలోని దోషం వల్లనే. ఒకే సూర్యబింబం వెనుక వైపున ఎర్రరంగు పూసిన అద్దంలో ఒకరకంగాను, పూయని అద్దంలో మరొక విధంగాను; మసిబారిన అద్దంలో మరొకరకంగాను; నీటిలో ఒక రకంగాను, నేలమీద మరోరకంగాను పడుతుంది. ఇదంతా సూర్యునిలో దోషంకాదు. అలాగే ఎట్టి గుణాలతో కూడిన వాసనలలో ప్రతిఫలిస్తే – చైతన్యం అట్టి గుణాలతో కూడియున్నట్లే ఉంటుంది. కాని నిజంగా చైతన్యం ఒక్కటే కనుక అది సర్వభూతాంతరాత్మ. (ఏ రంగుసీసాలో పోస్తే ఒకే ద్రవం **ఆ రంగు**లోనే కనిపిస్తుంది.)

"ఏకోదేవః సర్వ భూతేషు గూఢః
సర్వవ్యాపీ సర్వ భూతాంత రాత్మ"। శ్వేతాశ్వతరోపనిషత్తు (అ 6–11)

– ఒక్కడే అయిన భగవంతుడు అన్ని ప్రాణులలోను దాగి ఉన్నాడు. అతడు సర్వవ్యాపి. అన్ని ప్రాణులకు అంతర్యామి – అని చెబుతున్నది.

"అంగుష్ఠ మాత్రః పురుషోఽ౦తరాత్మా
సదా జనానాం హృదయే సన్నివిష్టః"।

"బొటనవ్రేలి పరిమాణంతో అంతరాత్మయైన శుద్ధచైతన్యం ఎల్లప్పుడూ సమస్త ప్రాణుల హృదయాలలో నివశిస్తుంది." –

అని శ్వేతాశ్వతరోపనిషత్తు (అ. 3–13) తెలియజేస్తున్నది. ఇలా సర్వభూతాంతరాత్మ అయిన ఆ శుద్ధ చైతన్య తత్వం నుండి జీవులు ఎలా ఆవిర్భవించినవో – ఆ సృష్టిక్రమమును రాబోవు మంత్రంలో వివరించబోతున్నాడు–

– ఆ పరమాత్మ నుండి జీవులు ఎలా ఆవిర్భవించినవో – ఆ సృష్టి క్రమాన్ని ఈ **5వ మంత్రంలో చెబుతున్నారు.**

మం॥ తస్మాదగ్నిః సమిధో యస్య సూర్యః

సోమాత్ పర్జన్యః ఓషధయః పృధివ్యాం।

పుమాన్ రేతః సించతి యోషితాయాం

బహ్వీ ప్రజాః పురుషాత్ సంప్రసూతాః ॥ (5)

ప్రతి॥ తస్మాత్ = దానినుండి; సూర్యః = సూర్యుడు; సమిధః = సమిధగా; అగ్నిః = దేవలోకం; సోమాత్ = చంద్రునినుండి; పర్జన్యః = వర్షమేఘాలు; యస్య = దాని నుండి; పృధివ్యాం ఓషధయః = భూమిపై ఓషధులు ; పుమాన్ = పురుషుడు; యోషితాయాం = స్త్రీయందు; రేతః సించతి = రేతస్సును వదులుతాడు; పురుషాత్ = పురుషుని నుండి; బహ్వీప్రజాః = వివిధ జీవులు; సంప్రసూతా = జనిస్తున్నాయి.

భావం : దానినుండి సూర్యుడే సమిధగా గల మొదటి అగ్నియైన **దేవలోకం,** చంద్రుని నుండి **వర్షమేఘాలు,** మేఘముల వర్షం వల్ల భూమిపై **ఓషధులు,** వానినుండి **పురుషుడు,** ఆ పురుషుడు **స్త్రీయందు** రేతః పాతం చేయగా దానినుండి ఎన్నో జీవులు ఉద్భవిస్తాయి.

వ్యాఖ్య : శుద్ధచైతన్యం ఒక్కటే. అది సర్వవ్యాపి. అంతటా ఉన్నది. దానినుండే అనేక జీవులు ఉద్భవిస్తున్నాయి. ఎలా ఉద్భవిస్తున్నాయి? ఈ క్రమాన్ని తెలియజేసే విద్యను **'పంచాగ్నివిద్య'** అన్నారు. ఇది ఛాందోగ్యోపనిషత్తులో వివరించబడి ఉన్నది. అనాదిగా ఈ విద్య క్షత్రియుల వద్దనే ఉన్నది. మొట్ట మొదటివాడుగా బ్రాహ్మణుడైన **గౌతమ మహర్షి** ఈ విద్యను ఛాందోగ్యోపనిషత్తునందు అభ్యసించాడు.

ఒకే పరమాత్మ తత్వం నుండి – శుద్ధచైతన్యం నుండి అనేక జీవులు ఎలా ఉద్భవించాయో ఈ మంత్రంలో తెలియజేశారు.

చైతన్యం నుండి మొదటగావచ్చినది దేవలోకం. ఈదేవలోకం రావటానికి ఒక సమిధకావాలి. ఆ సమిధయే సూర్యుడు. మండుతున్న అగ్ని నుండి నిప్పురవ్వలు వచ్చేది సమిధలు వేస్తేనే - అలాగే కోటిసూర్యసమప్రభా కాంతివంతమైన **ఆ శుద్ధ చైతన్యంలో సూర్యుడనే సమిధవల్ల దేవలోకం వచ్చింది.** ఆకాశాన్ని సూర్యుడు ఎలా ప్రకాశింపజేస్తున్నాడో అలాగే దేవలోకాన్ని ప్రకాశింపజేసే వెలుగు ఆత్మ వెలుగు - ఆత్మ ప్రకాశం - ఆత్మ సూర్యుడు. ఈ దేవలోకమే **మొదటి అగ్ని -** (యజ్ఞకార్యాలు చేసిన జీవులు చేరేది ఈ లోకమే)

ఈ దేవలోకంలో ఉన్న చంద్రునివల్ల వర్షమేఘాలు కలుగుతాయి. ఇది **రెండవ అగ్ని.** (దేవలోకంలోని జీవులు భోగానుభవం పూర్తయినతర్వాత మేఘాలరూపంలో వర్షిస్తారు.)

మేఘాలు వర్షించటం వల్ల భూమి మీద పంటలు పండుతాయి. చెట్లు - ఓషధులు - (ధాన్యం - పప్పులు మొ॥) మొలకెత్తుతాయి. ఈ ఓషధులే **మూడవ అగ్ని.** (ఆ జీవులు వర్ష రూపంలో నేలపైకొచ్చి ఓషధుల రూపంలో భూమినుండి ఉద్భవిస్తారు)

ఈ ఓషధులను - ఆహారాన్ని భుజిస్తూ ఉండే పురుషునిలో రేతస్సు (వీర్యం) తయారవుతుంది. ఇలా ఓషధుల ద్వారా రేతస్సును తయారుచేసుకొనే పురుషుడే **నాల్గవ అగ్ని.**

ఈ పురుషుడు స్త్రీతో కలియటం ద్వారా రేతస్సును స్త్రీ గర్భంలో నిక్షిప్తం చేస్తాడు. ఇలా వీర్యాన్ని గ్రహించే స్త్రీ **ఐదవ అగ్ని.**

ఇలా స్త్రీ గర్భంలో ప్రవేశించిన రేతస్సు నుండి ఒక జీవకణం - **జీవుడున్న వీర్యకణం** స్త్రీ గర్భంలోని అండంతో కలిసి పిండం ఏర్పడుతుంది. ఆ పిండం క్రమక్రమంగా పెరిగి పెద్దదై పూర్ణ జీవుడుగా వెలుపలికి వస్తాడు. ఈ విధంగా సకల జీవరాసులు ఉద్భవిస్తాయి. **కనుక సకల జీవరాసులకు మూల కారణం ఆ పరమాత్మ చైతన్యమే. ఇదే పంచాగ్ని విద్య.**

ఇక్కడ చాలావరకు జీవులు ఈ విధంగా ఉద్భవించినప్పటికి **స్వేదజాలు, ఉద్భిజాలు, అండజాలు** కూడా ఉన్నాయి. అండజాలు కూడా పై విధంగానే పంచాగ్ని విద్యకు చెందినవే. ఇక సూక్ష్మ జీవులు, చెట్లు చేమలు – మరొక విధంగా ఆ శుద్ధ చైతన్యం నుండే ఉద్భవిస్తున్నాయి.

వివిధ రకములైన సూక్ష్మ వస్తువులు, స్థూలవస్తువులు, సూక్ష్మజీవులు, స్థూలజీవులు, భూతములు, సముద్రాలు, పర్వతాలు అన్నీ ఆ శుద్ధ చైతన్యమునుండే వస్తున్నాయని రాబోయే 4 మంత్రాలలో వివరించబోతున్నాడు.

– పరతత్త్వం నుండి ఇలా ఉద్భవించిన జీవుల యొక్క మనుగడకు అవసరమైన విషయాలు ఉద్భవించిన వైనాన్ని 6వ మంత్రంలో –

మం॥ తస్మా దృచః సామయజూంషి దీక్షా
యజ్ఞాశ్చ సర్వే క్రతవో దక్షిణాశ్చ ।
సంవత్సరశ్చ యజమానశ్చ లోకాః
సోమోయత్ర పవతే యత్ర సూర్యః ॥ (6)

ప్రతి॥ తస్మాత్ = దాని నుండి; ఋచః = ఋక్కులూ; సామః = సామగానాలు; యజూంషి = యజస్సులు; దీక్షా = వ్రతదీక్షలు; యజ్ఞాశ్చ = యజ్ఞములు; సర్వేక్రతవః = అన్నిక్రతువులు; దక్షిణాః = దక్షిణలు; సంవత్సరః = సంవత్సరం; యజమానః = యజమాని; యత్రసోమో యత్రసూర్యః పవతేలోకాః = సూర్యచంద్రులు పవిత్రం చేసే లోకాలు జనించాయి.

భావం : దానినుండే వేదఋక్కులు, సామగానాలు, యజ్ఞవిధులు (యజస్సులు), వ్రతదీక్షలు, యజ్ఞములు, అన్ని క్రతువులు, యజ్ఞదక్షిణలు, యజ్ఞసమయము, యజమాని, సూర్యచంద్రులు పవిత్రం చేసే లోకాలు పుడుతున్నాయి.

వ్యాఖ్య : పంచాగ్ని విద్య ద్వారా పరతత్వం నుండి జీవులు ఎలా ఉద్భవించారో తెలియజేశారు క్రిందటి మంత్రంలో. ఆ జీవుల యొక్క మనుగడకు అవసరమైనవి కూడా ఆ పరతత్వంనుండే ఉద్భవించినవని ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

జీవులు ఈ లోకంలోనికి వచ్చినతర్వాత వారు వారి వారి **కర్మ ఫలాలననుభవిస్తూ పురుషార్థ సాధనకు ప్రయత్నం చేయాలి.** మానవులకు పురుషార్థాలేమిటి? **ధర్మ, అర్థ, కామ, మోక్షములు.** మానవులందరి అంతిమ పురుషార్థం – పరమలక్ష్యం – **మోక్షం.** అయితే జీవించినంతకాలం ఈ దేహాన్ని పోషించుకోవాలి. మనస్సులో కలిగే కోరికలను తీర్చుకోవాలి. అదే **కామం.** అలా కోర్కెలు తీర్చుకోవాలంటే పనిచేయాలి, డబ్బు సంపాదించాలి. అదే **అర్థం.** అయితే కోరికలుగాని, కోరికలు తీర్చుకొనుటకు చేసే పనులుగాని ఎలాంటి పనులై యుండాలి? **ధర్మం** తప్పనివై యుండాలి. ధర్మం తప్పకుండా అర్థకామాలను పొందిన వాడే **మోక్షానికి** అర్హుడు.

ఇలా ధర్మ పద్ధతిలో చేసే కర్మలనే **యజ్ఞకర్మలు (త్యాగపూర్వకమైనకర్మలు)** అంటారు. అంతటా భగవంతుడున్నాడని – ఆయనను ఆశ్రయించి మనం జీవనం సాగించాలని తెలుసుకోవాలి. అందుకే **వేదాలు.** వేద అంటే తెలుసుకొనుట. ఆ వేదాలు అపౌరుషేయాలు. ఎవరూ తయారు చేసినవికాదు. వ్రాసినవికాదు. అవి **శ్రుతులు.** అంటే విన్నవి. ఎవరువిన్నారు? ఎవరు చెప్పారు? విన్నది ప్రగాఢ ధ్యాన నిష్ఠాగరిష్ఠులైన ఋషిపుంగవులు. చెప్పినది సర్వభూతాంతరాత్మ అయిన ఆ పరమాత్మ. కనుక ఆ పరమాత్మ నుండే **వేద ఋక్కులు** ముందు వచ్చినవి. ఆ తర్వాత గానయోగ్యమైన **సామగానాలు.** ఆ తర్వాత యజుస్సులు (యజ్ఞయాగాలు పూజా పునస్కారాలు) ఉద్భవించినవి.

ఇవి కోరిన కొర్కెలు తీర్చుకొనుటకు – ఈ లోకంలో సుఖంగా జీవించటానికి – మానవ మనుగడకు అవసరమైనవి.

కేవలం కోరిన కోర్కెలు తీర్చుకొనుటయేగాక అంతః కరణ శుద్ధికావాలి; అప్పుడే పరమాత్మ వైపుకు తిరిగేది. ఆ అంతఃకరణ శుద్ధికై **వ్రతదీక్షలు; యజ్ఞయాగాలు, క్రతువులు** మొ॥ అనేక కర్మలు ఉద్భవించినవి. యజ్ఞం అంటే త్యాగం అని అర్ధం. త్యాగం లేని యజ్ఞం వ్యర్థం. అందుకే ఫలత్యాగాన్ని సూచించే **యజ్ఞదక్షిణలు** తెలియజేయబడినవి. త్యాగబుద్ధి వల్ల పరమాత్మతో సన్నిహితత్వం కలుగుతుంది. ఆ తరువాత సంవత్సరం – యజ్ఞసమయం ఆవిర్భవించినది. యజ్ఞ సమయంలో యజ్ఞ విధిని నిర్వహించేయజమాని లేదా యజ్ఞకర్త ఉద్భవించాడు. ఇలా ఆవిర్భవించిన జగత్తును, జగత్తులోని జీవుళ్ళను పగటి కాలంలో **సూర్యుడు,** రాత్రికాలంలో **చంద్రుడు** ప్రకాశింపచేస్తూ ఈలోకాలను – ఈ క్షేత్రాలను ప్రకాశింపజేయుచున్నారు.

సూర్య చంద్రులు పావనంచేసే **అన్నిలోకాలు** కూడా ఆ పరతత్వం నుండే ఉద్భవించాయి. లోకాలంటే అనుభవ క్షేత్రాలు.

ఈ విధంగా **జీవుళ్ళ కొరకు** లోకాలు – అంటే **అనుభవ క్షేత్రాలు ఉద్భవించాయి.** జీవుళ్ళకు అనుభవ క్షేత్రం ఏమిటి? **జీవునికి దేహం అనుభవక్షేత్రం.** కనుక ఇదొకలోకం.

ఇంకా సృష్ఠిలోని ఏఏవిషయాలు ఆ చైతన్యం నుండి కదిలి వచ్చాయో తరువాత మంత్రంలో.....

– పరతత్త్వం నుండి ఇంకా ఏఏవిషయాలు ఉత్పన్న మవుతున్నాయో 7వ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥ తస్మాచ్చ దేవా బహుధా సంప్రసూతాః

సాధ్యా మనుష్యాః పశవో వయాంసి।

ప్రాణా పానౌ వ్రీహియవౌ తపశ్చ

శ్రద్ధాసత్యం బ్రహ్మ చర్యం విధిశ్చ ॥ (7)

ప్రతి॥ తస్మాత్ = దానినుండి; బహుధాదేవాః = అనేక మంది దేవతలు; సాధ్యా = సాధ్యులు; మనుష్యాః = మనుష్యులు; పశవః = పశువులు; వయాంసి = పక్షులు; ప్రాణాపానౌ = ప్రాణ అపానవాయువులు; చ = ఇంకా; వ్రీహియవౌ = వరి, యవధాన్యములు; తపః = తపస్సు; శ్రద్ధా = శ్రద్ధ ; సత్యం = సత్యమూ; బ్రహ్మాచర్యం = బ్రహ్మాచర్యమూ; విధిఃచ = విధులుకూడా; సంప్రసూతః = జనించినవి.

భావం : దానినుండి వివిధ దేవతలు, సాధ్యులు, మనుష్యులు, పశువులు, పక్షులు, ప్రాణ అపానవాయువులు, **వరి, యవ** ధాన్యములు, తపస్సు, శ్రద్ధ, సత్యము, బ్రహ్మ చర్యము, విధులు అన్నీ జనించినవి.

వ్యాఖ్య : అంగిరసుడు సృష్టి క్రమాన్ని కొనసాగిస్తున్నాడు. ఇక్కడి మానవులు పురుషార్థం చేస్తూ జీవిస్తారు. వారిలో కొందరు క్రిందటి మంత్రంలో చెప్పిన విధంగా యజ్ఞయాగాది క్రతువులు, వ్రతదీక్షలు, పుణ్య కర్మలు చేస్తారు. ఆ పుణ్య కర్మలఫలంగా వారు దివ్యలోకాలలో – స్వర్గలోకం, పితృలోకం, చంద్రలోకం, సూర్యలోకం మొ॥ వానిలో ప్రవేశించే **దేవతలుగాను సాధ్యులుగాను** ఉద్భవిస్తారు.

అలాగే పుణ్యపాపకర్మలను – మిశ్రమ కర్మలను చేసినవారు సుఖ దుఃఖాదుల ననుభవించటానికి వీలుగా **మానవులుగా** జన్మిస్తారు. ఎవరైతే నీచకర్మలు చేస్తారో వారు **పశుపక్ష్యాది** నీచయోనులందు జన్మించి కర్మఫలాలు అనుభవిస్తారు. ఇలా దేవతలు – సాధ్యులు – మానవులు – పశువులు – పక్షులు వచ్చినవి.

ఇక మనుష్యులు, పశు పక్ష్యాదులు జీవనం సాగించటానికి **ప్రాణ - ఆపాన వాయువులు** పుట్టినవి. ప్రాణ సంచారము జరిగి వారు శక్తివంతులై జీవించటానికి - కర్మలు చేయటానికి కావలసిన (ఆహారం) **వరి, యవధాన్యములు -** ఆహారం సృష్ఠించబడింది.

ఈ ఆహారాన్ని స్వీకరించిన మనుష్యులు ఆహారం ద్వారా శక్తినిపొంది - ఆ శక్తితో సత్యాన్వేషణ చేస్తారు. పరమాత్మ కొరకు అన్వేషణ చేస్తారు. **అదే తపస్సు.**

తపస్సు ద్వారా సత్ఫలితాలను పొందాలంటే **శ్రద్ధ** అవసరం కనుక శ్రద్ధ - విశ్వాసం కలిగింది. తపశ్శాలురైన వారు మాట్లాడేది **సత్యాన్ని,** ఆచరించేది **బ్రహ్మచర్యాన్ని.** శ్రద్ధతో తపస్సు చేసేవారు - సత్యభాషణం చేస్తూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ వారి **విధులు** నిర్వర్తిస్తారు. మానవులకు అందరికీ కొన్ని **విధినిషేధాలు** శాస్త్రాలలో పేర్కొనబడ్డాయి. విధులు అంటే తప్పకచేయవలసినవి. నిషేధాలు అంటే చేయకూడనివి. **ఇలా దైనందిన** జీవితంలో చేయవలసిన విధులు - చేయకూడని నిషేధాలు - అన్నీ కూడా ఆ పరతత్వం నుండే ఉద్భవించినవని ఋషి తెలియజేస్తున్నాడు.

జీవుళ్ళు, వారు అవలంబించే ఉత్తమ విలువలు - అన్నీకూడ సృష్ఠిక్రమంలో ఉద్భవించినవే.

ఇంతవరకూ సృష్ఠిక్రమాన్ని చక్కగా వివరించిన అంగిరస మహర్షి రాబోవు మంత్రంలో సప్త సంఖ్యద్వారా వివిధలోకాలను, ఇంద్రియ విషయాలను, ప్రాణక్రియలను, తెలియజేయబోతున్నారు.

మం॥ సప్త ప్రాణాః ప్రభవంతి తస్మాత్
సప్తార్చిషః సమిధః సప్తహోమాః ।
సప్త ఇమేలోకాః యేషు చరంతి ప్రాణా
గుహాశయా నిహితాః సప్త సప్త ॥ **(8)**

ప్రతి॥ తస్మాత్ = దాని నుండి, సప్తప్రాణాః = సప్తప్రాణాలు; సప్త ఆర్చిషః = ఏడు జ్వాలలు; సమిధః = సమిధలు; సప్తహోమాః = ఏడుహోమాలు; గుహాశయా నిహితాః = హృద్గుహలో ఉంటూ; ప్రాణాః చరంతి = ప్రాణశక్తులు సంచరించే, సప్త సప్తలోకాః = ఏడేడు లోకాలు; ప్రభవంతి = పుడుతున్నాయి.

భావం : దానినుండి సప్త ప్రాణాలు, సప్తజ్వాలలు, సప్త సమిధలు, సప్తహోమాలు (ఆహూతులు), హృదయగుహలో ఉంటూ, ప్రాణశక్తులు సంచరించే ఏడేడులోకాలు అన్నీ పుట్టినవి.

వ్యాఖ్య : 1. ఆ పరతత్వం నుండి 7 ప్రాణాలు ఉద్భవించినవి. **ప్రాణాలంటే ఇంద్రియాలే.** శిరస్సులోని 7 ఇంద్రియాలే సప్తప్రాణాలు. **రెండు కళ్ళు, రెండు చెవులు, 2 ముక్కురంధ్రాలు, నోరు. మొత్తం 7.**

2. జ్వాలలు అంటే ఇంద్రియాలయొక్క గ్రహణ శక్తులు

చూడటం కన్ను యొక్క గ్రహణ శక్తి.

వినటం చెవి యొక్క గ్రహణ శక్తి.

వాసన చూడటం ముక్కు యొక్క గ్రహణశక్తి.

రుచి చూడటం నోటియొక్క గ్రహణశక్తి. ఈ గ్రహణశక్తులే జ్వాలలు.

3. **సమిధలు** అంటే ఇంద్రియవిషయాలు. సమిధలు వేస్తే అగ్ని చెలరేగుతుంది. ఇంద్రియ విషయాలను చూస్తే (గ్రహిస్తే) ఇంద్రియాలు చెలరేగుతాయి. అందుకే ఇంద్రియవిషయాలను సమిధలు అన్నారు.

దృశ్యాలు – రూపాలు కంటిని పురికొల్పుతాయి.

శబ్దాలు – మాటలు చెవిని పురికొల్పుతాయి.

వాసన – గంధం – ముక్కును పురికొల్పుతుంది.

రుచి – (నోటిని) నాలుకను పురికొల్పుతుంది.

(ఇంద్రియాలు 7 అయినా ఇంద్రియ విషయాలు మాత్రం నాలుగే. మరి సప్త సమిధలెలా అయినవి?

కన్ను బాహ్య దృశ్యాలను చూస్తుంది. తనశరీరాన్ని చూస్తుంది.

చెవి బాహ్య శబ్దాలు వింటుంది. తనలోని శబ్దాలను వింటుంది.

ముక్కు బయటివస్తువుల వాసనచూస్తుంది. తన శరీర గంధాన్నీ చూస్తుంది.

నోరు మాత్రం బాహ్యవస్తువుల రుచినేచెబుతుంది. తన రుచిని చెప్పదు. ఇలా - మొత్తం 7 సమిధలు)

4. **ఆహుతులు అంటే** ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో కలిసినప్పుడు కలిగే **జ్ఞానమే.** విషయజ్ఞానమే. హోమగుండంలో వేసిన ఆహుతులు అగ్నికి ఆహుతై హోమగుండంలోనే భస్మమైపోతాయి. అలాగే విషయజ్ఞానము మనస్సులో అనుభూతిగా అంతర్లీనమై పోతుంది. జ్ఞాపకంగా ఉండి పోతుంది.

ఉదా : (కన్ను తాజ్‌మహల్‌ను చూచింది. ఇది విషయ జ్ఞానం. ఇది జ్ఞాపకంగా ఉండి పోతుంది).

5. సప్తలోకాలు అంటే నాడీ కేంద్రాలు. మూలధారం - స్వాధిష్ఠానం - మణిపూరం - అనాహతం - విశుద్ధం - ఆజ్ఞ - సహస్రారం

ఈనాడీ కేంద్రాలు సరిగ్గా పనిచేస్తేనే ఇంద్రియాలు సరిగ్గా పనిచేస్తాయి. ఆ కేంద్రాలు పనిచేయక పోతే ఈ ఇంద్రియాలు మూలనబడిపోతాయి. నాడీకేంద్రాల ప్రమేయంతోనే ఇంద్రియాలు వాటిపనులు అవి నిర్వర్తిస్తూ ఉంటాయి. ఈ నాడీ కేంద్రాలనే లోకాలు అన్నారు బాగానే ఉంది. ఇవి హృదయ గుహలో ఉంటూ ప్రాణశక్తులు సంచరించే లోకాలు అన్నారు. ఇదేమిటి? ఈ ప్రాణశక్తులు జాగ్రదావస్థలోను, స్వప్నావస్థలోను సంచరిస్తూ ఇంద్రియాలను పనిచేయిస్తూ ఉంటాయి. ఇక సుషుప్తి అవస్థలో ఇవి హృదయస్థానంలో లయిస్తాయి. కనుక **హృద్గుహలో** ఉంటూ ప్రాణశక్తులు సంచరించే **ఏడులోకాలు అన్నారు వీటిని.**

- ఇంతవరకు సృష్టిక్రమాన్ని చెప్పిన అంగిరసుడు ఇక సముద్రాలు, పర్వతాలు, నదులు, ఓషధులు కూడా ఆ పరతత్వం నుండే వచ్చినవని ఇక్కడ తెలియజేస్తున్నాడు.

మం॥ అతః సముద్రా గిరయశ్చ సర్వే
అస్మాత్ స్యందంతే సింధవః సర్వరూపాః ।
అతశ్చ సర్వా ఓషధయో రసశ్చ
యేనైష భూతై స్తిష్టతే హ్యంతరాత్మా ॥ (9)

ప్రతి॥ అతః = దానినుండే; సర్వేసముద్రా = అన్ని సముద్రాలు; గిరయః = పర్వతాలు; సర్వరూపాసింధవః = అన్నివిధాలైన నదులు; అస్మాత్ స్యందంతే = దానినుండే ప్రవహిస్తున్నాయి. అతఃచ = దానినుండే; సర్వాఓషధయో = అన్ని ఓషధులు; రసఃచ = రసములు కూడా; యేన = దేనివల్ల ; ఏష అంతరాత్మ = ఈ సూక్ష్మశరీరము; భూతైః తిష్టతే = పంచభూతములచేత ఆవరించబడినదో (ఆ ఓషధులు కూడా దానినుండే)

భావం : దాని నుండే అన్ని సముద్రాలు, పర్వతాలు వచ్చాయి. అన్నినదులు దాని నుండే ప్రవహిస్తున్నాయి. దానినుండే అన్ని ఓషధులు, రసములు. పంచభూతాలచే అవరించబడ్డ స్థూల, సూక్ష్మశరీరాలు ఓషధుల రసాలచేత సంభవించినవి.

వ్యాఖ్య : ఆ పరతత్వం నుండే అపరిమిత జలాలతో కూడిన **సముద్రాలు** ఆవిర్భవించాయి. సూర్యరశ్మి వల్ల ఈ సముద్రజలాలు వేడెక్కి ఆవిరిగా మారి ఆకాశంలో మేఘాలై చరిస్తుంటాయి. అవి చల్లబడి వర్షించటానికి వాటికి అడ్డుగా **పర్వతాలుండాలి.** అలా అడ్డుకోబడిన మేఘాలు వర్షించి కొండలలో, పర్వతాలలో, అరణ్యాలలో పడి ఆ నీరు ప్రవహించి **నదులుగా** మారుతాయి. అనేక నదులు ఇలా పర్వతాలలో పుట్టి భూమిపై - పల్లెలు - పట్టణాలు - అరణ్యాలగుండా ప్రవహించి చివరకు పుట్టిన చోటైన ఆ

సముద్రంలోనే కలిసిపోతాయి. అయితే ఈలోగా ఆ నదుల నీరు అనేక పంటపొలాలకు చేరి చెట్లు, వృక్షములు, సస్యములు, **ఓషధులు** మొలకెత్తటానికి దోహదం చేస్తాయి.

ఈ ఓషధులవల్ల – సస్యాలవల్ల – ఫలాలవల్ల మానవుని **స్థూలదేహం పోషించబడుతుంది.** ఈ స్థూలదేహం **పంచభూతాల** (యొక్క పంచీకరణ) **తో తయారై ఈ ఓషధులు, రసాలచేత పోషించబడుతున్నది.** ఈ స్థూల శరీరం సూక్ష్మ శరీరాన్ని కప్పిఉంచుతుంది. సూక్ష్మ శరీరంనుండి వచ్చే ఆజ్ఞలను స్వీకరించి స్థూలశరీరం ఈ లోకంలో కర్మలు చేస్తుంది. స్థూల శరీరం ఇలా కర్మలు చేస్తే ఆ కర్మల వల్ల కర్మఫలాలు వస్తాయి. ఆ కర్మఫలాలు వాసనలుగా సూక్ష్మశరీరంలో ముద్రించబడి ఉంటాయి.

స్థూల సూక్ష్మ శరీరాలు రెండూ కలసి ఉంటే బ్రతుకు – ఆ రెండూ గనక విడిపోతే అదే చావు.

ఇంతవరకు ఆ పరతత్వం నుండి ఏమేమి వచ్చాయో – సృష్టిక్రమం మొత్తాన్ని వివరించిన అంగిరస మహర్షి, ఈ మంత్రంతో ముగించి – దేనినుండి సృష్ఠి ఆవిర్భ వించినదో ఆ పరతత్వం బయట ఎక్కడో లేదని; అది ప్రతి వ్యక్తియొక్క హృదయ గుహలో నిండియున్నదని రాబోవు మంత్రంలో తెలియజేసి ఈ ద్వితీయముండకంలోని ప్రథమ ఖండాన్ని ముగించబోతున్నాడు.

– శిష్యుని ప్రశ్నకు, గురువుయొక్క సూటి సమాధానం.

మం॥ పురుష ఏవేదం విశ్వం కర్మ
తపోబ్రహ్మ పరామృతం ।
ఏ తద్యోవేద నిహితం గుహాయాం
సోఽ విద్యా గ్రంధిం వికిరతీహ సోమ్య॥ (10)

ప్రతి॥ ఇదం విశ్వం = ఈ విశ్వం; కర్మతపః పురుష ఏవ = యజ్ఞకర్మ, తపస్సు, పురుషుడే; గుహాయాం = హృదయగుహలో; నిహితం = నిండియున్న; పరామృతం = శ్రేష్టము అమృతము అయిన; బ్రహ్మ = బ్రహ్మమేఇది; ఏతత్‌యోవేద = దీనిని ఎవరు తెలుసుకుంటారో; సః = అతడు; అవిద్యాగ్రంథిం= అజ్ఞానగ్రంథిని; ఇహ = ఇక్కడే; వికిరతి = ఛేదిస్తాడు.

భావం : ఈ విశ్వం, కర్మ, తపస్సు పురుషుడే. హృదయ గుహలో నిండియున్న శ్రేష్టము, అమృతము అయిన బ్రహ్మమే ఇది. ఎవరు దీనిని తెలుసుకుంటారో అతడే అవిద్యా గ్రంథిని ఛేదించగలుగుతాడు.

వ్యాఖ్య : ఈ ఉపనిషత్తు ప్రారంభంలో ఉత్తమ గృహస్థుడైన శిష్యుడు శౌనకుడు తన గురువుఐన అంగిరసుని సమీపించి ఇలా అన్నాడు.

"కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి."

'ఓ మహాత్మా! దేనిని తెలుసుకొనుట చేత ఈ సమస్తము తెలియబడినది అవుతుంది' అని.

ఆ ప్రశ్నకు సమాధానంగానే ఇక్కడ తెలుసుకోవలసింది శ్రేష్ఠము అమృతమునైన ఆ బ్రహ్మమునే. ఆ బ్రహ్మము **నీ హృదయగుహలోనే ఉన్నదని తెలుసుకుంటే ఇక నీకు అన్నీ తెలిసినట్లే –** నీ అజ్ఞానం తొలగినట్లేనని తెలియజేశాడు.

అయితే ఈ సమాధానం అప్పుడే చెప్పి ఉండవచ్చుగదా! ఇప్పటి దాకా సాగదీసి సాగదీసి చెప్పడమెందుకు?

అప్పుడేచెబితే అపార్థం చేసుకొనే అవకాశం ఉంది. అన్నీ సందేహాలే మిగిలిపోతాయి. శిష్యుని యొక్క మానసిక పరిపక్వతను బట్టి జ్ఞానబోధ చేసేవాడే సద్గురువు. శిష్యుడు గృహస్తుడు. పైగా అతడు లౌకిక కార్యాలను

కర్తవ్యంగా భావించి చేస్తూండేవాడు. ఆ కర్మలలో ఒకటిగా కష్టాలను, **దుఃఖాలను తొలగించుకొనుటకు; ఆనందాన్ని పొందుటకు ఏదైనా ఉపాయం ఉందేమో తెలుసుకుందామని భావించినవాడు.** కనుకనే అతడికి అపర – పర అనే రెండు విద్యలున్నాయని; **అపరావిద్య** అంటే నాలుగు వేదాలు, ఆరు వేదాంగములు అని; **పరావిద్య** అంటే అక్షర పరబ్రహ్మమును అందించే విద్యయని; ఈ పరావిద్యయే అజ్ఞానమాలిన్యాన్ని తొలగించి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించి ఆత్మ సాక్షాత్కారానికి తోడ్పడుతుందని తెలియజేసి ముందుగా అపరావిద్యను గురించి బోధించాడు. ఈ అపరావిద్య ప్రత్యక్షంగా ఆత్మ సాక్షాత్కారానికి ఉపయోగించక పోయినా పరోక్షంగా సహకరిస్తుంది గనుక దానిని తెలియజేశాడు. శిష్యుని యొక్క మానసిక స్థాయిని పెంచి బుద్ధిని సూక్ష్మం చేయటానికి ఉపయోగ పడే అపరావిద్యను తెలియజేశాడు. ఈ సమస్త సృష్టి ఆ పరబ్రహ్మమునుండే వచ్చినదని సృష్టిక్రమాన్ని వివరించి, **ఈ లోకంలో ఆచరించవలసిన యజ్ఞకర్మలను వివరించాడు. వాటి యొక్క విధివిధానాలను తెలిపి వాటిద్వారా అందుకొనే లోకాలను తెలియజేసి – కర్మల ద్వారా లభించేలోకాలను పరీక్షించి నిత్యమైనది కర్మలద్వారా పొందలేమని గ్రహించి ముముక్షువైనవాడు పరతత్వాన్ని గ్రహించుటకు సమిధలను చేత బట్టుకొని శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడు ఐన గురువును సమీపించి ఆయనను సేవించి – అనుగ్రహాన్ని పొంది బ్రహ్మవిద్యను – బ్రహ్మజ్ఞానాన్ని పొందాలని తెలియజేశాడు.**

ఇప్పుడు శిష్యుని మానసిక స్థాయి ఉన్నతంగా ఉన్నది గనుక బ్రహ్మ **విద్యను బోధిస్తున్నాడు. ఈ విశ్వంలో అంతటా పాలలో వెన్నలాగా – నువ్వులలో నూనెలాగా ఆ పరమాత్మ ఉన్నాదని – ఈ కనిపించేదంతా ఆపరమాత్మయొక్క సత్తాయేనని తెల్పి – నామరూపాలతో కూడిన ఈ జగత్తులో నామరూపరహితుడైన ఆ పరమాత్మను తెలుసుకోవాలని**

తెలియజేస్తున్నాడు. ఈ సమస్త విశ్వము, ఇక్కడ చేయు యజ్ఞకర్మలు, తపస్సులు – అంతా కూడా పురుషుడే – ఆ పరతత్వమే – **'పురుష ఏవ ఇదం విశ్వం'** అని తెలియజేస్తున్నాడు.

అంతయూ పురుషుడే అని తెలియజేయటం వల్ల ఇక పురుషుని కన్న అన్యముగా మరేమీలేదని – ఒకవేళ ఏదన్నా గోచరిస్తుంటే అది అంతా మిధ్యయేనని – అనిత్యమేనని – భ్రమయేనని స్పష్టంగా తెలుస్తున్నది. అట్టి పురుషుణ్ణి తెలిసుకుంటే అజ్ఞానగ్రంధి ఛేదించబడుతుంది. **ఇక్కడ పురుషుణ్ణి తెలుసుకొనుటయంటే పురుషుడగుటయే. ఆత్మను తెలుసుకొనుట అంటే 'నేను ఆత్మను' అని అనుభూతిచెందుటయే.**

"తతోమాం తత్వతో జ్ఞాత్వా విశతే తదనంతరం" – అని భగవద్గీతలో భగవానుడు తెలియజేసినది ఇదే. **నన్ను తత్వతః తెలుసుకొంటే ఇక అతడు నాలో ఉన్నట్లే – నేనుగా ఉన్నట్లే.** ఇది శ్రేష్ఠమైన జ్ఞానం.

అందుకే దీనిని (ఈ జ్ఞానాన్ని – ఈ తత్వాన్ని) **పరా2మృతం'** అన్నారు. పర అంటే వేరైనది అని, శ్రేష్టమైనది అని అర్థం. ఇది ఉత్తమోత్తమమైనది. అన్నింటికన్న ఉన్నతమైనది. దానికన్న శ్రేష్టమైనది మరొకటి లేదు. ఇదికేవలం శ్రేష్టమైనది అని చెప్పి ఊరుకోలేదు. అమృతం అన్నారు. ఇది సామాన్యవస్తువులాగా మార్పులు చెంది, కృశించి నశించిపోతుందని అనుకుంటారేమోనని అమృతం అన్నారు. పుట్టినదానికే నశింపు. పుట్టుకేలేని దానికి నశింపు ఎక్కడ? కనుక అమృత స్వరూపం.

"బ్రహ్మణోహి ప్రతిష్ఠా2హం అమృతస్యావ్యయస్యచ" నేను అమృత స్వరూపమును, అవ్యయ స్వరూపమును ఐన బ్రహ్మమునే అని భగవద్గీత 13వ అధ్యాయంలో భగవానుడు తెలియజేశాడు.

ఇట్టి ఈ పరబ్రహ్మతత్వాన్ని ఎక్కడ ఉన్నదని తెలుసుకోవాలి?

"గుహాయాం నిహితం వేద" = హృదయగుహలో నిండియున్నదని తెలుసుకోవాలి. పరమాత్మ అంతటా ఉన్నా మన ఉపాసనకు ఒక చోటును భావనచేయాలి. అంతటా ఉన్న పరమాత్మను వెదకాలంటే ఒక సౌలభ్యమైన స్థానం కావాలి. మరి భగవంతుడే అనేక సందర్భాలలో నేను హృదయగుహలో ఉన్నానని. అందరి హృదయంలో ఉన్నానని తెలియజేశాడు.

"ఈశ్వర స్సర్వభూతానాం **హృద్దేశేఽ ర్జున** తిష్ఠతి" – (18 అ)

"సర్వస్య చాహం **హృది** సన్ని విష్టః" – (15 అ)

కనుక ఆయన **హృదయ గుహలో** ఉన్నాడని తెలుసుకోవాలి.

"అంగుష్ఠ మాత్రః పురుషోఽ ంతరాత్మా

సదాజనానాం **హృదయే** సన్నివిష్ఠః" – శ్వేతాశ్వతరోపనిషత్తు

'బొటనవ్రేలి పరిమాణం గల అంతరాత్మయైన ఆ పరతత్వం ఎల్లప్పుడు జనుల హృదయగుహలలో ఉంటున్నది' –అని ఉపనిషత్తు తెలియజేస్తున్నది.–

ఇలా తెలుసుకొంటే ఏమిటి ప్రయోజనం?

"సః అవిద్యా గ్రంథిం ఇహ వికిరతి" = అతడు అజ్ఞాన గ్రంథిని అవిద్యాగ్రంథిని, **ఇక్కడే – ఈలోకంలోనే – ఈదేహంతో ఉండగానే ఛేదించగలుగుతాడు.** ఇప్పటిదాకా తానుదేహాన్నని, ఈ దేహానికి సంబంధించినవి తనవని – అహంకారంతో మమకారంతో ఉన్నాడు. **ఇదే అజ్ఞానం.** ఈ అజ్ఞానం కారణంగానే ఈ జగత్తును సత్యమనుకొంటున్నాడు. ఇక్కడే ఏవేవో ఆట బొమ్మలను సంపాదించి – అనుభవించి ఆనందించాలను కుంటున్నాడు. కాని శాశ్వత ఆనందం లభించటంలేదు. నేను దేహాన్ని కాదు 'ఆత్మను' అని ఎప్పుడు భావించాడో

అప్పుడే దేహం తనకన్న వేరౌతుంది; ఈదేహానికి సంబంధించినవి తనకు సంబంధించినవి కాకుండా పోతాయి. దానితో అహంకారం తొలగి – అజ్ఞాన గ్రంధి ఛేదించబడుతుంది. **దీనితో ద్వైత బుద్ధి నశిస్తుంది.** ఇక మిగిలేది అద్వైత జ్యోతియే. అమరజ్యోతియే. అదే నీవు. **"తత్వమసి"**

"పరాం శాంతిం శాశ్వ తమానందంచ భజ।

ముక్తో భగవన్ । తదేతత్ జన్మ సాఫల్యం" ॥

'ఓ మహర్షీ పరమశాంతిని శాశ్వతానందాన్ని అనుభవించు. ముక్తుడివికా! ఇదియే జన్మ సాఫల్యము" – అని **విచారబిందూపనిషత్** తెలియజేస్తున్నది. దీనినే హృదయగ్రంథిని ఛేదించమని మహర్షి ఈ మంత్రంలో తెలిపాడు.

ఈ మంత్రంలో **యః వేదః** అని యః పదప్రయోగం చేశారు. అంటే ఎవరైనా అని అర్థం. ఎవరు ఇలా హృదయగుహలో ఉన్న పరామృత స్వరూప బ్రహ్మాన్ని తెలుసుకుంటారో – అని – కనుక పరమాత్మను ఎవరైనా తెలుసుకోవచ్చు. గృహస్థులైనా తెలుసుకోవచ్చు. సన్యాసులేకానక్కరలేదు. ఎవరు తెలుసుకుంటే వారి అజ్ఞానం వీడిపోతుంది.



ద్వితీయ ముండకం

ద్వితీయ ఖండం

– హృదయ గుహలోని పరామృత బ్రహ్మమును తెలుసుకొంటేనే అవిద్యా గ్రంథి విచ్ఛేదమవుతుందని ఇంతవరకు చెప్పారు. ఇప్పుడా బ్రహ్మ స్వరూపాన్ని వర్ణిస్తున్నారు.

మం॥ ఆవిః సన్నిహితం గుహాచరం నామ
మహత్ పదమత్రై తత్ సమర్పితం ।
ఏజత్ ప్రాణన్ నిమిషచ్చ యదేతత్ జ్ఞానథ సదసత్
వరేణ్యం పరం విజ్ఞానాత్ యద్వరిష్టం ప్రజానాం ॥(1)

ప్రతి॥ ఆవిః = ప్రకాశం; సన్నిహితం = చేరువగా ఉన్నది; గుహాచరం = హృదయగుహలో కదిలేది; మహత్ పదం = గొప్పస్థానం; ఏజత్ = కదిలేవి; ప్రాణత్ = శ్వాసించేవి; నిమిషత్ = రెప్పలార్చేవి; ఏతత్ = ఇవిఅన్నీ; అత్ర సమర్పితం = బ్రహ్మమునందు కేంద్రీకరించియున్నవి; యత్ ప్రజానాం వరిష్టం = ఏది జీవులలో శ్రేష్టమైనదో; సదసత్ = స్థూలము సూక్ష్మమో; వరేణ్యం = ఆరాధ్యమైనదో; విజ్ఞానాత్ పరం = జ్ఞానానికి అతీతమో; ఏతత్జ్ఞానథ = బ్రహ్మమును తెలుసుకో.

భావం : ప్రకాశవంతమైనది, అతి చేరువలో ఉన్నది, హృదయ గుహలో చరించేది అయిన బ్రహ్మము అన్నింటికి ఆధారమైన గొప్పస్థానం. కదిలేవి, శ్వాసించేవి, రెప్పలార్చేవి –అన్నీ బ్రహ్మమునందే కేంద్రీకరించి యున్నవి. ఏది జీవులలో శ్రేష్టమైనదో, స్థూలము – సూక్ష్మమో, ఆరాధ్యమైనదో, జ్ఞానానికి అతీతమో అట్టి బ్రహ్మమును తెలుసుకో.

వ్యాఖ్య : ఎవరైతే హృదయగుహలో నున్న పరా2మృతమైన బ్రహ్మమును తెలుసుకుంటారో అట్టివారు అజ్ఞానగ్రంథిని భేదించగలరని క్రిందటి

ప్రథమఖండాన్ని ముగించారు. ఈ ద్వితీయ ఖండంలో అట్టి **పరామృత రూపబ్రహ్మాన్ని తెలుసుకోమని** శిష్యునికి చెబుతూ **ఆ బ్రహ్మస్వరూపాన్ని వర్ణిస్తున్నారు.**

1. **ఆవి :-** అంటే ప్రత్యక్షం అని. నిజంగా బ్రహ్మం ప్రత్యక్షమా? ఈ కంటితో చూడగలమా? – చూడలేం. మరైతే ఎలా? **అనుభవాలద్వారా ప్రత్యక్షం చేసుకోవాల్సిందే.** చెట్టు ఆకులు కదిలితే **గాలి** ఉన్నదని; వస్తువులు ఉంటే లేదా మనం అటూ ఇటూ నడుస్తున్నాం అంటే **ఆకాశం** ఉన్నదని ఎలాగైతే తెలుసుకోగలుగుతామో అలాగే బ్రహ్మమును అనుభవాల ద్వారా చూడాల్సిందే. ఎలా?

కన్ను చూడగలుగుతున్నదీ, చెవి వినగలుగుతున్నది, వాక్కు మాట్లాడగలుగుతున్నదీ; చేతులు పట్టుకోగలుగుతున్నవీ; కాళ్ళు నడువగలుగుతున్నవీ; మనస్సు ఆలోచించగలుగుతున్నదీ అంటే – ఇవన్నీ ఆయా ఇంద్రియాల వల్లనే కాదు; వాటి వెనుకనున్న **చైతన్యశక్తి వల్లనే. ఆ చైతన్య శక్తియే బ్రహ్మము.** ఆ శక్తే లేకపోతే కన్ను చూడలేదు, చెవివినలేదు. చనిపోయినవానిలో ఇంద్రియాలు ఏవీపనిచేయవు. కనుక బ్రహ్మము ఈ క్షేత్రంలో అంతటా వ్యాపించియుండటాన – దాని సమక్షంలో అన్ని ఇంద్రియాలు తమ తమ పనులు చేసుకొంటున్నాయి. **కనుక బ్రహ్మము ప్రత్యక్షమే –**

2. **సన్నిహితం :** ఆత్మ ఈ దేహంలో అంతటా ఉన్నది. సర్వాంతర్యామిగా ఉన్నది. కనుకనే అది సన్నిహితం. అత్యంత సమీపం. అది సమీపంలో ఉండటం వల్లనే – సన్నిహితంగా ఉండటం వల్లనే **జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, అంతరింద్రియాలు తమపని తాముచేసుకపోతున్నవి.** అయస్కాంత సాన్నిధ్యంలో గుండుసూదులు చైతన్యాన్ని పొందినట్లు ఆత్మ సాన్నిధ్యంలో ఇంద్రియాలు చైతన్య వంతమౌతాయి. కనుక ఆత్మ సన్నిహితం.

3. **గుహాచరం :** సన్నిహితం అంటే ఎంతసన్నిహితం? ఎక్కడ ఉన్నది

ఆత్మ? అనే సందేహం కలగొచ్చు. అందుకే ఆత్మ హృదయ గుహలోఉన్నది అంటున్నాడు. నిజంగా ఆత్మ ఎక్కడో ఒకచోట ఉండే పరిమిత వస్తువా? కాదే. **అది సుసూక్ష్మం, అపరిమితం, సర్వవ్యాపకం గరా!.** అలాంటిది హృదయగుహలో ఉంటుందని చెప్పటం సబబా? నిజమే. అది ఎక్కడో ఒకచోట ఉండేదికాదు. అంతటా వ్యాపించియున్నదే. అయితే ఎక్కడో ఒకచోట దానిని **ధ్యానించాలి గనుక ధ్యాన సౌలభ్యం కొరకు** హృదయగుహలో ఉన్నదని ఉపనిషత్తులు చెబుతున్నాయి. అందుకే సాధకులైన వారు ఆత్మను హృదయస్థానంలో ధ్యానిస్తారు ప్రారంభంలో.

"ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్టతి" అని,

"సర్వస్యచాహం హృది సన్నివిష్ఠః" అని భగవానుడు గీతలో తెలియజేసింది కూడా అందుకే.

4. **మహత్పదం :** ఇది గొప్ప ఆశ్రయం. ఆధారం. ఈ సమస్త జగత్తుకు **ఆధారం** బ్రహ్మమే. సర్వానికి **కారణం** ఆ బ్రహ్మమే. కారణం లేకపోతే కార్యంలేదు. మట్టిలేకపోతే కుండలేదు. కుండకు మట్టికారణం ఎలాగో ఈ జగత్తుకు బ్రహ్మం అలాగే కారణం. ఈ జగత్తు అంతా బ్రహ్మం నుండి ఆవిర్భవించినదేనని మనం ద్వితీయముండకం – ప్రథమఖండంలో విపులంగా చెప్పుకున్నాం. కనుక ఈ జగత్తు సృష్ఠికి ఆ బ్రహ్మం కారణం గనుక ఆయనే ఆధారం – ఆశ్రయం. అలలు సాగరంనుండి కదిలి ఎంత దూరం వెళ్ళినా చివరకు సాగరంలో కలసిపోవాల్సిందే. అలాగే బ్రహ్మమునుండి కదిలిన ఈ సృష్టియావత్తు బ్రహ్మములోనే నిలిచి చివరకు బ్రహ్మములోనే లయమై పోతుంది. కనుకనే

"ఆధార మానంద మఖండ బోధం"

బ్రహ్మము ఆధారము, ఆనందము, అఖండజ్ఞాన స్వరూపం అని **'కైవల్యోపనిషత్'** చెబుతున్నది.

5. **ఏజత్, ప్రాణాత్, నిమిషత్ చ ఏతత్ అత్ర సమర్పితం :** కదిలేవి, శ్వాసించేవి, రెప్పలార్చేవి; ఆర్చనివి కూడా ఈ బ్రహ్మమునందే ఉన్నవి అని తెలియజేస్తున్నారు.

కదిలేవి అంటే నదులు, సముద్రకెరటాలు, చెట్ల కొమ్మలు, ప్రాణులు అని; **శ్వాసించేవి** అంటే మానవులు, జంతువులు, కప్పలు, చేపలు మొ॥నవి; **రెప్పలార్చేవి** అంటే మానవులు, జంతువులు, పక్షులు; **ఆర్చనివి** జడ ప్రకృతి; ఈ మొత్తం బ్రహ్మములోనే ప్రతిష్ఠితమై యున్నది. అసలు ఈ సృష్ఠికి ఆధారం ఆ బ్రహ్మమేనని చెప్పినప్పుడు సృష్ఠి అంతా బ్రహ్మములో స్థితికలిగి యున్నట్లే. కనుక అన్నీ బ్రహ్మములోనే ఉన్నవి.

యత్ ప్రజానాం వరిష్టం సదసత్ వరేణ్యం విజ్ఞానాత్‌పరం ఏతత్ జానథ!

6. **ప్రజానాం వరిష్టం :** బ్రహ్మము జీవులలో సర్వశ్రేష్ఠమైనది. నిజంగా జీవుళ్ళలో దేహం, ఇంద్రియాలు, మనస్సు ఉన్నాయి. వీటన్నింటి కన్నా శ్రేష్టమైనది **బుద్ధి** మానవులలో మాత్రం ఉన్నది. అయితే **బుద్ధికన్న శ్రేష్ఠమైన ఆత్మ** అన్ని జీవుళ్ళలోను ఉన్నది. కనుక అది **సర్వశ్రేష్టం. 'వరిష్టం'** అన్నారు.

7. **సదసత్ :** సత్ – అసత్. సత్ అంటే స్థూలం – అసత్ అంటే సూక్ష్మం. కార్యరూపంలో స్థూలంగా ఉండేదీ బ్రహ్మమే. కారణరూపంలో సూక్ష్మంగా ఉండేదీ బ్రహ్మమే. త్రాడు చీకటిలో పాముగా కనిపించింది. **పాముకార్యం త్రాడు కారణం.** కార్యరూపంలో కనిపించే పాము నిజంగా కారణరూపమైన త్రాడే. అలాగే కార్యరూపంలో కనిపించే ఈ జగత్తు నిజంగా కారణరూపమైన **ఆ బ్రహ్మమే.** కనుక కార్యకారణాలు రెండూ – స్థూల సూక్ష్మాలు రెండూ ఆ **బ్రహ్మమే. కనుక సత్ అసత్‌లు రెండూ అదే.** అందుకే సదసత్ అన్నారు.

8. **వరేణ్యం :– ఆరాధ్యం :** బ్రహ్మము ఆరాధనీయమైనది. నిజంగా అదే చేరుకోవలసిన స్థానం. కనుక సర్వులకూ అది ఆరాధ్యం.

9. **విజ్ఞానాత్ పరం :** అది తెలిసినదానికన్నా - తెలియనిదాని కన్నా అతీతం. **బుద్ధికి కొన్ని తెలుసు. కొన్ని తెలియవు. కనుక బుద్ధి పరిమితం. మరి ఆత్మ! అపరిమితం.** దీనికి తెలియటం - తెలియక పోవటం అంటూ ఏదీలేదు. అది ప్రజ్ఞానఘనం. బుద్ధికి **తెలియటాన్ని - తెలియక పోవటాన్నీ - తెలుసుకునే తెలివి అది.** మరి అట్టిదానిని **'జానథః'** తెలుసుకో అనటం ఏమిటి? బ్రహ్మాన్ని తెలుసుకోవటం అంటే **బ్రహ్మంగా ఉండిపో** - అని చెప్పటమే. బ్రహ్మాన్ని తెలుసుకుంటే - **తెలుసుకొన్న నీవు ఉండాలికదా! కనుక నీవు బ్రహ్మంగా ఉండిపో - అని.**

- ఆ బ్రహ్మతత్త్వం ఎలాంటిదో ఇంకా వర్ణిస్తున్నారు.

మం॥ యదర్చి మత్ యదణుభ్యోఽ_ణు చ
యస్మిన్ లోకా నిహితా లోకినశ్చ।
తదేత దక్షరం బ్రహ్మ సప్రాణస్తదు వాఙ్మనః
తదేతత్ సత్యం తదమృతం తత్వేద్ధవ్యం సోమ్యవిద్ధి ॥(2)

ప్రతి॥ యత్ ఆర్చిమత్ = ఏదిప్రకాశవంతమో; యత్అణుభ్యః అణు = ఏది అణువుకన్న సూక్ష్మమో; యస్మిన్లోకాః లోకినః = ఎందులో లోకాలు, లోకంలో ఉండేవారు; నిహితా = ఉంటారో; తత్ ఏతత్ అక్షరం బ్రహ్మ = అదియే నశించని బ్రహ్మము; సః = అతడే; ప్రాణః = ప్రాణము; తత్ఉ = అతడే; వాక్మనః చ = వాక్కు, మనస్సుకూడా; తత్ సత్యం = అది సత్యము, తత్అమృతం = అది మృతం లేనిది; తత్ ఏతత్వేద్ధవ్యం = ఆ బ్రహ్మమే తెలియదగినది; సోమ్యవిద్ధి = ఓ సౌమ్యుడా తెలుసుకో.

భావం : ఏది ప్రకాశమో, ఏది అణువుకన్న సూక్ష్మమో, దేనిలో లోకాలు, లోకస్థులు ఉన్నారో అదియే నశించని బ్రహ్మము. అతడే ప్రాణము, వాక్కు, మనస్సు, సత్యము, అమృతము. తెలియదగినది అదియే. ఓ సౌమ్యుడా! తెలుసుకో.

వ్యాఖ్య :

1. అర్చిమత్ : ప్రకాశవంతమైనది. ఏవస్తువు నైనా కన్నుచూడాలంటే ప్రకాశం కావాలి. **ఆత్మ అట్టిప్రకాశం.** ఆత్మ ప్రకాశం ఉండబట్టే కన్ను చూడగలుగుతున్నది, చెవి వినగలుగుతున్నది. మనస్సు ఆలోచించగలగుతున్నది. కనుక అన్ని ఇంద్రియాలకు వెనుక అధిష్ఠాన దేవతల రూపంలో ప్రకాశిస్తున్నది ఆత్మచైతన్యమే గనుక అదిప్రకాశం.

2. అణుభ్యో అణు : అణువుకన్న సూక్ష్మమైనది. ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మం. సూక్ష్మం గనుకనే సర్వవ్యాపకం అయింది.

"సూక్ష్మాదపి సూక్ష్మతరో" ఆత్మసూక్ష్మముకన్న సూక్ష్మము అని **"బ్రహ్మరహస్యోపనిషత్తు"** చెబుతున్నది. కనుక సూక్ష్మదృష్టి గల వారికే అది అనుభవానికి వస్తుంది.

"తేషాం సూక్ష్మదర్శినాం సగోచరో భవతి" సూక్ష్మ దృష్టిగల అట్టి మహాత్ములే దానిని దర్శించగలరు - అని **'వేదాంత సారోపనిషత్తు'** చెబుతున్నది.

ఈ విషయాన్నే కధారూపంలో భాగవతం తెలియజేస్తున్నది. భగవానుని తూచటానికి సత్యభామ మణులు మాణిక్యాలు వజ్ర వైఢూర్యాలు, బంగారం రత్నాలు - ఇలా ఎన్నింటినో ఉంచింది త్రాసులో. కాని అవేవీ సరితూగలేదు భగవానునికి. కాని రుక్మిణి భక్తితో తులసీదళాన్ని ఉంచింది. అంతే. అంతటి భగవానుడు తేలికయ్యాడు. కనుక ఆయన భక్తి ముందు సూక్ష్మాతి సూక్ష్ముడయ్యాడు.

3. యస్మిన్ లోకాః లోకినః నిహితా : లోకాలన్నీ - ఆ లోకాలలో ఉండే సమస్త చరాచర ప్రాణులు - జడపదార్థాలు - అన్నీ కూడా ఆ బ్రహ్మములోనే ఉన్నవి. ఈ విషయాన్ని కూడా భాగవతంలో చిన్ని కృష్ణుడు తన లీల ద్వారా తెలియజేశాడు.

అమ్మా మన్ను దిన్నాడే కృష్ణుడు అని బలరాముడు ఫిర్యాదుచేశాడు యశోదకు. ఆ తిన్నావా? అన్నది యశోద. లేదమ్మా. అంతా అబద్ధం అన్నాడు చిన్నికృష్ణుడు. ఏదీ నోరుతెరువు అంది. నోరు తెరిచాడు. అంతే, నోరు తెరవటంతోనే అందులోని దృశ్యాన్ని చూచి నోరు తెరవటం యశోద వంతు అయింది. ఆయన బొజ్జలో 7+7 లోకాలు, సూర్య చంద్రులు, పర్వతాలు, సముద్రాలు, ఆదిత్యులు, రుద్రులు, వసువులు, అశ్వనీదేవతలు, దేవ, రాక్షస, యక్ష, గంధర్వ, గరుడ, సిద్ధ, సాధ్య, పన్నగ, విద్యాధరులతో పాటు వృక్షాలు, జంతువులు – అన్నీ కనిపించినై. అంటే అన్ని లోకాలు బ్రహ్మములోనే.

3. తదేతత్ అక్షరం బ్రహ్మ : అదే ఈ అక్షరమైన బ్రహ్మము. నశించి పోయేవాటికి ఆధారంగా నశించకుండా బ్రహ్మం ఉన్నది. **తెర** స్థిరంగా ఉంటే దాని మీదకు ఎన్నో బొమ్మలు వస్తూ పోతూ ఉంటాయి. **అద్దం** స్థిరంగా ఉంటే అందులో ఎందరో కనిపిస్తూ అదృశ్యమవుతూ ఉంటారు. అలాగే బ్రహ్మం కూటస్థునిలాగా స్థిరంగా ఎప్పుడూ ఉండేది.

4. స ప్రాణః, తదువాక్ మనః : అదేప్రాణము, అదేవాక్కు, అదేమనస్సు. ప్రాణం ఉంటేనే మనస్సు వాక్కు పనిచేస్తాయి. ఆ ప్రాణం ఆత్మచైతన్యం ఉంటేనే. **ఆత్మచైతన్యమే ప్రాణంగా ఉండి శక్తినిస్తుంది.**

5. తత్ సత్యం, తత్ అమృతం : ఆ పరబ్రహ్మం సత్యవస్తువు. ఎప్పుడూ ఉండేదేదో అదేసత్యం. ఒకప్పుడుండి ఒకప్పుడు లేనిది అసత్య వస్తువే. **అది అమృతం.** మార్పులు లేనిది. మరణం లేనిది. ఎప్పుడూ ఒక్కటిగానే ఉండేది. అలాగే ఆత్మను తెలుసుకొని ఆత్మానుభూతి చెందిన **జీవన్ముక్తుడు జననమరణాలు లేనివాడౌతున్నాడు.** అదే అమృతం. అంటే – **ఆత్మస్థితినే అమృతత్వ స్థితి అంటారు.**

6. తత్ వేద్ధవ్యం : తెలుసుకోవలసినది అదే. ఆత్మస్థితిని పొందితే అమరత్వమే గనుక తెలుసుకోవలసింది ఆత్మను గురించే – బ్రహ్మమును

గురించే అంటున్నాడు. అది తెలుసుకుంటే ఇక తెలుసుకోవాల్సిందేమీ ఉండదు. **ఆనంద సామ్రాజ్యంలో ఓలలాడటమే.**

7. సోమ్య! విద్ధి! : ఓ సౌమ్యుడా! తెలుసుకో. బ్రహ్మాన్ని తెలుసుకొన్నవాడు అమరుడౌతున్నాడు. కనుక అమృతత్వాన్ని పొందటానికి బ్రహ్మాన్ని తెలుసుకో. 'విద్ధి' అంటున్నాడు. నిజంగా ఇక్కడ బ్రహ్మాన్ని **తెలుసుకోవటం అంటే శాస్త్రాల ద్వారానో - గురువుల ద్వారానో బ్రహ్మము యొక్క గుణాలను తెలుసుకొనటం కాదు. ఆ తెలుసుకొన్న గుణాల ద్వారా బ్రహ్మముతో అనుసంధానం కావాలి. అనుభూతి చెందాలి.** నేను బ్రహ్మాన్ని అనే అనుభవం కలగాలి. **బ్రహ్మముగా ఉండి పోవాలి.** అదే తెలుసుకోవటం అంటే -

ఈ తెలుసుకోవటం - **అంటే అనుభూతి చెందటం** ఎలాగో - ఏ సాధనలు చేయాలో తర్వాత మంత్రాలలో తెలియజేస్తున్నారు.

- ఇక సాధన గురించి -

మం॥ ధనుర్ గృహీత్వా ఔపనిషదం మహాస్త్రం
శరం హ్యుపాసా నిశితం సంధయీత ।
ఆయమ్య తద్భావ గతేన చేతసా
లక్ష్యం తదేవాక్షరం సోమ్యవిద్ధి॥ (3)

ప్రతి॥ సోమ్య = ఓసౌమ్యుడా!; ఔపనిషదం = ఉపనిషత్తులు అందించే; మహాస్త్రం = గొప్ప అస్త్రమైన; ధనుః = ధనుస్సును; గృహీత్వా = తీసుకొని; ఉపాసా నిశితం హి = ఉపాసనచే పదునెక్కిన; శరం = బాణాన్ని; సంధయీత = సంధించు; తద్భావగతేన = బ్రహ్మభావనయందే లగ్నమైన; చేతసా = మనస్సుచేత; ఆయమ్య = వింటినారిని లాగి; అక్షరంతదేవ = నశించని పరబ్రహ్మమునే; లక్ష్యంవిద్ధి = లక్ష్యస్థానమని తెలుసుకో.

భావం : ఉపనిషత్తులు అందించేగొప్ప ఆయుధమైన ధనుస్సును తీసుకొని; **నిత్యఉపాసన చేత** పదును బెట్టబడిన బాణాన్ని సంధించు. ఎటూచెదరకుండా నిరంతరం **బ్రహ్మచింతన** యందే లగ్నమైన మనస్సు చేత వింటినారిని లాగి అక్షరమైన - నాశరహితమైన - ఆ బ్రహ్మమునే లక్ష్యంగా తెలుసుకో.

వ్యాఖ్య : తెలుసుకోవలసిన ముఖ్యవిషయం - మనలక్ష్యం ఏమిటి? మానవులందరి యొక్క పరమలక్ష్యం ఒక్కటే. నాశరహితమైన బ్రహ్మమును తెలుసుకొని **బ్రహ్మానుభూతిలో నిలచిపోవుటయే.** అయితే ఎలా? దానిని ఇక్కడ ఒక ఉపమానం ద్వారా తెలియజేస్తున్నారు. ఏదైనా ఒక లక్ష్యాన్ని ఛేదించాలంటే ధనుస్సుకు బాణాన్ని సంధించి వింటి నారిని చెవులదాకా లాగి, లక్ష్యంమీద దృష్టిని ఏకాగ్రంగా నిలిపి బాణాన్ని వదలాలి. అంతే. **అది లక్ష్యాన్ని ఛేదిస్తుంది.**

అలాగే ఇక్కడ గ్రహించాల్సిన ధనుస్సు **ఉపనిషత్తులు అందించే పరమజ్ఞానం.** ఉపనిషత్తులలో బ్రహ్మమును గురించి వర్ణించి, ఆ స్థానాన్ని చేరుకొనే మార్గాలు - ఉపాయాలు తెలియజేస్తారు. వాటిని ముందుగా తెలుసుకొని - అర్థం చేసుకొని - అవగాహన చేసుకొని - ఆ తర్వాత **నిత్యము ఉపాసనచేయాలి.** అంటే మనన నిధిద్యాసనలు చేయాలి. అప్పుడే గ్రహించిన అర్థాలు స్వంతమయ్యేది. కనుక శాస్త్రాలను **శ్రవణంచేసి, మననంచేసి, నిధిద్యాసన చేయుటం ద్వారా ఆ పరమలక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.**

ఇలా ఉపనిషత్తులు అందించే జ్ఞానంతో సాధనచేసి **చిత్తాన్ని నిరంతరం బ్రహ్మ భావనలో** లగ్నం చేయాలి. ఎలా? **'నేను బ్రహ్మమునే' అనే భావన నిరంతరము మనకు ఉండటమే బ్రహ్మభావన. లేదా బ్రహ్మచింతన.** మనస్సు ఇంద్రియాలకు లొంగితే ఆ ఇంద్రియాలు మనస్సును విషయాల మీదికి తీసుక వెళతాయి. ఆ విషయాలలో ఇరికించివేసి ఆందోళన అలజడులతో

అల్లకల్లోలంచేసి వేస్తాయి. అలాగాక మనస్సు ఇంద్రియాలకు లొంగక ధృఢంగా నిలువగలిగితే - భగవంతుని పైకి తిరిగిన **బుద్ధికి అధీనమైతే** ఇక ఆ మనస్సు ఎంతో ప్రశాంతంగా నిలిచిపోతుంది. **అట్టి ప్రశాంత చిత్తంతోనే బ్రహ్మభావన చేయగలుగుతాం.** నేను దేహ - ఇంద్రియ - మనో - బుద్ధులుకాదు - వాటికి ఆధారంగా, అధిష్ఠానంగా ఉండి, వాటి వృత్తులకు అంటకుండా ఉండే శుద్ధ చైతన్యాన్ని అని నిరంతరం భావన చేస్తాం. ఇలా **చింతన చేసి చేసి** చివరకు **ఆ బ్రహ్మముగా మిగిలిపోతాం.** మన నిజస్థితిలో నిలిచి పోతాం. **అదే స్వస్వరూప దర్శనం. భగవత్ సాక్షాత్కారం.**

ఈ మంత్రంలో తెలియజేసిన ధనుస్సు - బాణము ఏవో తరువాత మంత్రం వివరణ ఇస్తుంది.

బ్రహ్మము యొక్క లక్షణాలను చెప్పి అట్టి బ్రహ్మమును తెలుసుకో - అని మొదటి రెండు మంత్రాలలో చెప్పిన అంగిరసమహర్షి ఆ తెలుసుకొనే విధానాన్ని - ఉపాయాన్ని ఈ 3-4 మంత్రాలలో తెలియజేస్తున్నారు.

- క్రిందటి మంత్రంలో తెలిపిన ధనుస్సు, బాణం ఏమిటో ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

మం॥ ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్ ॥ (4)

ప్రతి॥ ప్రణవః ధనుః = ప్రణవమేధనుస్సు; శరహి ఆత్మా = ఆత్మయేబాణము; బ్రహ్మ తల్లక్ష్యం = బ్రహ్మమే ఆ లక్ష్యం అని; ఉచ్యతే = చెప్పబడింది; అప్రమత్తేన వేద్ధవ్యం = స్థిమితంతో అనుభవించాలి; శరవత్ = బాణమువలె; తన్మయఃభవేత్ = ఆ స్వరూపమే అయిపోవాలి.

భావం : ఓంకారమే ధనుస్సు. ఆత్మయే బాణం. బ్రహ్మమే లక్ష్యస్థానం. ఏమరుపాటులేని చిత్తంతో ఆ లక్ష్యాన్ని ఛేదించాలి. బాణం లక్ష్యాన్ని ఛేదించి ఆ స్వరూపంతో ఏకమైనట్లు బ్రహ్మముతో ఐక్యమై పోవాలి.

వ్యాఖ్య : ఉపనిషత్తులు సూచించిన **ఓంకారమే ధనుస్సు.** ఆత్మ = అంటే **జీవాత్మయే బాణం.** జీవాత్మ అంటే నేను జీవుణ్ణి అనుకొనే మనస్సు - అదేబాణం. **లక్ష్యంమాత్రం పరమాత్మే. ఇప్పుడీ బాణం అనబడే జీవాత్మ ధనస్సు అనబడే ప్రణవోపాసనద్వారా లక్ష్యమైన బ్రహ్మముతో ఐక్యం కావాలి.**

అంటే ప్రణవోపాసన **ద్వారా జీవబ్రహ్మలు ఏకంకావాలి అని.** ధ్యానించేవాడు, ధ్యేయవస్తువు ఒకటికావాలి. తెలుసుకొనేవాడు, తెలుసుకోబడేది ఒకటికావాలి. **జీవాత్మ, పరమాత్మ ఒకటి కావాలి.**

ధ్యానించేది మనస్సు. మనస్సు ఏవిషయాన్ని గురించి చింతిస్తే ఆ విషయాకారంగా మారి పోతుంది. **ప్రణవధ్యానం చేస్తే ప్రణవ స్వరూపంగా మారిపోతుంది.**

ప్రణవం - ఓం అనేది పరమాత్మకుగల పేరు. పరమాత్మకు ప్రతీక కూడా అదే. పరమాత్మను 'ఓం' కారం ద్వారా ఉపాసనచేస్తారు. సర్వమూ ఓంకారమేనని **"సర్వమోంకార ఏవ"** అని మాండూక్యోపనిషత్ చెబుతున్నది.

"ఓం ఇత్యేష ప్రణవో బ్రహ్మణః ప్రతీక" - ఓంఅను ఈ ప్రణవమే బ్రహ్మమునకు ప్రతీక - అని **'శివజ్ఞానామృతోపనిషత్తు'** చెబుతున్నది.

"ఓంతత్సదితినిర్దేశః బ్రహ్మణస్త్రి విధః స్మృతః" (గీ-17) బ్రహ్మమునకు ఓం-తత్-సత్ అని 3 విధములైన పేర్లుగలవు అని గీతలో భగవానుడు తెలియజేశాడు.

కనుక బాగా ఎక్కు పెట్టిన బాణం ఏవిధంగా లక్ష్యాన్ని భేదిస్తుందో అదే విధంగా ప్రణవధ్యానం జరిగితే జీవాత్మ పరమాత్మతో ఐక్యమవుతుంది. ఇక్కడ జీవాత్మ పరమాత్మతో ఐక్యమగుట అంటే **రెండూ వేరు వేరుగా లేవు. రెండూ ఒక్కటే.** జీవాత్మే పరమాత్మ. **వడ్లగింజ బియ్యపుగింజ నిజంగా రెండు వేరు వేరుకాదు.** వడ్ల **గింజ నిజంగా** బియ్యపుగింజే.

కాకపోతే అడ్డంగా ఉన్న పొట్టును తీసేయాలి అంతే. అలాగే అసలు పరమాత్మ ఈ క్షేత్రంలో కూర్చొని జీవుడుగా పిలవబడుతున్నాడు. ఈ క్షేత్రాన్ని లేదా ఉపాధిని నిరశించి చూస్తే ఇంక అక్కడ ఉన్నది చైతన్యమే. అక్కడ పొట్టును తొలగించినట్లు ఇక్కడ ఉపాధిని తొలగించాలి.

బాణాన్ని ఎక్కుపెట్టినప్పుడు **అప్రమత్తంగా** ఉండాలి. లక్ష్యస్థానాన్ని ఏకాగ్ర దృష్ఠితో చూస్తున్నాం. ధనుస్సును, బాణాన్ని దృఢంగా పట్టుకున్నాం. ఎక్కు పెట్టి బాణాన్ని వదిలే సమయానికి **మనస్సులో ఏదో ఆందోళన** కలిగి దృష్ఠి చెదిరిందనుకో బాణం గురి తప్పిపోతుంది. అలాగే ఇక్కడ కూడా ప్రణవ ధ్యానం చేసేటప్పుడు కూడా **మనస్సు అన్యవిషయాల మీదకు వెళ్ళకుండా తదేకంగా బ్రహ్మ భావన ఉండాలి.** బ్రహ్మ భావన చెదరకుండా, సాధనలో **అప్రమత్తుడై** యుంటే సాధకుడు బ్రాహ్మీస్థితిని చేరుకుంటాడు. బ్రహ్మముగా ఉండిపోతాడు. స్వస్వరూపంలో నిలిచిపోతాడు.

– బ్రహ్మము యొక్క నిజస్థితిని వర్ణిస్తున్నారు.

మం॥ యస్మిన్ ద్యౌః పృధివీచ అంతరిక్ష మోతం
మనః సహ ప్రాణైశ్చ సర్వైః।
తమే వైకం జానధ ఆత్మాన మన్యా
వాచో విముంచధాఽమృతస్యైష సేతుః ॥(5)

ప్రతి॥ యస్మిన్ = దేనియందు; ద్యౌఃపృధివీ = ఆకాశం, భూమి; అంతరిక్షం చ = అంతరిక్షము మరియు; ప్రాణైః సహ = ప్రాణములతో; మనఃచ = మనస్సుకూడా; సర్వైః = అన్నీ; ఓతం=అల్లుకోబడి ఉన్నాయో; తం ఏవ ఏకం ఆత్మానం = అదే ఒక్కటైన ఆత్మ అని; జానధ = తెలుసుకో; అన్యాః వాచః = మిగతామాటలు; విముంచధ = వదిలిపెట్టు; ఏష = ఇదియే; అమృతస్య సేతుః = అమృతత్వానికి వారధి.

భావం : దేనియందు భూమ్యాకాశాలు, వాటి మధ్య నున్న అంతరిక్షము,

పంచప్రాణాలతో కూడిన మనస్సు అన్నీ అల్లుకొని ఉన్నాయో అదియే ఆత్మ అని తెలుసుకో. అన్యమైన వ్యర్థ ప్రసంగాలు వదిలిపెట్టు. అమృతత్త్వానికి ఇదియేవారధి.

వ్యాఖ్య : బ్రహ్మాండంలోని భూమ్యాకాశాలు; మధ్యలోనున్న అంతరిక్షం – **పిండాండంలోని** మనోబుద్ధులు పంచప్రాణాలు దేనియందు అల్లుకొని యున్నవో అదే ఆత్మ అనితెలుసుకో.

ఒక కార్డు బోర్డు షీటుతెచ్చి దానిమీద మంచి డ్రాయింగు వేశాడు ఒకడు. నేల – నీరు. సముద్రాలు – అడవులు – ఆకాశం. సూర్య చంద్రులు – నక్షత్రాలు – నేలమీద మనుష్యులు, నీటిలో చేపలు మొసళ్ళు, అంతరిక్షంలో పక్షులు ఇలా ఎన్నో బొమ్మలు వేశాడు.

ఇప్పుడు నేల, ఆకాశం, సూర్యచంద్రులు అంతా ఎక్కడ ఉన్నారు? ఆ షీటు మీదనే. మనుష్యులు, జంతువులో! వీరూ ఆ షీటుమీదే. మనిషిలోపల ఉన్న ఖాళీస్థలం ఎక్కడ ఉన్నది? అదీ షీటు మీదనే. అంటే అన్నీ ఆ షీటుతో అల్లుకొని పెనవేసుకొని ఉన్నాయన్నమాట. అన్ని బొమ్మలకు – ఆకాశంలో ఎగిరే పక్షులకు, తిరిగేగ్రహాలకు అన్నింటికి ఆ షీటే ఆధారం. అలాగే ఈ సమస్త బ్రహ్మాండానికి ఆధారం – ఆత్మ చైతన్యమే. ఇలా ఆత్మను తెలుసుకోవాలి. **అలా తెలుసుకుంటేనే అన్నింటి వెనుక నున్న ఆత్మ చైతన్యాన్ని దర్శించగలం.** జగత్తునుగాక జగత్తుకు ఆధారాన్ని చూడాలి. జగత్తు కేవలం భ్రాంతి మాత్రమే. భ్రాంతిని తొలగిస్తే యదార్థం బయటపడుతుంది.

శ్లో॥ భ్రాంతి మాత్రమిదం విశ్వం నకించిదపి నిశ్చయీ
నిర్వాసనః స్ఫూర్తి మాత్రో నకించి దివశామ్యతి ॥ –

“ఈ విశ్వము భ్రాంతిమాత్రమే గాని మరొకటికాదని ఎవడు దృఢనిశ్చయంతో ఉంటాడో అతడు వాసనాక్షయం చేసుకొని జ్ఞానియై శాంతిని పొందున”ని **అష్టావక్రగీతలో** అష్టావక్రుడు జనక మహారాజుకు తెలియజేశాడు.

ఇదే నిజమైనజ్ఞానము. ఇట్టిజ్ఞానాన్ని తెలుసుకోమని మహర్షి తెలియజేస్తున్నాడు. ఆత్మను తెలుసుకొనుట అంటే ఆత్మానుభూతిని పొందుటయే. అందువల్లనే ఆత్మజ్ఞానం అన్ని జ్ఞానాల కన్న శ్రేష్ఠమైనది అని చెప్పటం.

'నహిజ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే' అని గీతలో భగవానుడు తెలియజేశాడు.

అయితే ఇట్టి ఉత్కృష్టమైన జ్ఞానాన్ని పొందాలంటే అన్యమైన మాటలు వదిలిపెట్టాలి. మనం రోజంతా మాట్లాడే మాటల్లో 100 మాటల్లో తప్పనిసరి అవసరానివి 10 మాటలు ఉంటాయి. మిగతా వన్నీ **వ్యర్థప్రసంగాలే.** అలావ్యర్థ ప్రసంగాలు చేసేవారు ఆత్మజ్ఞానాన్ని పొందే అవకాశంలేనివారే. కొందరు **Chatter Box** లాగా వాగుతూనే ఉంటారు. అలా వాగుతూ వాగుతూ చుట్టూ చూస్తుంటారు మన గొప్పతనాన్ని ఎందరు చూస్తున్నారు? అని. వీరంతా వ్యర్థ జీవులే. వాళ్ళకి లౌకికమైన సంపదలు ఎన్ని ఉన్నా – పదవులు, కీర్తి ప్రతిష్టలు ఎన్ని సంపాదించినా – ఎన్ని దానధర్మాలు చేసినా అన్నీ బూడిదలో పోసిన పన్నీరే. ఎందువల్ల? –

మనం మాటలు మాట్లాడుతున్నా మంటే ఆ మాటల వెనుక మనస్సులో కొన్ని భావాలు, ఆలోచనలు కదిలినవన్న మాటే. మనస్సులోని భావాలే మాటల రూపంలో వ్యక్తమవుతాయి. మనస్సులో భావాలు ఎందుకు కదులుతున్న వంటే – **విషయాలతో సంగభావం వల్ల; బుద్ధిలోని కోరికలవల్లనే.** అందుకే అన్యప్రసంగాలు ఆపమని చెప్పటం. మాటలువద్దంటే సంకల్పాలు – విషయప్రపంచ ఆలోచనలు – అన్నీ ఆపమనే అర్థం. ఇలా అన్యమైన ఆలోచనలు ఆపటంతో ఆత్మ సంబంధ విషయాలను చింతించటానికి అవకాశం కలుగుతుంది. అన్యవిషయాలను మాట్లాడవద్దు అంటే దేనికి అన్యం? **ఆత్మకు అన్యమైన విషయాలు అని.** ఆత్మకు అన్యమైన అనాత్మ విషయాలను – సంకల్పాలను ఆపి,

ఆత్మవిషయకమైన మాటలు మాట్లాడాలి; ఆలోచించాలి. ఇలా మాట్లాడుతూ – ఆలోచిస్తూ ఆత్మచింతన చేస్తుంటేనే చివరకు ఆత్మానుభూతిని పొందటం సాధ్యమవుతుంది.

కనుక మనం అన్యమైన మాటలు ఆపి ఆత్మసంబంధమైన మాటలే మాట్లాడాలి. ఆత్మ సంబంధమైన ఆలోచనలే చేయాలి. **అదే ఆత్మానుభూతికి మార్గం.** కనుకనే దీనిని అమృతత్వానికి వారధి అన్నారు.

ఈ భ్రమాత్మకమైన సంసారసాగరాన్ని దాటించి అమృతత్వమనే ఒడ్డును చేర్చటానికి వారధి లాంటిదే ఈ ఆత్మజ్ఞానము. అది దృఢంగా ఉండి ముముక్షువులైన వారిని మోక్షధామాన్ని చేర్చేది. కనుకనే జ్ఞానాన్ని వారధి అన్నారు.

'సర్వంజ్ఞాన ప్లవేనైవ వృజనం సంతరిష్యసి' – గీత – ఈ సంసార సముద్రాన్ని దాటడానికి జ్ఞానమనే తెప్పకావాలని భగవానుడన్నాడు.

– అట్టి ఆత్మను గుర్తించి ధ్యానించుట ఎలాగో.....

మం॥ అరా ఇవరథనాభౌ సంహతా యత్ర నాడ్యః
స ఏషోఽ౽ంతశ్చరతే బహుధా జాయమానః।
ఓ మిత్యేవం ధ్యాయథ ఆత్మానం
స్వస్తివః పారాయ తమసః పరస్తాత్ ॥ (6)

ప్రతి॥ రథనాభౌ అరాఇవ = రథచక్రంలోని ఆకులవలె; యత్రనాడ్యః సంహతా = ఎక్కడ నాడులన్నీ కలిసిపోతాయో; స ఏషః = ఆహృదయంలోని ఆత్మ; బహుధాజాయమానః = అనేకవిధాలుగా; అంతః చరతే = లోపలచరిస్తూ ఉంటుంది; ఆత్మానాం ఓం ఇతి ఏవం = అట్టి ఆత్మను ఓం అని; ధ్యాయధ = ధ్యానించండి; తమసః పరస్తాత్ = అంధకారాన్ని అధిగమించి; పారాయ = ఆవలిగట్టు చేరుటకు; వఃస్వస్తి = మీకు శుభములు కలుగుగాక.

భావం : రధచక్రంలోని ఆకులన్నీ ఇరుసును చేరియున్నట్లుగ ఎక్కడ నాడులన్నీ కలిసిపోతాయో ఆ హృదయంలోని ఆత్మ అనేక విధాల చరిస్తూ ఉంటుంది. అట్టి ఆత్మనే ఓంకారంగా ధ్యానించండి. అంధకారాన్ని అధిగమించి ఆవలిగట్టు చేరుటలో మీకు శుభములు కలుగుగాక!

వ్యాఖ్య : ఆత్మను ధ్యానించటానికి ఒక స్థానాన్ని ఇక్కడ చూపుతున్నారు. **అదే హృదయస్థానం.** ఆత్మ హృదయస్థానంలో ఉన్నదని శాస్త్రాలు చెబుతున్నాయి. "సర్వస్యచాహం హృది సన్నివిష్ఠః" అని (గీ-15) లోను;

"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశే2ర్జున తిష్ఠతి" (గీ-18) లోను భగవానుడు తెలియజేశారు.

రధ చక్రంలోని ఆకులన్నీ మధ్యలోనున్న ఇరుసును చేరినట్లుగ శరీరంలోని నాడులన్నీ హృదయస్థానంలో కలిసిపోతాయి. ఈ దేహంలో 72వేల నాడులు శరీరంలోని అన్ని భాగాలలో వ్యాపించియుండి - అన్నీ హృదయస్థానంలో కలిసిపోతాయి. నాడీ స్పందన హృదయం నుండే జరుగుతుంది. హృదయంలో జరిగేనాడీచలనం వల్లనే శరీరం అంతా కూడా చలిస్తూ ఉంటుంది.

రధచక్రంలోని ఇరుసు లాగానే శరీరమునందలి హృదయం శక్తి వంతమైనది. శరీరమంతటికి ఆధారమైనది. అట్టి హృదయంలోనే ఆత్మ ప్రతిష్ఠితమై ఉన్నదని ఉపనిషత్తుల ఉద్భోధ. అట్టి ఆత్మ హృదయంలో అనేక విధాలచరిస్తుంది. దానినే ఓంకారంగా ధ్యానించమని మహర్షి ఉపదేశం. అసలు సృష్టిలో మొట్టమొదట కదిలిన శబ్దతరంగం ఓంకారమే.

ఓంకారంలో 3 శబ్దాలున్నవి. **అ - ఉ - మ.** అని. వీటినే మాత్రలు అంటారు. ఈ 3 మాత్రలే సృష్ఠికి ఆధారం.

1. జాగ్రదవస్థలో ఆత్మ స్థూలశరీరం ద్వారా ఈ విశ్వాన్ని చూస్తుంది గనుక **విశ్వుడు** అన్నారు. ఈ విశ్వుని **'అ'**కారంతోను. 2. స్వప్నావస్థలో

ఆత్మ సూక్ష్మ శరీరం ద్వారా స్వప్న ప్రపంచాన్ని చూస్తుంది గనుక తైజసుడు అన్నారు. ఆ తైజసుని **'ఉ'**కారంతోను; 3. సుషుప్తి యవస్థలో ఆత్మ అజ్ఞాన స్వరూపమైన కారణ శరీరంలో ఉండి ఏమీ తెలియనిస్థితిలో ఉంటుంది. దానిని ప్రాజ్ఞుడు అన్నారు. అతణ్ణి **'మ'**కారంతోను ప్రతిపాదిస్తారు. ఈ 3 అవస్థలకు ఆవల తురీయావస్థ ఉన్నది. ఓంకారోపాసనతో ఈ తురీయాన్ని చేరుకోవాలి.

ఈ ఓంకారం యొక్క మహిమ వర్ణనాతీతం. దీనిని గురించి చక్కగా విపులంగా తెలియజేసేది **'మాండూక్యోపనిషత్తు'.**

ఓంకారంలోని అకార ఉకార మకారాలచేత 'భూః, భువః, సువః' అనే 3 వ్యాహృతులేర్పడినవి. అవే గాయిత్రీ మంత్రంలోని 3 పాదాలు. ఈ సృష్టి మొత్తం ఓంకార స్వరూపమే.

"ఈ ప్రపంచం ఓంకారం నుండి జనించి, ఓంకారము నందేయుండి, ప్రళయకాలంలో ఓంకారంలోనే లయమౌతుంది." అని వేద వాక్కు. కనుకనే ఆత్మను ఓంకారముగా భావించి ఉపాసన చెయ్యమని - ధ్యానించమని అంగిరసుడు తెలియజేస్తున్నాడు.

ఇలా ఆ పరమాత్మను ఓంకారంగా ధ్యానించి, అజ్ఞానమనే అంధకారాన్ని దాటి, మోక్షమనే ఆవలిగట్టును చేరి తరించమని చెబుతూ – అలా చేరుటలో 'మీకు శుభములు కలుగు గాక' అని దీవిస్తున్నారు.

గురు ముఖత ఉపదేశాన్ని పొంది, దానిని చక్కగా మననం చేసుకొని, ఆచరిస్తేనే ఆత్మానుభూతి కలిగేది. ఆచరణవల్లనే ఫలసిద్ధి. ఇలా ఆచరణ చేయుటలో నీకెట్టి ఆటంకములు కలుగకుండా ఉండాలని, ఒకవేళ ఆటంకాలు కలిగినావాటిని అధిగమించి ముందుకు వెళ్ళాలనే ఆశీస్సులను 'శుభములు కలుగుగాక' అనే వాక్యంలో తెలియజేస్తున్నాడు.

మం॥ యః సర్వజ్ఞ సర్వవిత్ యస్యైషమహిమా భువి
దివ్యేబ్రహ్మపురే హ్యేష వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః ।
మనోమయః ప్రాణ శరీరనేతా
ప్రతిష్ఠితోఽన్నే హృదయం సన్నిధాయ ।
తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః
ఆనందరూపం అమృతం యద్విభాతి ॥ (7)

ప్రతి॥ యఃసర్వజ్ఞ సర్వవిత్ = బ్రహ్మము సర్వజ్ఞుడు, సర్వవిదుడు; భువి ఏష మహిమాయస్య = జగత్తులో కనిపించే మహిమఅంతా ఆయనదే; ప్రాణశరీరనేతా = ప్రాణశరీరాలకు నాయకుడై; మనోమయః = మనస్సనేరూపంతో; దివ్యే బ్రహ్మపురే వ్యోమ్న = **బ్రహ్మపురిలోని ఆకాశంలో**; ఏష ఆత్మాప్రతిష్టితః = ఈ ఆత్మప్రతిష్టించబడియున్నది; హృదయం ప్రతిష్టితే = హృదయంలో స్థిరపడి; అన్నే సన్నిధాయ = అన్నంతో పోషించబడే శరీరంలో వ్యాపించియున్నది; తద్విజ్ఞానేన = పరమాత్మజ్ఞానంతో; ధీరాః = ధీర పురుషులు; ఆనందరూపం, అమృతం = ఆనందస్వరూపమై, నశించనిదై; యద్విభాతి = ప్రకాశించే బ్రహ్మమును; పరిపశ్యంతి = దర్శిస్తున్నారు.

భావం : బ్రహ్మము సర్వజ్ఞుడు, సర్వవిదుడు. ఈ జగత్తులో కనిపించే మహిమ అంతా ఆయనదే. ప్రాణశరీరాలకు నాయకుడై, మనస్సనే రూపంతో హృదయాకాశంలోని బ్రహ్మపురిలో ప్రతిష్టితుడైయున్నాడు. అన్నంతో పోషించబడే శరీరంలో వ్యాపించియున్నాడు. బ్రహ్మము యొక్క పరిపూర్ణ జ్ఞానాన్ని పొంది ధీర పురుషులు ఆనందస్వరూపమై, అమృతత్వమై యున్న దానిని దర్శిస్తున్నారు.

వ్యాఖ్య : పరమాత్మ **1. సర్వజ్ఞుడు; 2. సర్వవిదుడు.** అయనకు తెలియని విషయంలేదు. ఈ జగత్తంతా ఆయననుండే ఉద్భవించినది. కనుక జగత్తులోని సర్వమూ ఆయనకు తెలుసు. ఈ జగత్తుకు ఉపాదానకారణమూ ఆయనే, నిమిత్త కారణమూ ఆయనే. కనుక సర్వమూ తెలిసిన వాడు ఆయన. అందుకే ఆయనను **'కవి'** అని గీతలో భగవానుడు తెలియజేశాడు.

3. ఈ జగత్తులో కనిపించేదంతా ఆయన వైభవమే. ఉపాదాన కారణంగా ఆయనే ఈజగత్తు నందంతటా వ్యాపించియున్నాడు. కనుక ఇక్కడ గోచరించే వైభవమంతా ఆయనవైభవమే. **పురుషసూక్తం** కూడా **"ఏతావానస్య మహిమా" -** ఇదంతయూ అతని మహిమయేనని చెబుతున్నది. ఈ జగత్తులో అన్నీ ఒక క్రమమైన శాసనాన్ని అనుసరించి కదులుతున్నవి. ఈ భూమి, గ్రహాలు, సూర్యచంద్రులు - అన్నీ ఒక పద్ధతి ప్రకారం - నిర్ణయించబడిన వేగంతో - నిర్ణయించబడిన మార్గంలో కదులుతున్నాయి. అలాగే జీవులు ఎవరికర్మ ఫలాలను వారు అనుభవిస్తున్నారు. ఎవరు ఏ అనుభవాలను పొందాలో. ఎట్టి జన్మలెత్తాలో, ఎక్కడ జన్మించాలో **అన్నీ క్రమ పద్ధతిలో జరిగిపోతున్నవి.** ఇదంతా ఎలా జరుగుతున్నది? ఇదంతా **ఆత్మవైభవమే.** కనుకనే ఆయన సర్వశక్తి మంతుడు.

4. ధ్యానంకొరకు ఇక ఆ ఆత్మయొక్క **స్థానం** ఏదో తెలియజేస్తున్నారు. అది **బ్రహ్మపురి అని.** అది ఎంతో **ప్రకాశవంతమైనది.** అది ఎక్కడ ఉన్నది?-

హృదయమనే పద్మకోశంలో - అక్కడి ఆకాశంలో (ఖాళీప్రదేశంలో) ఈ చైతన్య వంతమైన - ప్రకాశవంతమైన బ్రహ్మపురి ఉన్నది. **బ్రహ్మము నివశించే ప్రదేశం గనుక దానిని బ్రహ్మపురి అన్నారు.** అక్కడ ఈ ఆత్మ ఎలా ఉన్నది? వర్షాకాలంలో మేఘాలలో మెరిసే మెరుపు తీగలాగా దివ్యమైన ప్రకాశంతో ఉన్నది. ఉన్నది అంటే ఏదో ఒక వస్తువు ఉన్నట్లుగా గాక అది అంతటా వ్యాపించేయుంటుంది. అందుకే అది అన్నంలో స్థిరపడి

ఉన్నది అన్నారు. అన్నం అంటే అన్నంతో పోషించబడే **శరీరంలో** అంతటా వ్యాపించబడియున్నది అని.

5. దానికి వస్త్రం మనస్సు. 6. అది ప్రాణ శరీరాలకు అధినేత. మనం శరీరాన్ని వస్త్రంతో కప్పుతాం. కనిపించేది వస్త్రమేగాని శరీరంకాదు. అలాగే ఆత్మ మనస్సుచేత ఆవరించబడి ఉన్నది. (అప్పుడే **ఆత్మను - జీవుడు అంటున్నాం.**) ఇప్పుడు కనిపించేది మనస్సేగాని, ఆత్మ కనిపించదు. అందుకే జీవుళ్ళు తమ నిజస్వరూపమైన ఆత్మ స్వరూపమును దర్శించలేక పోతున్నారు. మనస్సు యొక్క ఆలోచనలను, దాని పనులను గమనించగలుగుతున్నారు.

అలాగే ప్రాణ శరీరాలు మనస్సు యొక్క నిర్ణయాలకు తలఒగ్గి ఉంటాయి. ఈ దేహం-ఇంద్రియాలు మనస్సు చెప్పినట్లు నడుస్తుంటాయి గనుకనే **మనస్సు అధినేత.** మనస్సుకు ఆధారమైన అధిష్ఠానమైన **ఆత్మ నాయకుడు.**

ఆత్మ ఎట్టిదో, ఎక్కడ దాని నివాసమో తెల్పి దానిని సాక్షాత్కరించు కొనుట ఎట్లో తెలియజేస్తున్నారు మహర్షి.

బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానమును (బ్రహ్మజ్ఞానమును) పొందిన ధీరపురుషులు అమృతము - ఆనంద స్వరూపము ఐన అట్టి బ్రహ్మమును సాక్షాత్కరించు కొందురు అని -

అంటే బ్రహ్మమునకు సంబంధించిన పరిపూర్ణ జ్ఞానమును అందించేవి **ఉపనిషత్తులు.** ఆ ఉపనిషత్తుల ద్వారా పొందే విద్యయే బ్రహ్మవిద్య. అట్టి విద్యను పొందినంత మాత్రాన చాలదు. వారు **ధీరపురుషులై** ఉండాలి. అంటే జ్ఞానాన్ని పొంది జ్ఞానసాధనలు చేసేవారు కావాలి. హృదయాకాశంలో ప్రతిష్ఠితమై, జ్యోతిస్వరూపముగానున్న ఆత్మను ధ్యానించాలి. అలా **ధ్యాన సాధనను** సాగించటంతో బాటు **జ్ఞాన సాధనలు** కూడా సాగించాలి. అట్టిసాధకులకు ఎన్నో కష్టాలు ఎదురౌతూ ఉంటాయి.

అయినాసరే వాటన్నింటిని అధిగమించి ధైర్యంతో ముందుకుసాగాలి. **అట్టి వారే ధీరపురుషులు.**

"జ్ఞాన సాధనానాం భావనాపరిపాక నిమిత్తం తత్త్వజ్ఞానం" జ్ఞాన సాధనలు పరిపక్వం చెందగానే తత్వజ్ఞానానుభూతి - ఆత్మానుభూతి కలుగుతుంది - అని శంకరుల వారు గీతాభాష్యంలో తెలిపారు.

కనుక ఎవరైతే మనస్సును ఏకాగ్రంచేసి, బుద్ధిని శుద్ధంచేసి సాధనలు సాగించారో అట్టి వారికి పరిపాకదశలో ఆత్మానుభూతి కలుగుతుంది.

ఆత్మ ఆనందమయము - అమృతస్వరూపము. అంటే ఆత్మానుభూతిపొందిన వారికి **పరిపూర్ణ నిరంతర ఆనందమే. ఆనందమే వారి స్వరూపం.** అలాగే వారు **అమృతులు.** మరణం - **మార్పులు లేవు. వికారాలు లేవు. శాశ్వత ఆనందప్రాప్తి. అదే మోక్షం.**

ఇట్టి అమృతము - ఆనందము ఐన ఆత్మ హృదయగుహలో ఉన్నదని అంగిరసుడు తెలియజేశాడు. మరి హృదయమేమో అజ్ఞానం చేత - అవిద్యచేత ఆవరించబడి యున్నది. ఆ అజ్ఞానం ఉన్నంతకాలం ఆనందానుభూతి కలుగదు. కనుక అజ్ఞాన బంధం ఛేదించబడుట, ఆనందానుభూతి కలుగుట ఎట్లో రాబోయేమంత్రంలో వివరించబోతున్నారు.

- అజ్ఞాన బంధం ఛేదించబడేది ఎలా? దానివల్ల ప్రయోజనాలేమి?

మం॥ భిద్యతే హృదయగ్రంధిః ఛిద్యంతే సర్వ సంశయాః।
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరా పరే॥(8)

ప్రతి॥ తస్మిన్ పరాపరే దృష్టే = ఎప్పుడైతే హెచ్చుతగ్గులను గుర్తించటం జరిగిందో; హృదయగ్రంథి భిద్యతే = అజ్ఞానపు ముడి వీడిపోతుంది; సర్వసంశయాః = అన్ని సందేహాలు; ఛిద్యంతే = నివృత్తి అవుతాయి; అస్యకర్మాణి = అతడికర్మలన్నీ; క్షీయంతే = నశించపోతాయి.

భావం : ఎప్పుడైతే హెచ్చుతగ్గులను గుర్తించటం జరిగిందో అజ్ఞానపు

ముడి వీడిపోతుంది. అన్ని సందేహాలు తీరిపోతాయి. అతడి కర్మలన్నీ నశించిపోతాయి.

వ్యాఖ్య : నేను ఆత్మను అని మరచుటయే అవిద్య. అజ్ఞానం. ఈ అవిద్య లేదా అజ్ఞానం తొలగేది ఆత్మజ్ఞానంతోనే. నేను ఆత్మననే జ్ఞానంతోనే. నన్ను నేను మరచిన స్థితిలో – నాస్వరూపాన్ని మరచినస్థితిలో **'ఈ క్షేత్రమే నేను'** అనుకొని తాదాత్మ్యం చెందుతాను. క్షేత్రం అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలే. – క్షేత్రమేనేను అనుకోవటంతో ఏం జరుగుతున్నది?

కారణ శరీరంలో వాసనలున్నాయి. అంటే తీరని కోరికలు, చేసిన సంకల్పాలు, పొందిన అనుభవాలు, జ్ఞాపకాలు. **ఇవి ప్రేరేపిస్తుంటే మనో బుద్ధులు పనిచేయటం** ప్రారంభిస్తాయి. **మనోబుద్ధులు ఈ ప్రపంచాన్ని చూస్తాయి.** ప్రపంచంలోని **ద్వంద్వాలను చూస్తాయి.** ఎలా? రాగద్వేషాలతో. రాగద్వేషాలతో మనస్సు ఈ ప్రపంచాన్ని చూడగానే ఈ ద్వంద్వాలకు సంబంధించిన సమాచారాన్ని **బుద్ధి విశ్లేషణ** చేస్తుంది. **ఒకటి కావాలని – మరొకటి వద్దని భావిస్తుంది. దీనితో అనేక సందేహాలు, సంశయాలు – వీటిని పొందటానికి తొలగించుకోటానికి అనేక కర్మలను చేస్తుంది శరీరం.** ఈ కర్మల ద్వారా **కర్మఫలాలు** కూడబెట్ట బడతాయి. **వాటివల్ల మళ్ళీ మళ్ళీ జన్మలు.**

ఇలా బుద్ధిలో అజ్ఞానం. మనస్సులో రాగద్వేషాలు సంశయాలు దేహం ద్వారా జరిగేకర్మలు – ఇవన్నీ అజ్ఞానం వల్లనే.

ఎప్పుడైతే **ఈ రాగద్వేషాలను, హెచ్చుతగ్గులను** గుర్తించటం జరిగిందో – వీటన్నిటికి కారణం **అజ్ఞానం, అవిద్య అని తెలిసిందో – వెంటనే దృష్టి ఈ మొత్తానికి వెనుకనున్న ఆధారం, అధిష్టానం ఐన ఆత్మపైకి తిరుగుతుంది. నేను 'ఆత్మనే' గాని ఈ క్షేత్రాన్ని కాదని తెలుస్తుంది.**

ఇలా 'ఆత్మను' అని తెలియటంతో అజ్ఞానపు గ్రంథి వీడిపోతుంది. హృదయాన్ని ఆవరించియున్న అజ్ఞానమే హృదయగ్రంథి. **గ్రంథి అంటే ముడి.**

ఎక్కడ బడితే అక్కడ తిరిగే కుక్క మెడకు ఒక తాడు చుట్టి **ముడి** వేశాం అనుకోండి. అప్పుడు దానిని ఎక్కడ కట్టివేస్తే అక్కడే పడి ఉంటుంది. ఇంటి ముందు కట్టివేస్తే ఇంటికి కాపలాకాస్తూ పడిఉంటుంది.

అలాగే జీవుడికి **ఈ అజ్ఞానమనే ముడి పడింది.** దానితో బద్ధుడై **ఈ సంసారమనే ఇంటికి కాపలా కుక్క అవుతున్నాడు.** ఇంద్రియాలకు దాసుడై కర్మలు చేస్తూ పడిఉంటాడు. – కుక్కకు తాడు తొలగిస్తే స్వేచ్ఛను పొందినట్లు జీవునికి ఈ అజ్ఞానపు ముడి వీడితే (ఆత్మజ్ఞానంతో) ఇక ఈ సంసారానికి బద్ధుడు కాడు. **స్వేచ్ఛవస్తుంది.** ఈ జనన మరణ చక్రంనుండి **విముక్తి** పొందుతాడు. **ఆత్మాను భూతిలో అజ్ఞానపు ముడి** కాస్తా తొలగి పోతుంది.

దానితో **అన్ని సందేహాలు తొలగిపోతాయి.** సందేహాలన్నీ అజ్ఞానం వల్లనే. సంశయాలు సందేహాలు తొలగించుకొనుటకే కర్మలు చేస్తాడు. కర్మఫలాలు అంటుకుంటాయి. అయితే ఆజ్ఞాన గ్రంధి వీడినవాడు ఆత్మ స్థితిలో కూర్చుంటాడు.

మనశ్శరీరాల వల్ల జరిగే కర్మలకు కేవల సాక్షి అవుతాడు. కనుక కర్మఫలాలు అంటవు. ఇంతకు ముందు చేసిన **కర్మలు జీవభావంలో** చేసినవి గనుక వాటిని అనుభవించే జీవుడు ఇప్పుడు లేకపోవటంతో ఆ కర్మఫలాలన్నీ నశిస్తాయి. **కనుక సర్వ కర్మబంధ విముక్తి – మోక్షప్రాప్తి –**

– "నేను బ్రహ్మమునే" అని ఎవరు తెలసుకోగలరు? –

మం॥ హిరణ్మయే పరేకోశే విరజం బ్రహ్మ నిష్కలం ।
తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మ విదోవిదుః ॥(9)

ప్రతి॥ విరజం = నిర్మలమైనది; నిష్కలం = భాగాలు లేనిది; శుభ్రం = పరిశుద్ధమైనది; జ్యోతిషాం జ్యోతిః = అన్ని వెలుగులకు వెలుగు అయినది అయిన; బ్రహ్మ = బ్రహ్మము; హిరణ్మయే పరేకోశే = బంగారు మయమైన కోశములో; యత్ = ఏది కలదో; తత్ = దానిని; ఆత్మవిదః విదుః = ఆత్మవిదులు తెలుసుకోగలరు.

భావం : నిర్మలమైనది, ఏ భాగాలులేక అఖండమైనది, పరిశుద్ధమైనది, జ్యోతులకు జ్యోతి అయినది అయిన బ్రహ్మము బంగారు మయమైన కోశములో ఉన్నది. దానిని ఆత్మవిదులు తెలుసుకోగలరు.

వ్యాఖ్య : బ్రహ్మము హిరణ్మయ కోశములో ఉన్నట్లు ఆత్మవిదులు తెలుసుకోగలరు. ఆత్మవిదులంటే ఆత్మను తెలిసినవారే. అంటే తాము జడమైన దేహముకాదు. ఆత్మ చైతన్యమే – శుద్ధచైతన్యమేనని గ్రహించినవారు. దేహతాదాత్మ్యం వీడి ఆత్మతో తాదాత్మ్యం చెంది అనంత ఆనందాన్ని అనుభవించేవారు.

వారు బ్రహ్మమును హిరణ్మయ కోశములోనున్నట్లు తెలుసుకున్నారు. హిరణ్మయకోశం అంటే **అనందమయకోశమే.** ఆత్మానుభూతికి అడ్డువచ్చే కోశం ఇదే. ఆత్మకు సన్నిహితంగా ఉన్నందున **దుఃఖం తెలియదు.** కనుకనే దీనిని **సువర్ణకోశం – హిరణ్మయకోశం అన్నారు.** ఇది ఆత్మను కప్పి యుండటం వల్ల ఆత్మానుభూతికి అడ్డుతగులుతున్నది.

''హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖం.'' అని ఈశావాస్యోపనిషత్తులో సత్య స్వరూపుడైన పరమాత్మ ముఖం హిరణ్మయ పాత్రచేత కప్పబడి ఉన్నది అని చెప్పటమైనది. దీనిని తొలగిస్తేనే పరమాత్మ దర్శనం. అందుకే 'ఓ పోషకుడా! సూర్యభగవానుడా! ఆ బంగారు పాత్రను తొలగించు అని ఉపాస్యదేవతను ప్రార్థించటం – ఆ ప్రార్థనతో ఉపాస్య దేవత కరుణించి ఆ పాత్రను తొలగించటం; దానితో పరమాత్మ దర్శనం ఈశావాస్యోపనిషత్తులో చెప్పబడింది.

సాధారణంగా ఆనందంలో ఉన్నవాడు ఆత్మవైపుకు తిరగడు. ఆనంద మయకోశం నిజమైన ఆత్మానందంకాకపోయినా అక్కడ దుఃఖాలేమీ లేవు. ఆనందమే ఉంది. అందుకే సాధకుడు ఉపాస్యదేవతను ప్రార్థించి, ఆ అడ్డు తొలగించుకున్నాడు.

కనుక ఉపాసనా బలంతో ఇది సాధించాలి. హృదయాకాశంలోని బ్రహ్మపురిలోనున్న బ్రహ్మమును ప్రణవ ధ్యానం ద్వారా ఉపాసనచేయాలి.

ఎలా ఉపాసించాలి? –

ఆ బ్రహ్మము నిర్మలము, నిష్కలమూ, శుభ్రం, జ్యోతిషాం జ్యోతిః అని ఉపాసన చేయాలి.

1. ఏదైనా ఒక వస్తువు **మలినం** అయిందీ అంటే రెండవవస్తువు కలిస్తేనే. బియ్యం రాళ్ళతో మలినమవుతాయి. శరీరం మురికితో మలినమవుతుంది. **మనస్సు సంకల్పాలచేత మలినమవుతుంది –** అయితే ఆత్మమలినం కావటానికి **రెండవదేదీ లేదు గదా. కనుక నిర్మలం.**
2. నిర్మలమైన, అద్వయమైన **ఆత్మ నిష్కలం. అంటే భాగాలు లేనిది.** ఆత్మను భాగాలు చేసేవీలు లేదు. భాగాలు చేయటానికి రెండవ వస్తువులేదు. అది అఖండం, సూక్ష్మాతి సూక్ష్మంగనుక సర్వవ్యాపకమై ఒక్కటిగా ఉంటుంది.
3. మలినాలు లేని ఆత్మ శుభ్రం. అంటే పరిశుద్ధమైనది.
4. అట్టి ఆత్మ జ్యోతులకు జ్యోతి. వెలుగులకు వెలుగు. అన్ని వెలుగులకు కారణం ఉంటుంది. ఆత్మ జ్యోతికి కారణం లేదు. అది స్వయం జ్యోతి. సూర్యుడు కూడా స్వయం ప్రకాశంగలవాడు కాదు. ఆయనలో **అంతర్యామిగా** నున్న భగవంతునిదే **ఆ ప్రకాశం.** కనుక ఆత్మను **స్వప్రకాశం** అన్నారు. అన్ని వెలుగులు ఆ బ్రహ్మము యొక్క ప్రకాశంవల్లనే.

'జ్యోతిషామపి తత్ జ్యోతిః' అని గీతలో భగవానుడు కూడా ఆత్మ స్వయంజ్యోతి అని తెలియజేశాడు.

ఇదే విషయాన్ని రాబోయే మంత్రంలో కూడా తెలియజేయబోతున్నారు.

– ఆత్మ జ్యోతులకు జ్యోతి ఎలా ?

మం॥ న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకం
నేమా విద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః।
తమేవ భాంత మనుభాతి సర్వం
తస్యభాసా సర్వమిదం విభాతి॥ (10)

ప్రతి॥ తత్ర సూర్యః నభాతి = అక్కడ సూర్యుడు ప్రకాశించడు; చంద్రతారకం న = చంద్రుడు, నక్షత్రాలు ప్రకాశించవు; ఇమా విద్యుతః నభాంతి = ఈ మెరుపులు ప్రకాశించవు; అయం అగ్ని; కుతః = ఇంక ఈ అగ్ని మాటచెప్పాలా?; తంభాంతం ఏవ = దానియొక్క ప్రకాశంతోనే; సర్వం అనుభాతి = సర్వమూ ప్రకాశిస్తున్నవి; ఇదం సర్వం = ఈ ప్రపంచం అంతా; తస్యభాసా = ఆయన యొక్క వెలుగు వల్లనే; విభాతి = ప్రకాశిస్తున్నది.

భావం : అక్కడ సూర్యుడు ప్రకాశించడు. చంద్రుడు, నక్షత్రాలు ప్రకాశించవు. ఈ మెరుపులు ప్రకాశించవు. ఇక ఈ అగ్ని మాట చెప్పాలా? దాని ప్రకాశాన్ని అనుసరించియే అన్నీ ప్రకాశిస్తున్నవి. ఈ ప్రపంచం అంతా ఆయన వెలుగువల్లనే ప్రకాశిస్తున్నది.

వ్యాఖ్య : ఇదే మంత్రం ఒక్క అక్షరం తేడా లేకుండా కఠోపనిషత్తులోనూ ఉన్నది. (పంచమవల్లి – 15) శ్వేతాశ్వత రోపనిషత్తులోనూ ఉన్నది (6వ అధ్యా14) కేనోపనిషత్తులోనూ ఇదే భావనగల మంత్రం ఉన్నది.

మనం ఏ వస్తువునైనా చూడాలంటే కన్ను ఉండాలి. అయితే వస్తువు చీకటిలో ఉంది. మరి చూడగలమా? **లేదు.** సరే వస్తువు వెలుగులోనే ఉంది,కాని కంటి వెనుక కంటికి శక్తి నిచ్చే చైతన్యం – అధిష్ఠానదేవత లేదు (ప్రాణం లేదు). అప్పుడు చూడగలదా ఆ కన్ను? **చూడలేదు. అంటే సూర్యుని ప్రకాశం ఆ వస్తువు మీదా పడాలి, ఆ వస్తువును చూచే నీకంటి**

వెనుక అంతరంగంలోనూ ఉండాలి – అని తేలిపోతున్నది. అంటే చైతన్య ప్రకాశం బాహ్యంలోని వస్తువులను, చూచేకంటిని, గ్రహించేమనస్సును – అన్నిటిని ప్రకాశింప జేస్తున్నది. అని.

అయితే ఈ ప్రకాశం ఎక్కడిది? నాదే. అంటే ఆత్మదే. ఆత్మనైన నేను ప్రకాశించటం వల్లనే నా మనస్సు – నాకన్ను – ప్రకాశించి; బయటి వస్తువులు తెలియబడుతున్నాయి. నేను కేవలం ఈ దేహంలోనే గాక అంతటా వ్యాపించియున్న చైతన్యాన్ని గనుక దేహంలోని **ఇంద్రియాలను** జగత్తులోని సమస్త **వస్తువులను** వెలిగిస్తున్నాను. కనుక సర్వత్రా వ్యాపించియున్న ప్రకాశం అంతా సర్వాంతర్యామినైన నాదే.

కనుక నా (పరమాత్మ) యొక్క చైతన్యం వల్లనే సూర్యచంద్రులు, నక్షత్రాలు, అగ్ని, విద్యుత్తు – అన్నీ ప్రకాశిస్తున్నవి. అన్నింటిని ప్రకాశింపజేసే ఆ చైతన్యాన్ని (నన్ను) ప్రకాశింపజేసే వస్తువేమి ఉన్నది? **ఏవీ ప్రకాశింపజేయలేవు.** సూర్యుని కాంతితో ఇక్కడ వస్తువును (కుర్చీని) చూస్తున్నాం. మరి సూర్యుని చూడటానికి **కుర్చీ సాయం కావాలా?** ఏమీ అక్కరలేదు. సూర్యునివద్ద దీపంగాని, విద్యుత్తుగాని, చంద్రుడుగాని, నక్షత్రాలుగాని ప్రకాశించవు. **అలాగే అన్నింటిని ప్రకాశింపజేసే పరమాత్మ చైతన్యాన్ని ఎవరు ప్రకాశింపజేయగలరు?** పరమాత్మ వద్ద **సూర్యుడూ ప్రకాశింపలేడు. చంద్రుడూ ప్రకాశింపలేడు. మెరుపులూ ప్రకాశించలేవు. అగ్ని ప్రకాశించదు.**

ఆత్మ చైతన్యం ప్రకాశించినప్పుడే దానిననుసరించి అన్నీ ప్రకాశించబడుతాయి. నిజంగా ఆత్మచైతన్యం వల్లనే అన్ని ఇంద్రియాలు, దేహము, మనస్సు, బుద్ధి అన్నీ ప్రకాశించి వాటి పనులు అవి చేసుకుంటాయి. అలాగే బ్రహ్మాండంలోని **సూర్యచంద్రులు, తారకలు, మెరుపులు – అగ్ని – సర్వమూ కూడా.** ఇలా పిండాండ, బ్రహ్మాండములలోని **అన్నింటిని వెలిగించే చైతన్యమే పరమాత్మ చైతన్యం.**

నిజంగా ఈ మంత్రంలోని ప్రకాశం సామాన్యమైన వెలుగును **గురించి** కాదు చెప్పేది. **జ్ఞాన ప్రకాశం అని అంతరార్థం.**

హారతి : సూర్య, చంద్ర, తారకలు, మెరుపులు ప్రకాశింపజేయలేని ఆ సర్వాంతర్యామి అయిన పరమాత్మ చైతన్యం ముందు **ఈ అగ్ని ఏపాటిది? అని తెలిపిన ఈ మంత్రం సాధారణంగా పూజలు చేసే సమయంలో నీరాజన మిచ్చేటప్పుడు చదువుతారు.** దాని అర్థం ఏమంటే అంతటి సూర్య, చంద్ర, నక్షత్రాల వెలుగే నిన్ను ప్రకాశింపజేయలేవు. నా చేతిలో ఉన్న ఈ చిన్న నీరాజనమనే అగ్ని ప్రకాశింపజేస్తుందా? ఈ అగ్ని ప్రకాశంతో చూడగలనా? ఇది కేవలం ప్రతీక మాత్రమే. దీనిని, ఈ దేహేంద్రియాదులను అన్నింటిని ప్రకాశింపజేసే దివ్య చైతన్యానివి నీవు. కాబట్టి జ్ఞాన ప్రకాశంతో - జ్ఞానముతో నీకు శరణాగతుడనై తెలుసుకోవాల్సిందే - అని భావించుటయే ఇందలి ముఖ్య ఉద్దేశము.

సమస్తము చైతన్యము చేతనే ప్రకాశింపబడుతున్నది. కనుక చైతన్యము అంతటా ఉన్నది. **అంతాచైతన్యమే. అంతా బ్రహ్మమే -** ఈ విషయాన్ని రాబోయే మంత్రంలో తెలియజేయబోతున్నారు.

- సర్వత్రా ఉన్నది ప్రకాశమానమైన బ్రహ్మమే - అసలు జగత్తు అంతా బ్రహ్మమేనని ఈ మంత్రంలో -

మం॥ బ్రహ్మైవేద మమృతం, పురస్తాద్ బ్రహ్మ
పశ్చాద్ బ్రహ్మ దక్షిణత శ్చోత్తరేణ ।
అధశ్చోర్ధ్వం చ ప్రసృతం
బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠం ॥ (11)

ప్రతి॥ ఇదం అమృతం బ్రహ్మఏవ = ఇది అంతయూ అమృతమయమైన బ్రహ్మమే; పురస్తాద్ బ్రహ్మ = ముందుబ్రహ్మమే; పశ్చాద్‌బ్రహ్మ = వెనుక బ్రహ్మమే; దక్షిణతః ఉత్తరేణ = కుడివైపు, ఎడమవైపు; అధఃఊర్ధ్వంచ =

క్రిందపైన కూడ; ప్రస్తుతం = (బ్రహ్మమే) వ్యాపించియున్నది; ఇదం విశ్వం = ఈ విశ్వమంతయూ; వరిష్టం బ్రహ్మేవ = ఉత్కృష్టమైన బ్రహ్మమే.

భావం : ఇది అంతయూ అమృతమయమైన బ్రహ్మమే. ముందుబ్రహ్మమే, వెనుక బ్రహ్మమే. కుడి ఎడమల, క్రింద పైన కూడ బ్రహ్మమే వ్యాపించి యున్నది. ఈ విశ్వమంతయూ ఉత్కృష్టమైన బ్రహ్మమే అయిఉన్నది.

వ్యాఖ్య : సర్వాన్ని వెలిగించి చూపించే స్వయం జ్యోతిని – స్వప్రకాశ చైతన్యాన్ని గురించి చెప్పి **అది అంతయు బ్రహ్మమేనని – అంతటా ఉన్నది యదార్థానికి బ్రహ్మమేనని** ఈ మంత్రంలో తెలియజేస్తున్నాడు మహర్షి.

బ్రహ్మము అమృతము అన్నారు. అంటే మృతం లేనిది అని. పరమాత్మకు చావు పుట్టుకలులేవు. మార్పులు – వికారాలు కూడా లేవు. అందుకే **అమృతం** అన్నారు. కనుక పరమాత్మ నిత్యుడు, శాశ్వతుడు. **సూక్ష్మాతి సూక్ష్మం గనుక సర్వవ్యాపకం.** అంతటా అదే వ్యాపించియుంటే ఇక రెండవదేదీ ఉండే ఆస్కారం లేదు కనుక **ఏకం అద్వయం.**

మనం రాత్రిపూట పొరుగున ఉన్న గ్రామానికి వెళ్తున్నాం. కటిక చీకటి; కీచురాళ్ళ ధ్వని; ఒంటరి ప్రయాణం; ఏవేవో వికృత శబ్దాలు; భయంవేస్తున్నది. అదే సమయంలో ఎదురుగా ఒక దయ్యం. జుట్టు విరబోసుకొని అటూ ఇటూ కదులుతూ వస్తున్నది. అప్పుడప్పుడు నిప్పురవ్వలు కూడా ఆ దయ్యంలో నుండి వస్తున్నాయి. ఓహో! అది కొరివి దయ్యం కాబోలు అనుకుని భయపడ్డాను. పరుగులంకించుకున్నాను. ఇంతలో మెరుపు మెరిసింది. అక్కడొక పెద్ద చెట్టు కనిపించింది. ఆ వెనుక ఒక గుడిసె. అందులో నుండి పొగ, నిప్పురవ్వలు వస్తున్నాయి. అందులో ఎవరో వంట చేస్తున్నారు. ఇంతకీ అక్కడ దయ్యం నిజంగా ఉన్నదా? లేదు. నిజంగా ఉన్నది చెట్టు మాత్రమే. చెట్టు ఉన్నదని తెలియని నాకు **లేని దయ్యం ఉన్నట్లు కనిపించింది.** అది చెట్టు అని తెలియగానే దయ్యం అదృశ్యం. నిజంగా దయ్యం లేదుకదా! అదృశ్యం కావటానికి? భ్రమలో అలా అనిపించిన దయ్యం – భ్రమ తొలగటంతోనే అనిపించలేదు అంతే.

నిప్పురవ్వలు గాని, జట్టు విరబోసుకొని యుండుటగాని నిజంగా చెట్టుకు సంబంధించినవిగావు. అవి ఊహించబడిన దయ్యానికి చెందినవి మాత్రమే.

ఇప్పుడు ఆరోపించబడిన దయ్యం అసత్యం. చెట్టు సత్యం. తెలివిలో ఉన్నప్పుడు - వెలుగులోనున్నప్పుడు ఉన్నది చెట్టు మాత్రమే. భ్రమలో ఉన్నప్పుడు **దయ్యం.** దయ్యం - చెట్టూ రెండూ ఒకేసారి కనిపించినవా? లేదు. అంటే **ద్వైతం అనేది ఎప్పుడూ లేదు.** ద్వైతభావం **మిధ్యయే. చెట్టు ఒక్కటే నిజంగా ఉన్నది.**

ఉన్నది బ్రహ్మ మొక్కటే. ఈ ప్రపంచం అందులో ఆరోపించబడింది. **ఒట్టి మిధ్య మాత్రమే.** నిజంగా ప్రపంచంలేదు. అయితే మనం అజ్ఞానంలో ఉన్నప్పుడు **ప్రపంచం మాత్రమే కనిపిస్తుంది.** అజ్ఞానం తొలిగితే ప్రపంచం అదృశ్యమై **బ్రహ్మమే అనుభూతిగా మిగులుతుంది.** అంటే జ్ఞాన స్థితిలో **అంతటా బ్రహ్మమే.** ముందూవెనుకా, ఆ ప్రక్క ఈ ప్రక్క, క్రిందా పైనా, అంతటా **ఆ బ్రహ్మమే.** అసలు రెండవదేదీ లేక అంతటా ఒక్కటే ఉన్నప్పుడు క్రింద ఏమిటి? పైన ఏమిటి? కుడి ఏమిటి? ఎడమ ఏమిటి? అజ్ఞానంలో ప్రపంచ భావన ఉన్నప్పుడు క్రింద, పైన - కుడి, ఎడమ. ఆ భావన పోతే అంతటా **ఒకే ఒక చైతన్యం మాత్రమే ఉన్నది.**

బ్రహ్మము బ్రహ్మముగానే ఉన్నది. అఖండమై, అద్వయమై, ఆనంద పూర్ణమై, అమృతమై, అనంతమై యున్నది.

యత్ర విశ్వం ఇదంభాతి - కల్పితం రజ్జు సర్పవత్
ఆనంద పరమానందః సబోధస్త్వం సుఖం చర!

త్రాడునందు పాము ఆరోపించబడినట్లు ఎవరియందు ఈ విశ్వం అంతా ఆరోపించబడిందో అట్టి పరమానంద చైతన్యం నీవే. అంతటా నీవే. కనుక సుఖంగా జీవించు - అని **అష్టావక్ర గీతలో అష్టావక్రుడు జనకునకి బోధించాడు.**

కనుక నీయదార్థ స్వరూపం జీవుడుకాదు. అదికేవలం భ్రమ - నీవు సచ్చిదానంద స్వరూపుడవై, సర్వాంతర్యామివైయున్న **బ్రహ్మానివే.**

తృతీయ ముండకం

ప్రథమ ఖండం

– జీవాత్మ పరమాత్మల నిజస్వరూపాన్ని ఉపమానం ద్వారా చక్కగా తెలియజేస్తున్నారు. –

మం॥ ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య
నశ్న న్నన్యో అభిచాక శీతి ॥ (1)

ప్రతి॥ సఖాయా = స్నేహితులై; సయుజా = సదాకలిసి ఉండే; ద్వా సుపర్ణా = రెండు పక్షులు; సమానం వృక్షం = ఒకేచెట్టును; పరిషస్వజాతే = ఆశ్రయించుకొని ఉన్నాయి; తయో అన్యః = అందులో ఒకటి; పిప్పలం = ఫలమును; స్వాదు అత్తి = ఆసక్తితో తింటున్నది; అన్యః = మరొకటి; అనశ్నన్ = తినకుండా; అభిచాకశీతి = చూస్తున్నది.

భావం : స్నేహితులై సదా కలసియుండే రెండు పక్షులు ఒకే చెట్టును ఆశ్రయించుకొని ఉన్నాయి. వానిలో ఒకటి పండును ఆసక్తితో తింటున్నది. మరొకటి ఏమీ తినకుండా ఊరకే చూస్తున్నది.

వ్యాఖ్య : కవితా ధోరణిలో మహర్షి చేత చెప్పబడ్డ మంత్రం ఇది. **ఒక చెట్టు** పై ఎప్పుడూ కలిసియుండే ప్రాణస్నేహితులైన రెండు పక్షులు కూర్చున్నాయి. ఒకటి పండును తింటున్నది. ఒకటి ఊరకనే చూస్తున్నది.

1. ఒకే చెట్టుపై : శరీరమే ఆ చెట్టు, జీవాత్మ పరమాత్మలే **ఆ పక్షులు.** అవి రెండూ సదా కలిసే ఉంటాయి. ఒకే చెట్టును ఆశ్రయించుకొని ఉన్నాయి – అనటంవల్ల జీవాత్మ పరమాత్మలు ఒకే శరీరంలోనే ఉన్నాయి. నిజంగా

జీవాత్మ పరమాత్మ లెవరు? జీవాత్మే పరమాత్మ. పరమాత్మే జీవాత్మ. ఇదే కలసి ఉండటం.

పరమాత్మ అంటే సర్వత్రా వ్యాపించియున్న చైతన్యము. అలా అంతటా వ్యాపించియున్న ఆ సచ్చిదానందరూప చైతన్యం ఈ క్షేత్రంలో కూడా వ్యాపించియున్నది. అదే చైతన్యం ఈ దేహ మనోబుద్ధులతో తాదాత్మ్యం చెంది **జీవాత్మ** అని పిలువబడుతున్నది. అంటే తాదాత్మ్యం చెందిన పరమాత్మే జీవాత్మ. తాదాత్మ్యం వీడిన జీవాత్మే పరమాత్మ. (వడ్లగింజ – బియ్యపుగింజ)

ఈ దేహ మనోబుద్ధులతో తాదాత్మ్యం చెంది జీవాత్మగా ఉన్న మనం ఈ తాదాత్మ్యం వీడితే పరమాత్మే అవుతాం. కనుకనే రెండూ ఈ శరీరంలోనే ఉన్నాయని – ఒకే చెట్టును ఆశ్రయించుకొని ఉన్నాయని చెప్పటం. కనుక మనం పరమాత్మ కొరకు ఎక్కడా వెతకాల్సిన పనిలేదు. ఈ దేహంలోనే జీవాత్మను గుర్తించి, తాదాత్మ్యం వదిలితే చాలు. ఈ ప్రాపంచిక బంధాలను ఈ ప్రాపంచిక – దేహ భావాలను వదలగలిగితే చాలు పరమాత్మగా అనుభవం కలుగుతుంది. మన నిజస్థితి మనకు అవగతం అవుతుంది.

అందుకే **సదా కలిసియుండే స్నేహితులైన రెండు పక్షులు** అని పోల్చటం జరిగింది. **జీవాత్మ పరమాత్మలు ఎప్పుడూ కలిసే ఉంటాయి.** విడిపోయే అవకాశం లేదు. పైగా ఇవి స్నేహితులు. **అంటే ఒకే భావంగల వారి మధ్య చక్కని స్నేహం ఉంటుంది.** నిజానికి జీవాత్మ – పరమాత్మ రెండూ ఒకే భావం సత్–చిత్– ఆనందం.

ఇందులో ఒక పక్షి పండ్లు తింటున్నది. మరొకటి ఊరకే చూస్తున్నది. జీవుడు కర్తగా – భోక్తగా వ్యవహరిస్తుంటాడు, పరమాత్మ అకర్త – అభోక్తగా ఉండిపోతున్నాడు. ఆయన పరిపూర్ణుడు గనుక, ఏ కొరతా లేనివాడుగనుక, ఆయన ఏ కర్మలూ చేయనక్కరలేదు. ఏ ఫలితాలు అనుభవించేపని లేదు. మరి **జీవుడేమోపరిమితుడు**. దేహ మనో బుద్ధులతో తాదాత్మ్యం చెందటం

వల్ల బుద్ధితో కలిసిపోయి తాను ఏవోకోరికలతో – కొరతలతో ఉన్నాననిభావించి, వాటిని తీర్చు కోవటానికి కర్మలు చేస్తాడు. వాటి కారణంగా సుఖమో దుఃఖమో కలుగుతుంది. చెట్టుపై నున్న పక్షి పండ్లను తింటున్నది. తియ్యటి పండ్లైతే సుఖం. చేదు, వగరు పండ్లైతే దుఃఖం. ఈ సుఖదుఃఖాలు తినే పక్షికేగాని, చూస్తున్నదానికేమీ లేదు. రెండవది పరిపూర్ణమైనది. ఆకలి తెలియనిది. ఏమీ తినాల్సిన పనిలేనిది. అది చూస్తూ ఉన్నది. అంతే. దానికే సుఖదుఃఖాలు లేవు. కనుక కర్మలలో తగులు కొన్న వారికే సుఖదుఃఖాలు. **సాక్షిగా చూచే ఆనందస్వరూపమునకు** కర్మలతో పనే లేదు. దేహాన్ని వృక్షంతో ఎందుకు పోల్చారు? ఛేదింపబడేది వృక్షం గనుక. ఈదేహ భ్రాంతిని మనం ఛేదించాలి – అని తెలియజెప్పటానికే –

– ఒకే చెట్టును ఆశ్రయించుకొని యున్న రెండు పక్షులలో ఒకటి పండును తింటూ సుఖదుఃఖాలు అనుభవిస్తున్నది. రెండవది ఏమీ తినక ఊరకచూస్తూ హాయిగా ఉన్నది. మరి సుఖదుఃఖాలు అనుభవించే పక్షి హాయిగా ఉండాలంటే – ?

మం॥ సమానే వృక్షే పురుషో నిమగ్నో౽
(అ)నీశయా శోచతి ముహ్యమానః ।
జుష్టం యదా పశ్యతి అన్యమీశం
అస్య మహిమానమితి వీత శోకః ॥ (2)

ప్రతి॥ సమానేవృక్షే = ఒకేచెట్టుపై; నిమగ్నః = కలిసియున్న రెండు పక్షులలో; పురుషః = జీవాత్మ; అనీశయా = అజ్ఞానముచేత; ముహ్యమానః = భ్రాంతి చెంది; శోచతి = దుఃఖిస్తున్నది; యదా = ఎప్పుడైతే; జుష్టం = పూజార్హమైన; ఈశం = పరమాత్మను, అస్యమహిమానం = అతడివైభవాన్ని; ఇతి = ఇలా అని; పశ్యతి = చూస్తున్నదో; వీతశోకః = శోకాన్ని పోగొట్టుకుంటుంది.

భావం : ఒకే చెట్టును ఆశ్రయించుకొన్న రెండు పక్షులలో ఒకటైన జీవాత్మ

అజ్ఞానం చేత భ్రాంతి చెంది దుఃఖిస్తున్నది. పూజార్హమైనది, ప్రభువు అయిన మరొక దానిని, దాని వైభవాన్ని చూడటంతోనే దాని దుఃఖం అంతా తొలగిపోతున్నది.

వ్యాఖ్య : ఒకే చెట్టును ఆశ్రయించిన రెండు పక్షులలో **ఒకటైన జీవాత్మ** అనబడేది అజ్ఞానం వల్ల – భ్రాంతివల్ల దుఃఖపడుతున్నది. జీవాత్మ అనేది నిజంగా పరమాత్మే. అయితే పరమాత్మననే విషయం తెలియనప్పుడే, మరచినప్పుడే అది జీవాత్మ అవుతున్నది, దుఃఖిస్తున్నది. ఇదే భ్రాంతి. ఇట్టి భ్రాంతికి కారణం ఏమిటి? అజ్ఞానం. (అనీశయా).

అజ్ఞానానికి రెండు శక్తులున్నవి. 1. అగ్రహణం. 2. అన్యధాగ్రహణం. **అగ్రహణం** అంటే గ్రహించలేక పోవటం. త్రాడునుత్రాడుగా గ్రహించలేక పోవటం. అలా గ్రహించలేనప్పుడు అది పాముగా అనిపిస్తుంది. ఇదే **అన్యధాగ్రహణం.** మరొకటిగా భావించటం. దానితో దుఃఖం. ఇప్పుడు మనం మన నిజస్వరూపం 'ఆత్మ' అని గ్రహించ లేక పోతున్నాం. తెలుసుకోలేక పోతున్నాం. కొందరు ప్రయత్న శీలురు తెలుసుకున్నప్పటికి అందులో నిలువలేక పోతున్నారు. ఎప్పుడైతే తన నిజస్వరూపం ఆత్మ అని తెలియదో వెంటనే మరొక విధంగా భావించటం జరుగుతుంది. జీవుడుగా భావించటం జరుగుతుంది.

ఆత్మనని తెలుసుకోలేక పోవటం – అగ్రహణం

జీవుడనని భావించటం అన్యధాగ్రహణం.

ఆత్మ ఆనందస్వరూపం. ఎందుకంటే అది పరిపూర్ణం. దానికి ఏ కొరతలు లేవు. ఏ కోరికలులేవు. ఏ దుఃఖములేదు. కనుక అది నిత్య ఆనందస్వరూపం. ఆత్మనని తెలుసుకోలేని వాడు జీవుడు. అపరి పూర్ణం. అతడికి కొరతలు, కోరికలు, అవసరాలు ఉంటాయి. దుఃఖం ఉంటుంది. కనుక జీవుణ్ణి అనుకున్న వాడికి దుఃఖం తప్పదు. ఆ దుఃఖాన్ని పోగొట్టుకోవటానికి; అవసరాలు, కోరికలు తీర్చుకోవటానికి; పరిపూర్ణత

సాధించటానికి కర్మలుచేయటం ప్రారంభిస్తాడు. ఈ కర్మలు అంతంలేనివి. కర్మలవల్ల కర్మఫలాలు, వాసనలు కూడుకొని అవి ఖర్చుకావటానికి మళ్ళీ మళ్ళీ జన్మలెత్తి కర్మఫలాలనుభవిస్తూ – కొత్త కర్మలు చేస్తూ మళ్ళీ కర్మఫలాలు వాసనలను కూర్చుకుంటూ – సుడిగుండంలో – కర్మసుడి గుండంలో చిక్కుకుపోతాడు జీవుడు. అందువల్ల సుఖంకోసం, – దుఃఖ నివృత్తి కోసం, – పరిపూర్ణత కోసం చేసే కర్మలవల్ల జీవభావంలోనే కూరుకుపోతుంటాడు. దుఃఖసముద్రంలోనే మునిగి పోతుంటాడు.

మరి ఈశోకాన్ని నివారించేదెట్లా? అజ్ఞానంతో జీవ భావాన్ని పొందిన వాడు దుఃఖ సముద్రాన్ని దాటేదెట్లా? – ఎలా దాటాలో అంగిరస మహర్షి తెలియజేస్తున్నారు.

ప్రభువైన మరొకదానిని–ఆత్మను–పరమాత్మను – పూజార్హమైనదానిని – దానివైభవాన్ని – మహిమను చూసినట్లైతే దుఃఖం కాస్తాతొలగి పోతుంది. శాశ్వతానందమే లభిస్తుంది. అంటే పరమాత్మ దర్శనంతో దుఃఖం తొలగి పోతుంది అని అంగిరస మహర్షి తెలియజేస్తున్నారు.

ఇక్కడ పరమాత్మ దర్శనం అంటే నీవు ఒక వస్తువునో, నీ ఎదురుగా నున్న వ్యక్తినో దర్శించినట్లుకాదు. పరమాత్మ నీ కన్న వేరుగనున్న వస్తువో వ్యక్తోకాదు. మరిఎలా? **అ పరమాత్మ పైనే దృష్టిని నిలిపి బుద్ధిలో ప్రాపంచిక విషయాలపై ఆసక్తిని, వ్యామోహాన్ని తొలగించి – దానిని శుద్ధం చేసి, అంతర్ముఖం చేసి నిరంతరం ఆత్మతోనే కలిసిపోయి, ఆత్మగా మిగిలిపోవటం – ఆత్మగా ఉండిపోవటమే పరమాత్మ దర్శనం.** జీవాత్మ జీవభావమనే ముసుగును తొలగించి పరమాత్మగా ఉండిపోవాలి. ప్రపంచంతో అన్ని సంబంధాలు (మానసికంగా – బౌద్ధికంగా) తొలగిపోవాలి. **నిన్ను నీవు పరమాత్మగా తెలుసుకోవటమే జ్ఞానం.** ఈ జ్ఞానంతోనే నీ అజ్ఞానం తొలగేది. ఈ అజ్ఞానం ఒక్కసారిగా తొలగిపోవాలి.

రాత్రినీవు కలగన్నావు. ఆ కలలో నీవు ఏవేవో నేరాలు చేశావు. తప్పులు చేశావు. దాని వల్ల నీకు 5 సంవత్సరాల శిక్షపడ్డది. ఆ శిక్ష నీవు తప్పించుకోవాలంటే నీవు ఒక్క సారిగా పూర్తిగా మేలుకోవాలి. అప్పుడే ఆ మొత్తంరద్దు. మేలుకొని నీ జాగ్రత్ స్వరూపంలో నిలిచావా? స్వప్న అనుభవాలన్నీ రద్దై పోతాయి. అలాగే జాగ్రత్‌లో చేసిన కర్మల యొక్క ఫలాలుగాని – వాసనలుగాని పూర్తిగ రద్దుకావాలంటే నీవు జాగ్రత్ నుండి ఒక్కసారిగా మేల్కొని నీజ్ఞాన స్వరూపంలో – నిజస్వరూపంలో నిలిచిపోవాలి. ఆత్మ స్వరూపంలో నిలిచిపోవాలి. దీని కొరకై సాధనలుచేయాలి. నిరంతరం నీ నిజస్వరూపమైన ఆత్మను నీవుగా భావించాలి. **సోఽహం భావనచేయాలి.** ఆత్మ ఆనందస్వరూపం కనుక పూజనీయం – ఆరాధ్యనీయం. అన్నింటికీ అతీతమైనది. ఉన్నతమైనది. అన్నింటిని శాసించే అధినేత. కనుక ప్రభువు. అట్టి పరమాత్మ దర్శనం చేతనే దుఃఖనిష్పత్తి – ఆనందప్రాప్తి.

– అట్టి సిద్ధిని పొందిన వాని స్థితి ఏమిటి?

మం॥ యదాపశ్యః పశ్యతే రుక్మవర్ణం
కర్తార మీశం పురుషం బ్రహ్మయోనిం ।
తదావిద్వాన్ పుణ్యపాపే విధూయ
నిరంజనః పరమం సామ్య ముపైతి ॥ (3)

ప్రతి॥ యదా = ఎప్పుడైతే; పశ్యః = ఋషి; రుక్మవర్ణం = స్వయంప్రకాశము; బ్రహ్మయోనిం = బ్రహ్మదేవుని పుట్టుకస్థానం; కర్తారం = సృష్టికర్త; ఈశం = ప్రభువు అయిన; పురుషం = పురుషుని; పశ్యతే = దర్శిస్తాడో; తదా = అప్పుడు; పుణ్యపాపే విధూయ = పుణ్యపాపాలను వదిలి; విద్వాన్ = ప్రజ్ఞా వంతుడు; నిరంజనః = నిర్మలము; పరమం = సర్వోత్తమము అయిన; సామ్యం ఉపైతి = సమస్థితిని పొందుతాడు.

భావం : ఎప్పుడైతే ఋషి స్వయం ప్రకాశము, బ్రహ్మ దేవుని పుట్టుకస్థానము,

సృష్టికర్త, ప్రభువు అయిన పురుషుని సాక్షాత్కరించు కుంటాడో అప్పుడు ప్రజ్ఞా వంతుడు పుణ్యపాపాలను వదిలి నిర్మలము, సర్వోన్నతము అయిన సమస్థితిని అందుకుంటాడు.

వ్యాఖ్య : ఎవరు పరమాత్మా నందంలో ఉండగలరు? ఎవరైతే పరమాత్మను దర్శిస్తారో వారే, ఎట్టివాడు **పరమాత్మ?**

1. రుక్మవర్ణం : బంగారువర్ణం. బంగారానికి బంగారురంగు ఎలానో పరమాత్మకు ఆయన ప్రకాశం అలాగ. **అంటే స్వయం ప్రకాశం.** మరొకదాని నుండి గ్రహించాల్సిన పనిలేదు. మరొక దానితో పోల్చేవీలు లేదు. అట్టి స్వయంప్రకాశం గలవాడు -

2. బ్రహ్మయోనిం : ఈ సృష్ఠికి కారణం బ్రహ్మదేవుడైతే ఆయనపుట్టుక ఎక్కడ? ఆయన పుట్టుకకు కారణంఏమిటి? అదే పరమాత్మ చైతన్యం. కనుక పరమాత్మ **బ్రహ్మయోని.**

3. కర్తారం : సృష్ఠికి అసలుకర్త పరమాత్మే. ఒక్కొక్కసారి ఒక్కొక్క బ్రహ్మను సృష్టించి - సృష్టికి ఆదేశిస్తాడు పరమాత్మ. కనుక అసలుకర్త ఆయనే - బ్రహ్మలు ఏజెంట్లు మాత్రమే. గుమాస్తాలు మాత్రమే.

4. ఈశం : ప్రభువు. ఎవరికి? ఈ సృష్ఠి మొత్తానికి. ఈ సృష్ఠిలో ఏది ఎలా తిరగాలో శాసించేవాడు, బ్రహ్మను శాసించేవాడు ఆయనే కనుక ఆయన అంతటికీ ప్రభువు. ఆయనను శాసించేవారెవరూ లేరు.

5. పురుషం : ఆయనపురుషుడు - భర్త. అన్నింటిని భరించేవాడు. ఈ సృష్ఠిని పోషించే భాద్యత కూడా ఆయనదే. ఆయన సాన్నిధ్యం వల్లనే పోషణ జరుగుతున్నది. దేహేంద్రియాలు కదలి వాటి పని అవిచేసుకోవాలన్నా, మనస్సు అనుభవాలు పొందాలన్నా, బుద్ధి ఆలోచించాలన్నా ఈ ఆత్మ చైతన్య శక్తి ఉంటేనే. కనుక అదే అన్నింటిని పోషించే భర్త. ఆధారమైన పురుషుడు. ఇలా పరమాత్మను ఎవరు

తెలుసుకుంటారో అట్టి వానినే ఇక్కడ **పశ్యః** అన్నారు. అంటే రుషి – సిద్ధుడు, జ్ఞాని అని అర్ధం. అట్టిజ్ఞాని ఎప్పుడైతే పరమాత్మను ఈ విధంగా సాక్షాత్కరింప జేసుకుంటాడో అప్పుడు. **పాపపుణ్యాలను అధిగమిస్తాడు.**

1. పాప పుణ్యాలనేవి అజ్ఞానదశలో జీవభావంలో జీవుడు చేసే కర్మలే. **దేహం చేస్తుంటే నేను చేస్తున్నానని దేహ తాదాత్మ్యంతో నెత్తిన వేసుకొనేవి.** అయితే **ఎప్పుడైతే** తన నిజ స్వరూపం ఆత్మ స్వరూపమని – తాను ఈదేహ మనోబుద్ధులకు వేరుగా నున్న శుద్ధచైతన్యాన్నని, **అకర్తను,** అభోక్తనని, ఆనంద స్వరూప పరమాత్మనని సాధకుడు **తెలుసుకుంటాడో** అతడు సిద్ధుడౌతాడు, జ్ఞాని అవుతాడు. ఆ దశలో **తానేమీ చేయని వాడే కనుక అకర్త. అకర్త గనుక ఇక పాపపుణ్యాలనేవి తనకేమీ ఉండవు.** పాప పుణ్యాలు మనోస్థాయిలోనివి. తాను మనోస్థాయినధిగమించిన ఆత్మ స్వరూపం. కనుక తాను పాపపుణ్యాల నధిగమించినట్లే.

2. నిరంజనః : పాపపుణ్యాలనధిగమించిన ఆత్మస్వరూపి ఎట్టి **కల్మషాలు లేని వాడు గనుక నిరంజనుడని** చెప్పబడతాడు. మాలిన్యాలన్నీ మనోస్థాయిలోనే. ఆత్మస్థాయిలో మాలిన్యాలకవకాశం లేదు.

3. పరమం : ఈ లోకంలోని అనాత్మ వస్తువులన్నీ మలినమే. వీటన్నిటికి వేరైన ఆత్మ స్వరూపుడు మాలిన్య రహితుడు గనుక శ్రేష్ఠమైనవాడు. అన్నింటికన్న ఉత్కృష్ట మైనవాడు.

4. సమంఉపైతి : ఇలా ఆత్మను తెలుసుకొని ఆత్మ విదుడైనవాడు అంతటా సమదృష్టి – ఆత్మ దృష్టి కలిగినవాడగును. అనాత్మదృష్టి అసమదృష్టి – **ఆత్మదృష్టే సమదృష్టి.** ఐతే అన్నీచేస్తున్నాడని చెప్పుకుంటున్నా ఆయన నిజంగా ఏమీ చేయని వాడే – ఆయన ఆనందసాగరం – **అట్టి** పరమాత్మను దర్శించినవారే సమస్థితిలో ఉంటారు.

– ఇట్టి ఆత్మవిదుడు ఎలా వ్యవహరిస్తాడు?

మం॥ ప్రాణోహ్యేషయః సర్వభూతైర్వి భాతి
విజానన్ విద్వాన్ భవతే నాతివాదీ।
ఆత్మక్రీడ ఆత్మరతిః క్రియావాన్
ఏష బ్రహ్మ విదాం వరిష్టః ॥ (4)

ప్రతి॥ యః = ఎవరైతే; ప్రాణోహ్యేష = ప్రాణాలకు ప్రాణమై; సర్వభూతైః విభాతి = సర్వజీవులలో ప్రకాశిస్తున్నాడో (ఆ బ్రహ్మమును), విజానన్ = తెలుసుకొని; విద్వాన్ భవతే = విద్వాంసుడవుతాడు; నాతివాదీ = (అతడు) వ్యర్ధ ప్రసంగాలుచేయడు; ఆత్మక్రీడ = ఆత్మయందు క్రీడిస్తూ; ఆత్మరతిః = ఆత్మలో రమిస్తూ; క్రియావాన్ = సత్కార్యాలుచేసే; ఏష = ఇతడే; బ్రహ్మవిదాం వరిష్టః = బ్రహ్మవిదులలో శ్రేష్ఠుడు.

భావం : ఎవడు ప్రాణాలకు ప్రాణమై, సర్వజీవులలో ప్రకాశిస్తున్నాడో అట్టి బ్రహ్మమును తెలుసుకొని విద్వాంసుడైన వాడు వ్యర్థప్రసంగాలు చేయడు, ఆత్మలో క్రీడిస్తూ, ఆత్మలోరమిస్తూ, సత్కార్యాలు చేసే ఇతడే బ్రహ్మవిదులలో శ్రేష్ఠుడు.

వ్యాఖ్య : 1. సర్వభూతములందు ఆత్మ ప్రకాశించుచున్నది. అది ప్రాణాలకు ప్రాణమై ఉన్నదీ; ప్రాణం ఉండటంవల్లనే దేహేంద్రియాలు పనిచేస్తూ ఉంటాయి. అయితే ఆప్రాణాలు నిలుస్తున్నది **ఆత్మ చైతన్యం వల్లనే.** అంటే ఆత్మయే ప్రాణాలకు శక్తి నిస్తున్నది; ఆ ప్రాణాల **వల్లనే సకల భూతములు కదులుతున్నాయి.** భూతములు– లేదా ప్రాణి కోట్లు కదులుతున్నప్పటికి ఆధారమైన **ఆత్మ మాత్రం కదలుట లేదు.** ఎందుకంటే అది సమస్త ప్రాణి కోట్లకు లోపల, వెలుపల అంతటా ఉన్నది. సూది మొన మోపినంత స్థలమైనను ఆత్మలేని చోటు లేదు. కనుకనే కదలలేదు. అది అంతటా

ఉన్నది గనుక అది అన్ని ప్రాణులలోను ఉన్నట్టే – అది ఒక్కటే. కనుక అందరిలో ప్రకాశిస్తున్న **ఆత్మ ఒక్కటే.** దానిని తెలుసుకున్నట్లైతే అన్నింటిని తెలుసుకొన్నట్లే. **అందుకే** ఏది తెలుసుకుంటే ఇక తెలుసుకోవాల్సినది ఉండదో అట్టి విద్యను బ్రహ్మవిద్య అన్నారు. **ఆత్మను తెలుసుకోవటం అంటే తాను ఆత్మననే అనుభూతిని నిరంతరము కలిగి ఉండటమే. ఆత్మగా వ్యవహరించటమే.** ఈ దేహేంద్రియాలు, మనోబుద్ధులు తనకన్న వేరుగా నున్నట్లు సాక్షిగా గమనించటమే. తనదేహమనోబుద్ధులు తనకన్న వేరుగా ఉన్నాయని భావించి – అన్నింటిని సమదృష్టితో చూడగలగటమే – అన్నింటిలోను ఉన్న తనను తాను దర్శించుకొంటూ ఉండుట.

2. నాతివాది : అట్టి దృష్టిగలవాణ్ణి **విద్వాంసుడంటారు.** అతడు ఆత్మజ్ఞానంలో నిష్ఠకలిగి ఉంటాడు. అతడు అనవసరంగా వ్యర్థభాషణలు చేయడు. తన స్థితిలోకి రాదలచిన సాధకులకు మార్గదర్శకుడౌతాడు. తన అనుభవాన్ని మాటలతో వర్ణించి సాధకులకు సాయపడతాడు. అవసరమైన వాటిని దాచిపెట్టి వ్యర్థమైన వాటిని పలకడు. డాంబిక ప్రదర్శనలు, అట్టహాసాలు, ఆర్భాటాలు ఉండవు. అతడే విద్వాన్.

3. ఇట్టి విద్వాంసుడు ఆత్మలో క్రీడిస్తాడు. అంటేతాను ఆత్మగా ఉండి జీవితాన్ని **ఒక ఆటగా భావించి క్రీడిస్తాడు.** ఇక్కడ చేసేపనులన్నీ అతడికి **క్రీడలే.** అలాగే ఆత్మలో **రమిస్తూ ఉంటాడు.** అంటే ఎల్లప్పుడూ జీవుడుగా, వ్యక్తిగా కాక **ఆత్మగా ఉండి ఆత్మానందాన్ని అనుభవిస్తుంటాడు.**

4. అట్టివారు సత్కర్మలాచరిస్తారు అని మహర్షి చెప్పారు. సత్కర్మలైనా – దుష్కర్మలైనా – అసలు చేయాల్సిన విధి ఏమున్నది? అంటే ఆత్మజ్ఞాని బండరాయిలాగా ఒక చోట పడి ఉంటాడా? అతడు **అకర్త – అభోక్త గదా!** అంటే నిజమే. అయితే అతడు తన శరీరం ద్వారా, మనోబుద్ధుల

ద్వారా జరిగేకర్మలకు కర్తకాడు; తాను ఏసంకల్పాలు చేయడు, ఏ కర్మలు చేయడు, అయితే మనలో అప్రయత్నంగా కొన్ని కర్మలు ఎలా జరిగిపోతున్నాయో అలాగే అతడిలో సత్కర్మలు జరిగిపోతాయి. నిద్రపోవటం – కల రావటం, సుషుప్తి – మెలకువ – ఇవన్నీ అప్రయత్నంగా మనలో జరిగిపోతున్నట్టే ఆత్మజ్ఞాని కూడా ఇతరులు తరించడానికి మార్గదర్శకులౌతారు. వారు ఆత్మగా – బ్రహ్మముగా ఉండి పోతారుగనుక వారు బ్రహ్మ విదులలో శ్రేష్ఠులు. వారికి ఏ కర్మ ఫలాలు అంటవు. ఏ ప్రారబ్ధమూ లేదు. సమస్త కర్మలు దగ్ధమై పరమాత్మగా ప్రకాశిస్తూ ఉంటారు.

– అట్టి ఆత్మను దర్శించే విధము ఏమిటి? సాధన ఏమిటి?

మం॥ సత్యేన లభ్యః తపసాహ్యేష ఆత్మ
సమ్యగ్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యం ।
అంతః శరీరే జ్యోతి ర్మయోహి శుభ్రో
యం పశ్యంతి యతయః క్షీణదోషాః ॥ (5)

ప్రతి॥ సత్యేన = సత్యముచేత; తపసా = తపస్సుచేత; సమ్యక్‌జ్ఞానేన = సమ్యక్‌జ్ఞానముచేత; బ్రహ్మచర్యేణ = బ్రహ్మచర్యంచేత; ఏష ఆత్మాలభ్యః = ఈ అత్మ లభ్యమవుతుంది; క్షీణదోషాః = పాపాలు తొలగగానే; జ్యోతిర్మయః = జ్యోతిర్మయము; శుభ్రః = పరిశుద్ధము అయిన; అయం = ఈ ఆత్మను; యతయః = సన్యాసులు (ప్రయత్నశీలురు); అంతఃశరీరే = శరీరంలోనే; నిత్యం = నిత్యమూ; పశ్యంతి = దర్శిస్తారు.

భావం : సత్యముచేత, తపస్సుచేత, పరిపూర్ణ ఆత్మజ్ఞానము చేత, బ్రహ్మ చర్యముచేత ఈ ఆత్మలభ్యమవుతుంది. పాపాలన్నీ తొలగిపోగానే జ్యోతిర్మయము, పరిశుద్ధము అయిన ఈ ఆత్మను సన్యాసులు శరీరంలోనే నిత్యము దర్శిస్తారు.

వ్యాఖ్య : ఆత్మఎలా లభ్యపడుతుందో తెలియజేస్తున్నారు. నిజంగా ఆత్మ ఒక వస్తువుకాదు – దానికొక రూపం లేదు. అది నీకన్న వేరుగా లేదు. అది క్రొత్తగా ఎక్కడి నుండో సంపాదించేదీకాదు. **ఆత్మను నేనేనని తెలియుటయే ఆత్మ లభించుట అంటే. అంటే ఆత్మ జ్ఞానమే ఆత్మలభ్యత.** ఈ ఆత్మజ్ఞానం అనేది ఎవరికి పడితే వారికి లభించేదికాదు. అందరూ చదవవచ్చు – వినవచ్చు. విచారణ చేయవచ్చుగాని ఆత్మజ్ఞానం నిలవదు. మరి ఎవరిలో నిలుస్తుంది? అర్హత సంపాదించిన వారిలోనే నిలుస్తుంది. ఏమిటా అర్హత?

1. సత్యం 2. తపస్సు 3. సమ్యక్ జ్ఞానం 4.బ్రహ్మచర్యం.

1. సత్యం : అంటే సత్యాన్ని పలుకుట. సత్యాన్నే ఎందుకు పలకాలి? అసత్యాన్ని పలికితే ఏమి? అసలు అసత్యం పలికితేనే లాభం కలుగుతున్నది గదా! సత్యంవల్ల అన్నీ కష్టాలు, నష్టాలే గదా! సత్యహరిశ్చంద్రుడి కథ మనకు తెలుసుగదా!

సత్యంవల్ల వాక్కు శుద్ధి అవుతుంది. **ఇదిశ్రేయోమార్గం.** తాత్కాలికంగా కొన్ని కష్టాలు, నష్టాలు వస్తే రావచ్చుగాక; అనిత్యమైన వస్తువుల విషయంలో నష్టంకలగవచ్చు. కాని శాశ్వత ఆనందాన్ని పొందాలంటే మాత్రం సత్యభాషణం ఎంతో ముఖ్యం. సత్యభాషణం నీలో త్రికరణ శుద్ధి కలిగిస్తుంది. అంతఃకరణం శాంతంగా ఉంటుంది. మనస్సులో ఒకటి భావించి; నోటితో మరొకటి చెబుతూ, చేతల ద్వారా మరొకటి చేసే వారికి మనశ్శాంతి ఉండదు. ఎప్పుడు తమ తప్పులు బయట పడతాయోనని, తమ అబద్ధాలు బయట పడతాయోనని, నిరంతరం ఆందోళన చెందుతూనే ఉంటారు. అలా మనస్సు ఆందోళనతో – అశాంతితో నింపుకున్న వారికి ఆత్మజ్ఞానాన్ని పొందే అర్హతలేనట్లే. కనుకనే సత్యమునే పలుకవలెను. 'సత్యంవద' అనివేదాలు చెబుతున్నది అందుకే. సత్యంద్వారా వాక్ శుద్ధి అవుతుంది.

2. తపస్సు : తపస్సు అంటే తపించుట అని. దేనికొరకు తపించాలి? డబ్బుకొరకు, ఇంటికొరకు, భార్యకొరకు, బిడ్డలకొరకు, సంపదలకొరకు, భోగాల కొరకు తపించటం కాదు. **స్వస్థానం చేరుకొనుటకు తపించాలి. ఆత్మానుభూతికైతపించాలి.** తపించటం అనేది మనస్సు ద్వారా చేయవలసినది. కనుక భగవంతుని కొరకు **తపిస్తే మనశ్శుద్ధి జరుగుతుంది.** మన ఇంద్రియాలను, మనస్సును బాహ్యంగా పోనీయక - వాటిని నిగ్రహించి, అంతర్ముఖం చేయటమే తపస్సు. కేవలం శరీరాన్ని హింసపెడితే అది తపస్సు కాదు అని భగవానుడే సెలవిచ్చారు. బంధం అనేది శరీరానికి కాదు. మనస్సుకు. కనుక విముక్తికూడా మనస్సుకే కలగాలి. అదికలగటానికే తపస్సు - అంటే ఏంచేయాలి? జపధ్యానాలతో నిరంతరం మనస్సును తపింపజేయాలి. **దీనివల్ల మనశ్శుద్ధి జరుగుతుంది.**

3. సమ్యక్‌జ్ఞానం : వాక్కు - మనస్సు - ఈరెండూ శుద్ధి చెందిన తర్వాత ఇక **బుద్ధి శుద్ధం** కావాలి. బుద్ధిలో అనేక విషయాలుంటాయి. అనేక ఆలోచనలు, కోరికలు కదలాడుతూ ఉంటాయి. అట్టిబుద్ధిని కలుషబుద్ధి అంటారు. అట్టి కలుషబుద్ధి ద్వారా ఆత్మ దర్శనంకాదు. కనుక దానిని శుద్ధిచేయాలి. ఎలాచేయాలి? బుద్ధిలోని ప్రాపంచిక విషయాలు, కోరికల స్థానంలో పరమాత్మకు సంబంధించిన విషయాలురావాలి. అలారావాలంటే శాస్త్రాలలో చెప్పిన విషయాలను విని, వాటిని మననం చేయాలి. వేదాలు - ఉపనిషత్తులు - భగవద్గీత - ఇలా అనేక ఆధ్యాత్మిక విషయాలను తెలిపే గ్రంధాలున్నాయి. వాటిని అధ్యయనం చేయాలి. వీటి ద్వారానే సరియైన జ్ఞానం కలుగుతుంది. వాటిని సరిగ్గా అవగాహన చేసుకోవాలంటే శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన సద్గురువును ఆశ్రయించి ఈ సమ్యక్ జ్ఞానాన్ని గ్రహించాలి. శ్రవణ మననాల ద్వారా జ్ఞానాన్ని స్థిరపరచుకోవాలి. జ్ఞానంతో బుద్ధిని బాగా **రాపాడిస్తే** బుద్ధికి పదును పెట్టినట్లవుతుంది. బుద్ధిలోని కల్మషాలన్నీ తొలగి పోతాయి. **దానితో బుద్ధి శుద్ధ మౌతుంది.** శుద్ధబుద్ధిలో ఆత్మజ్ఞానం నిలిచిపోతుంది. అందుకే **'బుద్ధి**

గ్రాహ్యమతీంద్రియం' అన్నారు. **కనుక సమ్యక్‌జ్ఞానంతో బుద్ధిని శుద్ధంచేసుకోవాలి.**

4. బ్రహ్మచర్యం : బ్రహ్మజ్ఞానం కలగాలంటే బ్రహ్మచర్యాన్ని అవలంబించాలి. బ్రహ్మచర్యం అంటే నిరంతరము బ్రహ్మమునందు చరించుట. సదా ఇంద్రియ మనో నిగ్రహాలతో మనస్సును శుద్ధిచేసి - బుద్ధితో శాస్త్రాల ద్వారా బ్రహ్మ జ్ఞానాన్ని సంపాదించి - దానిని మననంచేసి - నేను బ్రహ్మమునే గాని ఈ దేహాన్ని కాదు అనేనిశ్చయంతో నిరంతర **బ్రహ్మ భావనచేస్తూ ఆ బ్రహ్మమునందే చరించాలి. బ్రహ్మముగా ఉండిపోవాలి.**

క్షీణదోషాః : ఇలా నాలుగు సాధనల ద్వారా పాపాలన్నీ క్షయమవుతాయి. పాపాలంటే **వాసనలే.** వాసనలెప్పుడూ కర్మలను ప్రేరేపిస్తాయి. వాసన లంతరిస్తే కర్మలు అంతరించి మనస్సు నిశ్చలమౌతుంది. ఇలా మనస్సు నిశ్చలంకాగానే, **ఈ దేహమునందే ప్రకాశిస్తున్న జ్యోతిస్వరూపము - పరిశుద్ధము ఐన ఆత్మను సాధకులైనవారు - సన్యాసులైనవారు** నిత్యమూ దర్శిస్తూ ఉంటారు.

తాను ఆత్మ స్వరూపమేగనుక దానిని ఈదేహానికి **వెలుపలగాక లోపలనే దర్శిస్తారు.** దర్శించటం అంటే అనుభూతి చెందటమే. దీనిని యతయః = **సన్యాసులు పొందగలరు.** అంటే కాషాయ వస్త్రధారులు మాత్రమే పొందగలరు అనికాదు. మనస్సు సన్యసించాలి. మనస్సు అన్నింటిని వదలాలి. విషయాసక్తి ఏ మాత్రము మనస్సులో మెదలరాదు. అలా పూర్తిగా నిశ్చలమైన మనస్సే సన్యసించిన మనస్సు. అట్టి నిత్య సన్యాసియే నిత్యమైన - సత్యమైన ఆత్మదర్శనానికి అర్హుడు.

"జ్ఞేయస్స నిత్యసన్యాసీ యోనద్వేష్టి నకాంక్షతి" (గీత) ఎవరుదేనినీ కోరడో - దేనినీ ద్వేషింపడో అతడే నిత్య సన్యాసి అని భగవానుడు సెలవిచ్చారు గీతలో. కనుక అట్టి సన్యాసి కావాలి ఆత్మ దర్శనానికి - కనుక సత్యం, తపస్సు, సమ్యక్ జ్ఞానం, బ్రహ్మచర్యం- ఇవే ఆత్మదర్శనానికి సాధనలు.

– సత్యం యొక్క ప్రాముఖ్యత, దాని వల్లప్రయోజనం ఏమిటో ఈ మంత్రంలో–

మం॥ సత్యమేవ జయతే నానృతం
సత్యేన పంథా వితతో దేవయానః ।
యేనా క్రమంతి ఋషయో హ్యాప్తకామా
యత్ర తత్ సత్యస్య పరమం నిధానం ॥ (6)

ప్రతి॥ సత్యం ఏవజయతే = సత్యమేజయిస్తుంది; అనృతంన = అసత్యం జయించదు; సత్యేన = సత్యము చేతనే; దేవయానః పంథా = దేవయాన మార్గము; వితతః = ఏర్పడియున్నది; ఆప్తకామా ఋషయః = ఆప్తకాములైన ఋషులు; యేన = ఈ మార్గము ద్వారానే; తత్ సత్యస్య పరమం నిధానం = ఆ సత్య నిలయమైన పరంధామాన్ని; ఆక్రమంతి = చేరుకుంటారు.

భావం : సత్యమే జయిస్తుంది. అనృతం జయించదు. సత్యము చేతనే దేవయాన మార్గము ఏర్పడియున్నది. ఆప్తకాములైన ఋషులు ఈ మార్గం ద్వారానే సత్యనిలయమైన ఆ పరంధామాన్ని చేరుకుంటారు.

వ్యాఖ్య : "సత్యమేవ జయితే" సత్యమేజయిస్తుంది. అసత్యం జయించదు. – ఇది ఉపనిషద్వాక్యం. సత్యమునకు ప్రారంభదశలో అపజయం కలిగినా అంతిమ విజయం సత్యానిదే. అసత్యానికి లభించే విజయం అనిత్యమైనదే. అసత్యం వల్ల తాత్కాలికంగా ప్రయోజనం చేకూరవచ్చునేమోగాని అది స్థిరంగా నిలిచేదికాదు. అసత్యం భయాన్ని కలిగిస్తుంది. సత్యం నిర్భయంగా ఉండేట్లుచేస్తుంది. కష్టాలు వస్తాయిగదా అని అసత్యం పలకరాదు. సత్యం పరమాత్మ దరిచేరుస్తుంది. అసత్యం ప్రపంచం దరిచేరుస్తుంది. సత్యమనేది నిజమైన సుఖస్థానం.

ఎవరైతే సత్య మార్గాన నడుస్తారో వారు దేవయానమార్గం ద్వారా ప్రయాణించి సత్యలోకాన్ని – అంటే బ్రహ్మలోకాన్ని చేరుతారు. దీనినే

వేదాంతంలో 'క్రమముక్తి' అంటారు. బ్రహ్మలోకం లేదా సత్యలోకం అంటే ఏమిటి? మనకు 7 అధోలోకాలు - 7 ఊర్ధ్వలోకాలు ఉన్నాయి. ఊర్ధ్వలోకాలు ఏడింటిలోను అన్నింటికన్న పైన ఉన్నది సత్యలోకమే. అక్కడకు చేరిన వారు తిరిగి జన్మలెత్తి దుఃఖాలు పడవలసిన పనేలేదు. అందుకే ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తి నోర్జునః అన్నారు. - గీతలో. బ్రహ్మలోకం దాకా ఉండే అన్నిలోకాలు కూడా పునరావృత్తి కలిగినవే. అంటే తిరిగి వచ్చేవే. ఐతే ఒక్క బ్రహ్మలోకానికి పోతే మాత్రం అలా తిరిగి వచ్చే అవసరంలేదు. సత్యమార్గాన వెళ్ళేవారు ఇంద్రియనిగ్రహం కలిగి, కోరికలంతరించిన వారు గనుక ఈ మార్గంలో వారు బ్రహ్మలోకాన్ని చేరుకొని అక్కడ బ్రహ్మచేత ఉపదేశంపొంది, బ్రహ్మగారి ప్రవచనాలు వింటూ ఆయన ఉన్నంతకాలం అక్కడే ఉండి - ఆ తర్వాత ఆయనతోబాటుగ పరమాత్మలో విలీనమైపోతారు. అయితే ఇదంతా ఇక్కడే కోరికలనన్నింటినీ అంతం చేసుకొని **నిష్కాములైన వారికే.** అలాగాక కోరికలతో - (అవి ఎలాంటివైనా కావచ్చుగాక) ఉన్నట్లైతే అట్టివారు పితృయాన మార్గంలో ప్రయాణించి పుణ్యలోకాలకు - ఊర్ధ్వలోకాలకు వెళ్ళి - అక్కడ కొంతకాలం సుఖభోగాలు అనుభవించి - చేసుకున్న పుణ్యం క్షయమై పోగానే అప్పటికి మిగిలిన సంచింత కర్మలలో నుండి పక్వానికి వచ్చిన ప్రారబ్ధ కర్మ ఫలాలను అనుభవించటానికి తిరిగి మర్త్యలోకంలో మానవులుగానో - పశుపక్ష్యాదులుగానో జన్మించాలి.

కనుక సత్యమార్గాన నడిచేవారు సత్యలోకానికి, అసత్య మార్గాన నడిచిన వారు తిరిగి తిరిగి మర్త్యలోకానికి చేరుకుంటూ ఉండాలి. ఎవరిలో కోరికలు లేవో అట్టి మహాత్ములలో ఇక దోషాలంటూ ఉండే అవకాశం లేదు. రాగద్వేషాలు కాని, అహంకార మమకారాలుగాని, డంబదర్పాలుగాని, కీర్తి ప్రతిష్ఠలకై ప్రాకులాటలుగాని, అన్యాయ, అసత్యాలు గాని ఉండవుగనుక వారు సత్య దర్శనం చేస్తారు. సత్యలోకాన్ని

చేరుకుంటారు. సత్యానికి – అంటే పరమాత్మకు దగ్గరవుతారు. అయితే వారికి తమస్వరూప జ్ఞానం కావాలి గనుక ఆ జ్ఞానాన్ని అక్కడ అందుకుంటారు. మరి సత్యస్వరూపులు కావటం కూడా అక్కడే జరుగుతుందా? కాదు కాదు. అది ఇక్కడే, ఈ దేహం ఉండగానే జరగాలి.

– సత్య స్వరూపం ఎలాంటిదో, దానిని ఎక్కడ ఎప్పుడు దర్శించాలో తెలియజేస్తున్నారు.

మం॥ బృహచ్ఛ తద్దివ్య మచింత్య రూపం
సూక్ష్మాచ్ఛ తత్ సూక్ష్మతరం విభాతి।
దూరాత్ సుదూరే తది హాంతి కే చ
పశ్యత్ స్విహైవ నిహితం గుహాయాం ॥ (7)

ప్రతి॥ తత్ బృహత్ = అది పెద్దది; దివ్యం = దివ్యమైనది; అచింత్యరూపం = చింతించుటకు వీలుకానిది; సూక్ష్మాత్ సూక్ష్మతరం = సూక్ష్మమైనదాని కన్న సూక్ష్మమైనదై; విభాతి = విరాజిల్లుతున్నది. తత్ = అది; దూరాత్సుదూరే = దూరమైన వాటికన్నా దూరంగా ఉన్నది; ఇహ అంతికేచ = ఇక్కడే లోపల ఉన్నది; నిహితం గుహాయాం = హృదయ గుహలో ఉన్న దానిని; పశ్యత్సుఇహ ఏవ = ఈ జన్మలోనే ఋషులు సాక్షాత్కరించుకోగలరు.

భావం : ఆ సత్యస్వరూపం పెద్దది, దివ్యమైనది, చింతించవీలు లేనిది, సూక్ష్మాతి సూక్ష్మమై విరాజిల్లు తున్నది. అది చాలాదూరం, ఇక్కడే దేహంలోనే ఉన్నది. హృదయ గుహలో ఉన్న దానిని ఋషులు ఈ జన్మలోనే సాక్షాత్కరించుకుంటారు.

వ్యాఖ్య : సత్యస్వరూపం అంటే పరమాత్మ స్వరూపమే, బ్రహ్మమే. అది.

1. 'బృహత్' అంటే పెద్దది అని. ఎంత పెద్దది అంటే అంతకన్న పెద్దది మరొకటి లేదు. అసలు అది ఏకం అద్వయం. రెండవదేదీ లేనిది – ఒక్కటే. కనుక మరొక దానితో పోల్చే వీలు లేదు; అసలు మరొకటి లేదు

గనుక. అయితే ఆ బ్రహ్మము యొక్క స్వరూపం అతి విచిత్రమైనది గనుక, ఇక్కడి అసత్ పదార్థాలను వర్ణించినట్లు వర్ణించ వీలు లేనిది గనుక, దానిని పెద్దదని చెప్పి; మరల **సూక్ష్మాత్-తత్-సూక్ష్మతరం** అన్నారు. అంటే అతిచిన్న వాటికన్న చిన్నది అని. అంటే బ్రహ్మము కన్న పెద్దదీలేదు. బ్రహ్మము కన్న చిన్నదీలేదు. నిజంగా బ్రహ్మము కన్న అన్యమైన సత్ వస్తువేదీ లేదు గనుక ఇలా చెప్పాల్సి వస్తున్నది.

అన్నింటి కన్న పెద్దది – అన్నింటికన్న చిన్నది అనే ఈ విషయాన్ని కథారూపంలో భాగవతంలో వివరించారు వ్యాసులవారు.

చిన్ని కృష్ణుడు గోవులను, గోపాలకులను రక్షించటానికి గోవర్థనగిరిని తన చిటికెన వ్రేలిపై నిలిపాడు. అలా భగవానుడెంత గొప్పవాడో – బలవంతుడో తెలిపాడు. అలాగే సత్యభామ శ్రీకృష్ణుని **(పెద్దకృష్ణుని)** తులాబారంలో తూయాలనుకుంది. ఎంత బంగారం వేసినా – వజ్ర వైఢూర్యాలు వేసినా చాలలేదు. కాని రుక్మిణీ దేవి తులసీ దళం వేసింది. అంతే అంతకృష్ణుడూ తులసీదళం కన్న తేలికయ్యాడు. అందుకే అణోరణీయాన్ మహతో మహియాన్ అన్నారు. (చిన్ని కృష్ణుడు చిటికెన వ్రేలుపై గోవర్థన గిరినిలిపితే పెద్దకృష్ణుడు తులసీదళంతో తూగాడు)

2. దివ్యం : ఇట్టి చిత్రమైనది గనుకనే బ్రహ్మమును దివ్యం – దైవ సంబంధం అన్నారు. లౌకిక వస్తువుల వంటిది కాదు బ్రహ్మము. అది సూక్ష్మాతి సూక్ష్మం సర్వవ్యాపకం, జ్యోతిషాం అపి తద్ జ్యోతిః, కనుకనే దివ్యం.

3. అచింత్యరూపం : చింతించ వీలులేనిది. ఈ లోకంలోని దేనినైనా చింతించవచ్చు. చింతించటానికి మనకు మనస్సున్నది. ఈ మనస్సేమో పరిమితమైనది.

పరిమితమైన మనస్సు పరిమిత వస్తువులను మాత్రమే చింతించగలుగుతుంది. అపరిమిత తత్త్వమైన పరమాత్మను చింతించలేదు.

ఏ పరమాత్మ చైతన్య శక్తి కారణంగా మనస్సు పనిచేయగలుగుతున్నదో ఆ పరమాత్మను మనస్సు చింతించలేదు. కనుక అచింత్యం.

4. సూక్ష్మాత్ సూక్ష్మతరం : ఆకాశం అన్నింటి కన్న సూక్ష్మం. ఆత్మ ఆకాశం కన్న సూక్ష్మం. కనుక సూక్ష్మాతి సూక్ష్మం. సూక్ష్మమైన వాని కన్న సూక్ష్మమైనది.

5. అది దూరాత్ సుదూరే : దూరమైన వాటికన్న చాలా దూరమైంది. అలాగని భయపడకు; తత్ **ఇహ అంతికేచ :** ఇక్కడే లోపలనే – ఈ దేహంలోనే ఉన్నది. ఇదే విషయాన్ని ఈశావాస్య మంత్రం చెబుతున్నది. "తద్దూరే – తద్వంతికే" అని. సర్వవ్యాపకమైనది దూరంగా ఉన్నదని ఎలా చెబుతాం? దగ్గరగా ఉన్నదని ఎలా చెబుతాం? దూరంగా ఉన్నదంటే దగ్గరగా లేదని; దగ్గరగా ఉన్నదంటే దూరంగా లేదని, కాని అది దూరం –దగ్గర రెండూను. అజ్ఞానులకు అదిదూరం విజ్ఞానులకు అది దగ్గర. దగ్గరంటే ఎంతదగ్గర? ఈదేహంలోనే ఉన్నది.

అట్టి బ్రహ్మమును ఎక్కడ ఎప్పుడు దర్శించాలో తెలియజేస్తున్నారు. ఇది **సాధకులకు గొప్ప ప్రోత్సాహం.**

నిహితం గుహాయాం : ఇక్కడే – ఈ హృదయ గుహలోనే దర్శించవచ్చు. మముక్షువులు **ఈ జన్మలోనే – ఇక్కడే దానిని దర్శిస్తారు.** హృదయకుహరంలో ప్రజ్వలిస్తున్న అగ్ని జ్వాల మధ్య పరమాత్మచైతన్యం ఉంది. 'తస్యా శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః' **అది నీవే.** నీవు ఈ కనిపించే దేహానివి కాదు. ఊహకు అందే మనస్సు, బుద్ధి కాదు. వీటన్నింటికి ఆధారంగా – వెనుకగా ఉన్న చైతన్యమే నీవు. అలా 'నేను అదే'నని స్థిర నిశ్చయానికి రావటమే ఆత్మ దర్శనం. పరమాత్మ దర్శనం. ఇది ఇక్కడే సాధించాలి. అంటే ఈ మానవ జన్మలోనే సాధించాలి.

– పరమాత్మ దర్శనం ఎలా? వేటితో దర్శించగలం?

మం॥ న చక్షుషా గృహ్యతే నాపివాచా
నాన్యైర్ దేవైః తపసా కర్మణావా।
జ్ఞాన ప్రసాదేన విశుద్ధ సత్త్వః తతస్తుతం
పశ్యతే నిష్కలం ధ్యాయమానః ॥ (8)

ప్రతి॥ చక్షుషా న గృహ్యతే = కన్నులతో చూడబడదు; వాచా అపిన = వాక్కుద్వారా కూడ తెలియబడదు; అన్యై దేవైః న = ఇంద్రియాల ద్వారా తెలియబడదు; తపసా వా కర్మణా నః = తపస్సుచేత లేదా కర్మలచేత పొందబడదు; జ్ఞానప్రసాదేన = జ్ఞానంచేత; విశుద్ధసత్త్వః = అంతఃకరణం శుద్ధమైనప్పుడు; ధ్యాయమానః = ధ్యానస్థితిలో; నిష్కలం తం = నిష్కలమైన బ్రహ్మమును; పశ్యతే = దర్శిస్తారు.

భావం : పరమాత్మ కన్నులతో చూడబడదు. వాక్కుగాని, ఇంద్రియాలుగాని తెలుసుకోలేవు. తపస్సు లేదా కర్మల వల్ల అత్మ పొందబడదు. ఆత్మ జ్ఞానంతో అంతః కరణం (బుద్ధి) శుద్ధమైనప్పుడు, ధ్యానస్థితిలో అద్వయబ్రహ్మమును దర్శించటం జరుగుతుంది.

వ్యాఖ్య : ఆత్మ – లేదా బ్రహ్మము అత్యంత సూక్ష్మాతిసూక్ష్మం. అట్టి దానిని స్థూలమైన కన్నులు చూడలేవు. స్థూల వస్తువులను మాత్రమే స్థూలమైన కన్నులు చూడగలగుతాయిగాని సూక్ష్మాతి సూక్ష్మమైన దానిని చూడలేవు. మనస్సును, బుద్ధిని కూడా కన్నులు చూడలేవు. ఆకాశాన్ని కూడా కన్నులు చూడలేవు.

"న తత్ర చక్షుర్గచ్ఛతి – నవాగ్గచ్ఛతి" (కేనోపనిషత్) నిజంగా కన్నులు దేనినైనా తమంతట తాము చూడలేవు. ఆ కన్నులకు వెనుకనున్న చైతన్యం వల్లనే చూడగలుగుతాయి. ఏ చైతన్యం వల్ల కన్నులు చూడగలుగుతున్నాయో అట్టి చైతన్యాన్ని అవి ఎలా చూడగలవు?

"దేనిని కన్నులు చూడలేవో, దేని శక్తివల్ల కన్నులు చూస్తున్నాయో – అదే బ్రహ్మము" అని కేనోపనిషత్ చెబుతున్నది. **"తదేవ బ్రహ్మత్వంవిద్ధి".**

కన్నులతో చూడశక్యంగాని చైతన్యమును మాటలతో వర్ణించవీలు లేదు. వాక్కుకు అందదు. నిజంగా వాక్కుకు కూడా వెనుకనుండి శక్తినిచ్చేది చైతన్యమే. అట్టి చైతన్యాన్ని మాటలతో వర్ణించటం ఎలా? వాక్కుద్వారా స్థూలవస్తువులను వర్ణించగలం. లేదా మనస్సులోని భావాలను వ్యక్తంచేయగలం. అప్పటికీ కొన్ని భావాలను వ్యక్తం చేయలేం. మనకు ఒకరి మీద ఎంత ప్రేమ ఉందో ఖచ్చితంగా ఎలా తూచినట్లు చెప్పగలం. దానికి కొలబద్ద ఏది? మరి మనస్సులోని భావాలనే చెప్పలేని వాక్కు మనస్సుకు అతీతమై ఆ మనస్సును కూడా నడిపించే ఆత్మనెట్లు వర్ణించగలదు.

ఇక్కడ వాక్కు – కన్నులు అని రెండింటిని చెప్పినా – అన్ని ఇంద్రియాలను చెప్పినట్లే. **వాక్కు కర్మేంద్రియాల ప్రతినిధి. కన్ను జ్ఞానేంద్రియాల ప్రతినిధి.** అంటే కర్మేంద్రియ జ్ఞానేంద్రియాల ద్వారా ఆత్మను దర్శించలేము అని భావం. అందుకే అన్యైః దేవైఃన = ఇతర ఇంద్రియాల ద్వారా కూడా తెలుసుకోలేము అన్నారు.

అలాగే అంతరింద్రియాలైన మనోబుద్ధులు కూడా ఆత్మను తెలుసుకోజాలవు. అవి కూడా ఆత్మశక్తి వల్లనే పనిచేస్తాయి.

కర్మలు : కర్మలద్వారా ఆత్మానుభూతిని పొందలేం. కర్మలన్నీ ఆలోచనల వల్ల, ఆలోచనలు కోరికలవల్ల ఉత్పన్నమౌతున్నాయి. కోరికలు ఆత్మనుతెలియని అజ్ఞానంలోనే కలుగుతాయి. కనుక కర్మలవల్ల ఆత్మకు దూరమౌతున్నామేగాని దగ్గర కావటంలేదు. కర్మలవల్ల అజ్ఞానం వృద్ధి అవుతుంది. పుణ్యకర్మలు చేస్తే స్వర్గాది లోకాలకు వెళ్ళి సుఖాలను పొందటం జరుగుతుందేగాని ముక్తి లభించదు. ఇక పాపకర్మలవల్ల దుఃఖాలు, నరకయాతనలు.

తపస్సు : ఇక తపస్సు వల్ల కూడా ముక్తి లేదు. తపస్సు అనేది మనస్సును, వాక్కును, శరీరాన్ని శుద్ధిచేస్తుంది. అన్యవృత్తులు ఆగి ఏక వృత్తిలో నిలపటానికి సహాయపడుతుంది. అంతే. తపస్సు ఒక మార్గం మాత్రమే. అది గమ్యం కాదు. తపస్సు ద్వారా మాలిన్యం కడిగి వేయబడిన అంతః కరణం ధ్యానాను కూలమవుతుంది. మనస్సు ప్రశాంతతో నిండి పోతుంది. అంతవరకే ప్రయోజనం. అంతేతప్ప తపస్సు ముక్తినివ్వదు.

మరి ఆత్మ సాక్షాత్కారం ఎలా?

ఆత్మసాక్షాత్కారం అనేది మనం ప్రయత్నించి పొందేది కాదు. అది తనంతతానుగా అనుభవమునకు రావలసినదే. తనంతటతానుగా వ్యక్తంకావలసినదే. **ఎక్కడ? బుద్ధిలో.** మరి వ్యక్తంకావటం లేదేమి? అది వ్యక్తమవుతూనే ఉన్నది. కాని ఆ బుద్ధి మలినాలతో కూడి ఉండటం వలన గోచరించటం లేదు. మురికితో – మలినాలతో ఉన్న అద్దం మీద ప్రతిబింబం ఎలా కనిపించదో అలాగే కోరికలనే మలినాలతో కూడిన బుద్ధియందు ఆత్మ ప్రతిబింబించదు. అద్ధంపై మురికిని తుడిచి వేసినట్లుగ బుద్ధిలోని **కోరికలనే మలినాన్ని** తుడిచివేస్తే ఆత్మ స్పష్ఠంగా గోచరిస్తుంది. కనుక బుద్ధిని శుద్ధంచేయాలి. దానికే సాధనలు – ఎలా?

'జ్ఞాన ప్రసాదేన' ఆత్మ జ్ఞానాన్ని పొందినప్పుడు శాశ్వతమైన సత్యవస్తువు ఆత్మయని; అన్యమైన వన్నీ మిధ్యయని తెలుస్తుంది. దానితో మిధ్యావస్తువులపై ఆకర్షణ తొలగి పోతుంది. అలా తొలగటంతో బుద్ధిలోని లౌకిక పరమైన కోరికలు నశించి శుద్ధమౌతుంది. అలా శుద్ధమైన బుద్ధి – శాంతించిన మనస్సు ధ్యానానుకూల మవుతుంది. అలా ధ్యాన సాధన సాగితే – ఆత్మ తత్వ విచారణ జరిగితే తన నిజ స్వరూపం ఆత్మ స్వరూపంగా అనుభవానికి వస్తుంది. **అదే అద్వయ ఆనందరసాను భూతి. ఆత్మానుభూతి. బ్రహ్మానుభూతి.**

– ఈ దేహంలోనే ఆత్మను ఎలా దర్శించాలి?

మం॥ ఏషోఽణు రాత్మా చేతసా వేదితవ్యః

యస్మిన్ ప్రాణః పంచధా సంవివేశ ।

ప్రాణైశ్చిత్తం సర్వమోతం ప్రజానాం

యస్మిన్ విశుద్ధే విభవత్యేష ఆత్మా ॥ (9)

ప్రతి॥ యస్మిన్ ప్రాణః = ఎందులో ప్రాణం; పంచధా సంవివేశ = ఐదువిధాలుగా ప్రవేశించినదో (అట్టిదేహంలో) ఏషః అణుః ఆత్మా = ఈ సూక్ష్మ ఆత్మ; చేతసావేదితవ్యః = బుద్ధితో తెలుసుకోబడుతుంది; ప్రజానాం = జీవులతో (మనుష్యులలో) చిత్తం = బుద్ధి; ప్రాణైః = ఇంద్రియాలతో; ఓతం = అల్లుకపోయి ఉంది; యస్మిన్ = అందులో; ఏష ఆత్మా = ఈఆత్మ; విశుద్ధే విభవతి = (బుద్ధి) శుద్ధమైనప్పుడు ప్రకాశిస్తుంది.

భావం : ఈ దేహంలో ప్రాణం ఐదు విధాలుగా ప్రవేశించింది. ఇందులో సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను శుద్ధమైన బుద్ధితో తెలుసుకోవాలి. బుద్ధి ఇంద్రియాలతో అల్లుకోబడియుంటుంది. అట్టి బుద్ధి ఇంద్రియాలనుండి విడివిడి శుద్ధమైనప్పుడు ఆత్మ స్వయంగా ప్రకాశిస్తుంది.

వ్యాఖ్య : నిర్మలమైన బుద్ధివల్లనే ఆత్మాను భూతియని క్రిందటి మంత్రంలో తెలుసుకున్నాం. అది కూడా ఈ దేహంలో ఉన్నప్పుడే తెలుసుకోవాలి. మానవదేహంలో ఉన్నప్పుడే సాధ్యం. పశు పక్ష్యాదుల దేహాలలో నైతే బుద్ధే లేదు. దేవతలకైతే దేహమే లేదు. కనుక మానవదేహాలలో ఉన్నప్పుడే ఈ సాధనచేయాలి. ఈ దేహాలలో ప్రాణం 5 విధాలుగా వ్యాపించియున్నది **ప్రాణ – అపాన – వ్యాన – ఉదాన – సమాన** అనే విధంగా.

అయితే బుద్ధి అనేది నిర్మలంగా ఉండాలనేది **ముఖ్యషరతు.** కట్టెలు వేస్తుంటే నిప్పుప్రజ్వలిస్తుంది. కట్టెలువేయటం ఆపితే నిప్పు ఆరిపోతుంది. అలాగే బుద్ధిలోని కోరికలనే నిప్పు మనస్సు ఆలోచనలు చేస్తూన్న కొద్దీ

పెరుగుతుంది. ఆలోచనలు ఆగితే కోరికలు అంతం. కోరికలు అంతమైతేనే బుద్ధిశుద్ధం.

మానవుడి బుద్ధి ఇంద్రియాలతో అల్లుకు పోయి ఉన్నది. ఇంద్రియాలు, మనస్సు **ప్రపంచంలో చరిస్తూ ఉంటాయి.** ప్రాపంచిక భోగాలలో ఆసక్తి కలిగిఉంటాయి. ఇంద్రియాలు విషయాలగురించి, భోగాలగురించి సమాచారాన్ని అందిస్తుంటే మనస్సు తదేకంగా వాటి గురించే ఆలోచిస్తూ ఉంటుంది. ఆ ఆలోచనలను బట్టే మనిషి ప్రవర్తిస్తాడు. ఇలా ప్రాపంచిక విషయాలతో అల్లుకుపోయి బుద్ధి మలినమైనప్పుడు ఈ సంసార బంధంలో ఇరుక్కుపోతుంది. పరమాత్మకు దూరమౌతుంది. **అలాగాక ప్రయత్నంతో – విచారణద్వారా మనస్సును బుద్ధిని** దారి మళ్ళించి వాటిని ఆత్మపై నిలిపి, శుద్ధిచేసినట్లైతే వాటిలోని ఆలోచనలు, అలజడులు, కోరికలు తగ్గిపోయి; అవి శాంతపడతాయి. ధ్యానానుకూలమౌతాయి. **అంటే బుద్ధి ఇంద్రియాలవైపుకు తిరిగిందా మలినమవుతుంది. ఆత్మ వైపుకు తిరిగిందా శుద్ధమవుతోంది.**

ఇలా మాలిన్యాలు తొలగించుకొని బుద్ధిని పూర్తిగ ఆత్మయందే నిలిపినట్లైతే – ఆత్మనే నిరంతరము చింతించి నట్లైతే చివరకు **బుద్ధి అదృశ్యమై ఆస్థానంలో ఆత్మ అనుభవానికొస్తుంది.** చివరికతడు ఈ అనిత్యము, తాత్కాలికము ఐన సుఖమునిచ్చే ప్రపంచంతో పూర్తిగ విడివడి శాశ్వతము, అద్వయము అయిన ఆనంద స్వరూప ఆత్మగా ఉండిపోతాడు.

అట్టి ఆత్మానుభూతిపరుని – బ్రహ్మజ్ఞానిని ఈలోకం పూజిస్తుంది. ఎందుకు?

మం॥ యం యం లోకం మనసా సంవిభాతి
విశుద్ధ సత్వః కామయతే యాంశ్చకామాన్ ।
తం తంలోకం జయతే తాంశ్చ కామాం
తస్మాత్ ఆత్మజ్ఞం హ్యర్చయేత్ భూతికామః ॥(10)

ప్రతి॥ విశుద్ధ సత్వః = విశుద్ధ మనస్సుగలవాడు; యాన్‌కామాన్ = ఏకోరికలను; కామయతే = కోరుకుంటాడో; యం యంలోకం = ఏఏ లోకాలను; మనసా సంవిభాతి = మనస్సుతో కోరుకుంటాడో; తాన్‌కామాన్ = ఆ కోరికలను; తంతంలోకం = ఆయాలోకాలను; జయతే = జయిస్తాడు; తస్మాత్ = అందువల్ల ; భూతికామః = ప్రగతిని కోరుకొనేవాడు; ఆత్మజ్ఞంహి అర్చయేత్ = ఆత్మజ్ఞుని – బ్రహ్మజ్ఞానిని అర్చించాలి.

భావం : విశుద్ధమైన మనస్సుగలవాడు ఏ కోరికలను కోరుకుంటాడో, ఏఏలోకాలను మనస్సు ద్వారా కోరుకుంటాడో, ఆ కోరికలను, ఆయాలోకాలను జయిస్తాడు. అందువల్ల ప్రగతిని కోరుకొనేవాడు బ్రహ్మజ్ఞానిని అర్చించాలి.

వ్యాఖ్య : అట్టి ఆత్మానుభూతి పరుడు ఈ లోకంలో పూజింపబడతాడు. లోకం అంతా అతణ్ణి పూజించి తమ ఈప్సితార్థములను తీర్చుకొంటుంది. ఇలా తమ తమ కోర్కెలు తీర్చుకొనుటకు ఎలా మహాత్ములను పూజించాలో ఈ మంత్రం నిర్దేశిస్తున్నది.

లోకంలో అందరికీ సుఖంగా జీవించాలనే కోరిక ఉంటుంది. ఇక్కడి సుఖాలు దొరికినాచాలదు; మరణించిన తర్వాత కూడా స్వర్గ సుఖాలు పొందాలనే కోరిక కూడా ఉంటుంది. అయితే **అందరికీ ఆయా కోరికలు తీరతాయా అంటే తీరవు. అయితే దానికీ ఒక ఉపాయాన్ని** ఇక్కడ తెలియజేస్తున్నారు. ఏమిటా ఉపాయం?

"ఆత్మజ్ఞానిని ఆరాధించాలి, అర్చించాలి, పూజించాలి". అయితే కేవలం ఆయన పాదాలొత్తడం, లేదా పాదాలుకడగటం, పూలతో పూజించటం, మెడలో దండలువేసి మొక్కటం ఇవేనా చేయవలసింది? ఇంతకన్నా చాలా ఎక్కువే చేయాలి. ఇవీ చేయాల్సిందే, భక్తిని పెంచుకోవాల్సిందే. తన భక్తిని వెల్లడించుకోవాల్సిందే. దానికి ఇవన్నీ బాగా

సహాయపడతాయి. అయితే విశుద్ధ మనస్సుతోనే ఇవన్నీ చేయాలి. అంటే మనస్సును శుద్ధిచేసుకోవాలి. మనస్సు నిండా ఆయనేనిండాలి; ఆసమయంలో ఆయన తప్ప మరేమీ లేదనే భావనరావాలి. రజోగుణ తమోగుణాలను అంతంచేసి మనస్సును **సత్వగుణంలో నిలపాలి.** అప్పుడే మనస్సు ప్రశాంత స్థితిలోనికి వస్తుంది. **ఇలాంటి ప్రశాంత మనస్సుతోనే ఆత్మ జ్ఞానిని సమీపించాలి. ఆయనను సేవించాలి. ఆరాధించాలి. పూజించాలి.** యాంత్రికంగా చేస్తే ప్రయోజనంలేదు. పూర్ణభక్తితో చేయాలి.

ఇలా చేసిన వానికి సకల శుభములు కలుగుతాయి. ఈ లోకంలోను, స్వర్గాది లోకాలలోను సుఖభోగాలు లభిస్తాయి. వాంఛితార్థాలు తీరతాయి. ఇట్టివారే ఆ మహాత్ముల అనుగ్రహంతో శాశ్వత ఆనందాన్ని పొందటానికి కూడా **తగిన అర్హతలను సంపాదిస్తారు.**

మరి ఆత్మజ్ఞానిని ఆశ్రయించిన వారికి ఇంతటి ప్రయోజనం కలుగుతుంటే మరి ఆత్మజ్ఞానికి అన్ని కోరికలు తీరవా? శాశ్వతానందము లభించదా? అంటే తప్పకుండా అన్ని **కోరికలు తీరుతాయి; సకల దుఃఖాలు, భయాలు నశిస్తాయి,** అద్వయమైన శాశ్వత ఆనందరసాను భూతి కలుగుతుంది. ఆయనకు లేనిదంటూ ఏమీలేదు. **ఆయన స్ఫటికంలా స్వచ్ఛంగాను, గంగలా పవిత్రంగాను, హిమవన్నగంలా నిర్మలంగాను ఉంటాడు.**

అయితే ఇంతటి బ్రహ్మజ్ఞానిలో కూడా కోరికలుంటాయా? నిజంగా అసలు కోరికలు ఉండవు. కోరికలు ఉండటం, అవి తీరటం **జీవుడి** యొక్క లక్షణం. **అసలు కోరికలే లేక నిత్యము – నిరంతరము ఆనందంలో ఉండుటే ఆత్మలక్షణం – ఆత్మజ్ఞాని – బ్రహ్మజ్ఞాని యొక్క లక్షణం.**

కోరికలు ఉండి తీరటం కన్న – అసలు కోరికలే లేని స్థితి అత్యున్నతమైన స్థితి. కనుక ఆత్మజ్ఞానిలో కోరికలు ఉండవు. అవి గతకాలపు విషయాలు మాత్రమే.

మరి అట్టి బ్రహ్మజ్ఞాన సంపన్నుడైనవాని అవసరం ఏమిటి? ఆయనకే అవసరంలేదు. మిగిలిన జీవుళ్ళు ప్రగతిని సాధించటానికి ఆదేహం ఉపయోగ పడుతుంది. ఎవరైనా భక్తితో మనశ్శుద్ధితో అంటే సత్వగుణంతో – శాంతస్వభావంతో ఆయనను ఆరాధిస్తే వారి కోరికలూ తీరతాయి, ఉన్నతలోకాలకు వెళ్ళి సుఖభోగాలూ అనుభవిస్తారు. మరింతగా వారిని సేవించి – ఆరాధించి – పూజించి – వారి **అనుగ్రహాన్ని పొందితే శాశ్వతమైన ఆనందాన్ని – ఆత్మానుభూతిని పొందే అర్హత కూడా లభిస్తుంది.** వారి ఉపదేశాలను స్వీకరించి ఆచరణచేస్తే అద్భుతమైన ఫలితాలను పొందుతారు. ఉన్నతస్థితిని పొందుతారు.

బ్రహ్మజ్ఞానిని శుద్ధమైన మనస్సుతో, సంపదలను కోరి ఆశ్రయించిన వారు పొందే స్థితిని ఈ మంత్రంలో తెలియజేసి, కోరికలు లేనివారై – నిష్కాములై ఆత్మజ్ఞానిని సేవిస్తే కలిగే ఫలితాన్ని రాబోయే మంత్రంలో విశదపరుస్తున్నారు.



తృతీయ ముండకం

ద్వితీయ ఖండం

- ఏ కోరికలు లేకుండా బ్రహ్మజ్ఞానిని ఆశ్రయించి - సేవించే ముముక్షువులకు కలిగే ఫలితం ఏమిటి? -

మం॥ స వేదైతత్ పరమం బ్రహ్మధామ
యత్ర విశ్వం నిహితం భాతి శుభ్రం ।
ఉపాసతే పురుషం యే హ్యకామాస్తే
శుక్రమేత దతివర్తంతి ధీరాః ॥ (1)

ప్రతి॥ సః = బ్రహ్మజ్ఞాని; భాతి = ప్రకాశవంతము; శుభ్రం = పరిశుద్ధము; యత్ర విశ్వం నిహితం = సమస్త విశ్వానికి ఆధారము; పరమం = శ్రేష్ఠము అయిన; ఏతత్ బ్రహ్మధామ = ఈ ప్రకాశమాన బ్రహ్మమును; వేద = తెలుసుకుంటాడు; తే పురుషం = అట్టి పురుషుని; యే అకామాః = ఎవరు కోరికలు లేనివారై; ఉపాసతే = ఉపాసిస్తారో; తే ధీరాః = అట్టి ధీరులు; ఏతత్ శుక్రం = ఈ పునర్జన్మను; అతివర్తంతి = అధిగమిస్తారు.

భావం : బ్రహ్మజ్ఞాని ప్రకాశవంతము, పరిశుద్ధము, సమస్త విశ్వానికి ఆధారము, శ్రేష్టము అయిన ఈ ప్రకాశమాన బ్రహ్మమును తెలుసుకుంటాడు. అట్టి పురుషుని ఎవరు కోరికలు లేనివారై ఉపాసిస్తారో అట్టి ధీరులు పునర్జన్మను అధిగమిస్తారు.

వ్యాఖ్య : ఆత్మ జ్ఞానియైనవాడు బ్రహ్మమును తెలిసినవాడే. బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మయే. "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" – అతడే బ్రహ్మజ్ఞాని.

యత్ర విశ్వంనిహితం ఈ సమస్త విశ్వమునకు ఆధారమైనది బ్రహ్మము. ఈ విశ్వమంతా బ్రహ్మములో దాగియున్నది. దాగియుండటమంటే ఎవరికీ కనిపించకుండా భూమిలో గుంటతీసి

దాచినట్లుకాదు. చీకటిలో కన్పించిన పాము ఎక్కడున్నది వెలుగు వచ్చినప్పుడు? అది ఎక్కడాకనిపించదు. ఎక్కడకు పోయింది? తాడులోనే దాగి ఉన్నది. నిజంగా ఉన్నదా? లేదు. భ్రమతొలగింది అంతే. కనుక కల్పిత సర్పానికి ఆధారమైన తాడులోనే ఆ సర్పం దాగి ఉంది. అలాగే ఈ కల్పిత విశ్వానికి ఆధారమైన బ్రహ్మములోనే ఈ విశ్వం దాగి ఉంది. అంటే నిజంగా విశ్వం అప్పుడూ - ఇప్పుడూ - ఎప్పుడూ లేదు. కాని ఆత్మను తెలియని అజ్ఞానంలోనే అది ఉన్నది. జ్ఞానంతో ఆ భ్రమకాస్తా తొలగిపోతుంది. బ్రహ్మం ఒక్కటే సత్యం. అదేనీవు. అదేనేను. 'బ్రహ్మోహం' 'అహంబ్రహ్మోస్మి'. అది **దివ్యమైన ప్రకాశం కలిగింది, శుద్ధమైనది.** దానికి ఏకల్మషాలు అంటవు. అది అన్నింటికన్న **శ్రేష్ఠమైనది.** దానికన్న గొప్ప వస్తువు మరొకటి లేదు.

ఎవరు ఇలా బ్రహ్మమును తెలుసుకోగలరు? ఆత్మజ్ఞానాన్ని పొందినవారు మాత్రమే. జ్ఞానములేని కర్మలుగాని - జ్ఞానములేని భక్తిగాని, జ్ఞానములేని యోగముగాని - అన్నీ వ్యర్థప్రయత్నాలే. **జ్ఞానేనైవతు కైవల్యం.** జ్ఞానిమాత్రమే బ్రహ్మాన్ని తెలుసుకోగలడు. ఇలా తెలుసుకుంటే - తాను బ్రహ్మమేనని, అనుభవమౌతుంది. ఉన్నది అంతా తానుమాత్రమేనని తనకన్నా అన్యముగ మరేదీ లేదని ఇలా సర్వత్రా తననే దర్శించే బ్రహ్మజ్ఞానికి ఈ లోకంలో దేనితోను పనిలేదు. అతనిలో **ఎట్టి కోరికలు లేవు.** ఆందోళనలు, ఆలోచనలు, ఉద్రేకాలు లేవు - సుఖదుఃఖాలు, మానావమానాలు, జరామరణాలు - ఏవీ అతనికి అంటవు. జ్ఞానం కోసం కూడా పరితపించడు. అతడు ప్రశాంతంగా ఉంటాడు. నిర్మలమూ నిష్కళంకము అయిన అద్వయ చైతన్యమే అతడు. అనంత ఆనందస్వరూపుడే అయిన అట్టి బ్రహ్మజ్ఞానిని నిష్కామబుద్ధితో ఎవరు దర్శిస్తారో, ఎవరు సేవిస్తారో పూజిస్తారో ఆరాధిస్తారో అట్టి వారికిక పునర్జన్మ లేదు - కోరికతో ఆరాధిస్తే ఇష్టకామ్యార్థాలు సిద్ధిస్తాయి.

కోరికలు వదలి సేవిస్తే పునర్జన్మ లేదు.

పునర్జన్మకు కారణం కర్మఫలాలు, వాసనలు. ఇప్పటికే కోరికలు వదలినవారు ఆత్మజ్ఞానిని చేరుకొని ఆయనను ఆరాధిస్తూ ఆయన ఉపదేశాలు పొందుతూ ఉండటం వల్ల ఆత్మజ్ఞానాన్ని పొందుతారు – ఆ జ్ఞానాగ్నిలో ఇప్పటికే నిల్వ ఉన్న సమస్త కర్మఫలాలు – వాసనలు (సంచిత) దగ్ధమై పోతాయి. కనుక ఇక పునర్జన్మ ఉండదు. కోరికలతో జీవించటం అయోమయ జీవితం. కోరికలు వదలి జీవించటం ప్రశాంతజీవితం. అట్టి ప్రశాంతితో ఆత్మజ్ఞానిని సేవిస్తే ఆత్మజ్ఞానం కలిగి బ్రహ్మానుభూతి కలుగుతుంది. దానితో అద్వయ ఆనంద రసానుభూతి కలుగుతుంది. 'జీవితమిదం తృటిద్వయస్య క్రీడా' – "ఈ జీవితం రెండు క్షణాలుసాగే క్రీడ" అని – వేదాంత సారోపనిషత్తు చెబుతున్నది.

– కోరికలు లేకుండా బ్రహ్మజ్ఞానిని ఆశ్రయిస్తే జన్మలు లేకుండా ఎలా పోతాయి? కోరికలతో ఉంటే జన్మలెందుకు వస్తాయి?

మం॥ కామన్ యః కామయతే మన్యమానః
స కామాభిర్జాయతే తత్ర తత్ర ।
పర్యాప్త కామస్య కృతాత్మ నస్తు
ఇహైవ సర్వే ప్రవిలీయంతి కామాః ॥ (2)

ప్రతి॥ యః = ఎవరైతే; కామాన్ = విషయాలను; కామయతే మన్యమానః = స్మరించుకుంటూ ఉంటారో; సః = అతడు; కామభిః = కోరికలు తీర్చుకొనుటకు; తత్ర తత్ర జాయతే = అక్కడక్కడ పుడుతుంటాడు; పర్యాప్తకామస్య = కోరికలు తీరినట్టి; కృతాత్మనః తు = ఆత్మానుభూతి నొందినవానికి; ఇహఏవ = ఈ జన్మలోనే; సర్వేకామాః = అన్ని కోరికలు; ప్రవిలీయంతి = నశించిపోతాయి.

భావం : ఎవరైతే నిరంతరము విషయ చింతనచేస్తూ ఉంటాడో అతడు

తన కోరికలను తీర్చుకొనుటకు అక్కడక్కడ జన్మిస్తూ ఉంటాడు. అలాగాక కోరికలు తీరిన ఆత్మానుభూతి పరునికి సమస్త కోరికలు ఈ జన్మలోనే నశించిపోతాయి. (కనుక జన్మించాల్సిన పనిలేదు).

వ్యాఖ్య : నేను ఆత్మను అని తెలియక పోవటం వల్ల జీవుణ్ణి అనుకుంటున్నాను. ఇదే అజ్ఞానము. ఆత్మగా ఉంటే అంతా ఆనందమే. ఏ కొరతా లేదు, ఏకోరికాలేదు. అయితే జీవుణ్ణి అనుకుంటున్నాం గనుక, ఈ శరీర, మనోబుద్ధులకు పరిమితమైన వాడిననుకుంటున్నాం గనుక, మనకు ఏవో కొరతలు, వాటిని తీర్చుకొనుటకు కోరికలు, ఆ కోరికలను తీర్చుకొనుటకు ఆలోచనలు, కర్మలు చేస్తుంటాం. ఈ కర్మలవల్ల కర్మఫలాలు వచ్చి బంధాలై కూర్చుంటాయి. ఈ కోరిక అనేది ఏదో ఒక్కటికాదు. వస్తువులు, విషయాలు; భోగాలు అనేకం కనుక, కోరికలు కూడా అనేకం. ఒక్కొక్క కోరిక తీరుతున్న కొద్దీ కొత్త కొత్త కోరికలు ప్రవేశిస్తూ ఉంటాయి. ఈ కోరికలన్నీ ఒక్కొక్కప్పుడు గజిబిజిగా ప్రవేశించి మనస్సును పూర్తిగా చెడగొడతాయి. కోరికలు తీరితే సుఖం అనుకుంటాం గాని ఆ సుఖం తాత్కాలికమే. ఎందుకంటే వస్తువులు తాత్కాలికమైనవి గనుక. ఏ వస్తువు లభిస్తే నీకు ఆనందమో ఆ వస్తువు దూరంకాగానే దుఃఖం వస్తుంది. ఆ వస్తువు నీవు అనుకున్నట్లుగా ఉండక పోయినా, చెడిపోయినా దుఃఖమే. అంతేకాదు **ఒకప్పుడు ఆనందాన్ని ఇచ్చిన వస్తువే మరొకప్పుడు దుఃఖాన్ని కూడా ఇస్తుంది.**

కనుక మనలో కలిగిన, కలిగే కోరికల వల్ల మనకు అశాంతి కలుగుతున్నది. ఈ సత్యాన్ని గ్రహించలేని మానవులు వస్తువులు, విషయాలు ఆనందాన్నిస్తాయని భావించి, భ్రమించి **నిరంతరం వాటిని గురించే ఆలోచిస్తూ, వాటి నెలా సంపాదించు కోవటమా** అని స్మరించుకుంటూ, ప్రణాళికలు వేస్తూ వాటికోసం తపిస్తూ, ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఈ ప్రయత్నాలలో అతడి ఆయుష్షు పూర్తయి పోతుంది. శరీరం వదిలి

పోతుంది. అయినా సరే, ఈశరీరాన్ని వదిలి తన కోరికల మూటను నెత్తిన పెట్టుకొని ఆ కోరికలను తీర్చుకొనుటకు అక్కడక్కడ మరొక శరీరాన్ని ధరించి వస్తూ ఉంటాడు. మళ్ళీ అంతే. ఇలా ఎన్నో జన్మలు, అనంత కోటి జన్మలు ఎత్తుతూ ఉంటాడు. జన్మలన్నింటిలోనూ దుఃఖాలను పొందుతూ ఉంటాడు. అంటే **కోరికలున్నంత కాలం జన్మలూ తప్పవు, దుఃఖాలూ తప్పవు.**

కనుక నీకు దుఃఖాలు పూర్తిగ శాశ్వతంగా తొలగిపోవాలంటే కోరికలన్నీ అంతమైపోవాలి. అదేసమయంలో శాశ్వత ఆనందాన్ని పొందాలంటే నీవు ఆత్మానుభూతిని పొందాలి. అంటేనీవు నీ నిజస్వరూపమైన ఆత్మగా అనుభూతిచెందాలి. ఎప్పుడైతే నీవు ఆత్మనని తెలుసుకొన్నావో ఇకనీకు ఏ కొరతలు, కోరికలు ఉండవు. అన్ని కోరికలు అంతమై పోతాయి. అజ్ఞానం అంతం కావటంతోనే ఇక కోరికలుండే ప్రసక్తే రాదు. అన్ని కోరికలు ఈ జన్మలోనే తీరిపోయినవి గనుక ఇక జన్మించాల్సిన అవసరమే ఉండదు. అదే మోక్షం. ప్రారబ్ధం ప్రకారం వచ్చిన శరీరం ఉన్నాసరే అతడికి దానితో సంబంధం ఉండదు. అతడు ఆత్మ స్థితిలో – స్వస్థితిలో ఉంటూ ఇక్కడ జరిగేలోక వ్యవహారాలన్నింటిని నాటకంలాగా దర్శిస్తూ సుఖంగా, చిద్విలాసంగా ఉండగలడు. ఇదంతా ఎవరికి? ఆత్మజ్ఞానిని చేరి ఆయనను భక్తితో సేవించి, పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందిన వారికే.

– ఆత్మానుభూతి అనేది బాహ్యమైన పరిస్థితుల వల్ల కలిగే అవకాశం ఉందా? ఎలా కలుగుతుంది?

మం॥ నాయమాత్మా ప్రవచనేన లభ్యః
న మేధయా న బహునాశ్రుతేన ।
యమేవైష వృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనుంస్వా ॥ (3)

ప్రతి॥ అయంఆత్మా = ఈ ఆత్మ; ప్రవచనేన నలభ్యః = ప్రవచనాలవల్ల లభ్యంకాదు; న మేధయా = మేధాశక్తి వల్ల లభ్యంకాదు; నబహునాశ్రుతేన = ఎక్కువగా శ్రవణం చేసినందువల్ల లభ్యంకాదు; యంఏవ = ఎవరైతే; ఏషవృణుతే = ఈ ఆత్మనుపొంద ప్రయత్నించునో; తేన లభ్య = దాని వల్లనే లభిస్తుంది; తస్య = అతడికి; ఏష ఆత్మా = ఈ ఆత్మ; స్వాతనుం = తనస్వరూపాన్ని; వివృణుతే = తెలుపుతుంది.

భావం : ఈ ఆత్మ ప్రవచనాలవల్ల గాని, మేధాశక్తి వల్లగాని, ఎక్కువగా శ్రవణం చేయటంవల్లగాని లభ్యంకాదు. ఎవరైతే ఈ ఆత్మను పొందాలని తపిస్తాడో ఆ తపన వల్లనే ఆత్మను పొందగలుగుతాడు. అట్టి వానికి ఆత్మయే తన స్వరూపాన్ని వ్యక్తం చేస్తుంది.

వ్యాఖ్య : ఆత్మానుభూతి అనేది సత్కర్మలు పుణ్యకర్మలు చేస్తే కలుగుతుందని కొందరు, తీర్థయాత్రలు, భజనలు, పూజలు, పారాయణలు చేస్తే వస్తుందని కొందరు, గొప్ప భక్తిని కలిగి ఉంటే అదే వస్తుందని తామసగుణంలో ఉన్న కొందరు, నిరంతరం శాస్త్రాలను తెలుసుకుంటే, వింటే వస్తుందని కొందరు; ఏమీ అక్కర్లేదు ఒక్కసారి రామా అంటే చాలు వస్తుందని కొందరు; శివరాత్రి రోజున జాగరణచేస్తే వస్తుందని కొందరు. ఇవన్నీ కాదు బాగా దాన ధర్మాలు చేస్తే వస్తుందని కొందరు, ఇలా తమకు అనుకూలంగానో, అలవాటుగానో ఉన్న వాటితో పొందగలమని భావిస్తారు. వీరంతా అజ్ఞానులు.

ఎందువల్ల? ఆత్మ ఎక్కడో ఉన్నది కాదు మనం వెళ్ళి అందుకోవటానికి!

ఆత్మ ఏకం – అద్వయం – సూక్ష్మాతి సూక్ష్మం – సర్వవ్యాపకం – అఖండం. ఆత్మకన్న అన్యమైనది మరేదీలేదు. మరైతే ఆత్మను అందుకోవాలని ప్రయత్నించే నీ వెవరు? ఆత్మకన్న వేరుగా ఉన్నావా? లేదు – నీవు ఆత్మవే – ఆత్మను అనే జ్ఞానం నీకు లేదు. నీవు ఆత్మవే ఐతే

ఇంకా అందుకోవటం ఎందుకు? **ఆ జ్ఞానం** కలగాలి. అంతే. – నీవు ప్రతిరోజు పడుకొనే చోటనే నేలక్రింద నిధి ఉన్నది. అయినా నీకు తెలియదు. కనుక నీవు పేదవాడినని అనుకుంటున్నావు. అది తెలుసుకున్నావా? త్రవ్వితీయక పోయినా సరే నీవు భాగ్యవంతుడివే. అది నీ ఆస్తి. అలాగే ఆత్మవే అయినా నీకు తెలియదు ఆత్మనని. అదే అజ్ఞానం. ఆ అజ్ఞానంలో నీవు ఏంచేసినా అనుభూతి రాదు.

ఏదేదో చేస్తుంటే ఆత్మకు దూరమౌతున్నావేగాని దగ్గరకావటం లేదు. ఆత్మకు దగ్గరకావాలంటే ఆత్మనని తెలుసుకోవాలి. అంతే. అందుకే ఇక్కడ చెబుతున్నారు–

1. అయంఆత్మా ప్రవచనేన నలభ్యః : ఆత్మను గూర్చి అద్భుతంగా ఉపన్యాసాలివ్వవచ్చు. ఆత్మను గూర్చి చెబుతున్నావూ అంటే నీవు ఆత్మకాదన్నమాట. ఆత్మను గూర్చి వర్ణించే ఆ వాక్కుకు ఆధారం ఆత్మయేనని గ్రహించలేక ఇతరులకు ఆత్మను వర్ణిస్తుంటారు. ఇలా వర్ణించిన కొద్దీ ఆత్మకు దూరమగుటయే – కనుక ఉపన్యాసాలవల్ల ఆత్మపొందబడేదికాదు. గొప్ప ఉపన్యాసకులు అయినంతమాత్రాన ఆత్మానుభూతి కలగదు. ఉపన్యాసకులంతా ఆత్మాను భూతి పొందినవారు కాదు.

2. నమేధయా : మేధస్సుచేత తెలియబడేది కాదు. మేధస్సు బుద్ధికి సంబంధించిన విషయం. ఆత్మ అసలు విషయంకాదు. అదిచైతన్యం. బుద్ధిలో తెలివి ఉండవచ్చు. తెలివి లేక పోనూవచ్చు. అయితే బుద్ధిలో తెలివి ఉన్నదనిగాని, తెలివిలేదనిగాని ఎవరు తెలుసుకుంటున్నారు? ఆ తెలుసుకొనే ప్రజ్ఞయే ఆత్మ. కనుక ఎంత మేధాశక్తి ఉన్నా దీనితో తెలియబడదు ఆత్మ.

3. బహునా శ్రుతేన : సరే బాగా శ్రవణంచేస్తేనో? శాస్త్రాలన్నింటినీ, శాస్త్రాలలోని గూఢార్థాలన్నింటినీ గొప్పగొప్ప గురువులద్వారా వింటూ ఉంటేనో? కొందరికి ఎప్పుడూ ఇలా వినాలనే కుతూహలం ఉంటుంది.

ఎవరో ఒక గురువు ద్వారా శాస్త్రాన్ని చక్కగా వింటారు. కాని మననం చేయరు. మరొక గురువు చెబుతుంటే అదీ వింటారు. కొన్నాళ్ళు యోగం – కొన్నాళ్ళు వేదాంతం – కొన్నాళ్ళు కర్మలు – దానితో సందేహాలు మొదలు. లేదా రకరకాల గ్రంథాలు చదువుతారు. దీనితో ఆయన చెప్పింది కరెక్టా – ఈయన చెప్పింది కరెక్టా – గ్రంథంలో ఉన్నది కరెక్టా? అని సందేహం కలుగుతుంది. దానితో మరికొందరు మహాత్ముల ఉపన్యాసాలు విందామనుకుంటారు. లేదా ఎవరైనా మహాత్ముడు తటస్థపడితే వారిని ప్రశ్నిస్తారు. ఆయన చెప్పినది ఖాయపర్చుకుంటారా? లేదు. ఈయన చెప్పినది సరైనదేనా? అని అనుమానం. ఇలా తెలుసుకుంటూ తెలుసుకుంటూ ఎవరెవరు ప్రతిభ కలిగిన వారో – ఎవరెవరు తెలియని అజ్ఞానులో – అంచనాలు వేసుకుంటారు. ఎవరు చెప్పినదీ ఎక్కదు. అంతా విశ్లేషణ చేయటంలోను, పరిశీలన చేయటంలోనూ సరిపోతుంది. దీనితో ఆత్మానుభూతి మాట దేవుడెరుగు – ఆత్మకు దూరమై పోవటం ఖాయం. చివరకు అహంకారం ప్రబలే అవకాశం ఉంటుంది.

మరైతే ఆత్మానుభూతి ఎలా కలగుతుంది?– ఎవడైతే ఆత్మను తెలుసుకోవాలనే **ఆరాటంతో** ప్రయత్నం చేస్తాడో – ఆత్మను తెలుసుకొనేందుకు ఒక సద్గురువును ఆశ్రయించి – ముందుగా ఆయన సేవచేసి పూజించి, ఆరాధించి ఆయన అనుగ్రహాన్ని పొంది, ఆత్మకోసం తపిస్తే ఆయన ఆత్మనుగూర్చి ఉపదేశిస్తాడు. అప్పుడు నిరంతరం **'తదేకంగా ఆత్మచింతన'** గావిస్తూ ఉంటే – **భ్రమర కీటక న్యాయాన్ననుసరించి – యద్భావంతద్భవతి అన్నట్లుగ** చివరకు ఆత్మ విదుడై వెలుగుతుంటాడు.

ఆత్మకాని దానిని నిరాకరించుట, నిషేధించుటయే ఆత్మను తెలుసుకొనే ఉపాయం. తాను ఆత్మయేగనుక ప్రత్యేకంగా తెలుసుకోవాల్సిందేమీ లేదు. తెలియని అజ్ఞానాన్ని తొలగించుకుంటే చాలు. అనాత్మను తొలగిస్తేచాలు – ప్రాపంచిక ఆలోచనల నుండి విముక్తమైతేచాలు. అయితే దీనికి గొప్ప అర్హతకావాలి – ఏమిటది?

– ఇంకా ఆత్మానుభూతి ఎవరికి కలగదు? ఎవరికి కలుగుతుంది?

మం॥ నాయమాత్మా బలహీనేన లభ్యః
నచ ప్రమాదాత్ తపసో వాప్యలింగాత్ ।
ఏతై రుపాయైః యతతే యస్తు విద్వాన్
తస్యైష ఆత్మా విశతే బ్రహ్మధామ ॥ (4)

ప్రతి॥ అయం ఆత్మా = ఈ ఆత్మ; బలహీనేన నలభ్యః = బలహీనుని చేత పొందబడదు; ప్రమాదాత్‌చ న = అవిధేయుల చేత కూడా పొందబడదు; అలింగాత్ తపసః అపి = తగని తపస్సుల వల్లకూడా; న = పొందబడదు; యః విద్వాన్ = ఏ విద్వాంసుడు; ఏతైః ఉపాయైః = సరైన ఉపాయాలచేత; యతతే = ధృఢంగా ప్రయత్నిస్తాడో; తస్య = అతడికి; ఏష ఆత్మా = ఈ ఆత్మ; బ్రహ్మధామ విశతే = బ్రహ్మముతో ఐక్యమవుతుంది.

భావం : బలహీనులకు, అవిధేయులకు, తగని తపస్సులు చేసేవారికి ఆత్మలభించదు. దృఢమైన ప్రయత్నంతో, సరైన ఉపాయాలతో సాధన చేసేవారికే ఆత్మ బ్రహ్మముతో ఐక్యమవుతుంది.

వ్యాఖ్య : 1. ఆత్మ బలహీనులకు లభించదు. బలహీనతలంటే – శారీరక బలహీనత, మానసిక బలహీనత, నైతిక బలహీనత – అన్నీనూ. ఐతే **మానసిక బలహీనతే పెద్ద ఆటంకం.** దానివల్ల ఏకాగ్రత కుదరదు. మనస్సు బలహీనంగా ఉన్న వాడు అన్నింటిని తలచుకొంటూ నిలకడ లేకుండానన్నా ఉంటాడు, ఏమీ ఆలోచించలేక శూన్యంగా నన్నా ఉంటాడు. ఏకాగ్రచిత్తంతో ధ్యానంలో కూర్చోలేడు.

సామాన్యంగా లోకంలో ఒక దురభిప్రాయం ఉంది. వేదాంతులంటే ఈ లోకంలో దేనికీ పనికిరాని వారని; ఏపనీ చేయకుండా ఊరికే దండగతిండి తినేవారని. అందుకే ఒంట్లో ఓపిక ఉన్నంతకాలం పనిచేసి సంపాదించుకొని, కూడబెట్టుకొని, అనుభవించాలి. ఆపైన శక్తి ఉడిగి

పోయినతర్వాత ఎలాగూ ఏపనీ చేయలేరు గనుక, అప్పుడు కృష్ణారామా అనుకోమని, పురాణాలు వినమని, ఏదో మూలన కూర్చొని జపధ్యానాలు చేసుకోమని అంటారు, సలహాఇస్తారు. ఇవి అర్థంపర్థం లేని మాటలు. అజ్ఞానుల మాటలు, బుద్ధిహీనుల మాటలు. ఎందుకంటే –

పరమ పవిత్రమైన, జీవితానికి పరమ లక్ష్యమైన మోక్షప్రాప్తికి వేదాంత బాటలో ప్రయాణం చేయాలంటే ఎంతోకష్టం. ఎంతో గుండె ధైర్యం, మానసిక ధృడత్వం, దేహంలో శక్తి ఉండాలి. కార్యదీక్ష, పట్టుదల ఉండాలి. అలాంటిది శరీరంలో శక్తి అంతా ఉడిగిపోయి కాటికి కాళ్ళుజాపుకొన్నవాడు, శక్తి హీనుడు, ఇతరులపై ఆధారపడి, అందరిచేత ఛీత్కారాలు పొందుతూ, మానసికంగా క్రుంగి పోయిన వాడు; సోమరిపోతు; కళ్ళు చెవులు, కాళ్ళు, చేతులు పనిచేయనివాడు ఈ కష్టసాధ్యమైన మార్గంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేడు. అందుకే 'బలహీనులచేత పొందబడేది కాదు ఆత్మ', అనుట –

2. బలహీనుల చేత మాత్రమేకాదు **అవిధేయులచేత** కూడా పొందబడదు. వేదాంతాన్ని వినేటప్పుడు ఎంతో బుద్ధి మంతుల్లా వింటారు. లొట్టలు వేసుకుంటూ వింటారు. తన్మయంతో తల ఊగిస్తూ కళ్ళు తేలవేస్తూ వింటారు. వినటం పూర్తికాగానే "రబ్బరును సాగదీసి వదిలేస్తే మళ్ళీ యధాస్థితికి వచ్చినట్లు" ఎప్పటిలాగానే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. **ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యం** ఉండాలని వింటారు. ఉపన్యాసం కాగానే చీరలు, సొమ్ములు, వస్తువులు గురించి తపన. **త్యాగబుద్ధి** ఉండాలనివింటారు. వెంటనే అయ్యో వాళ్ళకన్నా మనకు ఆస్తి తక్కువగదా! వాళ్ళు 100 ఖర్చుపెడితే మనం పదో పరకోఖర్చు చేద్దాం అని భగవత్ కార్యాలపట్ల, సత్కార్యాల దగ్గర లెక్కలు వేస్తారు. స్వార్థంతో పెట్రేగిపోతుంటారు. వేదాంతం పట్ల – గురువుపట్ల విధేయత ఉండాలని వింటారు. గడపదాటగానే ఆ! ఈ వేదాంతం కడుపు నింపుతుందా!

ఏదోకాలక్షేపమేగాని అనుకుంటారు. గురువు ఎదురుగా వంగి వంగి నమస్కారాలు, ఎంతో అణకువ – పరోక్షంలో గోతులు త్రవ్వటం, ఆయన సుఖంగా ఉన్నాడనుకుంటే అసూయతో ఏడవటం, ఏవేవో దుష్ప్రచారాలు చేయటం, ఆయనకు వ్యతిరేకంగా పని చేయటం. ఇలాంటి అవిధేయులకు ఎన్ని జన్మలెత్తినా ఆత్మ అవగతం కాదు. అయినట్లే ఉంటుంది. కాని అనుభవానికిరాదు.

3. ఇక తగని తపస్సులు చేయువారికి కూడా లభించదు. మేం బలహీనులం కాదు బలవంతులం, దేనికైనా తట్టుకొని నిలబడగలవారం అని నిరూపించుకోవాలనిగాని, అజ్ఞానంతో గాని, అహంకారంతోగాని, అలవాటువల్లగాని **ఉపవాసాల పేరుతో** నిరాహారులై నీరసించి, నిదురించే మందభాగ్యులు గాని; ఏమాత్రం భావశుద్ధి లేక, ఆత్మజ్ఞానం గురించి తెలుసుకోక **హఠయోగాన్ని** ఆశ్రయించి శరీరాన్ని కష్టపెట్టే మోటు మనుష్యులుగాని, **జాగరణ** చేస్తే ముక్తి వస్తుందని కొరివిదయ్యాల లాగా కాపలా దారుల లాగా తెల్లవార్లూ మేలుకొని ఉండే నిశాచరులు గాని, వీరంతా – దారి తప్పిన బాటసారులేగాని ఆత్మను అందుకోగల తత్త్వ విదులు కాలేరు.

మరెలా? – (1) సద్గురువును ఆశ్రయించి – వేదాంత శ్రవణం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొంది (2) గురు సేవ ద్వారా గురువు అనుగ్రహాన్ని పొంది, (3) ఆయన ఉపదేశాల ప్రకారం తీవ్రమైన సాధనకు ఎవరు ప్రయత్నిస్తారో, (4) ఎవరు సర్వ ప్రాపంచిక విషయాల నుండి వస్తువుల నుండి మనస్సును వెనుకకు మరలించి, సర్వసంకల్పాలను త్యాగంచేస్తారో అట్టివారికే ఆత్మానుభూతి. ఆత్మ తనస్వరూపమేగనుక **అంతర్ముఖులై** తన స్వరూపాన్ని దర్శించాలి. తాను కాని దానిని త్యజించాలి. ఇది కర్మలద్వారా జరిగేదికాదు. సరియైన జ్ఞానం ద్వారా మాత్రమే లభించేది. జ్ఞానం వల్లనే ఆత్మానుభూతి; బ్రహ్మైక్యసిద్ధి; తానుబ్రహ్మమునే అనెడి ధృఢ నిర్ణయం కలుగుతుంది.

– ఆత్మాను భూతిని పొందిన వారు ఎలా జీవిస్తారు?

మం॥ సంప్రాప్యైనం ఋషయో జ్ఞానతృప్తాః
కృతాత్మానో వీతరాగాః ప్రశాంతాః ।
తే సర్వగం సర్వతః ప్రాప్య ధీరాః
యుక్తాత్మానః సర్వమేవా విశంతి॥ (5)

ప్రతి॥ ఏనం సంప్రాప్య = దీనిని పొంది; ఋషయః = ఋషులు; జ్ఞానతృప్తాః = జ్ఞానంచే తృప్తి చెందినవారై; కృతాత్మానః = కృత కృత్యులై; వీతరాగః = సంగభావం లేనివారై; ప్రశాంతాః = ప్రశాంతచిత్తులై; తేయుక్తాత్మానః = **ఆ యుక్తాత్ములైన;** ధీరాః = ధీర పురుషులు; సర్వగం = సర్వగతమైన ఆత్మను; సర్వతః = సర్వత్ర; ప్రాప్య = సాక్షాత్కరించుకుంటూ; సర్వం ఏవ అవిశంతి = అన్నింటిలో ప్రవేశిస్తారు.

భావం : ఆత్మాను భూతినొందిన ఋషులు జ్ఞానముతో తృప్తిచెంది, సంగభావం లేనివారై, కృతకృత్యులై, ప్రశాంతచిత్తులైయుంటారు. అట్టి ధీర పురుషులు సర్వగతమైన ఆత్మను సర్వత్రదర్శిస్తూ అన్నింటిలో ప్రవేశిస్తారు.

వ్యాఖ్య : 1. జ్ఞానతృప్తాః : క్రిందటి మంత్రంలో చెప్పబడిన విధంగా ఎవరు ఆత్మానుభూతిని పొందుతారో అట్టి వారు ఇక వ్యక్తిగా అసంతృప్తితో సుఖదుఃఖాలు అనుభవిస్తూ జీవించరు. వారు బ్రహ్మ జ్ఞానంతో తృప్తి చెందియుంటారు. **జ్ఞానమనేది మార్గంకాదు. అది గమ్యమే.** అట్టి జ్ఞానులు తాము సర్వత్రా ఉన్న ఏకైక సత్యమైన ఆత్మగనుక, వారికి దేహం ఉన్నా లేనట్టే. కనుక దేహావసరాలు లేవు – ఆకలి దప్పులులేవు. **మనస్సు ఆత్మలో అంతమై పోయింది గనుక ఇది సుఖమనీ, ఇది దుఃఖమనీ భేదాలు లేవు.** వాసనలన్నీ అంతమైనవి గనుక బుద్ధిలో కోరికలు లేవు. కనుక వాటిని తీర్చుకొనే ఆలోచనలుగాని, కర్మలు గాని ఉండవు. గమ్యస్థానం చేరుకున్నారు

గనుక ఇక చేరుకోవలసిన పదంగాని, **చేయవలసిన సాధనలుగాని లేవు.** వారికీ ప్రపంచం అంతా రాత్రి స్వప్నం వంటిదే. మిధ్యామాత్రం. వారి దృష్టిలో సృష్టి స్థితి లయాలుండవు. **ఎల్లప్పుడూ ఆత్మలో తృప్తినందుతూ** ఆనంద సాగరంలో ఓలలాడుతుంటారు. దుఃఖం ఏమాత్రం తెలియని ఆనందం. కనుక అది అద్వయ ఆనంద రసానుభూతి.

2. కృతాత్మానః : అందుకోవలసిన లక్ష్యాన్ని అందుకున్న వారు గనుక **కృతకృత్యులు.** కోరికలన్నీ తీరినవారుగనుక, ఇక కోరికలే లేవు గనుక, ఇక చేయదగినదేదీ లేదు గనుక, పొందవలసినదేదీ లేదు గనుక **కృతాత్మనః కృతకృత్యులు –**

3. వీతరాగాః : సంగత్వము లేనివారు. వారిదృష్టిలో ఈ ప్రపంచంగాని – ఇందులోని వస్తువులు, విషయాలు, భోగాలు గాని **లేనివే** గనుక ఇక వాటితో ఎట్టి సంగభావము ఉండదు. అవమానమైనా, సన్మానమైనా ప్రేమయైనా, ద్వేషమైనా వారిలో ఏ తేడా ఉండదు. దేనికీ చలించరు. (దృశ్యప్రపంచంపై మనస్సుకున్న మోహమే సంగం. వారికి దృశ్యమూ లేదు. మనస్సూలేదు.)

4. ప్రశాంతా : రాగద్వేషాలకు, మానావ మానాలకు, సుఖదుఃఖాలకు, శీతోష్ణాలకు, అతీతులు గనుక వారు ప్రశాంత చిత్తులు. వారిలో ఎటువంటి ఆందోళనకు ఆస్కారంలేదు.

వారు వ్యక్తిత్వము నశించినవారు గనుక ఇప్పటి దాకా ఉన్న పరిమితదేహ భావాన్ని విడిచి, అపరిమిత తత్వంలో ఉండిపోతారు. **సర్వగతమైన – సర్వవ్యాపకమైన ఆత్మగా ఉండిపోతారు. వారికి దేశ-కాల పరిమితులుండవు.** తాము తప్ప అన్యమైన దేదీ లేనివారై ఆత్మానుభవంలో ఉండిపోతారు. దృశ్యం అదృశ్యమైతే ముక్తియే. దృశ్యం అదృశ్యమైనదీ అంటే దృశ్యాన్ని దర్శించే మనస్సు అంతమైందీ అని. మనస్సు అంతమైన చోట ఆత్మయే ఉంటుంది.

ఇట్టి వారినే **యుక్తాత్ములు - ధీరులు** అంటారు. ఇలా **జ్ఞానమయులై, కృత కృత్యులై, ప్రశాంతులై, యుక్తాత్ములై, ధీరులైన ఋషులు** చైతన్య స్వరూపులై ఉంటారు. చైతన్యము నిరాకారమై, సర్వవ్యాపకమై నందున వారు దేహ పరిమితిని వీడి **సర్వగతులై** ఉంటారు. ఆకాశం ఎలా సర్వగతమై అన్నింటిలోను ప్రవేశిస్తుందో అలాగే సర్వగతులైన వీరు అన్నింటిలోను ప్రవేశిస్తారు. ఆకాశం స్థూలమైన వాటిలో ప్రవేశించలేదు. కానీ వీరు **అన్నింటిలోను ప్రవేశిస్తారు.** వారు సర్వజ్ఞులై యుంటారు - అని అంగిరసమహర్షి తెలియజేస్తున్నారు.

అట్టి స్థితి ఎలా వస్తుందో సూక్ష్మంగా తెలియజేయ బోతున్నారు.

- అట్టి అమృతత్వస్థితి - ఆత్మస్థితి ఎలా ప్రాప్తిస్తుంది?

మం॥ వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః
సన్న్యాస యోగాత్ యతయః శుద్ధసత్త్వాః ।
తే బ్రహ్మ లోకేషు పరాంత కాలే
పరామృతాః పరిముచ్యంతి సర్వేః ॥ (6)

ప్రతి॥ వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః = ఉపనిషత్తుల జ్ఞానమును చక్కగా గ్రహించి; సన్న్యాసయోగాత్ = సన్న్యాసయోగంచేత; యతయః = ఋషులు; శుద్ధ సత్త్వాః = పరిశుద్ధమైన మనస్సుగలవారై; తే = వారు; పరాంతకాలే = అంత్యకాలంలో; సర్వే = అందరూ; బ్రహ్మలోకేషు = బ్రహ్మలోకాన్ని చేరి; పరామృతాః = అమృతత్వాన్ని పొంది; పరిముచ్యంతి = తరిస్తారు.

భావం : ఉపనిషత్తుల జ్ఞానాన్ని క్షుణ్ణంగా గ్రహించి, సన్న్యాసయోగంతో పరిశుద్ధ మనస్కులైన ఋషులు అందరూ అంత్యకాలంలో బ్రహ్మలోకాన్ని చేరి అమృతత్త్వాన్ని పొంది తరిస్తారు.

వ్యాఖ్య : అమృతత్వ స్థితిని పొంది తరించటానికి 2 ముఖ్య ఉపాయాలు - లేదా- సాధనలు ఉన్నాయి.

(1) వేదాంత విజ్ఞానాన్ని చక్కగా విశ్లేషించి తెలుసుకొనుట.

(2) సన్యాసయోగం చేత పరిశుద్ధమైన అంతఃకరణం కలవారగుట.

1. వేదాంత విజ్ఞానం : వేదానికి అంతంలోనున్న జ్ఞాన భాండాగారాలను వేదాంత విజ్ఞానం అంటారు. **అవే ఉపనిషత్తులు.** ఈ ఉపనిషత్తులలో అతినిగూఢంగా తెలియబరచిన జ్ఞానమే వేదాంతజ్ఞానం. ఈ వేదాంత జ్ఞానాన్ని వినటం, తెలుసుకోవటం గాక దానిని చక్కగా విశ్లేషించి, నిశ్చితాభిప్రాయానికి రావాలి. అనుభవానికి తెచ్చుకోవాలి. అప్పుడే అది విజ్ఞానమవుతుంది. ఇట్టి వేదాంత విజ్ఞానాన్ని చక్కగా తెలిసినవారు ఋషులు.

ఉపనిషత్తులలోని సిద్ధాంతాలు గొప్పగొప్ప తాత్వికరహస్యాలను ఆవిష్కరిస్తాయి. ఇట్టి రహస్యాలను ముముక్షువులు తమంతట తాముగా గ్రహించలేరు. శ్రోత్రియులు, బ్రహ్మనిష్ఠులు అయిన ఆచార్యుల చెంత ఆశీనులై వినయ విధేయతలతో - విశ్వాసంతో శ్రవణంచేసి జ్ఞాన పంట పండించుకోవాల్సిందే. అప్పుడే జ్ఞానం వంటపట్టేది - అనుభవానికి వచ్చేది.

అందుకే వేదాంత జ్ఞాన మనక విజ్ఞానమని చెప్పి - అది తెలుసుకోవటం అనక **సు-నిశ్చితార్థాః** అన్నారు. అంటే అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. ఆ తెలుసుకోవటం కూడా అందలి నిగూఢరహస్యాలను **నిశ్చితమైన అర్థాలతో గ్రహించాలి.**

2. సన్యాసయోగాత్ : ఒక పరమగురువు వద్ద ఈ వేదాంత విజ్ఞానాన్ని గురించి శ్రవణం చేసిన తర్వాత సన్యాస యోగం ద్వారా ప్రయత్న శీలురై శుద్ధమైన అంతః కరణం కలిగిన వారు కావాలి. ప్రతి వారికీ అంతః కరణం మలినమై ఉంటుంది. ఈ లోకంలో జన్మించిన తర్వాత చుట్టూ ఉన్న ప్రపంచాన్ని - వాతావరణాన్ని చూస్తున్నప్పుడు - తనలోని వాసనల కనుగుణంగా రాగం - ద్వేషం - అసూయ - మోహం - మదం - అహంకారం - క్రోధం - లోభం - స్వార్థం, మొదలైన గుణాలతో మనస్సు కలుషితమై పోతుంది. ముముక్షువైనంత మాత్రాన ఇవి అన్నీ వాటంతట

అవి వదలిపోవు. వాటిని **ప్రయత్నంతో** వదిలించుకోవాలి. అందుకే **యతయః** = ప్రయత్నశీలురు అంటున్నారు. కనుక ప్రయత్నంతో మన మనస్సును అంటిన దోషాలను పోగొట్టుకోవాలి. అయితే ఎలా ప్రయత్నించాలి? వేదాంత విజ్ఞానాన్ని చక్కగా సద్గురువుల వద్ద శ్రవణం చేస్తూ – గురుసేవ ద్వారా – గురువు యొక్క అనుగ్రహాన్ని పొంది ఆ వేదాంత జ్ఞానంలోని రహస్యాలను నిశ్చితంగా తెలుసుకోవాలి, అనుభవానికి తెచ్చుకోవాలి.

సన్యాసయోగమును అనుసంధానం చేయాలి. నిజంగా సన్యాస యోగం అనేది ఒకే ఒక పదంకాదు. అది 2 పదాలకలయిక. **సన్యాసము – యోగము.** సన్యాసం అంటే వదలటం. యోగం అంటే కలవటం. కనుక రెండూ వేరు వేరు సాధనలు అని తెలుసుకోవాలి.

ఎ. సన్యాసం : అంటే వదలటం. దేనిని వదలాలి? **ఈ ప్రపంచం, ఇందులోని విషయాలు, భోగాలు సత్యము అనే భ్రమను – మోహాన్ని వదలాలి.** ఆ మోహాన్ని వదిలితే విషయాలపై – భోగాలపై **రాగం – ఆకర్షణ – కోరిక** తగ్గిపోతుంది. వాటికొరకు పరుగు లెత్తటం తగ్గిపోతుంది. అవి లభించలేదనే **ఆక్రోశం, క్రోధం** తగ్గిపోతాయి. అవతల వారికున్నవి, నాకు లేవు అనే **అసూయ, ఈర్ష్యతగ్గిపోతాయి.** నాకే ఉండాలి, వాటిని నేను వదలకుండా పట్టుక కూర్చోవాలనే **లోభబుద్ధి** తగ్గిపోతుంది. అంతే కాదు ఇవన్నీ నాకే ఉన్నాయి – ఎవ్వరికీ లేవు అనే **మదం** తగ్గిపోతుంది. అంటే అన్ని దుర్గుణాలకు మూలం **ప్రపంచం సత్యమని భావించటమే.** కనుక ప్రపంచం మిధ్యయని, రాత్రి స్వప్నంలో కనిపించిన స్వప్నప్రపంచం వంటిదేనని, మరల మరల తెలుసుకుంటూ గుర్తుచేసుకుంటూ అన్ని వస్తువులలో – విషయాలలో – భోగాలలో ఉన్న **దోషాలను మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకుంటూ ఉండాలి.** దీనితో మనకు ఈ ప్రపంచంపై – లౌకికమైన భోగాలపై ఆసక్తి తగ్గిపోతుంది – దానితో మనలోని దుర్గుణాలన్నీ

తొలగిపోయి అంతఃకరణం శుద్ధమవుతుంది. దీని వల్ల క్రమంగా దేహాభిమానం కూడా తగ్గిపోతుంది. వస్తువులను వదలటంగాక వస్తువులపై రాగాన్ని వదలాలి. **ఇదే సన్యాసం అంటే.**

బి. యోగం అంటే కలయిక : ప్రాపంచిక విషయవాసనలను **సన్యాసంద్వారా వదిలాం.** దానితో మనస్సులోని వాసనలు పూర్తిగ నశించి **మనస్సు ప్రశాంత మవుతుంది.** అలా శాంతించిన మనస్సును అలాగే ఉంచితే **అది మళ్ళీ ప్రపంచంలోకి తిరిగి,** విషయాలతో పెనవేసుకొని పోయే ప్రమాదం ఉంది. అలా జరిగితే చేసిన ప్రయత్న మంతా వృధా. కనుక పరిశుద్ధమైన మనస్సును **'యోగం'** ద్వారా **ఆత్మవైపుకు త్రిప్పాలి.** అంతర్ముఖం చెయ్యాలి. నిరంతరం ఆత్మతో అనుసంధానం చెయ్యాలి. నేను ఈ దేహం. మనస్సు – బుద్ధికాదు; **వీటికి ఆధారంగా ఉన్న నిరాకార – సూక్ష్మాతి సూక్ష్మ చైతన్యాన్ని అనే దృష్టి కలిగి ఉండాలి.** నిరంతరం అట్టి చైతన్యంగా – ఆత్మగా ఉండిపోవాలి. ఇదే అంతఃకరణం ఆత్మతో కలియటం. జీవాత్మ పరమాత్మల ఐక్యత. **యోగం. కనుక సన్యాసం ద్వారా ప్రపంచంనుండి విడిపోయిన మనస్సును యోగం ద్వారా ఆత్మతో పెనవేయాలి – కలిపేయాలి. ఇదే సన్యాసయోగం.** దీనివల్ల పరిశుద్ధు లౌతారు.

ఇట్టి సన్యాసయోగం ద్వారా పవిత్రులైన యతులు అంత్యకాలంలో బ్రహ్మలోకాన్ని చేరుకుంటారు.

అంత్యకాల మంటే మరణకాలం అని భావిస్తారు చాలామంది. శరీరం వదిలి పోవటం అజ్ఞానికి అంత్యకాలం **– మరణకాలం.** కాని అంతః కరణం వదిలిపోవటం లేదా **జీవ భావం వదిలి పోవటం** జ్ఞానికి అంత్యకాలం. **ఇదే సాక్షాత్కార సమయం అని శంకరాచార్యులవారు సెలవిచ్చారు.** కనుక అంత్యకాల మంటే **సాక్షాత్కార సమయమే.**

ఎవరు వేదాంత విజ్ఞానం ద్వారా, సన్యాస యోగం ద్వారా – ప్రాపంచిక విషయాలతో గల సంగభావాన్ని పూర్తిగ వదిలి. ఆత్మతో

అనుసంధానమై, **ఆత్మగా ఉండిపోతారో** అట్టివారు ఆ సమయంలోనే – అంటే ఆత్మ **సాక్షాత్కార సమయంలోనే** లేదా ఆత్మాను భూతి పొందిన క్షణంలోనే **బ్రహ్మలోకాన్ని చేరుకుంటారు.** అమృతత్వాన్ని అందుకొని తరిస్తారు – అని అంగిరస మహర్షి తెలియజేస్తున్నారు.

ఐతే **బ్రహ్మలోకాన్ని చేరటం అంటే** క్రమముక్తి ద్వారా సృష్టికర్తగారు ఉండే సత్యలోకమా? అంటేకాదు. ఇది బ్రహ్మప్రాప్తి. మోక్షప్రాప్తి. ఆనందప్రాప్తి – అమృతత్వప్రాప్తి. అందుకే బ్రహ్మలోకం చేరుకొని – **అమృతత్వాన్ని పొంది తరిస్తారు అన్నారు.** క్రమముక్తి ద్వారా బ్రహ్మలోకాన్ని చేరినవారు అక్కడ బ్రహ్మగారి ద్వారా జ్ఞానాన్ని పొందాలి. దీర్ఘకాలం అలా జ్ఞానాన్ని పొంది తరించాలి. అక్కడా Pass - Fail ఉంటాయి. కనుక బ్రహ్మలోకాన్ని చేరగానే అమృతత్వం లభించదు. **ఇది జీవన్ముక్తి.** ఆత్మ సాక్షాత్కారం కలగటంతోనే అమృతత్వప్రాప్తి. ఇక ఏమార్పులు లేని శాశ్వత ఆనందస్థితి.

అయితే ఇట్టి జ్ఞానికి ప్రారబ్ధవశాత్తు ఇంకాదేహం ఉంటుంది. అయినా వారి దృష్టిలో ఉన్నట్టుకాదు. శరీరానికి పరిమితులై ఉండరు. అప్రయత్నంగా దేహేంద్రియలు పనిచేస్తున్నా సరే వారు తమ స్వస్థితిలోనే ఉండిపోతారు. **రాత్రి సమయాన బండి నడిపేవాడు బండిలో నిద్రిస్తాడు. బండి మాత్రం అలవాటుగా చేరవలసిన చోటుకు చేరుతుంది. ఇదే జ్ఞాని పరిస్థితి –**

– అట్టి వారి వ్యక్తిత్వం ఏమవుతుంది? వారి కర్మలు ఏమవుతాయి?

మం॥ గతాః కలాః పంచదశ ప్రతిష్ఠా
దేవాశ్చ సర్వే ప్రతిదేవ తాసు ।
కర్మాణి విజ్ఞాన మయశ్చ ఆత్మా
పరేఽవ్యయే సర్వ ఏకీ భవంతి॥ (7)

ప్రతి॥ పంచదశకలాః = పదిహేను అంశాలూ; ప్రతిష్ఠాగతాః = వాటి

కారణాలలో కలసి పోతాయి; దేవాశ్చసర్వే = ఇంద్రియాలన్నీ; ప్రతి దేవతాసు = వాటి అధిష్టాన దేవతలలో కలిసి పోతాయి; కర్మాణి = కర్మలు; విజ్ఞాన మయశ్చ ఆత్మా = జ్ఞాన మయమైన వ్యక్తిత్వం; సర్వ = అన్నీ; పరే అవ్యయే = శ్రేష్ఠమైన అక్షరతత్వంలో; ఏకీభవంతి = లీనమై పోతాయి.

భావం : వారి పదిహేను అంశాలు వాటి కారణాలలోను; ఇందియాలు అధిష్టాన దేవతలలోను కలిసి పోతాయి. ఇక వారి కర్మలు, వ్యక్తిత్వం పరమమైన అక్షర తత్త్వంలో లీనమైపోతాయి.

వ్యాఖ్య : ఎవరైతే బ్రహ్మలోకమును చేరి అమృతత్వమును పొందుతారో బ్రహ్మాత్మైక్య సిద్ధిని పొందుతారో అట్టి వారి **వ్యక్తిత్వం - ఇప్పటిదాకా తగిలించుకున్న ఉపాధులు, జీవభావం ఏమవుతాయో ఇక్కడ చెబుతున్నారు.**

ఎ. వారి 15 అంశాలు వాటి మూల కారణాలలో చేరిపోతాయి - ఏమిటా 15 అంశాలు?- ఆత్మనుండి ప్రాణం జనిస్తుంది. ఆ ప్రాణం ప్రధానంగా **5 విధాలుగా** ఉంటుంది. **అవే ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదానాలు.** వాటికి వేర్వేరు విధులున్నాయ (1) **ప్రాణం** అనేది బయటినుండి గాలిని లోనికి పీల్చుకోవటం, నోటిలో పడ్డ ఆహారాన్ని లోనికి స్వీకరించటం చేస్తుంటుంది. **(2) అపానం** మల ద్వారం, జననేంద్రియంలో ఉంటుంది. అది మనం తీసుకున్న ఆహారంలోని సారం పోగా మిగిలిన పిప్పిని - పనికిరానిదానిని మలమూత్రాల రూపంలో బయటకు పంపుతుంది. **(3) సమానం :** కడుపు భాగంలో ఉండి మనం తిన్న అన్నాన్ని జీర్ణంచేసి - ఆ సారాన్ని యే అవయవాలకు ఎంతెంత అవసరమో అంత అంత భాగాన్ని ఆయా అవయవాలకు సరఫరా చేస్తుంది. **(4) వ్యానం :** అనేది అన్ని నాడులలో ఉంటుంది. హృదయం నుండి నూటొక్క నాడులు (101) వాటికి ఒక్కొక్కదానికి 100 శాఖలు, మళ్ళీ ఒక్కొక్క శాఖకు 72000 ఉపశాఖనాడులు ఉన్నాయి. మొత్తం (101×100×7200 = 72,72,00,000) 72 కోట్ల 72 లక్షల నాడులు. మన దేహంలో రక్తాన్ని

హృదయం నుండి అన్ని శరీరభాగాలకు, మళ్ళీ అన్ని శరీరభాగాలనుండి చెడు రక్తాన్ని హృదయానికి చేరుస్తూ ఉంటాయి. వీటన్నింటిలో వ్యానశక్తి ఉండి ఆనాడులలోని రక్తంతో పాటు ఈ అన్నసారాన్ని శరీరభాగాలకు తీసుకెళుతుంది. **(5) ఇక ఉదానం :** 101 నాడులలోను ఒక్కటి (సుషుమ్న) పైకిపోతుంది. దీనిలో ఉదానం ఉంటుంది. ఇది ఆలోచనాశక్తి నిచ్చేది. అంతేకాదు. శరీరాన్ని విడిచిన తర్వాత జీవుడు వెళ్ళవలసిన స్థానానికి చేర్చేది కూడా ఈ ఉదానశక్తే. పుణ్యం చేసుకొంటే పుణ్యలోకాలకు, పాపంచేసుకొంటే నరకానికి, రెండూ ఉంటే మనుష్యలోకానికి తీసుకెళ్ళే సారధి ఇది.

ఇలా ఉన్న ఈ 5 ప్రాణాలు, వీటికి మళ్ళీ 5 ఉపప్రాణాలు, మొత్తం **10** వాటి వాటి మూలకారణమైన ఆత్మలో అంతమైపోతాయి. అంతేగాక **5 భూతాలు** వాటి తన్మాత్రలలో ఐక్యమైపోతాయి. ఇలా **15** అంశాలూ వాటివాటి మూలకారణాలలో అంతమై పోతాయి.

బి. ఇక కర్మేంద్రియాలు 5, జ్ఞానేంద్రియాలు 5, అంతః కరణములు నాలుగు - వాటి వాటి అధిష్టాన దేవతలతో కలిసిపోతాయి.

పాదాలు విష్ణువులో, చేతులు ఇంద్రునిలో, వాక్కు అగ్నిలో, పాయువు మృతువులో, జననేంద్రియం ప్రజాపతిలో, కన్ను సూర్యునిలో, ముక్కు అశ్వనీ దేవతలలో, **చెవి ఆకాశంలో,** చర్మం వాయువులో, నాలుక వరుణునిలో, **మనస్సు చంద్రునిలో,** బుద్ధి బృహస్పతిలో, చిత్తం వాసుదేవునిలో, **అహంకారం రుద్రునిలో** కలిసిపోతాయి. ఇంద్రియాలు, ఇంద్రియ విషయాలు అధిష్టాన దేవతలలో కలిస్తే ఆ అధిష్టాన దేవతలు ఆత్మలో కలిసి పోతాయి.

సి. ఇక కర్మలు. **అంటే కర్మఫలాలు :** జ్ఞానాగ్నిలో దగ్ధమైపోతాయి. నిజంగా కర్మఫలాలు అహంకారానికే చెందుతాయి. అహంకారం ఆత్మలో అంతమైతే అహంకారానికి చెందిన కర్మఫలాలు ఆత్మలోనే అంతమైపోతాయి.

ఇక వ్యక్తిత్వం – అంటే **జీవభావం.** నేను దేహాన్ని అనే అజ్ఞానం నేను ఆత్మను అనే జ్ఞానం కలగటంతోనే అంతమై పోతుంది. **కనుక అన్నీ అంతం.** నేను నేను అంటున్న జీవభావం ఆత్మను చేరటంతో ఆత్మ అక్షర పరబ్రహ్మంలో లీనమై పోతుంది. (అయమాత్మా బ్రహ్మ) ఇదే **పర – అవ్యయమని** ఈ మంత్రంలో చెప్పబడినది. అన్ని కార్యములు, అన్ని ఇంద్రియాలు, విషయాలు, ప్రాణాలు ఈ పరమ కారణంలో విలీనమై పోతాయి. – అద్వయము, సర్వవ్యాపకము అయిన అక్షరతత్వంలో అన్ని నామరూపాలు – అనాత్మపదార్థాలు **ఎలా** విలీనమైపోతాయో తరువాత మంత్రంలో – చెప్పబోతున్నారు.

– జీవభావం పరమాత్మలో ఐక్యమయ్యే విధం –

మం॥ యథానద్యః స్యందమానాః సముద్రే
అస్తం గచ్ఛంతి నామరూపే విహాయ।
తథా విద్వాన్ నామరూపాద్విముక్తః
పరాత్పరం పురుష ముపైతి దివ్యం॥ (8)

ప్రతి॥ యథా = ఏప్రకారంగా; స్యందమానాః = ప్రవహించే; నద్యః = నదులు; నామరూపే విహాయ = నామ రూపాలను విడిచి; సముద్రే = సముద్రంలో; అస్తం గచ్ఛంతి = కలిసిపోతాయో; తథా = అలాగే; విద్వాన్ = విద్వాంసుడు; నామరూపాత్ విముక్తః = నామరూపాలనుండి విడివడి; పరాత్పరం = పరమోత్కృష్టమైన; దివ్యం = దివ్యమైన; పురుషం ఉపైతి = పరబ్రహ్మంలో లీనమై పోతాడు.

భావం : ఏప్రకారంగా ప్రవహించే నదులు నామరూపాలను వదిలి సముద్రంలో కలిసి పోతాయో అలాగే ఆత్మజ్ఞాని నామరూపాలనుండి విడుదలపొంది సర్వోత్కృష్టము, దివ్యము ఐన పరబ్రహ్మంలో లీనమై పోతాడు.

వ్యాఖ్య : నదులు సాగరంలో ఐక్యమైనట్లు : నదులు అనేక రూపాలు. వాటి వడి, ఉరవడి, పరవడి వేరు వేరుగా ఉంటాయి. నదిలోని నీటిరుచి కూడా ఒక దానికి ఒకదానికి తేడా. రంగులు తేడా. వేరువేరు పేర్లు. గంగ, గోదావరి, కృష్ణ, కావేరి, నర్మద, తుంగభద్ర.... ఇలా వేరువేరు నామరూపాలతో, వేరు వేరు రుచులతో రంగులతో ఉన్న ఈ నదులన్నీ ఏఏ మార్గాలలో పయనించినా చివరకు అన్నీ చేరుకొనేది సాగరాన్నే. సముద్రంలో చేరి పోవటంతో వాటి వాటి **నామం, రూపం, గుణం (రుచి) – అన్నీ తొలగిపోయి** ఒక్కటే సముద్రాకారంగా మారి పోతాయి. వాటివాటి **ప్రత్యేకతలన్నీ రద్దయి పోతాయి.** ఎంత ఉరవడితో పరవళ్ళు తొక్కి ప్రవహించినా, సముద్రుణ్ణి చేరి అందులో **లయమై** పోవటంతో వాటికి **స్వస్థత – శాంతి – ప్రశాంతి చేకూరుతుంది.** దీని కంతటికీ కారణం ఆ నదులన్నీ సముద్రం నుంచి బయలుదేరటమే. వాటి జన్మ స్థానం సముద్రం కావటమే. సూర్యుని వేడికి సముద్రంలోని నీరు వేడెక్కి ఆవిరియై మేఘాల రూపంలో నిలుస్తుంది. చెట్ల నుండి వీచే చల్లనిగాలికి ఆ మేఘాలు చల్లబడి వర్షిస్తాయి. ఆ వర్షపు నీరు నదులను చేరి ప్రవహిస్తుంది. అలా ప్రవహించి ప్రవహించి సముద్రుణ్ణి చేరుతుంది.

సముద్రుణ్ణి చేరేవరకు ఒకటే ఆరాటం, అశాంతి, పరుగు, విశ్రాంతిలేదు. సముద్రుణ్ణి చేరగానే పరమశాంతి. చేరేదాకా వేరు వేరు వ్యక్తిత్వం, చేరగానే అంతా ఒక్కటే. గుర్తింపు రద్దు –

అలాగే పరమాత్మ చైతన్యం అనేక జీవుళ్ళుగా వ్యక్తమవుతుంది. జీవుళ్ళకు వేరు వేరు నామాలు, రూపాలు, గుణాలు. ఇలా వేరు వేరు నామరూప గుణాలతో ఉన్న జీవుళ్ళు అందరిలోను ఉన్నది ఆ చైతన్య అంశయే. జీవుడు జీవుడుగా ఉన్నంతవరకు ప్రత్యేక వ్యక్తిత్వం, పేరు, రూపం, గుణం ఉంటాయి. జీవుడు తన నిజస్వరూపమైన ఆత్మచైతన్యంలో లయమై పోవటంతో తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, నామాన్ని, రూపాన్ని, గుణాన్ని

అన్నింటిని కోల్పోయి, ఆత్మాకారంగా మారిపోతాడు. అయితే నిజంగా నదులు సముద్రం కన్న వేరుగా ఉన్నట్లు జీవుళ్ళు పరమాత్మకన్నా వేరుగా ఉంటారా? ఉండరు. ఆ పరమాత్మే ఈ జీవుడుగా భ్రాంతి కొల్పుతుంటాడు. ఆ భ్రమ తీరిపోతేచాలు జీవుడు పరమాత్మే. త్రాడు చీకటిలో పాముగా కనిపిస్తుంది. భ్రమతీరితేచాలు అది త్రాడే. ఇక్కడ **పాముత్రాడుగా ఎట్లా మారటం లేదో అలాగే జీవుడు పరమాత్మగా మారటం అనేది జరగదు.** అజ్ఞానం తొలగితే చాలు జీవుడు పరమాత్మయే.

జీవుడుగా ఉన్నంతకాలం అనేకమైన కోరికలు, వాటికనుగుణమైన ఆలోచనలు, కర్మలు – వాటి ఫలితంగా సుఖ దుఃఖాలు; నిరంతరం అలజడి, ఆందోళన, ఉద్రేకం, అశాంతి. ఎప్పుడైతే జీవ భావం తొలగిపోయిందో – తాను పరమాత్మ స్వరూపాన్ని అనే జ్ఞానం కలిగిందో, ఆ స్వరూపంలోనే నిలుస్తున్నాడో ఇక ఎట్టి కోరికలుగాని, కర్మలుగాని, అనుభవాలుగాని లేవు, ఉండవు. కనుక పరమ ప్రశాంతి. ఇలా జ్ఞానియైనవాడు తన స్వరూపం తెలుసుకొని, భ్రమాజ్ఞానం నుండి తొలగి **సత్య స్వరూపంలో** నిలవటంతో అన్ని నామరూప గుణాలనుండి విముక్తుడై , మిక్కిలి శ్రేష్ఠమైన, దివ్యమైన శాశ్వత ఆనందస్వరూప పరబ్రహ్మముగా అద్వయానందరసాను భూతిలో ఉండిపోతాడు –

– బ్రహ్మవిదుని విశిష్టత ఏమిటి? –

మం॥ సయోహవైతత్ పరమం బ్రహ్మవేద
బ్రహ్మైవభవతి నాస్యా బ్రహ్మవిత్ కులే భవతి ।
తరతి శోకం తరతి పాప్మానం
గుహా గ్రంధిభ్యో విముక్తోఽ మృతోభవతి ॥(9)

ప్రతి॥ యః = ఎవరైతే; హవై = నిజంగా; తత్ పరమం బ్రహ్మ = ఆ పరబ్రహ్మన్ని; వేద = తెలుసుకుంటాడో; బ్రహ్మ ఏవభవతి = బ్రహ్మమే

అవుతాడు; అస్యకులే = అతడికులంలో; అబ్రహ్మవిత్ = బ్రహ్మమును తెలియనివాడు; నభవతి = పుట్టడు; సః = అతడు; శోకం తరతి = దుఃఖాన్ని దాటిపోతాడు; పాప్మానం తరతి = పాపాలను దాటి పోతాడు; గుహాగ్రంధిభ్యః = హృదయగ్రంధి నుండి; విముక్తః = విముక్తుడై; అమృతః భవతి = అమరుడౌతాడు.

భావం : బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మమే అవుతాడు. బ్రహ్మమును తెలియని వాడు అతని వంశంలో జన్మించడు. హృదయగ్రంధులు వీడిపోగా శోకానికి, పాపాలకు దూరుడై అతడు అమరుడౌతాడు.

వ్యాఖ్య : 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అని ఉపనిషత్ వాక్యం. బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మమే అవుతాడు. **బ్రహ్మమును తెలియుట అంటే బ్రహ్మస్వరూపాన్ని తెలుసుకొనుట.** బ్రహ్మము నిరాకారమని, నిర్గుణమని, అపరిమితమని, అపరిచ్ఛిన్నమని, సర్వవ్యాపక మని, ఏకమనీ, **అద్వయమని** శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. **మరి బ్రహ్మము ఏకమైతే తెలుసుకొనేవాడు బ్రహ్మము కన్న వేరుగ ఎక్కడ ఉంటాడు?** బ్రహ్మము కన్న వేరైనది లేదంటూ – 'నేను బ్రహ్మమును తెలుసుకున్నాను'. అంటే నేను వేరుగా ఉన్నట్లే గదా! కనుక నేను తెలుసుకున్నాను అనే పదానికి అర్థం లేదు. మరైతే తెలుసుకోవటం ఏమిటి? ఇప్పటి దాకా తాను భ్రమలో ఉండి దేహాన్ని అనుకున్నతాను; దేహాన్ని కాదని, ఈ కల్పిత దేహమనో బుద్ధులకు **ఆధారంగా ఉన్న ఆత్మనని –** ఆత్మ యైనతాను కేవలం ఈ దేహంలో మాత్రమేకాదు **సర్వత్రా ఉన్నానని దృఢ నిశ్చయంలో ఉండిపోవాలి.** ఈ దేహ మనోబుద్ధులు తనలోనే కల్పించబడిన భావనలని – మేలుకున్న వాడు స్వప్నాన్ని గుర్తుచేసుకున్నట్లు, భావించినట్లు భావించాలి. స్వప్న ప్రపంచం యావత్తు మేలుకొన్న వాని మనస్సులో లీనమైనట్లు, ఇప్పటి వరకు కనిపించిన ఈ దృశ్య ప్రపంచం, దానిని చూచిన, అనుభవించిన దేహ మనోబుద్ధులు అన్నీ బ్రహ్మమే ఐన తనలో లీనమై పోతాయి. తాను

తానుగా మిగిలిపోవటం జరుగుతుంది. ఇలా బ్రహ్మముగా అనుభూతి పొందిన వాడు బ్రహ్మమే అని భావం. అతడు సాక్షాత్ పరమాత్మయే.

ఇంతవరకు అజ్ఞానంలో – తన నిజస్వరూపం తెలియని దశలో – భ్రమలో ఈ దేహ మనోబుద్ధులే తానని భావించాడు. ఇప్పుడు తన నిజస్వరూపం అవగతమైంది. అజ్ఞానం తొలగింది. జ్ఞానం కలిగింది. జ్ఞానంతో అజ్ఞానం తొలగటమే మోక్షం. మన ప్రయత్నాలన్నీ – సాధనలన్నీ అజ్ఞానాన్ని తొలగించుకొనుటకే.

బ్రహ్మమునని అనుభవం పొందటంతో – తన నిజస్వరూపం సర్వవ్యాపక బ్రహ్మము – అద్వయ బ్రహ్మము అని దృఢ నిశ్చయం కలగటంతో ఇప్పటివరకూ ఉన్న అజ్ఞానం తొలగింది. దానితో బంధాలన్నీ తొలగుతాయి. అతడి వంశంలో బ్రహ్మ విదుడుకాని వాడు జన్మించడు అని అంగిరస మహర్షి తెలియజేస్తున్నాడు. ఇదేమిటి? బ్రహ్మజ్ఞాని వంశంలో బ్రహ్మజ్ఞానులే జన్మిస్తారా?

మరి "పండిత పుత్ర శుంఠ" అనేది అబద్ధమా? బురద నుండి కమలములు పుట్టినట్లు ఎటువంటి సంస్కారం లేని హీనుల కడుపున గొప్పగొప్ప వారు పుట్టుట లేదా? – నిజమే. సంస్కార హీనుల కడుపున పుట్టినవారు స్వప్రయత్నంతో – పరిసరాల ప్రభావంతో గొప్పవారు కావచ్చు. బ్రహ్మజ్ఞానులు కావచ్చు. అలాగే కొందరు గొప్పవారి కడుపున శుంఠలు పుట్టవచ్చు. అవి ప్రత్యేకమైన సంఘటనలు. అన్నిచోట్ల అలాగే ఉండటం జరగదు.

ఐతే సాధారణంగా తండ్రి ఏ వృత్తిలో ఉంటే కుమారునికి కూడా ఆ వృత్తిలో ఎంతో కొంత అనుభవం అనుకోకుండానే వస్తుంది. ప్రయత్నం చేస్తే **అందులో శ్రేష్ఠుడు కావచ్చు కూడా.**

అలాగే బ్రహ్మజ్ఞానుల వంశంలో పుట్టిన వారు కూడా చిన్నతనం నుండి ఆయా పరిసరాలలో పెరగటం వల్ల అనుకోకుండానే ఆయా

విషయాలలో కొంత **అనుభవం, అభిరుచి** ఉంటాయి. వారూ తండ్రిలాగా పూజింపబడాలని, గొప్పవారు కావాలని ప్రయత్నించి ఉన్నత స్థానానికి ఎదుగుతారు.

మనస్తత్వ శాస్త్ర రీత్యా – ఒక వ్యక్తి యొక్క ఔన్నత్యం జీవన విధానం **వంశపారం పర్యత పైన (Law of Heridity), పరిసరాల ప్రభావం (Law of Environment) పైన** ఆధారపడి ఉంటాయి.

మరి బ్రహ్మజ్ఞానుల యొక్క సంతానం వంశపారంపర్య లక్షణాలను పుణికి పుచ్చుకొని, చుట్టూనున్న పరిసరాలు ఆధ్యాత్మిక సుగంధాలు వెదజల్ల బడుతూ ఉంటే అందులో ఉండి, తప్పక ఆ వాసనలను పీల్చుకొనుట జరుగుతుంది. అందుకే బ్రహ్మజ్ఞాని వంశంలో అబ్రహ్మ విదుడు జన్మించడు అని చెప్పటం. ఐతే అరుదుగా ఎక్కడో ఒకచోట దీనికి వ్యతిరేకంగా కూడా జరగవచ్చు. పరిసరాల ప్రభావం వల్ల చెడిపోవచ్చు.

బ్రహ్మమునని తెలుసుకొనుటతో బ్రహ్మమే అయిన బ్రహ్మజ్ఞానికి ప్రారబ్ధవశాత్తు ఇంకాదేహం ఉన్నప్పటికి అతడి దృష్ఠిలో దేహం లేనిదే గనుక దేహబాధలుగాని, దుఃఖంగాని అతడికి అంటవు. **ఆ దేహం** ఏంచేసినా ఏపాపము అతడికి అంటదు. అతడికి మనస్సే లేదు గనుక **శోకంలేదు. పాపంలేదు.** అజ్ఞాన గ్రంధులు విడిపోయినవి గనుక అతడు అమరుడౌతున్నాడు. మళ్ళీదేహభావనరాదు. మరణించిన తర్వాత దేహమూరాదు. జన్మలేదు. –

హృదయ గ్రంధులు అంటే జ్ఞానోదయాన్ని ఆటంకపరిచే **కామక్రోధాలు, రాగద్వేషాలు, అజ్ఞానం.** ఈ హృదయగ్రంధులే మనను ఈ ప్రపంచంతో బంధించి వేస్తాయి. పరమాత్మతో సాన్నిహిత్యానికి ఆటంకం కలిగిస్తాయి. అవి వీడిపోతే బ్రహ్మైక్యమే.

దృశ్య ప్రపంచం స్వప్న ప్రపంచంలాగా అదృశ్యమై పోయింది. ఈ ప్రపంచాన్ని చూస్తున్న ఈ జీవుడు కూడా స్వప్న పురుషుని లాగా

అదృశ్యుడయ్యాడు. ఇక ఉన్నది ఏకము, అద్వయమునైన తానే. అకర్తగా – అభోక్తగా ఉన్న తాను ఇప్పటికే తననుండి వేరైన దేహాన్ని పూర్తిగా వదలి తాను తానుగా ఉండిపోతాడు. పరమాత్మగా ఉండిపోతాడు. శాశ్వత స్థితిలో ఉండిపోతాడు. అమృతత్వంలో – అమరుడుగా ఉండిపోతాడు.

– ఈ బ్రహ్మవిద్యను ఎవరికి ఉపదేశించాలి?

మం॥ తదే తద్ ఋచాభ్యుక్తం –

క్రియావంతః శ్రోత్రియా బ్రహ్మనిష్టాః
స్వయం జుహ్వాతి ఏకర్షింశ్రద్ధ యంతః ।
తేషామే వైతాం బ్రహ్మవిద్యాం వదేత
శిరోవ్రతం విధివద్ యైస్తు చీర్ణం ॥ (10)

ప్రతి॥ తత్ ఏతత్ ఋచా అభ్యుక్తం = ఇదియే వేదము చేత ప్రవచించబడింది; క్రియావంతః = సక్రమ కర్మాచరణగలవారికి; శ్రోత్రియాః = వేదపారంగతులకు; బ్రహ్మనిష్టాః = బ్రహ్మనిష్ట గలవారికి; శ్రద్ధయంతః = శ్రద్ధగలవారికి; ఏకర్షిం = ఏకర్షి అనే అగ్నిని; జుహ్వాతి = హోమం చేసేవారికి; యైః = ఎవరైతే; విధివత్ = శాస్త్రోక్తరీతిన; శిరోవ్రతం = అగ్నిని తలపై నుంచుకొనువ్రతం; చీర్ణం = ఆచరించే; తేషాం = అట్టివారికి; ఏవ = మాత్రమే; ఏతాం బ్రహ్మవిద్యాం = ఈ బ్రహ్మవిద్యను; వదేత = చెప్పాలి.

భావం : ఇదియే వేదం చేత ప్రవచించబడిన బ్రహ్మ విద్య. సక్రమ కర్మాచరణ గలవారికి, వేద పారంగతులకు, బ్రహ్మనిష్ట గలవారికి, ఏకర్షి అగ్ని హోమం చేసేవారికి, శిరోవ్రతాన్ని అచరించేవారికి, శ్రద్ధగలవారికి మాత్రమే ఈ బ్రహ్మ విద్యను చెప్పాలి.

వ్యాఖ్య : ఈ ఉపనిషత్తు **అథర్వణవేదములోనిది.** ఉపనిషత్తులో ఏముంటుంది? **ఆత్మానుభూతి పొందటానికి,** మానవ జీవిత

పరమలక్ష్యమైన **మోక్షాన్ని పొందటానికి కావలసిన జ్ఞానం** ఇందులో నిక్షిప్తం చేయబడిఉంటుంది. తత్ ఏతత్ = అట్టి ఈ **ఉపనిషత్తు (ఋక్కు) వేదము చేత** ప్రతిపాదించబడినదని గుర్తు చేస్తున్నారు ఉపనిషత్ ఋషి. ఇది అధర్వణ వేదములోనిది, కనుక ఇది వేద ప్రతిపాదితము. **దీని పారాయణం వేదపారాయణం.** ఇది అత్యంత ఉన్నతమైన జ్ఞానము, లోతైన భావాలు కలిగి సర్వసంగ పరిత్యాగులు పరిపక్వ సాధకులు **తెలుసుకోవలసిన జ్ఞానము.** కొన్ని అర్హతలు గలవారికే ఈ అధర్వణవేదము నందలి ఉపనిషత్ చెప్పాలి.

మరి అందరూ తెలుసుకొనే అర్హతలేదా? తెలుసుకోవచ్చు. కాని జ్ఞానం అవగాహన అయి, అది ఆచరణలోనికి వచ్చి ఉపయోగ పడాలంటే **కొన్ని అర్హతలు కావాలి.** ఏమిటా అర్హతలు?

ఇందులో **6** ముఖ్యమైన అర్హతలను చెప్పారు.

1. క్రియావంతః : సరియైన కర్మాచరణ ఉండాలి. అందరూ కర్మలు చేస్తారు, వాటి ఫలాలను పొందుతారు. అవి బంధాలవుతాయి. అలాగాక కర్మలను **కర్మయోగంగా ఆచరించాలి (ఎ) నిష్కామంగా (బి) ఫలాపేక్ష రహితంగా (సి) కర్మలతో సంగభావంలేకుండా (డి) ఫలితంకోసం ఎదురుచూడకుండా (ఇ) లభించిన కర్మఫలాలు భగవంతుడు ప్రసాదించిన ప్రసాదంగా భావిస్తూ మనస్సు ప్రశాంతతలో ఉంచుకోవాలి. అట్టి వారికే అర్హత** కర్మలు చేయటకుగాని, కర్మఫలాలు పొందుటకుగాని **ఎట్టి ఆరాటం లేకుండా** ప్రశాంత చిత్తంతో భగవంతుని ఇచ్ఛ నెరవేరుతున్నదనే భావంతో నిమిత్త మాత్రుడు కావాలి.

2. శ్రోత్రియా : శ్రుతులయొక్క అంటే వేదాల యొక్క జ్ఞానముగల వారు. **ఇదీ వేదమే గదా! వేదాన్ని** తెలుసుకోవటానికి అర్హత కూడా వేదమే ఎలా అవుతుంది? అంటే – ఇదేమో వేదాలకు అంతంలో నున్న అద్భుతజ్ఞానం. దీనిని తెలుసుకోవాలంటే దీనికి ముందున్న **మంత్రభాగం, బ్రాహ్మణ,**

ఆరణ్యకాలలో – అంటే భగవంతుని **స్తోత్రం చేయుటలోను,** భగవంతుని దేహేంద్రియాలతో, **మనస్సుతో భక్తి పూర్వకంగా పూజించుటలోను, భగవంతుని హృదయ కమలంలో ఉపాసన చేయుటలోను** అనుభవం ఉండాలి. అట్టివారే జ్ఞానకాండకు **సంబంధించిన ఉపనిషత్తులను** అర్థంచేసుకోగలుగుతారు.

3. బ్రహ్మనిష్ఠాః : బ్రహ్మనిష్ఠ ఉండాలి. అంటే పూర్తిగా బ్రహ్మజ్ఞానం సంపాదించి బ్రహ్మమునందు నిష్ఠగలిగి బ్రహ్మముగా ఉండేవారని కాదు. నిరంతరము తన నిజ స్వరూపమును తెలుసుకొని అందులో నిలవటానికి **ప్రయత్నం చేసేవారు** అని భావం. దేహమనోబుద్ధుల తాదాత్మ్యాన్ని విడిచి ఆత్మలోనే నిలుచుటకు **ప్రయత్నించటం** ఒక గొప్ప అర్హత.

4. శ్రద్ధయంతః : శ్రద్ధ అంటే **విశ్వాసము –** ఇది అన్నింటికన్నగొప్ప అర్హత. అయితే ఎవరి మీద విశ్వాసం ఉండాలి? **శాస్త్రం మీద, గురువు మీద.** చాల మందికి వేదాంతం అగమ్య గోచరం కావటానికి ముఖ్య కారణం ఈ శ్రద్ధ లేకపోవటమే. ఆధ్యాత్మిక సాధనలలో పురోభివృద్ధి ఉండాలంటే శ్రద్ధ కావాలి. **పురోభివృద్ధి లేదంటే శ్రద్ధ లేదనే అర్థం.**

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అన్నారు. విశ్వాసఘాతుకులకు ఈజ్ఞానం చెప్పరాదు.

5. ఏకర్షిం స్వయం జుహ్వతి : ఏకర్షి హోమాన్ని స్వయంగా చేసినవారు. **ఏకర్షి అంటే అగ్ని.** అగ్నియొక్క ఉపాసన అధ్వరణ వేదంలో తెలియజేయబడి ఉన్నది. **అగ్నియొక్క ఉపాసన అంటే సగుణబ్రహ్మోపాసనయే.** మొదట రూపం – గుణం, ఆ తర్వాత గుణం, చివరకు నిర్గుణ ఉపాసన. సగుణోపాసనవల్ల అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. కనుక సగుణోపాసన చేయాలి ముందు. కనీసం హోమం చేయాలి.

6. శిరోవ్రతం : శిరోవ్రతం అంటే **అగ్నిని తలపై నిడుకొనుట.** అంటే తలమీద నిప్పుల కుంపటి పెట్టుకొని వచ్చి కూర్చున్న వారికే ఈ

ముండకోపనిషత్ చెప్పాలా? **ఇదేమిటి? గోల.** తలపైన ఉండవలసినది అగ్ని జ్వాలకాదు. **వైరాగ్యజ్వాల. వైరాగ్యం మనస్సులో ఉండాలి.** ప్రాపంచిక విషయాలపట్ల వైముఖ్యం ఉండాలి. వస్తువుల పట్ల వైముఖ్యంగాక వస్తువులపై గల **ఆసక్తి పట్ల వైముఖ్యం.** నీవు దూరం చేయాల్సింది వస్తువులను కాదు; వస్తువులపై గల రాగాన్ని, ఆసక్తిని. అవి తనకు ఎంతో సుఖాన్నివ్వగల వనే భ్రమను వదలాలి. **లభించిన దానితో సంతృప్తి చెందాలి. దేనికొరకు అఱ్రులు చాచకూడదు.**

శిరోవ్రతమంటే ముండనమని చెబుతూ **'సన్యాసికే ఈ ఉపనిషత్తు'** అని శంకరాచార్యుల వారు తమ భాష్యంలో తెలియజేశారు. సన్యాసి అంటే **సర్వ సంకల్పాలు త్యజించినవాడు** - అని అర్థం.

ఇలా 6 రకాల అర్హతలు గలవానికే ఈ ఉపనిషత్తును బోధించాలని, ఈ అర్హతలు లేనివారు దీనిని సందేహిస్తారని, సరిగ్గా **అవగాహన చేసికొని ఉపయోగించుకోలేరని ఉపనిషత్ ఋషులభావం.**

- ముగింపు

మం॥ తదేతత్ సత్యం, ఋషిరంగిరాః
పురోవాచనై, తదచీర్ణ వ్రతోఽ_ధీతే।
నమః పరమ ఋషిభ్యో
నమః పరమ ఋషిభ్యః ॥ (11)

ప్రతి॥ తదేతత్ సత్యం = అదియే ఈ సత్యం; ఋషి అంగిరాః = అంగిరసమహర్షి; పురా ఉవాచ = పూర్వం శిష్యులకు చెప్పెను; అచీర్ణవ్రతః = ఏ వ్రతాన్నీ ఆచరించనివాడు; ఏతత్ న అధీతే = దీనిని అధ్యయనం చేయరాదు; పరమ ఋషిభ్యోనమః = పరమ ఋషులకు నమస్కారము; పరమఋషిభ్యః నమః = పరమ ఋషులకు నమస్కారము.

భావం : అదియే ఈ సత్యం. ఈ సత్యాన్నే అంగిరసుడు పూర్వం తన

శిష్యులకు చెప్పెను. ఏ వ్రతాన్నీ ఆచరించని వాడు దీనిని అధ్యయనం చేయరాదు. పరమ ఋషులకు నమస్కారం. పరమ ఋషులకు నమస్కారం.

వ్యాఖ్య : ప్రారంభంలో ఉత్తమ శిష్యుడైన శౌనక మహర్షి అంగిరసుని సమీపించి **హే! భగవాన్! దేనిని తెలుసుకొనుట చేత ఈ యావత్తు తెలియబడుతుంది? అని అడిగాడు. దానికి సమాధానంగా ఈ ఉపనిషత్తును చెప్పి ఇప్పుడు ముగిస్తున్నాడు ఉపనిషత్ ఋషి అంగిరసుడు.** "తత్ ఏతత్ సత్యం" తత్ = **అది;** ఏతత్ సత్యం = **ఈసత్యమే. "నీవు తెలుసుకోవాలను కున్నది ఈ సత్యమే". ఈ పరబ్రహ్మమునే.** దేనిని తెలుసుకున్న తర్వాత ఇక తెలుసుకొనుటకు మరేమీ మిగలదో – సర్వమూ తెలిసి పోతాయో **ఆ సత్యం ఇదే – ఈపర బ్రహ్మమే. ఆ పరబ్రహ్మమునీవే.** నీవు తప్ప మరొకటేదీ యదార్థంగా లేనే లేదు. ఇలా శౌనకుడడిగిన లోతైన ప్రశ్నకు విచిత్రంగాను, విపులంగాను **సమాధానాన్ని బోధించిన గురువు** అంగిరసుడు నీవు తెలుసుకోవాలనుకున్నది ఈ పరతత్త్వాన్ని గురించే అని చెప్పటమే గాక అదే పరమ సత్యమైనదని తెలియజేస్తున్నారు. **అసత్యం – సత్యం – పరమసత్యం. మూడు రకాలు.** (ఉన్నదానిని) కనిపిస్తున్న దానిని లేదంటే **అసత్యం.** కనిపిస్తున్నదానిని నిజమేనంటే **సత్యం.** అలా కనిపిస్తున్నదే గాని అది అసలు నిజంకాదు – ఇదిగో ఇది నిజం అని తెలిపితే అది **పరమసత్యం.** ఇట్టి పరమసత్యాన్ని పురాతన కాలంలోనే అంగిరసమహర్షి శిష్యునికి తెలియజేశాడు.

ఇట్టి పరమసత్యాన్ని తెలుసుకొనే ఈ అద్భుత విద్యను **అర్హతలేని వారికి బోధించరాదంటూ;** ఎట్టి అర్హతలు ఉండాలో అట్టి 6 అర్హతలను క్రిందటి మంత్రంలో తెలియజేశారు. ఇక ఈ మంత్రంలో ఏ వ్రతాన్నీ ఆచరించనివాడు దీనిని అధ్యయనం చేయరాదు అని ఆంక్ష పెడుతున్నాడు. వ్రతమంటే సత్యనారాయణస్వామి వ్రతం లాంటిదా? **"సత్యాన్ని పలకటమే సత్యనారాయణస్వామి వ్రతం"** అని తెలుసుకొంటే **అది నిజంగా వ్రతమే.**

ఇక్కడ **"వ్రతం అంటే అధ్యాత్మిక వాసన"** అని అర్థం. ఇంతలోతైన శాస్త్రాన్ని, పరమజ్ఞానాన్ని అందుకోవాలంటే – గ్రహించాలంటే మనస్సు పూర్తిగా **శాంతంగా** ఉండాలి. అలా ఉండాలంటే మనస్సు ప్రాపంచిక విషయ వస్తువులలోను, భోగాలలోను తేలియాడరాదు. **విషయవైరాగ్యం** ఉండాలి. అట్టి వైరాగ్యం **వివేకంతో** కూడినదై ఉండాలి. వివేకం అంటే ఆత్మ – ఆనాత్మలను వేరు పరచి తెలుసుకోగల తెలివి. అట్టి తెలివి **సద్గురువుల ద్వారా శాస్త్రాన్ని శ్రవణం చేసి మననం చేస్తేనే** లభిస్తుంది. శాస్త్రాన్ని శ్రవణం చేయాలంటే శాస్త్రం మీద గురువు మీద పూర్తి (శ్రద్ధ) **విశ్వాసం** ఉంటేనే కురుదుతుంది. అంతటి విశ్వాసం కలగాలంటే నీకు **తీవ్రమైన మోక్షాపేక్ష ఉండాలి.** అన్నింటి కన్న మోక్ష సాధనే ప్రధానంగా భావించినప్పుడే నీలో **తితిక్ష –** ఆటంకాలను ఎదుర్కొనే **నేర్పు ఓర్పు – సహనం** సమకూరుతాయి. అట్టి ఓర్పుతో సాధన చేస్తేనే **చిత్త ఏకాగ్రత.** ఇవన్నీ **సాధన చతుష్టయ సంపదగా** వేదాంతంలో చెబుతారు. ఇట్టి సంపదయే ఉపనిషత్తును తెలుసుకొనుటకు **అర్హత. ఈ అర్హతలేని వారు ఉపనిషత్తును అద్యయనం చేసినా ఉపయోగం ఉండదు.** కనుక ముందు ఈ సాధన చతుష్టయ సంపదను సాధించాలి. **ఇదే వ్రతం.** ఈ వ్రతాన్ని ఆచరించక పోతే మనస్సు నిశ్చలంకాదు – ఏకాగ్రంకాదు. అందుకే ముముక్షువులకే ఈ జ్ఞానాన్ని అందించాలని చెప్పటం. పరమగురువులకు నమస్కరిస్తూ ముగింపు చేస్తున్నారు. గురువు తన గురువుద్వారా తెలుసుకున్నందున వారికీ నమస్కృతులు – చివరిపదం రెండుసార్లు. ఒకటి గురువు యొక్క శాస్త్ర పాండిత్యానికి పలికారు. రెండవది వారి అనుభవానికి (బ్రహ్మనిష్ఠకు). రెండుసార్లు చెప్పటం ఉపనిషత్తు ముగింపును సూచిస్తుంది.

ఓం తత్ సత్

ఈ అద్భుతమైన ఉపనిషత్తును వివరంగా తెలుసుకొనుటకు ఆడియో సి.డి.లు, వీడియో డి.వి.డిలు లభించును. ఇవేగాక ఇతర ఉపనిషత్తులపైన, భగవద్గీత పైన, ప్రకరణ గ్రంథాలపైన ప్రవచనముల గ్రంథములు, ఆడియో సి.డి.లు, వీడియో డివిడిలు కావలసిన వారు **సంప్రదించవలసిన నెంబర్లు : 09886265225, 08008539770**

